
గురువారం 12-1-2023


'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 118

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



వాణిజ్యంలో భారత్ వేగుచుక్క

ప్రపంచ వాణిజ్యంలో భారత్‌ను వేగు చుక్కగా అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ పరిగణిస్తోందని ప్రధాని మోదీ చెప్పారు.

వివరాలు 6లో ▸



లక్షద్వీప్ ఎంపీకి పదేళ్ల ఖైదు

హత్యాయత్నం కేసులో లక్షద్వీప్ ఎంపీ మహమ్మద్ ఫైజల్ సహా నలుగురికి జిల్లా కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించింది.

వివరాలు 6లో ▸



విమాన సేవలకు అంతరాయం

సాంకేతిక సమస్యలు తలెత్తడంతో అమెరికాలో 600కు పైగా విమానాల రాకపోకలు రద్దయ్యాయి.

వివరాలు 6లో ▸





'నాటు నాటు'కు గోల్డెన్ గ్లోబ్

తెలుగు పాటకు అరుదైన గౌరవం

బెస్ట్ ఒరిజినల్ సాంగ్-మోషన్ పిక్చర్ కేటగిరీలో అవార్డు

ప్రతి భారతీయుడిని గర్వించేలా చేసింది: ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్

12లో

తెలుగు పాట దుమ్మురేపింది.. 'నా పాట సూడు..' అంటూ 'గోల్డెన్ గ్లోబ్'ను ముద్దాడింది. ఎంఎం కీరవాణి స్వరపర్చిన ఈ పాటకు బెస్ట్ ఒరిజినల్ సాంగ్-మోషన్ పిక్చర్ కేటగిరీలో ప్రతిష్టాత్మక గోల్డెన్ గ్లోబ్ అవార్డు లభించింది. భారత్ నుంచి ఒక పాటకు ఈ అవార్డు లభించడం ఇదే మొదటిసారి. 'ఆర్ఆర్ఆర్' చిత్రం 'బెస్ట్ పిక్చర్-నాన్ ఇంగ్లిష్' కేటగిరీలోనూ నామినేటైనా.. చివరకు అవార్డు మాత్రం అర్జెంటీనా చారిత్రక చిత్రం 'అర్జెంటీనా 1985'కు దక్కింది.

న్యూస్‌రీల్

ఐటీ అధికారులకూ 'సైబర్' స్ట్రోక్



సైబర్ నేరగాళ్లు ఆదాయ పన్ను శాఖ అధికారులకే టోకరా వేశారు. అమెజాన్ గిఫ్ట్‌కార్డులు పంపాలంటూ ఓ ఉన్నతాధికారి పేరుతో అధికారులకు సైబర్ నేరగాళ్లు మెసేజ్‌లు పంపించారు. దీంతో గిఫ్ట్‌కార్డులు పంపించగా.. వెంటనే రూ.1.10 లక్షలను తమ ఖాతాలోకి జమ చేసుకున్నారు.

వివరాలు 10 ▸

'ఎలక్ట్రిక్' స్టార్ట్



భారత్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా రెండేళ్లకోసారి జరిగే ఆటో ఎక్స్‌పో గ్రేటర్ నోయిడాలో బుధవారం ప్రారంభమైంది. ఏపీలో వచ్చే నాలుగేళ్లలో రూ.2,000 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు కియా వెల్లడించింది.

వివరాలు 13 ▸

నా'రా'బంధువులే'!

టీడీపీ పెద్దల గుప్పిట్లో బడుగుల అసైన్డ్ భూములు

- అమరావతిలో చంద్రబాబు బృందం అక్రమాలు బట్టబయలు
- జీపీఏ, సేల్‌డీడ్లతో 'పచ్చ ముఠా' దందా
- ఇప్పటివరకు సీఐడీ గుర్తించిన అసైన్డ్ భూములు 932.72 ఎకరాలు
- వాటి మార్కెట్ విలువ రూ.3,730.88 కోట్లు
- మాజీ మంత్రి నారాయణ సమీప బంధువుల పేరిట 140 ఎకరాలు
- నారాయణ విద్యా సంస్థలు, రామకృష్ణ హౌసింగ్ ఉద్యోగుల ఖాతాలో 200 ఎకరాలు
- టీడీపీ ప్రభుత్వంలో ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీవీ వియ్యంకుడి పేరిట 40 ఎకరాలు
- చంద్రబాబు బినామీలు, సన్నిహితులు, టీడీపీ నేతల పేరిట 540 ఎకరాలు
- అన్యాక్రాంతమైన మొత్తం అసైన్డ్ భూములు 1,400 ఎకరాలు.. మార్కెట్ విలువ రూ.5,600 కోట్లు



సాక్షి, అమరావతి: అసైన్డ్ భూముల్లో వాలిపోయిన భూ రాబందుల అక్రమాలు బహిర్గతమయ్యాయి. బడుగు, బలహీన వర్గాల రైతులను బెదిరించి 932.72 ఎకరాల అసైన్డ్ భూములను పచ్చ గద్దలు కాజేసినట్లు వెల్లడైంది. గ్రామాల వారీగా ఎల్లో గ్యాంగ్ అసైన్డ్ భూముల అక్రమాల చిట్టా రట్టైంది. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 2014- 18 మధ్య చోటు చేసుకున్న ఈ దారుణాలు సీఐడీ దర్యాప్తులో ఆధార సహితంగా, రియల్ ఎస్టేట్ అక్రమ సామ్రాజ్యం భౌగోళిక సరిహద్దులతో సహా వెలుగు చూశాయి. ఇప్పటివరకు బట్టబయలైన అసైన్డ్ భూములు 932.72 ఎకరాలు. చంద్రబాబు చెప్పిన ప్రకారం వాటి మార్కెట్ విలువ ఏకంగా రూ.3,730.88 కోట్లకు పైమాటే! కొనసాగుతున్న సీఐడీ దర్యాప్తులో మరిన్ని అసైన్డ్ బాగోతాలు వెలుగు చూసే అవకాశాలున్నాయి.

కార్యాలయాల వారీగా రికార్డుల పరిశీలన..

రాజధాని అమరావతి ప్రాంతంలో 2014 నాటికి ఎస్సీ, బీసీ రైతుల పేరిట ఉన్న అసైన్డ్ భూములు

మిగతా 2వ పేజీలో ▶


జగనన్న తోడు లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

'చిరు' రుణాల్లో ఏపీ ఫస్ట్

- చిరు వ్యాపారులకు సున్నా వడ్డీ రుణాల్లో దేశ చరిత్రలోనే రాష్ట్రం రికార్డు
- దేశవ్యాప్తంగా 24.06 లక్షల మందికి రుణాలు.. ఇందులో ఏపీలోనే 15.31 లక్షలు
- జగనన్న తోడు లబ్ధిదారుల ఖాతాల్లో వడ్డీ జమ చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- సకాలంలో రుణాలు చెల్లించిన వారికి రూ.15.17 కోట్ల వడ్డీ చెల్లింపు
- కొత్తగా 3.95 లక్షల మందికి రూ.10 వేల చొప్పున రూ.395 కోట్ల రుణాలు
- చిరు వ్యాపారులతో స్వయం ఉపాధి వ్యవస్థలో గొప్ప మార్పు
- లబ్ధిదారుల్లో 80% ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు
- ఎవరికైనా జగనన్న తోడు రాకపోతే కంగారు పడొద్దు
- మళ్లీ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే ఆరు నెలల్లో తోడుగా నిలుస్తాం
- రెండు సచివాలయాలను ఒక బ్యాంకుతో టైఅప్ చేశాం.. సకాలంలో రుణం చెల్లిస్తే ఏటా అదనంగా రూ.వెయ్యి చొప్పున రూ.13 వేల వరకు రుణం
- ఇప్పటి వరకు 15,31,347 మందికి రూ.2,406 కోట్లు వడ్డీ లేని రుణం

2లో

ప్రజల ప్రాణాలకు రక్ష జీవో నంబర్ 1

విశాఖ ఏయూ, గుంటూరు ఏఎన్‌యూల్లో రౌండ్ టేబుల్ సమావేశాల్లో విద్యావేత్తలు, మేధావులు

'ప్రజల ప్రాణాలకు రక్షణ కవచంగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 1 నిలుస్తుంది. జీవోను రాజకీయ కోణంలో చూడొద్దు. ఎవరి స్వేచ్ఛను ప్రభుత్వం హరించలేదు. ఎవరికీ ఇబ్బంది లేకుండా సభలు, సమావేశాలు జరుపుకోవాలని మాత్రమే జీవోలో ఉంది. ప్రభుత్వ చర్యలను అందరూ స్వాగతించాలి' అని విద్యావేత్తలు, మేధావులు కోరారు.

10లో



సబ్జెక్టు టీచర్లుగా అర్హులైన ఎస్జీటీలు

- హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్ల సమస్యకు విద్యాశాఖ పరిష్కారం.. 5,809 మంది నియామకం
- నెలకు రూ. 2,500 చొప్పున సబ్జెక్టు టీచర్ల అలవెన్స్

2లో



బంగారం.. భారతదేశంలో దీని ఉత్పత్తి తక్కువైనా.. వినియోగంలో మాత్రం చైనా తర్వాత మనమే. ఉత్పత్తిలో ప్రపంచంలో 60వ స్థానంలో ఉన్న మనం, వినియోగంలో రెండో స్థానంలో ఉన్నాం. మనవారికి బంగారంపై ఎంత మక్కువో.. ఈ గణాంకాలు చాలు. అలంకరణతోపాటు, పెట్టుబడి సాధనంగా కూడా బంగారాన్ని ఎక్కువగా కొనుగోలు చేస్తుంటాం. దీన్ని అసరాగా తీసుకునే అడ్డదారుల్లో బంగారాన్ని దిగుమతి చేసుకుని, భారీ స్థాయిలో లాభాలార్జించేందుకు కొందరు వ్యాపారులు స్మగ్లింగ్ ముఠాలతో చేతులు కలుపుతున్నారు. విమానాశ్రయాల్లో ఆధునిక సాంకేతిక పరికరాలతో తనిఖీలు ముమ్మరంగా చేస్తుండటంతో కొత్తదారులు వెతుక్కున్నారు. విదేశాల నుంచి వయా కోల్‌కతా మీదుగా విశాఖ వ్యాపారుల చేతికి చేరుతున్న బంగారం స్మగ్లింగ్ తీరు అధికారుల్ని ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

బంగారం స్మగ్లింగ్ నయా మార్గ్!

- గోల్డ్ స్మగ్లింగ్ వయా బంగ్లాదేశ్ టు కోల్‌కతా.. అక్కడే కరిగించి బంగారు కడ్డీలుగా మారుస్తున్న స్మగ్లర్లు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం : బంగారం స్మగ్లింగ్ రూటు మారింది. అటు చెన్నై, ఇటు హైదరాబాద్ విమానాశ్రయాల్లో నిఘా పెరిగి భారీగా బంగారం పట్టుబడుతుండటంతో స్మగ్లర్లు తమ రూటు కాస్తా మార్చారు. దుబాయ్ నుంచి బంగ్లాదేశ్‌కు.. అక్కడి నుంచి కోల్‌కతాకు తరలిస్తున్నట్టు సమాచారం. కోల్‌కతాలో విదేశీ బంగారం మార్కింగ్‌ను కాస్తా తొలగించి, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో విశాఖపట్నానికి తరలిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో కోల్‌కతాలోని స్మగ్లింగ్ ముఠాతో పాటు విశాఖలోని కొందరు బంగారు వ్యాపారస్తులు కూడా చేతులు కలిపినట్టు తెలుస్తోంది. తక్కువ ధరకే బంగారం దొరుకుతుండటంతో పాటు ఎటువంటి పన్నులు లేకుండానే వ్యాపారం చేసుకునే వీలుండటంతో రోజురోజుకీ స్మగ్లింగ్ వ్యవహారం పెరుగుతున్నట్టు సమాచారం. తాజాగా రూ.1.07 కోట్ల విలువైన 1.86 కేజీల బంగారాన్ని కోల్‌కతా నుంచి తరలిస్తుండగా డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు తాజాగా విశాఖ రైల్వే స్టేషన్‌లో పట్టుకున్నారు. గతంలోనూ ఏకంగా 30 కేజీల బంగారాన్ని ఇదే తరహాలో పట్టుకున్నారు. బంగారంపై కేంద్రం కస్టమ్స్ డ్యూటీని 7.5 శాతం నుంచి 12.5 శాతానికి పెంచడంతో పాటు అదనంగా 2.5 శాతం వ్యవసాయ మౌలిక సదుపాయాల సెస్‌ను విధిస్తుండటంతో బంగారం స్మగ్లింగ్ పెరుగుతున్నట్టు డీఆర్ఐ అధికారులు భావిస్తున్నారు. విమానాశ్రయాల్లో నిఘా పెరగడంతో బంగ్లాదేశ్ తీరానికి అనుకొని ఉన్న పశ్చిమబెంగాల్‌కు తరలించే మార్గాన్ని స్మగ్లర్లు ఎంచుకున్నట్టు తెలుస్తోంది. వాస్తవానికి బంగారం స్మగ్లింగ్ వ్యవహారం అరబ్ దేశాల నుంచి జరుగుతోంది. అరబ్ నుంచి మయన్మార్‌కు, అక్కడ నుంచి బంగ్లాదేశ్‌కు సులువుగా చేరుస్తున్నారు. బంగ్లాదేశ్‌తో పశ్చిమబెంగాల్‌కు సువిశాల తీరప్రాంతం ఉంది. ఇక్కడ అనునిత్యం గస్తీ చేయడం కూడా కష్టసాధ్యంగా ఉంటోంది. సులభంగా చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో బంగారం ఎక్కువగా చేతులు మారుతోంది. అందుకే ఈ మార్గాన్ని స్మగ్లర్లు ఎన్నుకున్నట్టు డీఆర్ఐ అధికారులు అంచనా వేశారు. స్థానికులు కూడా ఈ బంగారం స్మగ్లింగ్ వ్యవహారంలో ఉపాధి పొందడంతో పాటు భారీగా డబ్బును ఆర్జించడంతో వారికి సహకరిస్తున్నట్టు డీఆర్ఐ అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది.

కోల్‌కతా కేంద్రంగా..!

విదేశాల నుంచి వచ్చే బంగారానికి అక్కడి అధికారిక ముద్ర(సీల్) ఉంటుంది. కోల్‌కతాలో దీన్ని కరిగిస్తున్నారు. ఆ తర్వాత బంగారం పీసులు, బార్లుగా వివిధ రూపాల్లో మారుస్తున్నారు. ఈ వ్యవహారమంతా కోల్‌కతాకు చెందిన బంగారం స్మగ్లర్లు చేస్తున్నారు. అక్కడి నుంచి వివిధ మార్గాల్లో బంగారాన్ని తరలిస్తున్నారు. బోస్, ఆద్య.. ఇలా వివిధ మారు పేర్లతో ఉన్న కోల్‌కతా బంగారం స్మగ్లర్లు ఈ వ్యవహారాలు నిర్వహిస్తున్నట్టు సమాచారం. ఈ వ్యవహారాల్లో ఆదాయం దండిగా ఉండటంతో స్థానికులు స్మగ్లర్లకు బాగా సహకరిస్తున్నట్టు డీఆర్ఐ అధికారులు పేర్కొంటున్నారు. కోల్‌కత్తా నుంచి విశాఖకు రోడ్డు, రైల్వే మార్గంలో ఈ అక్రమ బంగారాన్ని తరలిస్తున్నారు. అక్కడి నుంచి వచ్చిన స్మగ్లింగ్ బంగారాన్ని విశాఖలోని కొందరు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నట్టు తెలుస్తోంది.

మూగ నేస్తాలు.. మౌన భావాలు

మనుషుల మధ్య దూరం పెరుగుతోంది. పక్క పక్కనే ఇళ్లు ఉంటున్నా.. అంటీముట్టనట్లుగా ఉండటం పరిపాటిగా మారింది. మనసు విప్పి మాట్లాడుకోవటం మాని, సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ యంత్రాలతో సావాసం చేయడం అధికమైంది. పల్లెటూళ్లలో కాస్త కలివిడితనం ఉంటున్నా.. పట్టణాల్లోని కాంక్రీట్ వనాల్లో ఎవరికి వారే యమునాతీరే అన్నట్లుగా జీవనం సాగుతోంది. ఈ కోవలో ఏదో కోల్పోయిన భావన ప్రతి ఒక్కరిలో కనిపిస్తుంది. ఇలాంటి పరిస్థితి నుంచి బయటపడేందుకు మూగజీవాలతో స్నేహం కాస్త ఊరటనిస్తోంది. మాటలు రాకపోయినా మనసుకు దగ్గరయ్యే స్వభావం ప్రశాంతత చేకూరుస్తోంది.

- సాక్షి, కర్నూలు డెస్క్

విస్తరిస్తున్న పక్షుల పెంపకం

- ఖర్చుకు వెనుకాడకుండా కొనుగోలు
- ప్రేమతో దగ్గరవుతున్న మూగప్రాణులు
- పావురాలు, కుందేళ్లు, వెరైటీ పిల్లులకూ చోటు
- మాటలతో మాయచేస్తున్న ఆఫ్రికన్ బర్డ్స్
- మానసిక ప్రశాంతత కోరుకుంటున్న పట్టణాలు

చెట్లపై నిద్రపోయిన పక్షులన్నీ తెల్లారిందిలెవండోయ్ అన్నట్లు ఒక్కసారిగా పైకి లేచి ఆహార వేటకు పయనమవడం.. గంప కింద కోడి కొక్కొరొక్కోమని మేల్కొలపడం.. పిడికెడంత కూడా లేని పిచుకలు కీచుకీచుమంటూ ఇంటి ముందు వాలి గింజల కోసం వెతుకులాడటం.. పెంపుడు కుక్కలు యజమాని వెంట పొలం బాట పట్టడం.. పశువులు పొలం పనులకు సిద్ధమవడం.. ఇదీ పల్లె జీవనం. మనిషి జీవితంలో ఈ మూగప్రాణాలు ఓ భాగం. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ వీటితో అనుబంధం క్రమంగా తగ్గిపోతోంది. యాంత్రిక జీవనంలో మునిగితేలుతూ మానసిక ఆనందాన్ని కోల్పోతున్న వేళ ఇప్పుడిప్పుడే మూగ ప్రాణుల మీద మమకారం పెరుగుతోంది. డబ్బు పోయినా పర్వాలేదు.. మనసు విప్పి మాట్లాడితే మనసుకు సాత్వంత లభిస్తుందనే అభిప్రాయం క్రమంగా పెరుగుతోంది.

కర్నూలు నగరంలోని కృష్ణానగర్‌లో నివాసం ఉంటున్న ఖలీల్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇతనికి చిన్నప్పటి నుంచి మూగజీవాలంటే ప్రాణం. మొదట కుక్కలు, పిల్లులతో సావాసం చేసినా, ఐదేళ్లుగా పక్షులను తన జీవితంలో భాగం చేసుకున్నాడు. సాధారణంగా ఒకటో, రెండో పక్షులను ఓ చిన్న కేజ్‌లో బంధించి అమితమైన ప్రేమను చూపడం సహజం. ఇందుకోసం వెచ్చించే డబ్బు కూడా వేలల్లోనే ఉంటుంది. అయితే ఇతను తన ఇంటి ఆవరణనే పెద్ద బోనుగా మలచడం విశేషం. పక్షుల స్వేచ్ఛా విహారానికి అనుగుణంగా తీర్చిదిద్దిన ఈ బోనుకు చేసిన వ్యయం అక్షరాలా రూ.3లక్షల పైమాటే. ఇక ఈ ఐదేళ్లలో అతను పెంచుతున్న పక్షుల ఖరీదు రూ.7లక్షల పైనే కావడం చూస్తే ఆ మూగ ప్రాణులు అతని జీవితాన్ని ఎంతగా ప్రభావితం చేశాయో తెలుస్తోంది. ఇంతే కాదు.. ప్రతినెలా వీటికి చేస్తున్న ఖర్చు రూ.5వేల వరకు ఉంటోంది.



దీపావళి అంటే దడ

పక్షులకు దీపావళి వస్తే దడ. టపాసుల శబ్దాలకు బెంబేలెత్తుతాయి. కొన్ని పెంపుడు పక్షులు ఆ శబ్దాలకు హార్ట్ స్ట్రోక్‌కు గురవుతాయి. దీపావళి సమయంలో వీటి సంరక్షణకు ప్రత్యేక తప్పవని యజమానులు చెబుతున్నారు.

కింద పడితే తినవు..

డబ్బు విలువ పెరుగుతున్న కొద్దీ ఆహారం దొరకడం కూడా కష్టతరమవుతోంది. నిరుపేదలు ఇప్పటికీ దుర్భర జీవనం గడపటం చూస్తున్నాం. కొందరికి డబ్బు ఎక్కువై ఆహార పదార్థాలను వీధులపాలు చేస్తే.. ఇప్పటికీ ఆ విస్తర్లకేసి చూసే జనం ఉన్నారంటే అతిశయోక్తి కాదు. అయితే కొన్ని పక్షుల విషయానికొస్తే.. కింద పడిన గింజలను ముట్టుకోవంటే ఆశ్చర్యమేస్తుంది. యజమాని ఎంతో ఇష్టంగా వాటి నోటికి అందించే దేనినైనా తినే ఈ పక్షులు, నోరు జారితే వాటికేసి కూడా చూడకపోవడం వింతేమరి.

కుటుంబ సభ్యుల్లానే..

పక్షుల పెంపకం కుటుంబంలో భాగమవుతోంది. వీటి పెంపకం కాస్త కష్టమే అయినా ఇష్టాన్ని పెంచుకుంటే కుటుంబ సభ్యుల తరహాలోనే దగ్గరవుతున్నాయి. ఉరుకులు పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరూ మానసిక సమస్యలతో బాధపడుతున్నారు. ఇలాంటి సమయంలో కొద్దిసేపు పక్షులతో గడిపితే మానసిక ఆనందం లభిస్తుందని పక్షుల ప్రేమికులు చెబుతున్నారు. ఇక ఉదయాన్నే పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే పిల్లలు సైతం వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు వీటిపై అమితమైన ప్రేమను చూపుతూ స్నేహితుల్లా భావిస్తుండటం విశేషం.

కదలికలు పసిగట్టి.. బాధ తెలుసుకొని

పక్షుల పెంపకం కత్తి మీద సాములాంటిదే. వాటితో ఎంత అభిమానం పెంచుకుంటే అంత దగ్గరవుతాయి. కొన్నాం.. తెచ్చుకున్నాం.. అని కాకుండా, ప్రతి రోజూ వాటితో కొంత సమయం గడిపినప్పుడే ఏం తింటున్నాయి, ఆరోగ్యం ఎలా ఉందనే విషయాలు తెలుస్తాయి. ముందు రోజు వేసిన ఆహారం తినకపోతే ఏదో అనారోగ్యంతో ఉన్నట్లుగా గుర్తిస్తారు. లేదా కదలికలు రోజులాగా ఉండకపోయినా ఏదో బాధలో ఉన్నట్లు అర్థమవుతుంది. ఆ మేరకు వాటికి చికిత్స అందించాల్సి ఉంటుంది. ఇక ప్రతి సంవత్సరం వీటికి వ్యాక్సినేషన్ చేయిస్తే ఆరోగ్యంగా ఉంటాయని యజమానులు చెబుతున్నారు.

పెరుగుతున్న పక్షుల విక్రయ వ్యాపారం

మారుతున్న ప్రజల అభిరుచి వ్యాపార పరంగానూ అభివృద్ధి చెందుతోంది. అక్వేరియంలతో పాటు వివిధ రకాల పక్షులు, కుందేళ్ల విక్రయ దుకాణాలు అక్కడక్కడా కనిపిస్తున్నాయి. దుకాణాల్లో పక్షులను ఉంచేందుకు రంగురంగుల పంజరాలు ప్రత్యేక ఆకర్షణగా ఉంటున్నాయి. వీటికి అవసరమైన ఆహారాన్ని కూడా యజమానులు దుకాణాల్లోనే విక్రయిస్తున్నారు. పక్షుల పెంపకానికి అవసరమైన సామగ్రి, ఇతరత్రాలను చెన్నై, కోల్‌కతా, బెంగళూరు నుంచి తెప్పిస్తున్నారు.

వాటితో గడిపితే సమయమే తెలియదు

మనిషికి కష్టం వస్తే మాటల్లో చెప్పుకోగలం. పక్షులు తమ బాధను చెప్పుకోలేవు. మనమే అర్థం చేసుకోవాలి. ఉదయం లేవగానే వాటి వద్దకు వెళ్లడం, వాటి బాగోగులను పరిశీలించడం.. స్నేహంగా మెలగడం నా దినచర్యలో భాగమైంది. కనీసం ఓ గంట వాటితో ఉంటే ఏదో తెలియని ఆనందం నాలో కలుగుతుంది. కొత్త వ్యక్తులు వీటి దగ్గరకు వస్తే పెద్ద శబ్దాలు చేస్తూ అటూఇటూ ఎగురుతుంటాయి. నేను కనిపించగానే ఎంతో ప్రేమతో నా మీద వాలిపోతాయి. మనుషుల్లో మానవత్వం లోపిస్తున్న వేళ ఇలాంటి మూగప్రాణులు ఎంతో ప్రేమను కురిపిస్తాయి. ఎంత డబ్బిస్తే ఈ ఆనందాన్ని కొనగలం.

– లోధి ఇర్ఫాన్ అహ్మద్ ఖాన్, కృష్ణానగర్, కర్నూలు

పావురాల పెంపకం ఎంతో ఇష్టం

చిన్నతనం నుంచి పావురలంటే అమితమైన ఇష్టం. మొదట్లో నా వద్ద 10 పావురాలు మాత్రమే ఉండేవి. ఇప్పుడు ఎనిమిది రకాలు, వందకు పైగా పావురాలు ఉన్నాయి. ఇంటికి సమీపంలో ఓ షెడ్ ఏర్పాటు చేసుకొని పెంచుతున్నా. రేసింగ్ హర్యామర్ పావురం ఖరీదు జత రూ.5వేల వరకు ఉంటోంది. 100, 1000 కిలోమీటర్ల పోటీల్లోనూ నా పావురాలు పాల్గొంటాయి. బెట్టింగ్ కాకుండా పావురాల్లోని సత్తా చాటేందుకు పోటీలకు వెళ్తుంటాం.

– షేక్ ఇబ్రహీం, కింగ్‌మార్కెట్, కర్నూలు

ఆదరణ బాగుంది

నగరంలో పెంపుడు జంతువులు, పక్షులకు ఆదరణ బాగుంది. ఉన్నతశ్రేణి కుటుంబాల్లో వీటిని ఎక్కువగా పెంచుకుంటారు. ఇంట్లో బిడ్డల్లా వీటిని ఆదరిస్తుంటారు. పెంపుడు శునకాలతో పాటు పిచ్చుకలు, పలురకాల పక్షులు, కుందేళ్లను అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నారు. ఎక్కువగా ఇళ్లల్లో అక్వేరియం వుంచేందుకు ఇష్టపడుతున్నారు. వివిధరకాల చేపపిల్లలు అందుబాటులో వున్నాయి. బళ్లారి, మైసూర్, హైదరాబాద్ నుంచి ఎక్కువగా వీటిని దిగుమతి చేసుకుంటున్నాం. అభిరుచికి తగ్గట్టు ఖరీదైన పక్షులు, చేపలను పెంచేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. ఈ వ్యాపారం సంతృప్తికరంగా వుంది.

– మహబూబ్, దుకాణ యజమాని, కర్నూలు

క్లుప్తంగా...

వైఎస్సార్ ఆరోగ్య వర్సిటీ వీసీగా ఎంటీ కృష్ణబాబు

సాక్షి, అమరావతి: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబుకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్(వీసీ)గా పూర్తి అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. గురువారంతో ప్రస్తుత వీసీ డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ పదవీకాలం ముగియనుండటంతో నూతన వీసీగా వైద్య శాఖ ముఖ్యకార్యదర్శిని గవర్నర్ నియమించారు. దీంతో బుధవారం ప్రభుత్వం గెజిట్‌ను జారీ చేసింది. నూతన వీసీని నియమించే వరకు వీసీగా కృష్ణబాబు కొనసాగుతారు. ఇప్పటికే నూతన వీసీ నియామకానికి సెర్చ్ కమిటీని ఏర్పాటు చేసి, నోటిఫికేషన్‌ను జారీ చేశారు.

వాల్తేర్ వీరయ్యకు రూ.25, వీరసింహారెడ్డికి రూ.20


- 10 రోజుల పాటు టికెట్ల ధరలు పెంపుదలకు అనుమతి

సాక్షి, అమరావతి: వాల్తేర్ వీరయ్య, వీరసింహారెడ్డి సినిమాల టికెట్ల ధరలను 10 రోజులపాటు పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఆ సినిమా నిర్మాతలు తమ సినిమాల బడ్జెట్ వివరాలతో సమర్పించిన దరఖాస్తులను హోం శాఖ కమిటీ పరిశీలించి టికెట్ల ధర పెంపుపై సిఫార్సు చేసింది. దీంతో వాల్తేర్ వీరయ్య సినిమాకు టికెట్‌పై గరిష్టంగా రూ.25 చొప్పున, వీరసింహారెడ్డి సినిమాకు రూ.20 చొప్పున పెంపుదలకు అనుమతినిస్తూ హోం శాఖ బుధవారం ఉత్తర్వులిచ్చింది.

ఈశాన్య రుతుపవనాలు ఉపసంహరణ!

సాక్షి, విశాఖపట్నం: ఈశాన్య రుతుపవనాలు ఉపసంహరించుకోనున్నాయి. గురువారం నుంచి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ పరిసర ప్రాంతాల నుంచి ఇవి విరమించుకోవడానికి పరిస్థితులు అనుకూలంగా మారనున్నట్లు భారత వాతావరణ విభాగం తెలిపింది. ఏటా అక్టోబర్ మూడో వారంలో ఈశాన్య రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయి. కానీ ఈ ఏడాది వారం రోజులు ఆలస్యంగా అక్టోబర్ 29న ప్రవేశించాయి. ఈ రుతుపవనాలు దక్షిణాది రాష్ట్రాల్లో మూడు నెలల పాటు (అక్టోబర్ నుంచి డిసెంబర్ ఆఖరు వరకు) ప్రభావం చూపుతాయి. అనంతరం రాష్ట్రం నుంచి నిష్క్రమిస్తాయి. ఈ ఏడాది కూడా వర్షాలు సమృద్ధిగానే కురిశాయి. వీటి ఉపసంహరణతో రాష్ట్రంలో ఇప్పట్లో వర్షాలకు అవకాశం లేనట్టేనని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

జేఈఈ అర్హతలో స్వల్ప మార్పులు



సాక్షి, హైదరాబాద్: జేఈఈ మెయిన్స్ అర్హత నిబంధనల్లో స్వల్ప మార్పులు చేశారు. ఈ విషయాన్ని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. జేఈఈ పరీక్ష రాసిన అభ్యర్థులు ఐఐటీలు, ఎన్ఐటీలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే సంస్థల్లో ప్రవేశాలు పొందేప్పుడు ఇంటర్‌లో 75 శాతం మార్కులు పొంది ఉండాలని ఎన్‌టీఏ తొలుత పేర్కొంది. దీనివల్ల ఈశాన్య రాష్ట్రాలతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో వివాదం చెలరేగింది. ఆయా రాష్ట్రాల్లో ఇంటర్, 10 ప్లస్‌టులో గరిష్టంగా 60 శాతం పర్సంటైల్ మాత్రమే వస్తోంది. దీంతో కొంతమంది కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఇంటర్, ప్లస్‌టులోని సబ్జెక్టుల్లో 75 మార్కులు లేదా టాప్ 20 పర్సంటైల్ ఉన్నవారు జాతీయ సీట్ల కేటాయింపునకు అర్హులని ఎన్‌టీఏ మార్పు చేసింది. ఎస్సీ, ఎస్టీలు ఇంటర్, ప్లస్‌టులో 65 మార్కులు పొంది ఉంటే సరిపోతుందని నిర్ణయించింది.

సబ్జెక్టు టీచర్లుగా అర్హులైన ఎస్జీటీలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ హైస్కూళ్లు, ఇతర ప్రీ హైస్కూళ్లలో 3వ తరగతి నుంచి విద్యార్థులకు సబ్జెక్టు టీచర్లతో బోధన చేయించేందుకు పాఠశాల విద్యా శాఖ చర్యలు చేపట్టింది. నూతన విధానంలోని స్కూళ్లలో 3వ తరగతి నుంచి సబ్జెక్టుల బోధనకు సీనియర్ సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీలు)కు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి ఇవ్వాలని భావించింది. దీనికోసం తగిన అర్హతలున్న 2,095 మంది ఎస్జీటీలతోపాటు మరో 3,714 మంది మొత్తం 5,809 మంది ఎస్జీటీలకు పదోన్నతి ఇవ్వడానికి జీవో నంబర్లు 117, 128 ను విడుదల చేసింది. వీటిపై కొందరు న్యాయస్థానాల్లో కేసులు వేశారు. కోర్టు ఆదేశాలతో పదోన్నతుల ప్రక్రియ పూర్తికాలేదు. అయితే విద్యార్థులకు సబ్జెక్టు బోధనకు వీలుగా పాఠశాల విద్యా శాఖ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. 5,809 మందినీ తాత్కాలికంగా సబ్జెక్టు బోధన చేసేలా చర్యలు చేపట్టారు. కోర్టు కేసులు పరిష్కారమై, వీరికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులిచ్చే వరకు సబ్జెక్టు బోధన చేస్తారు. ఇందుకు వీరికి నెలకు రూ. 2,500 చొప్పున సబ్జెక్టు టీచర్ అలవెన్స్ ఇస్తారు. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ మెమో జారీచేశారు.

‘చిరు’ రుణాల్లో ఏపీ ఫస్ట్

చిరు వ్యాపారులకు సున్నా వడ్డీ రుణాల్లో దేశ చరిత్రలోనే రాష్ట్రం రికార్డు

దేశ వ్యాప్తంగా 24.06 లక్షల మందికి రుణాలు.. ఇందులో ఒక్క ఏపీలోనే 15.31 లక్షలు

జగనన్న తోడు లబ్ధిదారుల ఖాతాల్లో వడ్డీ జమ చేస్తూ సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: చిరు వ్యాపారులకు సున్నా వడ్డీ రుణాలు ఇవ్వడంలో దేశ చరిత్రలోనే ఆంధ్రప్రదేశ్ రికార్డు సృష్టించిందని సీఎం వైఎస్ జగన్ తెలిపారు. దేశం మొత్తం మీద చిరు వ్యాపారులకు 24.06 లక్షల మందికి రుణాలు ఇస్తే, ఇందులో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే జగనన్న తోడు పథకం కింద 15.31 లక్షల మందికి రుణాలు ఇచ్చామని స్పష్టం చేశారు. రుణాలను సంఖ్యాపరంగా తీసుకుంటే దేశ వ్యాప్తంగా 39.21 లక్షల రుణాలకు గాను, ఒక్క మన ఏపీలో మాత్రమే 24.06 రుణాలు ఇచ్చామన్నారు. తద్వారా స్వయం ఉపాధి వ్యవస్థలో గొప్ప మార్పు వస్తోందన్నారు. చిరు వ్యాపారులందరూ వాళ్లంతటవారే ఉపాధి కల్పించుకోవడమే కాకుండా సమాజానికి కూడా గొప్ప మేలు చేస్తున్నారని కొనియాడారు. జగనన్న తోడు పథకం కింద చిరు వ్యాపారులకు ఆరవ విడత రూ.10 వేల వరకు వడ్డీ లేని రుణాలను ఇచ్చే కార్యక్రమాన్ని బుధవారం ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించారు. పూర్తి వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తూ ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున 3.95 లక్షల మంది చిరు వ్యాపారులు, సంప్రదాయ చేతివృత్తుల వారికి బ్యాంక్‌ల ద్వారా కొత్తగా రూ.395 కోట్ల రుణాలు అందించడంతో పాటు, గత 6 నెలలకు సంబంధించిన రూ.15.17 కోట్ల వడ్డీ రీయింబర్స్‌మెంట్‌ను కంప్యూటర్‌లో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. నడ్డి విరిగే వడ్డీలకు చెల్లుచీటీ చెబుతూ చిరు వ్యాపారులకు అండగా నిలిచారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. చిరు వ్యాపారుల్లో 80% బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములకు ‘జగనన్న తోడు’ అందుతోందన్నారు. 3.95 లక్షల మందిలో 3.67 లక్షల మంది సకాలంలో రుణాలు చెల్లించి, మళ్లీ రెండోసారి రుణాలు తీసుకుంటున్నారని చెప్పారు. వీరు కాక మరో 28 వేల మందికి ఇవాళ రుణాలు ఇస్తూ కొత్తగా ఈ పథకంలోకి తీసుకొచ్చామన్నారు. మొత్తంమ్మీద జగనన్న తోడు ద్వారా దాదాపు 15.31 లక్షల చిరు వ్యాపారుల కుటుంబాలకు మంచి జరుగుతోందన్నారు. వీరంతా ఇతరులపై ఆధార పడకుండా.. వడ్డీలు, చక్రవడ్డీలు కట్టాల్సిన అవసరం లేకుండా చిన్న చిన్న వ్యాపారాలు చేసుకోవడానికి రూ.10 వేలు వడ్డీ లేని రుణం ఇప్పిస్తున్నామని చెప్పారు. ‘ఎవరికి అవసరమైతే వాళ్లు రుణాలు తీసుకుంటున్నారు. తిరిగి చెల్లిస్తున్నారు. వాళ్లకు సహాయంగా బ్యాంక్‌లు తిరిగి రుణాలు ఇస్తున్నాయి. వాళ్లు కట్టిన వడ్డీని ప్రభుత్వం ప్రతి 6 నెలలకు ఒకసారి వెనక్కు తిరిగి ఇస్తోంది. తద్వారా వ్యవస్థలో గొప్ప మార్పు కనిపిస్తోంది’ అని అన్నారు. సీఎం ఏమన్నారంటే..



జగనన్న తోడు లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

> చిరు వ్యాపారులందరూ వాళ్ల కష్టం మీదే ఆధార పడుతున్నారు. పెట్టుబడి సాయం కింద మనం వాళ్ల వ్యాపారం కోసం రూ.10 వేలు సాయం చేస్తున్నాం. వాళ్లు మరొకరి దగ్గర వస్తువులు, పండ్లు, కూరగాయలు తదితరాలు కొనుగోలు చేసి.. ప్రజలకు విక్రయిస్తున్నారు. తద్వారా వాళ్ల బతుకు వారు బతకడమే కాకుండా.. స్వయం ఉపాధి రంగంలో గొప్ప మార్పు తీసుకొస్తున్నారు. అందువల్లే వారికి తోడుగా నిలిచాం. ఇప్పటి వరకు 15,31,347 మంది చిరు వ్యాపారులకు రూ.2,406 కోట్లు వడ్డీ లేని రుణం అందించాం. - సీఎం వైఎస్ జగన్

ఆ రుణానికి ప్రభుత్వ గ్యారంటీ

- ఫుట్‌పాత్‌ల మీద, వీధుల్లో తోపుడు బండ్ల మీద కూరగాయలు, పండ్లు, వస్తువులు, ఆహార పదార్థాలు అమ్ముకుని జీవించే వారు, రోడ్డు పక్కన టిఫిన్ సెంటర్లు నిర్వహించే వారు.. గంపలు, బుట్టల్లో పెట్టుకుని వస్తువులు అమ్మేవారు.. సైకిళ్లు, మోటారు సైకిళ్లు, ఆటోలపై వెళ్లి వ్యాపారం చేసుకునే వారితో పాటు చేనేతలు, సంప్రదాయ చేతి వృత్తుల కళాకారులు, ఇత్తడి పనిమీద బతికేవారికి. బొబ్బిలి వీణ వంటివి తయారు చేసే వారు, ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, కళంకారీ, తోలు బొమ్మలు, లేస్ వర్కర్స్ అందరికీ ఈ రోజు ఈ పథకాన్ని వర్తింప చేస్తున్నాం.
- బ్యాంకులకు గ్యారంటీ ఇవ్వాల్సిన అవసరం లేకుండా, ప్రభుత్వమే బ్యాంకులను ఒప్పించి వీరందరికీ సున్నా వడ్డీ పథకం కింద రూ.10 వేలు ఇప్పించే కార్యక్రమం చేస్తున్నాం. ఈ రుణాలు సకాలంలో చెల్లిస్తే మళ్లీ బ్యాంకులు వారికి తిరిగి రుణాలిచ్చే కార్యక్రమం కూడా జరుగుతోంది.

వారి కష్టాలు, బాధలు చూసినందుకే..

- నా సుదీర్ఘ పాదయాత్రలో చిరు వ్యాపారుల బాధలు, కష్టాలు నా కళ్లతో చూశాను. ప్రతి చోటా, ప్రతి జిల్లాలో, ప్రతి నియోజకవర్గంలో ఇవన్నీ సాధారణంగా కనిపించే విషయాలు. ఇటువంటి చిన్న వ్యాపారాలు చేసుకునే వాళ్లకు పెట్టుబడి సమకూర్చుకోవడం చాలా కష్టంగా ఉంటుంది.
- రూ.1,000 అప్పు కావాలంటే ముందే రూ.100 తీసుకుని, రూ.900 చేతిలో పెట్టి.. నెల నాటికి మళ్లీ ఆ డబ్బులు కట్టించుకుంటూ.. తిరిగి ఈ చిరు వ్యాపారులతోనే వ్యాపారం చేసే అధ్వాన్నమైన పరిస్థితుల్లో సమాజం ఉంది. అలాంటి సమాజంలో మార్పులు తీసుకొచ్చి, వాళ్ల బాధలకు, ఆ రోజు నేను చూసిన వాళ్ల కష్టాలకు శాశ్వత పరిష్కారం తీసుకురావాలన్న తపన, తాపత్రయం తోనే జగనన్న తోడు పథకం తీసుకువచ్చాం.
- ఇప్పటి వరకు రుణాలు పొందిన 15,31,347 మందిలో 8,74,745 మంది బ్యాంకులకు రుణం చెల్లించి.. మళ్లీ రెండోసారి రుణాలు పొందారు. ఇలా వీరంతా ఏడాది సైకిల్ పూర్తి చేసుకుని బ్యాంకులతో భేష్ అనిపించుకున్నారు.

సకాలంలో చెల్లిస్తే రూ.13 వేల వరకు రుణాలు

- సకాలంలో రుణాలు కడితే రూ.10 వేల నుంచి మరో వెయ్యి రూపాయలు పెంచి రూ.11వేలు, రూ.11 వేల నుంచి రూ.1,000 పెంచి రూ.12 వేలు అందించే కార్యక్రమం చేస్తూ.. రూ.13 వేల వరకు ఇచ్చేలా బ్యాంకులను ఒప్పించాం. వీళ్లందరికీ జగనన్న తోడుతో పాటు ఆసరా, చేయూత, సున్నా వడ్డీ, ఇళ్ల పట్టాలు, ఇళ్ల నిర్మాణం, విద్యాదీవెన, విద్యా కానుక, వసతి దీవెన, ఆరోగ్యశ్రీ ,ఆరోగ్య ఆసరా, రైతు భరోసా అన్ని పథకాలతో మంచి జరుగుతుంది. రాబోయే రోజుల్లో వీరందరికీ మంచి జరగాలి. వీరి జీవన ప్రమాణాలు మారాలి. వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడే పరిస్థితి రావాలి.
- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మంత్రులు ఆదిమూలపు, బొత్స, సీఎస్ జవహర్‌రెడ్డి, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్ వై శ్రీలక్ష్మి, గ్రామ, వార్డు సచివాలయాల శాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, పాల్గొన్నారు.

ఇది నిరంతర ప్రక్రియ

- 6 నెలలకు ఒకమారు వడ్డీ లేని రుణాలిచ్చే కార్యక్రమం చేస్తున్నాం. ఇది నిరంతర ప్రక్రియ. 2020 నవంబర్‌లో ఈ దిశగా తొలిసారి అడుగులు పడ్డాయి. ప్రస్తుతం 6వ దశ కార్యక్రమం జరుగుతోంది. సకాలంలో వడ్డీ కట్టిన వారికి తిరిగి వెనక్కు ఇచ్చే కార్యక్రమంలో భాగంగా ఈ రోజు ఇచ్చే రూ.15.17 కోట్ల వడ్డీతో కలుపుకుని, సకాలంలో రుణాలు చెల్లించిన 13.28 లక్షల మంది లబ్ధిదారులకు ప్రభుత్వం తరఫున రూ.63.65 కోట్లు చెల్లించాం.
- అర్హత ఉండీ కూడా ఎవరైనా ఈ పథకాన్ని అందుకోలేకపోయి ఉంటే ఎవరూ కంగారు పడాల్సిన పనిలేదు. అలాంటి వారంతా గ్రామ సచివాలయంలోకి వెళ్లి దరఖాస్తు చేసినా, వలంటీర్‌కు చెప్పడంతో పాటు 1902 నంబరుకు ఫోన్ చేస్తే చాలు. వాళ్లతో దరఖాస్తు నింపించడం మొదలు బ్యాంకులతో టై అప్ చేయించి వాళ్ల వ్యాపారాలకు అన్ని రకాలుగా సహాయ, సహకారాలు అందించే కార్యక్రమం ప్రభుత్వం దగ్గరుండి చేస్తుంది. ఇది నిరంతరం జరుగుతుంది. ఈ పథకాన్ని వీలైనంత ఎక్కువ మందికి అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్లకు సూచిస్తున్నాను.
- సకాలంలో డబ్బులు కడుతున్న వారి కోసం ఒక బ్యాంకును రెండు సచివాలయాలకు టైఅప్ చేశాం. ఈ రెండు సచివాలయాల్లో ఉన్న సిబ్బంది ఈ కార్యక్రమంలో భాగస్వాములుగా ఉంటూ పనిచేస్తారు. ఎవరైనా రుణాలు చెల్లించలేకపోతే.. మిగిలిన వారి మీద దాని ప్రభావం ఉంటుంది కాబట్టి.. సకాలంలో చెల్లించాలి.


ఈరోజే సంక్రాంతి



చిరు వ్యాపారులందరూ ఈరోజే సంక్రాంతి పండగ చేసుకుంటున్నాం. నాది కూరగాయల అంగడి. నా భర్త కూలి పనులకు వెళ్తాడు. ఇది వరకు పెట్టుబడి కోసం రూ.1,000 అప్పు తీసుకుంటే వడ్డీ కింద ముందుగానే రూ.100 పట్టుకుని ఇచ్చే వారు. రూ.500 వడ్డీ కట్టి రూ.4,500 చొప్పున ఎన్నోసార్లు తీసుకున్నాను. తర్వాత రూ.5 వేలు చెల్లించాను. కోవిడ్ లాంటి పరిస్థితుల్లో జగనన్న తోడు కింద రూ.10,000 వడ్డీ లేని రుణం ఇచ్చారు. వ్యాపారం చేసుకుని, సకాలంలో రుణం చెల్లించాను. నాకు మీరు వడ్డీ కూడా జమ చేశారు. తర్వాత రూ.11 వేలు.. ఇప్పుడు రూ.12 వేల రుణం అందజేశారు.

– పి.కోటేశ్వరి, కొడవలూరు, నెల్లూరు జిల్లా.

ఆత్మగౌరవం కాపాడుతున్నారు..



మీరు మా ఆత్మగౌరవం కాపాడుతున్నారు. నేను టైలరింగ్ చేస్తాను. నాకు ముగ్గురు పిల్లలు. టైలరింగ్ మెటీరియల్ కోసం ఫైనాన్షియర్ దగ్గరకు రూ.10 వేల కోసం వెళ్తే.. రూ.1,000 మినహాయించుకుని రూ.9 వేలు చేతిలో పెట్టేవారు. ప్రతిరోజూ సాయంత్రం రూ.200 చొప్పున అప్పు తీరే వరకు కట్టేదాన్ని. మీరు వచ్చిన తర్వాత 2020లో నవరత్నాలతో పాటు మీరు అందించిన జగనన్న తోడు మాకు చాలా ఉపయోగపడింది. మా అమ్మ వృద్ధాప్య పెన్షన్ తీసుకున్నప్పుడల్లా నా పెద్ద కొడుకు డబ్బులు పంపించాడని ఆనందంగా చెబుతూ ఉంటుంది.

– మాధురి, నరసన్నపేట, శ్రీకాకుళం జిల్లా

అడగకుండానే వరాలు



అన్నా.. మీరు అడగకుండానే వరాలు ఇచ్చిన దేవుడు. నేను టైలరింగ్ చేస్తాను. రూ.10 వేలు వడ్డీకి తీసుకుంటే రూ.2 వేలు వడ్డీ తీసుకుని రూ.8 వేలే ఇచ్చేవారు. ఇలా ఎన్నాళ్లుగానో నా కష్టం వడ్డీ వ్యాపారుల పాలయ్యేది. మీరు వచ్చాక ఆ దుస్థితి పోయింది. మాకు మేలు జరిగింది. వలంటీర్ రెండు రోజుల్లోనే నాకు లోన్ మంజూరు చేయించారు. మేం నలుగురు అమ్మాయిలం. మాకు మగబిడ్డ లేడని అమ్మానాన్నలు బాధ పడేవాళ్లు. మా అమ్మానాన్నలకు ఉన్న ఏకైక మగబిడ్డ మీరే అన్నా. మీ పథకాల వల్ల మేం హాయిగా జీవిస్తున్నాం.

– శశికళ, కడప, వైఎస్సార్ జిల్లా

జగనన్నే వన్స్ మోర్ అంటున్న జనం

మీ సుదీర్ఘ పాదయాత్రలో చిరు వ్యాపారుల కష్టాలను చూసి చలించిపోయారు. ఆ రోజు వారందరికీ నేను తోడుగా ఉంటానని మీరు ఇచ్చిన మాటను నిలుపుకున్నారు. ఇప్పటివరకు 15 లక్షల పైచిలుకు లబ్ధిదారులకు రూ.2,400 కోట్లకు పైగా రుణాలు అందించారు. చిరు వ్యాపారులు నిశ్చింతగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. అందుకే జగనన్నే వన్స్ మోర్.. అంటున్నారు.

– ఆదిమూలపు సురేష్, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి

చిరు వ్యాపారుల కుటుంబాల్లో వెలుగు

చిరు వ్యాపారులు, కుల వృత్తుల వారు పెట్టుబడి కోసం అప్పులు తెచ్చుకుని.. రోజు వడ్డీలు, వారపు వడ్డీలు, నెల వడ్డీల కోసం వారు సంపాదించిన దాంట్లో 90 శాతం చెల్లించే దుస్థితిని మీరు (సీఎం) మార్చేశారు. ఎలాంటి హామీ లేకుండా బ్యాంకుల్లో రూ.10 వేలు రుణాలిచ్చే విధంగా మీరు తీసుకున్న చర్యలు లక్షలాది కుటుంబాల్లో వెలుగు నింపాయి. వారందరూ కూడా మీరే మళ్లీ రావాలని కోరుకుంటున్నారు.

– బూడి ముత్యాలనాయుడు, ఉప ముఖ్యమంత్రి

నా‘రా’బంధువులే’!

▶ మొదటి పేజీ తరువాయి

గత సర్కారు హయాంలో ఇతరుల పేరుతో సీఆర్‌డీఏ రికార్డుల్లో నమోదు కావడం గమనార్హం. సీఐడీ దర్యాప్తులో గుర్తించిన అసైన్డ్ భూముల రికార్డులను గుంటూరు జిల్లా రెవెన్యూ అధికారులు ప్రత్యేక బృందాల ద్వారా తనిఖీ చేయించారు. అమరావతి పరిధిలో 932.72 ఎకరాల అసైన్డ్ భూములను టీడీపీ పెద్దలు కొల్లగొట్టినట్లు ఇప్పటివరకు నిర్ధారించారు. భూ సమీకరణ కోసం ఏర్పాటైన సీఆర్‌డీఏ కార్యాలయాల వారీగా రికార్డులను పరిశీలించి నిజాలు నిగ్గు తేల్చారు. మొత్తం 23 సీఆర్‌డీఏ కార్యాలయాల పరిధిలో 932.72 ఎకరాల అసైన్డ్ భూములను కాజేసినట్లు ఆధారాలతో సహా నిరూపితమైంది. రాజధాని నిర్మాణం తరువాత అమరావతిలో ఎకరా మార్కెట్ విలువ కనీసం రూ.4 కోట్లకు చేరుతుందని నాడు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబే ప్రకటించారు. ఆ ప్రకారం టీడీపీ పెద్దలు హస్తగతం చేసుకున్న 932.72 ఎకరాల అసైన్డ్ భూముల మార్కెట్ విలువ రూ.3,730.88 కోట్లకు పైమాటేనని పరిశీలకులు చెబుతున్నారు.

మొత్తం అసైన్డ్ అక్రమాలు రూ.5,600 కోట్లు!

సీఐడీ దర్యాప్తు ముందుకు సాగుతున్న కొద్దీ మరిన్ని అసైన్డ్ భూముల అక్రమాలు వెలుగు చూసే అవకాశాలున్నాయి. అమరావతి పరిధిలో మొత్తం 1,400 ఎకరాల అసైన్డ్ భూముల రికార్డులను తారుమారు చేసినట్లు గతంలోనే సీఐడీ ప్రాథమికంగా గుర్తించింది. ఆ ప్రకారం టీడీపీ నేతలు దక్కించుకున్న అసైన్డ్ భూముల విలువ రూ.5,600 కోట్లని అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి.

‘నారా’యణ బంధువులు, బినామీలే..

అసైన్డ్ భూముల అక్రమాల తీగ లాగితే నారా చంద్రబాబు, పొంగూరు నారాయణ బంధువులు, బినామీల ఇళ్లల్లో డొంక కదులుతోంది. బినామీలు, బంధువుల పేరిట అసైన్డ్ భూములను జీపీఏ, సేల్ డీడ్లు ద్వారా హస్తగతం చేసుకున్నట్లు సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది. టీడీపీ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన నాటి ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు సమీప బంధువు పేరిట కూడా అసైన్డ్ భూములను కొల్లగొట్టారు. నారాయణ విద్యా సంస్థలు, ఆయన సమీప బంధువుకు చెందిన రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్ ఉద్యోగుల పేరిట అసైన్డ్ భూములను కాజేశారు. ఇప్పటివరకు గుర్తించిన 932.72 ఎకరాల అసైన్డ్ భూముల సేల్‌డీడ్లు, జీపీఏలను సీఐడీ అధికారులు విశ్లేషించగా ఈ అక్రమాలు వెలుగుచూశాయి.

‘ఎన్‌స్పైర’లో కీలక ఆధారాలు స్వాధీనం

మాజీ మంత్రి పి.నారాయణ కుటుంబానికి చెందిన హైదరాబాద్‌లోని ‘ఎన్ స్పైర’ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ కార్యాలయంలో సీఐడీ అధికారుల సోదాలు బుధవారం ముగిశాయి. కంప్యూటర్ హార్డ్‌డిస్క్‌లు, బ్యాంకు ఖాతా లావాదేవీల పత్రాలు, ఇతర కీలక రికార్డులను సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకుని విశ్లేషిస్తున్నారు. మునుముందు మరిన్ని కీలక అంశాలు బహిర్గతమవుతాయని భావిస్తున్నారు.

అమరావతిలో ఎల్లో గ్యాంగ్ అసైన్డ్ దందా గ్రామాల వారీగా..

గ్రామం	అసైన్డ్ భూములు (ఎకరాల్లో)
కృష్ణాయపాలెం	9.31
నవులూరు-1	29.30
నవులూరు-2	12.89
కురగల్లు-1	225.34
కురగల్లు-2	2.14
నిడమర్రు-1	63.43
నిడమర్రు-2	41.62
ఉండవల్లి	5.45
పెనుమాక	2.37
లింగాయపాలెం	153.90
ఉద్దండరాయునిపాలెం	20.31
బోరుపాలెం	1.25
పిచుకలపాలెం	9.99
నెక్కల్లు	17.17
నేలపాడు	17.36
తుళ్లూరు-1	43.19
తుళ్లూరు-2	12.52
అనంతవరం	6.96
రాయపూడి-1	87.26
కొండమరాజుపాలెం	6.47
వెలగపూడి	3.30
వెంకటపాలెం	27.39
మందడం-2	133.80
మొత్తం	932.72

టీడీపీ పెద్దలు, బినామీల అసైన్డ్ అరాచకాలు ఇలా..

- చంద్రబాబు బినామీలు, సన్నిహితులు, టీడీపీ నేతలు, బంధువులు — 616.73 ఎకరాలు
- పొంగూరు నారాయణ బంధువులు — 140.10 ఎకరాలు (సేల్ డీడ్ల ద్వారా సేల్ డీడ్ల ద్వారా అసైన్డ్ భూములు హస్తగతం చేసుకున్నారు)
- గుమ్మడి సురేశ్ (విజయవాడ) — 40.96 ఎకరాలు (ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు వియ్యంకుడు. జీపీఏ ద్వారా అసైన్డ్ భూములను హస్తగతం చేసుకున్నారు)
- కొల్లి శివరామ్, విజయవాడ — 52.12 ఎకరాలు (మాజీ మంత్రి నారాయణ సమీప బంధువుకు చెందిన రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్‌లో ఉద్యోగి. జీపీఏ ద్వారా అసైన్డ్ భూములను హస్తగతం చేసుకున్నారు)
- యాగంటి శ్రీకాంత్, గుంటూరు — 9.50 ఎకరాలు (రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్‌లో ఉద్యోగి. జీపీఏ ద్వారా అసైన్డ్ భూములను హస్తగతం చేసుకున్నారు)

నారాయణ విద్యా సంస్థలు, రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్ ఉద్యోగులు (సేల్ డీడ్ల ద్వారా సేల్ డీడ్ల ద్వారా అసైన్డ్ భూములు హస్తగతం చేసుకున్నారు)

- బలుసు శ్రీనివాసరావు, వెంకటరావు (తూ.గోదావరి జిల్లా) — 14.34 ఎకరాలు
- కసిరెడ్డి పేరయ్య (విశాఖపట్నం) — 13.96 ఎకరాలు
- బలుసు శ్రీనివాసరావు, వెంకటరావు (తూ.గోదావరి జిల్లా) — 14.34 ఎకరాలు
- సుఖవాసి బసవరామయ్య, చైతన్య (హైదరాబాద్) — 7.88 ఎకరాలు
- నిమ్మగడ్డ శాంతకుమారి (నిజామాబాద్) — 10.23 ఎకరాలు
- కాట్రగడ్డ చంద్రశేఖరరావు: 5.23 ఎకరాలు
- వెల్లంకి శ్రీనివాస సత్యప్రసాద్ — 5.10 ఎకరాలు
- పోలవరపు సోమశేఖర్ (హైదరాబాద్) — 5.62 ఎకరాలు
- పొట్లూరి జయంత్ (విజయవాడ) — 4.27 ఎకరాలు
- చెరుకూరి అచ్యుతకిరణ్, రోహిత్ కిరణ్ (విజయవాడ) — 3.33 ఎకరాలు
- బోయినపల్లి వెంకట నరసింహారావు (హనుమకొండ, తెలంగాణ) — 3.35 ఎకరాలు

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

తెలిపిన చిన్నారి హనీ తల్లిదండ్రులు..

- హనీ పుట్టిన రోజు సందర్భంగా ఆశీర్వదించిన సీఎం
- జగనన్న దయవల్లే తమ బిడ్డ బతికిందంటూ తల్లిదండ్రుల భావోద్వేగం




హనీ తల్లి నాగలక్ష్మితో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి,అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన చిన్నారి హనీ, ఆమె తల్లిదండ్రులు కలిశారు. బుధవారం హనీ పుట్టిన రోజు సందర్భంగా తల్లిదండ్రులు నాగలక్ష్మి, రాంబాబులు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారి హనీని సీఎం జగన్ ఆశీర్వదించారు. గతంలో కోనసీమ జిల్లాలో సీఎం జగన్ పర్యటిస్తున్నప్పుడు నాగలక్ష్మి, రాంబాబులు సీఎం జగన్‌ను కలిసి తమ బిడ్డ అనారోగ్య సమస్యను వివరించారు. సీఎం ఆదేశాలతో చిన్నారికి ప్రభుత్వమే వైద్యం చేయిస్తోంది. అరుదైన గాకర్స్ వ్యాధితో బాధపడుతున్న హనీ చికిత్స కోసం ఇప్పటికే కోటి రూపాయలను సీఎం జగన్ మంజూరు చేశారు. చికిత్సకు అవసరమైన ఇంజెక్షన్లతో పాటు నెలకు రూ.10 వేలు పెన్షన్ కూడా ప్రభుత్వం ఇస్తోంది. అనంతరం నాగలక్ష్మి, రాంబాబులు మీడియాతో మాట్లాడుతూ సీఎం జగన్ దయ, కరుణ వల్లే తమ బిడ్డ బతికిందని భావోద్వేగానికి లోనయ్యారు. తమకు ఇంతటి సాయం చేసిన జగనన్న రుణం తీర్చుకోలేనిదని చెప్పారు.

సీఎం జగన్‌ను కలిసిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు

ఆయా సంఘాల డైరీలు, క్యాలెండర్లను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి



ఎన్జీవో సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ,తదితరులు

సాక్షి, అమరావతి: పలు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు బుధవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌ని కలిశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల డైరీలు, క్యాలెండర్లను సీఎం జగన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు సీఎంకు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, ఏపీ సెక్రటేరియట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డి, అసోసియేషన్ ప్రతినిధులు సీహెచ్ ఎర్రన్నయాదవ్, ఎం.సత్యసులోచన, కృష్ణ, ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, అసోసియేషన్ ప్రతినిధులు జి.హృదయరాజు, కేవీ శివారెడ్డి, హెచ్ తిమ్మన్న, కేఎస్ఎస్ ప్రసాద్, ఎల్.సీతారామరాజు, వైఎస్ఆర్‌టీఎఫ్–ఏపీ.. రాష్ట్ర నేతలు ఓబులాపతి, జాలిరెడ్డి, అశోక్, సుధీర్‌లు, పీఆర్టీయూ ఏపీ అధ్యక్షుడు గిరిప్రసాద్‌రెడ్డి, ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ, అసోసియేషన్ ప్రతినిధులు జి.ఆస్కార్‌రావు, జీఎం రమేష్‌కుమార్‌లు, గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు జానీపాషా షేక్ ఎండీ తదితరులున్నారు. వీరితో పాటు ఏపీ సివిల్ సర్వీసెస్ అసోసియేషన్ ప్రతినిధులు దర్శిచంద్రారెడ్డి, మోహన్ కుమార్, ఈ.మురళీ కూడా సీఎంను కలిశారు.



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పుల్లేటికుర్రులో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో సంక్షేమ కరపత్రాలను అందజేస్తున్న మంత్రి విడదల రజని

గడప గడపకు మన ప్రభుత్వం



అల్లూరి సీతారామరాజు జిల్లా పెద్దగంగవరంలో వృద్ధులకు నవరత్నాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



తిరుపతి జిల్లా నాయుడుపేట మున్సిపాలిటీ అమరాగార్డెన్ వీధిలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

మనకు మరింత చేరువగా గజరాజు

వైల్డ్ లైఫ్ (ప్రొటెక్షన్)-1972 చట్టంలో సవరణలు

- వైల్డ్ లైఫ్ (ప్రొటెక్షన్) బిల్లు-2022కు రాజ్యసభ ఆమోద ముద్ర
- ఇక విరివిగా దర్శనమివ్వనున్న ఏనుగులు!
- దేశంలో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సులభంగా బదిలీ
- మంచిది కాదంటున్న పర్యావరణవేత్తలు



కె.జి. రాఘవేంద్రారెడ్డి, సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ఇకపై ఏనుగులనూ పెంపుడు జంతువులుగా పెంచుకునే వీలు కలిగే అవకాశాలు ఉన్నాయి. అమ్యూజ్‌మెంట్ పార్కుల అభివృద్ధి పేరుతో ఏనుగులను ఓ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సులభంగా తరలించుకోవచ్చు కూడా. మానవ అవసరాలకు సైతం ఏనుగులను ఉపయోగించుకోవచ్చు. కేంద్రం తీసుకొచ్చిన తాజా సవరణలు ఇందుకు వీలు కల్పించే అవకాశం ఉందని చెబుతున్నారు. వైల్డ్ లైఫ్ (ప్రొటెక్షన్)-1972 చట్టంలో చేసిన సవరణలకు ఆమోదముద్ర పడింది. వైల్డ్ లైఫ్ (ప్రొటెక్షన్) బిల్లు-2022కు రాజ్యసభ సైతం గత నెల 19న ఆమోదముద్ర వేయడంతో ఏనుగులను సొంత అవసరాలకు వినియోగించుకునే వెసులుబాటు మరింత అధికారికం కానుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మతపరమైన, ఇతర అవసరాల కోసం ఏనుగులను తరలించేందుకు ప్రత్యేకంగా చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని తాజా సవరణలో పేర్కొన్నారు. ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో అమ్యూజ్‌మెంట్, జూ పార్కుల ఏర్పాటుకు ఇది దోహదం చేస్తుందని కొందరు చెబుతుండగా.. తాజా సవరణలపై పర్యావరణ వేత్తలు, జంతు ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రిలయన్స్ సంస్థ గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఏర్పాటు చేయనున్న అమ్యూజ్‌మెంట్ పార్కుకు ఏనుగులను తరలించేందుకు ఈ తాజా సవరణలు తోడ్పడతాయన్న విమర్శలూ వినిపిస్తున్నాయి.

ఇప్పటివరకు అనధికారికంగానే..!

దేశంలో మానవ అవసరాలకు ఏనుగులను ఉపయోగించుకోవడం ఎప్పటినుంచో ఉంది. సర్కస్‌లలో ఏనుగులతో ఫీట్లు చేయించడం, కొండ ప్రాంతాల్లో భారీ దుంగలను లాగేందుకు ఏనుగులను ఉపయోగించుకోవడం జరుగుతోంది. అధికారిక లెక్కల ప్రకారం ఈ విధంగా సొంత అవసరాలకు ఉపయోగించుకుంటున్న ఏనుగుల సంఖ్య 2,675 వరకు ఉంది. ఇందులో కేవలం 1,251 ఏనుగులకు సంబంధించి మాత్రమే యాజమాన్య హక్కులను వాటిని వినియోగిస్తున్న వ్యక్తులు చూపుతున్నారు. ప్రధానంగా అస్సాం, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో రక్షణ అవసరాలతో పాటు బరువైన మొద్దులను లాగేందుకు ఏనుగులను ఉపయోగించడం ఆనవాయితీగా ఉంది. అయితే, 1996లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో సొంత అవసరాలకు ఏనుగులను వినియోగించడం నిషేధించబడింది. అయినప్పటికీ ఈ వ్యవహారం ఇంకా అనధికారికంగానే కొన్ని రాష్ట్రాల్లో సాగిపోతోంది. అలా చేయడం ఏనుగులను బానిసలుగా మార్చడమేనని, వాటిని గంటల తరబడి నిలబెట్టడం, తరలింపు సమయంలో రోజుల తరబడి ప్రయాణం వంటివి వాటిని క్షోభకు గురిచేస్తాయని జంతు ప్రేమికులు చెబుతున్నారు.

ఆ మినహాయింపుతో..

వైల్డ్ లైఫ్ (ప్రొటెక్షన్) చట్టాన్ని 1972లో రూపొందించారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం తాజాగా కొన్ని సవరణలు చేసింది. వైల్డ్‌లైఫ్ (ప్రొటెక్షన్) బిల్లు-2021 పేరుతో కొన్ని సవరణలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం 2021లోనే పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టగా.. అది పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి చేరింది. తాజాగా రాజ్యసభలో కూడా ఆమోదం పొందటంతో త్వరలో వైల్డ్ లైఫ్ (ప్రొటెక్షన్) బిల్లు-2022 కాస్తా గెజిట్ నోటిఫికేషన్ ద్వారా చట్ట రూపంలో అమల్లోకి రానుంది. గతంలో ఉన్న చట్టంలో ఏనుగులను సంరక్షించేందుకు అనేక అంశాలు తోడ్పడేవని.. తాజాగా చట్టంలో సెక్షన్ 43(2) ప్రొవిజన్ చేర్చడంతో చిక్కు వచ్చిపడిందని చెబుతున్నారు.

- దేశంలో ఏనుగుల కారిడార్లు **88** ఉన్నాయి..
- ప్రధానంగా కర్ణాటక, అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా, నాగాలాండ్, పశ్చిమబెంగాల్, మేఘాలయ, కేరళ, ఉత్తరాఖండ్, జార్ఖండ్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ కారిడార్లు ఉన్నాయి.
- ఆంధ్రప్రదేశ్‌లో చిత్తూరు జిల్లాలో రాయల ఎలిఫెంట్ రిజర్వ్ **357.6** చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది.

పాత చట్టంలోని సెక్షన్ 12 ప్రకారం చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ అనుమతి లేకుండా ఏ అడవి జంతువునైనా కలిగి ఉంటే అది వేటాడటం కిందకు వస్తుంది. కానీ.. విద్య, శాస్త్ర పరిశోధనల కోసం చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ అనుమతితో ఏనుగులను వినియోగించుకునే వెసులుబాటు ఉంది. అది కూడా సెక్షన్ 12 నిబంధనలకు లోబడి మాత్రమేనని స్పష్టంగా పేర్కొన్నారు. ఇలా వినియోగించుకునే వెసులుబాటు కూడా ఆయా జంతువుల సంరక్షణ కేంద్రంగానే జరగాలని పేర్కొన్నారు. అయితే, తాజా సవరణల్లో ఏనుగుల సంరక్షణ కేంద్రంగా అనే అంశాన్ని మినహాయించారనే ఆరోపణలున్నాయి.

సులభంగా తరలించేందుకేనా!

దేశంలో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ఏనుగులను సులభంగా తరలించేందుకు ఈ కొత్త చట్టాన్ని తెస్తున్నట్టు తెలుస్తోంది. దేశంలో ప్రధానంగా అస్సాం, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో మానవ అవసరాలకు ఉపయోగించుకునే (కేప్టివ్) ఏనుగులున్నాయి. వీటిని గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి ప్రదేశాలకు తరలించేందుకే కేంద్రం కొత్త చట్టం కేంద్రం తెచ్చిందనేది ప్రధాన ఆరోపణ. గుజరాత్‌లో ఏర్పాటు చేయనున్న అమ్యూజ్‌మెంట్ పార్కులతో పాటు కేరళలోని దేవస్థానాల్లో

రాష్ట్రాల్లో ఉన్న ఏనుగుల సంఖ్య (2017-18 సెన్సెస్ ప్రకారం)

రాష్ట్రం	ఏనుగుల సంఖ్య
కర్ణాటక	6,049
అస్సాం	5,719
కేరళ	3,054
తమిళనాడు	2,761
ఒడిశా	1,976
ఉత్తరాఖండ్	1,839
మేఘాలయ	1,754
అరుణాచల్ ప్రదేశ్	1,614
జార్ఖండ్	679
నాగాలాండ్	446
ఛత్తీస్‌గఢ్	247
ఉత్తరప్రదేశ్	232
పశ్చిమబెంగాల్	194
త్రిపుర	102
ఆంధ్రప్రదేశ్	65
బిహార్	25
గుజరాత్	10
మధ్యప్రదేశ్	7
మిజోరం	7
మహారాష్ట్ర	8
మొత్తం	26,788

ఏనుగులను ఉపయోగించేందుకు తాజా సవరణల అసలు ఉద్దేశమనేది పర్యావరణ ప్రేమికుల ఆందోళన. తద్వారా సహజసిద్ధంగా ఏర్పడిన ఏనుగు కారిడార్లను చెరిపివేయడం సరి కాదని పేర్కొంటున్నారు. చట్టం పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చిన తర్వాత మాత్రమే తాజా మార్పుల వెనుక ఉన్న అసలు కారణం తెలిసే అవకాశం ఉందని చెప్పక తప్పదు.

క్లుప్తంగా...

రైతన్నా నీ మద్దతు నీటికా ? కరువుకా ?

అగ్రి మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి



సాక్షి,అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో దైవం దీవిస్తుంటే.. దయ్యాలు గోల చేస్తున్నాయని అగ్రి మిషన్ వైస్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీఎస్ నాగిరెడ్డి అన్నారు. ఆయన బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం జగన్ పాలనలో గ్రామాలన్నీ పచ్చగా ఉన్నాయని, నదులన్నీ కళకళలాడుతున్నాయని చెప్పారు. ఆహార ధాన్యాలు, పండ్ల ఉత్పత్తి భారీగా పెరిగిందన్నారు. చంద్రబాబు పాలనలో ఎప్పుడూ కరువు, కాటకాలే అని అన్నారు. ఆహార ఉత్పత్తులు భారీగా పెంచగలిగిన ప్రభుత్వం కావాలా? కరువు కాటకాలతో ఉండే పాలన కావాలో తేల్చుకోవాలని రైతులకు సూచించారు. రైతన్నా... నీ మద్దతు నీటికా? కరువుకా ? అని ఆయన ప్రశ్నించారు. బాబు హయాంలో భూగర్భ జలాలు 12.67 మీటర్ల లోతులో ఉండగా, ప్రస్తుతం 5.78 మీటర్లకు వచ్చాయని చెప్పారు. బాబు హయాంలో 1623 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించగా నేడు ఒక్క మండలాన్ని కూడా ప్రకటించే పరిస్థితి రాలేదన్నారు. టీడీపీ హయాంలో సగటున 153.95 లక్షల టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి జరిగితే గడిచిన మూడున్నరేళ్లలో 166.47 లక్షల టన్నుల ఉత్పత్తి జరిగిందన్నారు. నీతి ఆయోగ్ రిపోర్ట్ ప్రకారం పేదరికంలో గుజరాత్ 13, తెలంగాణ 18, కర్ణాటక 19 స్థానాల్లో ఉండగా ఏపీ 20వ స్థానంలో నిలిచిందని గుర్తు చేశారు.


ఏపీ శాక్స్ 2023-24 బడ్జెట్ రూ.146 కోట్లు



సాక్షి, అమరావతి: ఏపీలో ఎయిడ్స్ నియంత్రణ, నివారణ కార్యకలాపాలకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.146 కోట్లతో బడ్జెట్‌ను జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (న్యాకో)కు ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (ఏపీ శాక్స్) డైరెక్టర్ నవీన్‌కుమార్ ప్రతిపాదించారు. న్యాకో ఆధ్వర్యంలో సౌత్ రీజియన్ సమావేశం బుధ, గురు, శుక్రవారాల్లో మూడు రోజుల పాటు ఏర్పాటు చేశారు. 2023-24 సంవత్సరానికి ఆర్థిక ప్రణాళిక రూపకల్పన కోసం ఈ సమావేశాలు నిర్వహిస్తున్నారు. సమావేశాలకు న్యాకో డైరెక్టర్ హెకాలిజిమోమి అధ్యక్షత వహించారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో నవీన్ కుమార్ బడ్జెట్ ప్రతిపాదనలను సమర్పించి, ఏపీలో ఎయిడ్స్ నియంత్రణకు చేపట్టిన ఉత్తమ విధానాలను ప్రదర్శించారు. సమావేశంలో ఏపీడీ డాక్టర్ కామేశ్వరప్రసాద్, జేడీలు డాక్టర్ కిశోర్, డాక్టర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మిర్చి రైతుల కష్టాలపై వ్యవసాయ శాఖ స్పందించాలి

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు



సాక్షి, అమరావతి: మిర్చి రైతుల కష్టాలపై వ్యవసాయ శాఖ వెంటనే స్పందించాలని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు కోరారు. తామర పురుగుతో మిర్చి రైతులు వరుసగా రెండో ఏడాది కూడా తీవ్రంగా నష్టపోతున్నారని బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంటను కాపాడుకునేందుకు రకరకాల మందుల వాడకంతో పెట్టుబడి రెట్టింపు అవుతుందని, పురుగుమందుల ధరల నియంత్రణ పై వ్యవసాయ శాఖ దృష్టి పెట్టాలని సూచించారు.

మంత్రి పెద్దిరెడ్డివి శిఖండి రాజకీయాలు.. పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి పని అయిపోయిందని మరో ప్రకటనలో చంద్రబాబు విమర్శించారు. దూసుకొస్తోన్న పసుపు సైన్యాన్ని ఎదుర్కొనే ధైర్యం లేక పోలీసుల సహకారంతో ఆయన శిఖండి రాజకీయాలు చేస్తున్నాడని మండిపడ్డారు. 10 రోజుల్లో 5 ఎఫ్ఐఆర్‌లతో 80 మందిపై హత్యాయత్నం కేసులు పెట్టించారని ఆరోపించారు. అధికారం శాశ్వతం కాదని పోలీసులు, పెద్దిరెడ్డి తెలుసుకోవాలన్నారు.

ఆర్ఆర్ఆర్ యూనిట్‌కు అభినందనలు.. ఆర్ఆర్ఆర్ సినిమాలోని నాటు నాటు పాటకు గోల్డెన్ గ్లోబ్ అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందని చంద్రబాబు అన్నారు. చిత్ర యూనిట్‌కు ఒక ట్విట్టర్‌లో అభినందనలు తెలిపారు. తాను ముందే చెప్పినట్లు తెలుగు ఇప్పుడు భారతీయ మృదు శక్తి భాషగా మారిందన్నారు. సంగీత దర్శకుడు కీరవాణి, చిత్ర దర్శకుడు రాజమౌళిని అభినందించారు.

మీరేమంటారు?

- 2023-24 వార్షిక ఆదాయ అవసర నివేదికలు సమర్పించిన డిస్కంలు
- ఈ నెల 19, 20, 21 తేదీల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏపీఈఆర్‌సీ బహిరంగ విచారణ
- ప్రజాభిప్రాయం తెలుసుకునేందుకు జిల్లాల్లో ఎస్ఈ, ఈఈ కార్యాలయాల్లో ఏర్పాట్లు

సాక్షి, అమరావతి: విద్యుత్ చార్జీల (టారిఫ్) సవరణపై ఈనెల 19వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ప్రజాభిప్రాయం సేకరించనుంది. ఈ నెల 19, 20, 21 తేదీల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బహిరంగ విచారణ చేపట్టనుంది. సామాన్యులపై ఎటువంటి విద్యుత్ చార్జీల భారం వేయకుండా విద్యుత్ చార్జీలను సవరించేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ రాష్ట్రంలోని ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) 2023-24 ఆర్థిక సంవత్సరానికి రిటైల్ సప్లై బిజినెస్ (ఆర్ఎస్‌బీ) అగ్రిగేట్ రెవెన్యూ రిక్వైర్‌మెంట్ (ఏఆర్ఆర్)ను గతేడాది నవంబర్ 30న ఏపీఈఆర్‌సీకి సమర్పించాయి. వీటిపై ఈసారి కూడా గతేడాది లాగానే విశాఖపట్నంలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బహిరంగ విచారణ నిర్వహించనున్నారు. మండలి చైర్మన్ జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి, కార్యదర్శి, సభ్యులు, రాష్ట్ర ఇంధనశాఖ, డిస్కంల అధికారులు ఈ విచారణలో పాల్గొననున్నారు.

జిల్లాల్లో ప్రత్యక్ష ప్రసారం

ఈ నెల 19వ తేదీ నుంచి మూడు రోజులు ఉదయం గం.10.30 నిమిషాల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మధ్యాహ్నం రెండుగంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ప్రజలు అన్ని డిస్కంల టారిఫ్ ఫైలింగ్‌కు సంబంధించిన సూచనలు, అభ్యంతరాలు, అభిప్రాయాలను మండలికి తెలపవచ్చు. అన్ని జిల్లాల్లోని విద్యుత్ ఎస్ఈ, ఈఈ కార్యాలయాల్లో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాట్లు చేయనున్నారు. ప్రజలు తమ సమీపంలోని ఆయా కార్యాలయాలకు వెళ్లి తమ అభిప్రాయాలు చెప్పవచ్చు. ముందు నమోదు చేసుకున్న వారి నుంచి, తరువాత నమోదు చేసుకోని వారి నుంచి అభిప్రాయాలు తీసుకుంటారు. ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని ప్రజలంతా వీక్షించేందుకు వీలుగా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని డిస్కంలను ఏపీఈఆర్‌సీ ఆదేశించింది.

స్వచ్ఛత ఎంతో మీరే చెప్పండి

- ప్రజా మరుగుదొడ్ల నిర్వహణపై 18 వరకు ఆన్‌లైన్‌లో అభిప్రాయ సేకరణ
- నిర్వాహకులకు భారీగా రివార్డు ప్రకటించిన కేంద్రం
- ఈ వివరాలతో ఓడీఎఫ్++ పట్టణాల ఎంపికలో ప్రాధాన్యం
- 24 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలని విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా పట్టణాల్లో నిర్మించిన ప్రజా మరుగుదొడ్లు, కమ్యూనిటీ టాయిలెట్ల నాణ్యత, నిర్వహణపై కేంద్ర ప్రభుత్వం ఈ నెల 18 వరకు ఆన్‌లైన్ సర్వే ద్వారా ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తోంది. 'టాయిలెట్-2.0' పేరుతో ఈ సర్వే చేస్తోంది. మరుగుదొడ్లను వినియోగించిన తర్వాత అక్కడే ఉన్న 'క్యూఆర్ కోడ్'ను సెల్‌ఫోన్‌లో స్కాన్ చేసి ఆన్‌లైన్ సర్వేలో పాల్గొనాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ప్రకటించింది. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకొని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ బహిరంగ మల విసర్జన రహిత (ఓడీఎఫ్) నగరాలను ఎంపిక చేస్తుంది. స్వచ్ఛత పాటించే నగరాలు, పట్టణాలకు గుర్తింపునిచ్చి, ప్రోత్సాహకాలను అందిస్తుంది. స్వచ్ఛ పట్టణాలు, నగరాలుగా ప్రకటిస్తుంది. మరుగుదొడ్లను పరిశుభ్రంగా నిర్వహించే వారికి కెప్టెన్ అవార్డు కింద నగదు బహుమతులు సైతం ప్రకటించింది. అంతేకాకుండా సర్వే ముగిసిన మరుసటి రోజు నుంచే చెడిపోయిన మరుగుదొడ్లను బాగుచేసేందుకు చర్యలు తీసుకుంటారు. గత ఏడాది కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అవార్డుల్లో విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి నగరాలు వాటర్+ అవార్డును, ఏడు పట్టణాలు ఓడీఎఫ్++ గుర్తింపు, 94 పట్టణాలు ఓడీఎఫ్+ గుర్తింపు పొందాయి.

పరిశుభ్రమైన పట్టణాలే లక్ష్యంగా

బహిరంగ మల విసర్జనను నూరు శాతం నిర్మూలించేందుకు కేంద్రం ప్రజలను భాగస్వాములను చేస్తోంది. అందుకోసం నవంబర్ 19 ప్రపంచ టాయిలెట్ డే సందర్భంగా స్వచ్ఛ సర్వే ప్రారంభించింది. ఇప్పటిదాకా దేశవ్యాప్తంగా 25 శాతం నగరాలు ఓడీఎఫ్++ గుర్తింపు సాధించగా, ఈ సంఖ్యను నూరు శాతానికి పెంచాలన్నది కేంద్రం లక్ష్యం. అందుకనుగుణంగా రాష్ట్రంలో లక్ష కంటే తక్కువ జనాభా గల పట్టణాలను బహిరంగ మల విసర్జన రహితంగా మార్చాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిర్ణయించింది. అందులో భాగంగా పట్టణాల్లో ప్రజా మరుగుదొడ్ల నిర్వహణపై అవగాహన పెంచేందుకు, సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చేందుకు వాటివద్ద 'క్యూఆర్' కోడ్‌ను ఉంచింది. దీనిని స్కాన్ చేసి, ఆన్‌లైన్‌లో 24 ప్రశ్నలకు సమాధానాలను గుర్తించాలి. దీంతోపాటు ఇచ్చే ఓటింగ్ ఆధారంగా నిర్వాహకులను ఈ నెల 20వ తేదీన కెప్టెన్ అవార్డుతో సత్కరిస్తారు. మొదటి బహుమతిగా రూ.75 వేలు, రెండో బహుమతిగా రూ.50 వేలు, మూడో బహుమతిగా రూ.25 వేలు అందిస్తారు. ప్రజలు తమ అభిప్రాయాలను https://docs.google.com/forms/d/1AYucwLyLAJ037h1h_x2JpqoBoqLGDaGSU9FlYArRo8s/editలో చెప్పాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారులు కోరారు.

ఢిల్లీ గణతంత్ర వేడుకల్లో కోనసీమ 'ప్రభల శకటం'

జగ్గన్నతోట ప్రభల తీర్థానికి 410 ఏళ్ల ఘన చరిత్ర

సాక్షి, న్యూఢిల్లీ, అంబాజీపేట: దేశ రాజధానిలో ఈనెల 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల పరేడ్‌కు ఆంధ్రప్రదేశ్ నుంచి ఏకాదశ రుద్రుల ప్రభల శకటం ఎంపికైంది. సంక్రాంతి సందర్భంగా అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జరిగే వేడుకలు, పంటలు చేతికి అందే సమయంలో రైతన్నల ఆనందోత్సాహాలను ప్రతిబింబించేలా శకటం ముస్తాబవుతోంది. కోనసీమలో కనుమ రోజు జగ్గన్నతోటలో జరిగే ఏకాదశ రుద్రుల ప్రభల చరిత్రను ప్రతిబింబించేలా శకటాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఏకాదశ రుద్రుల ప్రభల చరిత్రను వివరిస్తూ గంగలకుర్రు అగ్రహారానికి చెందిన శివకేశవ యూత్ సభ్యులు రాష్ట్రపతికి లేఖ పంపారు.



ఏకాదశ రుద్రుల ప్రభలు

ప్రభల ఉత్సవంపై వారు రాసిన లేఖకు ప్రధాని మోదీ స్పందిస్తూ నాలుగు శతాబ్దాలుగా ప్రభల వేడుక నిర్వహించడం ఆనందదాయకమన్నారు. సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో గ్రామీణ ప్రాంతాలు పట్టుగొమ్మలుగా నిలుస్తున్నాయని అభినందించారు.

ఇదీ విశిష్టత

ఏకాదశ రుద్రులను కనుమ రోజు దర్శించుకుంటే ముక్తి కలుగుతుందని, పునర్జన్మ ఉండదని భక్తుల విశ్వాసం. ఏటా సంక్రాంతి మర్నాడు అంబాజీపేట మండలం మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో జరిగే ప్రభల తీర్థానికి 410 ఏళ్ల ఘన చరిత్ర ఉంది. లోకకల్యాణం కోసం పెద్దాపురం సంస్థానాధీశుడు రాజా వత్సవాయి జగన్నాథరాజు (జగ్గన్న) హయాంలో 17వ శతాబ్దంలో తొలిసారిగా ఇక్కడ నిర్వహించారు. ప్రభల ఉత్సవానికి మరో స్థల పురాణం కూడా ఉంది. 17వ శతాబ్దంలో శివభక్తుడైన జగ్గన్న ఇక్కడున్న పెద్ద మర్రిచెట్టు కింద నిత్యం ధ్యానం చేసుకునేవాడట. పూజలపై పెద్దాపురం సంస్థానాధీశులు అభ్యంతరం తెలపడంతో జగ్గన్న నేరుగా హైదరాబాద్‌లో ఉండే నవాబును కలిసి ఆయన మెప్పు పొందారట. నవాబు 8 పుట్లు (64 ఎకరాలు) భూమిని దానంగా ఇచ్చి అక్కడే శివ పూజ చేసుకునేందుకు జగ్గన్నకు అనుమతి ఇచ్చారు. కాలక్రమేణ ఆ ప్రాంతం జగ్గన్నతోటగా ప్రసిద్ధికెక్కినట్లు స్థల పురాణం చెబుతోంది. జగన్నాథ మహారాజుకు పరమేశ్వరుడు కలలో కనిపించి ప్రభల తీర్థం నిర్వహించమని, ఆదేశించడంతో జగ్గన్నతోట ప్రభల తీర్థంగా పేరు వచ్చినట్లు ప్రచారం కూడా ఉంది.

టీడీపీ మాజీ ఎంపీ నెలవల కుటుంబానికి పథకాల లబ్ధి రూ.45,702



టీడీపీ మాజీ ఎంపీకి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేట టౌన్ (తిరుపతి జిల్లా): రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్న సంగతి తెలిసిందే. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా రూ.45,702 లబ్ధి చేకూరింది. వైఎస్సార్ ఆసరా ద్వారా 2020-21, 2021-22లకు రూ.17,261 చొప్పున, సున్నా వడ్డీ కింద 2020లో రూ.2,628, 2021లో రూ.1,575, 2022లో రూ.1,112 నగదు అమృతసరోళి బ్యాంక్ ఖాతాలో ప్రభుత్వం జమ చేసింది. పంట రుణాల సున్నా వడ్డీ నగదునురెండు విడతలుగా రూ.5,865 నెలవల బ్యాంక్ ఖాతాలో వేసింది. బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సూళ్లూరుపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను నాయుడుపేటలో నెలవలకు అందజేశారు.

గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం

- అవసరమైన ఏర్పాట్లు చేయండి
- ప్రజలు వీక్షించేందుకు వీలుగా ప్రత్యక్ష ప్రసారం
- అధికార యంత్రాంగాన్ని ఆదేశించిన సీఎస్ జవహర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: గణతంత్ర దిన వేడుకలను ఘనంగా నిర్వహిద్దామని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్ జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి ఆయన 74వ గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో 26న రాష్ట్ర స్థాయిలో వేడుకలను నిర్వహించేందుకు వీలుగా వివిధ శాఖల వారీగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు వీలుగా గణతంత్ర దినోత్సవ పరేడ్ చీఫ్ కోఆర్డినేటర్ సంబంధిత విభాగాలు, సంస్థల సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. వేడుకల్లో గవర్నర్, ముఖ్యమంత్రి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి వంటి ప్రముఖులు పాల్గొంటున్నందున ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేని రీతిలో ఏర్పాట్లు చేయాలని సీఎస్ డా.జవహర్‌రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. వీవీఐపీల రాకపోకలపై సంబంధిత వ్యక్తిగత కార్యదర్శులతో సమన్వయం చేసుకుని ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. స్టేడియంలో వేడుకల రిహార్సల్స్ నిర్వహించాలని, ఈ నెల 24న ఫుల్ డ్రస్ రిహార్సల్స్ నాటికి పరేడ్‌ను పూర్తిగా సిద్ధం చేయాలని చెప్పారు. వీవీఐపీ, వీఐపీలు ఇతర ప్రజా ప్రతినిధులకు ప్రత్యేక సీట్లను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని, ప్రధాన వేదికను ప్రొటోకాల్ నిబంధనలకు అనుగుణంగా రూపొందించాలని, స్టేడియంలో పోర్ట్ వాల్ డిజైన్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

శకటాలను ఆకర్షణీయంగా రూపొందించాలి

ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేలా వివిధ శాఖలకు సంబంధించిన కార్యక్రమాలు, పథకాలపై వివిధ శాఖలకు చెందిన శకటాలను(టాబ్లూస్) ఆకర్షణీయంగా రూపొందించి ప్రదర్శనకు సిద్ధం చేయాలని సీఎస్ ఆదేశించారు. వేడుకల్లో సికింద్రాబాద్ నుంచి బ్యాండ్ ఆర్మీ కంటింజెంట్‌తో పాటు రాష్ట్ర పోలీస్ బెటాలియన్స్, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్, పోలీస్ బ్యాండ్ వంటి విభాగాలు కవాతులో పాల్గొంటాయని తెలిపారు. అలాగే వేడుకలను రాష్ట్ర ప్రజలు వీక్షించేందుకు వీలుగా ప్రత్యక్ష ప్రసారం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. 26వ తేదీ సాయంత్రం రాజ్‌భవన్‌లో నిర్వహించే తేనీటి(హై టీ) విందుకు రాజ్‌భవన్ అధికారుల సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేయాలని సీఎస్ ఆదేశించారు. సమావేశంలో ప్రొటోకాల్ డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, సంయుక్త కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్, విజయవాడ సబ్ కలెక్టర్ అదితి సింగ్ తదితరులు పాల్గొన్నారు.



తెల్లకాగితం లాంటి మనసుతో అన్ని అత్యున్నత ఆదర్శాలను వెతుకు.
అత్యంత జ్ఞానోదయం కలిగించే ఆలోచనలను పరిగణించు.
తర్వాత నీ దారిని ఎంపిక చేసుకో.
– జరాతుష్ట్ర

సాక్షి
గురువారం, జనవరి, 12

దయనీయంగా దాయాది

చపాతీ ఇరవై, తందూరీ రోటీ పాతిక రూపాయలు. కిలో గోదుమ పిండి నూట పాతిక. బేకరీలో బ్రెడ్ సైతం సైజును బట్టి రూ. 70 నుంచి 200. పాడి సమృద్ధిగా ఉండే శీతకాలమైనా సరే రెండున్నర నెలల క్రితమే లీటర్ పాలు రూ. 118 నుంచి రూ. 200 అయింది. గోదుమలు ప్రధాన ఆహారమైన దేశంలో పది కిలోల బస్తా 1500 పలుకుతోంది. మార్కెట్‌లో గోదుమ పిండి ఖాళీ అయ్యేసరికి, బారులు తీరిన జనం... తిండి కోసం అల్లాడుతూ ఆహార గింజలకై కొట్టుకుంటున్న పరిస్థితులు... ఆర్మీ గార్డుల రక్షణలో గోదుమ ట్రక్కులు పంపాల్సిన అవస్థలు... బలూచిస్తాన్, సింధ్ ప్రావిన్స్‌లలో తొక్కిసలాటలు. ఇవీ అక్కడి దృశ్యాలు. రాత్రి 8.30 గంటలకే మార్కెట్లు మూసేయాలి. రాత్రి పదికి కల్యాణ మండపాలు కట్టేయాలి. ఆఫీసులో కరెంట్ వినియోగం కనీసం 30 శాతం తగ్గించాలి. తేయాకు దిగుమతి చేసుకొనేందుకు విదేశీ మారకం తగినంత లేనందున రోజూ తాగే టీ పైనా రెండు కప్పుల రేషన్. ఇదీ పాకిస్తాన్‌లో ప్రభుత్వ ఆదేశాలు. పాలకుల విధాన వైఫల్యం, ప్రకృతి ప్రకోపం కలసి కొద్దినెలలుగా కనివిని ఎరుగని ఆర్థిక, ఆహార సంక్షోభంలోకి దాయాదిదేశాన్ని నెట్టేశాయి.

పాకిస్తాన్‌లో ప్రస్తుత పరిస్థితికి ఇవన్నీ మచ్చుతునకలు. గత జూన్ నుంచి సగటున 31 శాతం ఆహార ద్రవ్యోల్బణంతో అల్లాడుతున్న దేశంలో ఆర్థికవ్యవస్థ సైతం సంక్షోభంలో ఉంది. ఎనిమిదేళ్ళలో ఎన్నడూ లేనట్టు విదేశీమారక ద్రవ్య నిల్వలు 450 కోట్ల అమెరికన్ డాలర్లకు పడిపోయాయి. ఈ ఏడాది తొలి త్రైమాసికంలోనే ఏకంగా 800 కోట్ల డాలర్లకు పైగా అప్పులు తీర్చాలి. అంటే, రాను రానూ నిల్వలు మరింత క్షీణిస్తాయి. సరిగ్గా అయిదేళ్ళ క్రితం డాలర్ విలువ 110 రూపాయలున్న పాక్‌లో ఇప్పుడది రెట్టింపై, 228 చిల్లరకు చేరింది. తగ్గుతున్న ద్రవ్య నిల్వలు, బలహీనపడుతున్న రూపాయి, దెబ్బతింటున్న స్థూల ఆర్థిక అంశాలు... ఇలా అనేకం మన పొరుగు దేశాన్ని అడకత్తెరలో పెట్టాయి. కఠిన నిర్ణయాలు తీసుకోకుంటే సామాజిక, ఆరోగ్య రంగాల్లో సంక్షోభాలు అనివార్యం.

నిజానికి, గత ఏడాది 2.7 కోట్ల టన్నుల గోదుమలు పండించాలని పాక్ లక్ష్యంగా పెట్టుకుంది. కానీ, నీటి కొరత వచ్చింది. పులి మీద పుట్రలా ఆర్థిక వ్యవస్థ బలహీనపడింది. జూన్‌లో వరదలతో వ్యవసాయ భూమి దెబ్బతిని, ఉత్పత్తి పడిపోయింది. రష్యా నుంచి లక్షల టన్నులు దిగుమతికి ఒప్పందం కుదుర్చుకోవాల్సి వచ్చింది. ఇవన్నీ ప్రకృతి శాపమనుకుంటే... ఎన్నడూ లేనంత ద్రవ్యోల్బణం, పెట్రోలియమ్ ధరల పెంపు, రూపాయి విలువలో క్షీణత, దేశమే దివాళా తీసే పరిస్థితి – పాలకుల విధాన వైఫల్యానికి నిలువుటద్దాలు. గద్దె మీది పెద్దల తప్పులకు పౌరులు కష్టాల పాలయ్యారు. చిక్కు సమస్యల నుంచి దేశాన్ని బయటకు తెచ్చే కృషి చేయాల్సిన అధికార పక్షాలు ఆర్థికంగానే కాదు... ఆలోచనల పరంగానూ దివాళా తీయడం విషాదం. తక్షణ కర్తవ్యం గురించి ఆలోచించక, ఎంతసేపటికీ గత ప్రభుత్వాలపై నిందారోపణలకే పరిమితం కావడం విడ్డూరం.

గత ఏప్రిల్‌లో అవిశ్వాస తీర్మానం ద్వారా పదవి కోల్పోయిన తొలి పాక్ ప్రధానిగా ఇమ్రాన్ రికార్డు కెక్కితే, ఆయన స్థానంలో ప్రతిపక్ష పీఎంఎల్–ఎన్‌కు చెందిన షహబాజ్ షరీఫ్ గద్దెనెక్కారు. ప్రభుత్వం మారిందే కానీ, పార్లమెంట్ నిస్తేజంగా మారింది. వివిధ ప్రావిన్స్‌ల అసెంబ్లీలు ఏ క్షణం లోనైనా రద్దయ్యే పరిస్థితిలో పడ్డాయి. తీవ్రవాదం మరోసారి పడగ విప్పింది. ఏ రోజుకారోజు రాజకీయ సంక్షోభం ముదిరి, ఆర్థిక వ్యవస్థను దెబ్బతీశాయి. దేశ ఆర్థిక పరిస్థితి దిగజారుతున్నా, రాజకీయ పెద్దలెవరూ నియమానుసారం నడుచుకొనే ప్రయత్నం చేయకపోవడం మరీ విడ్డూరం. ఇన్నేళ్ళుగా పాలనను పక్కనపెట్టి, భారత, అఫ్గాన్ గడ్డలపై తీవ్రవాదాన్ని పెంచి పోషించడమే వ్యూహాత్మక అస్త్రంగా భావించిన పాకిస్తాన్‌కు ఇప్పుడు అదే తీవ్రవాదం గుదిబండై కూర్చుంది. స్వయంకృత అపరాధాలను గుర్తించి, ఇకనైనా బుద్ధి మార్చుకోవాల్సిన సమయం వచ్చింది.

2011 నాటికి పాక్ అప్పులు ఆ దేశ జీడీపీలో 52.8 శాతం ఉంటే, గత ఏడాదికి 77.8 శాతానికి ఎగబాకాయి. అప్పులు తీర్చలేక, ఆహార సంక్షోభం నుంచి బయటపడలేక సతమతమవుతూ ఆ దేశం ఆపన్నహస్తం కోసం చూస్తోంది. దేశ ఆర్థికవ్యవస్థను పునర్నిర్మించడానికి అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) సాయం కోరుతూ పాక్ ప్రధాని జెనీవాకు వెళ్ళారు. ఆహారం, వైద్యసాయం, వ్యవసాయం, ప్రాథమిక వసతుల నిమిత్తం 10 కోట్ల డాలర్ల ఆర్థిక సాయం ఇస్తానంటూ అమెరికా మంగళవారం ప్రకటించింది. సౌదీ అరేబియా సైతం పాక్‌లో తమ పెట్టుబడిని వెయ్యికోట్ల డాలర్లకు పెంచాలని యోచిస్తోంది. వరద బాధిత పాక్ కోలుకోవడానికి సోమవారం నాటి జెనీవా దాతల సదస్సులో వెయ్యి కోట్ల మేర వాగ్దానాలు రావడం నైతికంగా ఉత్సాహజనకమే. కానీ, వివిధ సంస్థలతో రానున్న మూడేళ్ళలో అందే సాయం పాక్ తక్షణ డాలర్ ద్రవ్యసంక్షోభాన్ని పరిష్కరించలేదు. తక్షణ ద్రవ్యసాయంతో ఆర్థిక వ్యవస్థకు ఊపిరులూదాలి.

ఐఎంఎఫ్‌తో సమస్యాత్మక సంబంధాలున్న పాక్ ఇప్పటికైతే కఠిన షరతులు ఆపాలని కోరింది. ఊహించినదాని కన్నా మెరుగైన సాయం అందినందుకు ప్రధానమంత్రి, బృందం సంతోషిస్తున్నా, ఇది తాత్కాలిక ఊరటే. స్థూల ఆర్థిక సంస్కరణలు చేపడితేనే దేశానికి దీర్ఘకాలిక పునరుద్ధరణ సాధ్యం. స్వయంగా ఆ దేశ ప్రధానమంత్రే చెప్పినట్టు పర్వతం లాంటి సమస్యలను అధిగమించడానికి కాలంతో పోటీపడుతూ పాక్ పరుగులు తీయాలి. అయితే, మాటలు చెబితే చాలదు... చేతల్లో చూపెట్టాలి. ఆ బృహత్తర బాధ్యత దాయాది దేశపు విధాన నిర్ణేతలదే!

సందేహాలు తీరకుండా చర్యలెలా?

విశ్లేషణ



వైభవ్ చతుర్వేది

వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి చేపట్టే చర్యలకు కొన్ని వైరుధ్యాలు అడ్డుపడుతున్నాయి. ఉష్ణోగ్రతలను తక్కువ పెరిగేలా చూడాలంటే, శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించాలి. కానీ పాశ్చాత్య దేశాలు అభివృద్ధి చెందుతున్న దేశాలు ఆధారపడే బొగ్గును తగ్గించే అంశానికే ప్రాధాన్యం ఇస్తున్నాయి. కాలుష్యానికి జరుగుతున్న నష్టాన్ని భర్తీ చేయాల్సిన బాధ్యత వాటిపైనే ఉండగా, ఆ దాతల జాబితాలోకి భారత్, చైనాలను కూడా చేర్చాలని డిమాండ్ చేస్తున్నాయి. భారత్‌కే ప్రత్యేకమైనది చైనాతో వ్యవహారం. చైనా తనకు అనుకూలంగా జీ77 + చైనా గ్రూపులో ఉంటూ వాతావరణ చర్చల్లో పాల్గొంటోంది. ఉద్గారాల్లో యూరప్, అమెరికాను మించనున్నందున దాతల జాబితాలోకి చైనా చేరేలా భారత్ ఒత్తిడి తేవాలి.

వాతావరణం విషయంలో గత ఏడాది ఎన్నో వైపరీత్యాలను చూశాం. ఉత్తర భారతం అసాధారణ వడగాడ్పులతో అట్టుడికింది. పాకిస్తాన్‌లో కనీవినీ ఎరుగని రీతిలో వరదలు జనావాసాలను ముంచెత్తాయి. యూరప్, చైనా కరవును చవిచూశాయి. వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో భాగంగా కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు ప్రపంచం ఇప్పటికే చాలా చర్యలు చేపట్టింది. అయినా సరే... గత ఏడాది మానవాళి ఐదు కీలకమైన వైరుధ్యాలను ఎదుర్కొంది. వీటిని తొలగించుకోకుంటే, ప్రకృతి వైపరీత్యాలు ఈ ఏడాదీ మనల్ని పలకరించక మానవు!

వైరుధ్యాల్లో మొట్టమొదటిది 'శిలాజ ఇంధనాలు వర్సెస్ బొగ్గు' అన్న అంశం నుంచి పుట్టుకొచ్చింది. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు భూమి సగటు ఉష్ణోగ్రతలను వీలైనంత తక్కువ పెరిగేలా చూడాల్సిన అవసరముంది. అయితే అభివృద్ధి చెందిన దేశాలు దీన్ని 1.5 డిగ్రీలకు పరిమితం చేయాలని అనుకుంటున్నాయి. ఈ అంశంపై ఇతర దేశాల మధ్య ఏకాభిప్రాయం సాధించే ప్రయత్నం చేస్తున్నాయి. వాతావరణ మార్పులపై ఐక్యరాజ్యసమితి శాస్త్రీయ మదింపు ప్రకారం, ఈ లక్ష్యాన్ని సాధించేందుకు శిలాజ ఇంధనాల వాడకాన్ని గణనీయంగా తగ్గించాల్సి ఉంటుంది. అయితే ఈజిప్టులో గత ఏడాది జరిగిన 27వ కాప్ సమావేశాల్లో పాశ్చాత్య దేశాలు బొగ్గు వాడకం తగ్గిద్దామనే అంశానికే ఎక్కువ ప్రాధాన్యమిచ్చాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో అత్యధికం చమురు, సహజవాయువుల ప్రధాన ఎగుమతిదారులు లేదా ఎక్కువ మోతాదుల్లో వినియోగించేవారు కావడం ఇక్కడ ప్రస్తావనార్హం!

ఇక రెండో వైరుధ్యం గురించి: కాప్–27 సమావేశాల్లో ఇది వ్యక్తమైంది. ఆర్థికాంశాలపై చర్చలో 'లాస్ అండ్ డ్యామేజ్' అంశంలో ఈ వైరుధ్యం ఏమిటన్నది తెలిసింది. వాతావరణ కాలుష్యానికీ, భారీ కర్బన ఉద్గారాలకూ అభివృద్ధి చెందిన దేశాల బాధ్యతే ఎక్కువ. కాబట్టి జరుగుతున్న నష్టాన్ని భర్తీ చేయాల్సిన బాధ్యత కూడా వాటిపైనే ఉంది. కర్బన ఉద్గారాలను తగ్గించుకునేందుకు ఇతర దేశాలు చేస్తున్న ప్రయత్నాలకు తగిన ఆర్థిక వనరులను సమకూర్చాల్సి ఉంది కూడా. ఇందుకోసం ఏటా సుమారు వెయ్యి కోట్ల డాలర్ల అవసరముండగా... ఇప్పటికి సమకూర్చింది పిసరంతే. ఎందుకిలా అన్న ప్రశ్నకు అభివృద్ధి చెందిన దేశాలు విచిత్రమైన వాదన చేస్తున్నాయి. దాతల జాబితాలోకి భారీ ఆర్థిక వ్యవస్థలున్న దేశాల (భారత్, చైనా అని)ను చేర్చాలని డిమాండ్ చేస్తున్నాయి. అకస్మాత్తుగా పుట్టుకొచ్చిన ఈ కొత్త వాదన... ఇప్పటివరకూ నిర్ణయించిన విషయాలకు భిన్నం.

మూడో వైరుధ్యం కాప్–27 తీర్మానం తుది ప్రతిలో 'జస్ట్ ట్రాన్సిషన్', 'జస్ట్ ఎనర్జీ ట్రాన్సిషన్ పార్ట్‌నర్‌షిప్' (జేఈటీపీ) అన్న



పదాలను చేర్చడంతో ఉత్పన్నమైంది. ఈ రెండు పదాలూ చూసేందుకు ఒకేలా అనిపిస్తాయి. కానీ వీటి అర్థాలు చాలా భిన్నం. 'జస్ట్ ట్రాన్సిషన్' అనేది సంప్రదాయేతర ఇంధన వనరుల వాడకానికి మళ్లేందుకు ఒక్కో దేశానికి కావాల్సిన అంశాలకు సంబంధించినది కాగా, జేఈటీపీ అనేది అభివృద్ధి చెందిన దేశాల్లో బొగ్గు వాడకాన్ని నిలిపివేసేందుకు జీ7 దేశాలు అమలు చేస్తున్న అజెండాకు సంబంధించిన విషయం. భారత్ సహా, ఇండోనేషియా, దక్షిణాఫ్రికా బొగ్గుపై ఆధారపడ్డ దేశాలు. వీటిని జేఈటీపీలోకి చేర్చేందుకు జీ7 దేశాలు ప్రయత్నిస్తున్నాయి. ఏతావాతా... కాప్–27 తుది తీర్మానంలో జస్ట్ ట్రాన్సిషన్ అనే మాట చేరిక ఆహ్వానించదగ్గదైతే... జేఈటీపీ మాత్రం అనుమానించదగ్గది.

నాలుగో వైరుధ్యం విషయానికి వద్దాం. కార్బన్ మార్కెట్లపై జరిగిన చర్చల్లో ఇది బయటపడింది. అభివృద్ధి చెందుతున్న దేశాలు ఈ కార్బన్ మార్కెట్లను (క్యోటో ప్రొటోకాల్‌లో భాగంగా ఏర్పాటైన క్లీన్ డెవలప్‌మెంట్ మెకనిజమ్స్; క్లుప్తంగా 'సీడీఎం') ఆర్థిక వనరులను సమకూర్చుకునే సాధనంగా చూస్తూవచ్చాయి. అభివృద్ధి చెందిన దేశాల దృక్పథం దీనికి పూర్తిగా భిన్నం. తక్కువ ఖర్చుతో కర్బన ఉద్గారాలను తొలగించుకునేందుకు సీడీఎంను వాడుకోవచ్చునని ఈ దేశాలు భావిస్తున్నాయి. క్యోటో ప్రొటోకాల్, ప్యారిస్ అగ్రిమెంట్ల రెండింటిలోనూ కార్బన్ మార్కెట్ల ప్రస్తావన ఉన్నప్పటికీ వాటి నేపథ్యాలు మాత్రం వేర్వేరు. మొదటిదాని ప్రకారం దేశాలకు నిర్దిష్టమైన కర్బన ఉద్గార తగ్గింపు లక్ష్యాలు లేవు. ప్యారిస్ ఒప్పందం ప్రకారం 'నేషనల్లీ డిటర్మైండ్ కంట్రిబ్యూషన్స్' (ఎన్‌డీసీ) ఉన్నాయి. కర్బన ఉద్గారాల తగ్గింపునకు ఆయా దేశాలు చేసే ప్రయత్నాలే ఈ 'ఎన్‌డీసీ'. భారతదేశం క్లైమేట్ ఫైనాన్స్ కోసం ఇతర దేశాలకు కార్బన్ క్రెడిట్స్ అమ్మితే, అవి ఉద్గారాల తగ్గింపు జాబితాలోకి చేరవు. దీనివల్ల మనం ఎన్‌డీసీలో వెనుకబడిపోతాం. కార్బన్ క్రెడిట్స్ అమ్ముకుని వాతావరణ మార్పులను తట్టుకునేందుకు అవసరమైన నిధులు సమకూర్చుకోవడం... ఆయా దేశాలు కర్బన ఉద్గారాలపై ఇచ్చిన మాటను పూర్తి చేసిన తరువాతే సాధ్యమవుతుందన్నమాట.

చిట్టచివరి... ఐదవ వైరుధ్యం గురించి. ఇది భారతదేశం తనకుతాను సమాధానం ఇచ్చుకోవాల్సిన ప్రశ్న. వాతావరణానికి సంబంధించిన రాజకీయాల్లో చైనాతో ఎలా వ్యవహరించాలి? తన ఆర్థిక బలంతో రాజకీయాలు చేస్తున్న చైనా విదేశాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతోంది. బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టు వీటిల్లో ఒకటి మాత్రమే. ఫలితంగా కర్బన ఉద్గారాలు ఎన్నో రెట్లు ఎక్కువయ్యాయి. మన మంత్రులు ఈ విషయాలను ఇప్పటికే పలుమార్లు ప్రపంచం దృష్టికి తీసుకొచ్చారు. కౌన్సిల్ ఆన్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ అండ్ వాటర్(సీఈఈడబ్ల్యూ) అంచనా ప్రకారం చైనా గత, భవిష్యత్తు ఉద్గారాలు అమెరికా, యూరప్‌లను కూడా మించిపోతాయి (2060 నాటికి శూన్యస్థాయికి తేవాలన్న లక్ష్యంతో చైనా ఉంది). అంటే అమెరికా, యూరప్‌ల మాదిరిగానే చైనాను కూడా అభివృద్ధి చెందిన దేశాల జాబితాలోకి చేర్చాలన్నమాట. కానీ చైనా తనకు అనుకూలంగా ఉండేలా జీ77 + చైనా గ్రూపులో ఉంటూ వాతావరణ చర్చల్లో పాల్గొంటోంది. ఈ విషయంలో భారత్ ఒక స్పష్టత ఏర్పరచుకోవాలి. చైనా పాత్ర ఎలా ఉండాలో కచ్చితంగా చెప్పాల్సి ఉంటుంది.

ఈ ఏడాది భారతదేశం జీ20 సమావేశాల అధ్యక్ష స్థానంలో ఉంది. దీని ఆసరాతోనైనా భారత్ ప్రపంచ వాతావరణ మార్పుల చర్చల్లో అగ్రస్థానాన్ని మరింత పదిలపరచుకోవాలి. అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రతినిధిగానూ స్థిరపడాలి. ప్రపంచవ్యాప్తంగా బొగ్గు వాడకం మాత్రమే కాకుండా... అన్ని శిలాజ ఇంధనాలను దశలవారీగా తగ్గించేలా ప్రపంచాన్ని ఒప్పించాలి. శిలాజ ఇంధనాల నుంచి సంప్రదాయేతర ఇంధన వనరుల వాడకం వైపు మళ్లేందుకు కావాల్సిన అంశాల ఆధారంగా జేఈటీపీ ఉండేలా... జీ7 దేశాల పెత్తనం మాదిరిగా కాకుండా చూసుకోవాలి. చైనా అపరిమిత ఉద్గారాల విషయంలో భారత్ విస్పష్టంగా వ్యవహరించాలి. దాతల జాబితాలోకి చైనా కూడా చేరేలా ఒత్తిడి తేవాలి. కార్బన్ మార్కెట్లను అవకాశంగా తీసుకుని మరింత పర్యావరణ హితమైన టెక్నాలజీలను అందరికీ అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేయాలి.

ఇప్పటివరకూ ప్రస్తావించిన ఐదు వైరుధ్యాలు పరిష్కారమవుతాయా? లేక అలాగే కొనసాగుతాయా? అన్నది ఇంకోదఫా వాతావరణ మార్పుల చర్చలు జరిగినప్పుడే తెలుస్తుంది. కాకపోతే ఈ ఐదు అంశాలు ప్రపంచం, మరీ ముఖ్యంగా భారతదేశం వాతావరణ మార్పుల విషయంలో ఈ ఏడాది ఎలా వ్యవహరించాలో నిర్దేశిస్తాయనడంలో సందేహం లేదు.

వ్యాసకర్త ఫెలో, 'కౌన్సిల్ ఆన్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ అండ్ వాటర్'
('ద హిందుస్తాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల మనసులోని మాటలు తాజాగా ఇలా...!

తగిన గెలుపు



ఎం.ఎం.కీరవాణి, ఎస్.ఎస్.రాజమౌళి, ఆర్ఆర్ఆర్ సినిమా బృందం... మీకు శుభాభినందనలు. మీ అందరి కఠిన శ్రమకు ఇది బహు యోగ్యమైన గెలుపు.
– ఇళయరాజా, సంగీత దర్శకుడు

హోరెత్తిన పాట



ఆర్ఆర్ఆర్ ప్రదర్శన సమయంలో 'నాటు నాటు' పాటకు ప్రేక్షకులు లేచి డ్యాన్స్ చేశారు. రాజమౌళితో పనిచేయడాన్ని ఎన్టీ రామారావు జూనియర్, రామ్‌చరణ్ 'అందమైన హింస'గా అభివర్ణించారు.
– కోర్ట్‌నీ హోవార్డ్, సినీ విమర్శకురాలు

ఇదేనా బెస్ట్?



ఇవ్వాళే మొదటిసారి ఈ 'నాటు నాటు' పాట విన్నాను. ఇట్టే తెలిసిపోయేంతటి ఒక అతి మామూలు పాటకు మన అత్యుత్తమమైనదిగా తీర్పురావడం అనేది ఎంత విషాదం! (గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్ 2023: ఆర్ఆర్ఆర్ సినిమా)
– నిఖిల్ ఇనామ్‌దార్, జర్నలిస్ట్

సమర్థించకూడదు



తాజా పాలు, పూర్తి గోదుమలకు (హోల్ వీట్) బిస్కెట్లు ప్రత్యామ్నాయం కాగలవని ఒక వ్యాపార ప్రకటనలో అమితాబ్ బచ్చన్ చెబుతున్నారు. తీవ్రంగా ప్రాసెస్ చేసిన జంక్ ఫుడ్‌ను పిల్లలకు మార్కెట్ చేయడాన్నీ, దానికి సెలబ్రిటీల సమర్థననూ ఆపాల్సిన సమయం ఇది.
– సాయంతన్ బేరా, పోషణాంశాల పాత్రికేయుడు

ప్రతి చర్యా విలువైనదే



నీటి నెలవుల్లోకి నిర్లక్ష్యంగా విసిరే ప్లాస్టిక్ జీవరాశికి ఊపిరాడకుండా చేయడమే కాదు, ప్రాణం పోయేలా కూడా చేస్తుంది. 'రెడ్యూస్, రీయూజ్, రీసైక్లింగ్' (తగ్గించడం, తిరిగి వాడటం, రీసైకిల్ చేయడం) ఒక్క మనిషి చేసినా ఆ చర్య పర్యావరణానికి ఎంతగానో తోడ్పడుతుంది.
– మోహన్ పర్గాయిన్, ఐఎఫ్ఎస్ అధికారి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇలాంటి స్ఫూర్తి కావాలి

'ప్రజల మనోఫలకాలపై రూపుదిద్దుకున్న వివేకానంద అనే ఆ మహనీయుని చిత్తరువు ఎప్పటికీ చెరిగిపోదు' అన్నారు ఓ రష్యన్ చింతనాశీలి. జీవితంలో సమస్యలనేవి ప్రతీ వ్యక్తికీ ఉండేవే. ఆ వ్యక్తి విద్యార్థి కావచ్చు, కార్మికుడు కావచ్చు, రైతు కావచ్చు, పారిశ్రామికవేత్త కావచ్చు, గృహిణి కావచ్చు, మరెవరైనా కావచ్చు. సమస్యలనేవి సర్వసాధారణమైతే, సమస్యను అవగాహన చేసుకొనే ప్రయత్నం చేయడానికి కావలసిన సామర్థ్యం పెంచుకుంటే సమస్యలు పరిష్కరించడం పెద్ద విశేషం కాదని వివేకానందుడు అన్న మాటలు సదా స్మరణీయం.



స్వామి వివేకానంద

ప్రపంచంలో ఏ గొప్ప వ్యక్తి చెప్పిన వాక్యాలు విన్నా ఆలోచింపజేస్తాయి. కాని స్వామి వివేకానందుడు చెప్పిన అమృత వాక్యాలు మాత్రం యువతను ప్రేరేపించి, ఆచరింపజేస్తున్నాయి.

ఇద్దరు వ్యక్తుల ఆదర్శాలు ఒకేలా ఉండకపోవచ్చు. కాని ఆ ఇద్దరు వ్యక్తులు ఒకే వ్యక్తి ఆదర్శాన్ని స్వీకరించి గొప్ప నేతలుగా ఎదగవచ్చనేది మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్‌లు నిరూపించారు. ఆ ఒక్క వ్యక్తి వివేకానందుడే నని వేరే చెప్పనవసరం లేదు. గాంధీజీ, బోస్‌బాబులు విభిన్న వ్యక్తిత్వాలు, భిన్న ఆదర్శాలు కలిగి ఉన్నవారని చరిత్రకారుల వాదనల సారాంశం. 'నేను స్వామి వివేకానందుడి రచనలు చదవడం ద్వారా నాలో వెయ్యి రెట్లు దేశ భక్తి పెరిగింది' అని గాంధీజీ అంటే... సుభాష్ చంద్రబోస్ 'స్వామి వివేకానందుని రచనలు చదువుతుంటే నా ఒంట్లో రక్తం ఉప్పొంగుతుంది కదా! ఆయనను విన్నవారు ఇంక ఎంత అనుభూతిని పొంది ఉంటారో? ఆయన బ్రతికి ఉన్నట్లయితే పాదాల చెంత కూర్చొని ఆయన ఏమి చెబితే అది చేసేవాణ్ణి' అన్నారు. ఈ మహానేతలు వివేకానందుని మాటలకు ఎంతగా ప్రభావితులు అయ్యారో ఈ మాటలే తెలియజేస్తాయి. ఇవ్వాళ దేశానికి కావలసింది ఇలాంటి ప్రభావ వంతమైన స్ఫూర్తి ప్రదాతలే.

విద్య పట్ల వివేకానందుని అభిప్రాయాలు అత్యున్నతమైనవి. విద్యా వ్యవస్థను ఆయన భావాలకు అనుగుణంగా రూపొందించగలిగితే కాబోయే భారత పౌరులందరూ జాతి రత్నాలుగానే భాసిస్తారు. అప్పుడు తాము పుట్టిన ఊరినే కాదు, దేశాన్నీ, ప్రపంచాన్నీ ఉద్ధరించగల మహానుభావులు ప్రపంచానికి అందుతారు.

– డా॥ నెమలిపురి సత్యనారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్
(నేడు వివేకానందుని జయంతి, జాతీయ యువజన దినోత్సవం)

గురి తప్పిన 'ఎన్డీఏ' లక్ష్యాలు

విశ్లేషణ



సి. రామచంద్రయ్య

జబ్బు ఒకటయితే దానికి మందు మరొకటి వేస్తే ప్రయోజనం ఏముంటుంది, రోగం ముదరడం తప్ప? ఇటీవల పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దేశంలో చలామణీలో ఉన్న నగదు గురించి ఇచ్చిన సమాధానం చూసిన తర్వాత ఎవరికైనా ఎన్డీఏ అనుసరిస్తున్న ఆర్థిక విధానాలపై ఇటువంటి సందేహం రాక మానదు. 2016 నవంబర్ 8న రాత్రి వేళ అప్పటి ఆర్థిక మంత్రి, రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌లతో మాట మాత్రంగానైనా సంప్రదించకుండా ప్రధాని నరేంద్ర మోదీ రూ. 1,000, రూ. 500 నోట్లను తక్షణమే రద్దు చేసిన నిర్ణయం దేశాన్ని కుదిపేసింది. పెద్ద నోట్ల రద్దు వల్ల దేశంలో నల్లధనం చాలావరకు తుడిచిపెట్టుకుపోతుందనీ, దేశంలో 2 శాతంగా ఉన్న నగదు రహిత లావాదేవీలలో పారదర్శకత పెరిగి రాబోయే ఐదేళ్లకు 50 శాతానికి చేరుతాయనీ ప్రధాని నమ్మకంగా చెప్పారు. కాగా, పెద్ద నోట్లను రద్దు చేయడం వల్ల ప్రజలలో భయాందోళనలు కలిగాయి. ఏటీఎంల వద్ద జరిగిన తొక్కిసలాటలలో సామాన్యులు ప్రాణాలు కోల్పోయారు. ఇంకా అనేక విధాలుగా ప్రజలు కష్ట నష్టాలకు లోనయ్యారు. అయితే, ఎన్డీఏ భాగస్వామ్య పార్టీల నేతలు పెద్ద నోట్ల రద్దు తర్వాత దేశంలో డిజిటల్ విప్లవం రానున్నదని ఘనంగా సెలవిచ్చారు. కానీ ఈ 6 సంవత్సరాలలో జరిగిందేమిటి?

2016 నవంబర్ 8 నాటికి దేశంలో 16 లక్షల 41 వేల 571 కోట్ల రూపాయల విలువ గల కరెన్సీ చలామణీలో ఉండగా, 2022 డిసెంబర్ 2 నాటికి 31 లక్షల 92 వేల 622 కోట్ల రూపాయల నగదు చలామణీలో ఉందని నిర్మలా సీతారామన్ పార్లమెంట్ సాక్షిగా వెల్లడించారు. ఆరు సంవత్సరాల వ్యవధిలో నగదు లభ్యత రెండు రెట్లు పెరిగింది. డిజిటల్ లావాదేవీలు ఆశించిన స్థాయిలో జరగడం లేదని అర్థమవుతూనే ఉంది. ఇక, నల్లధనం ఏ మేరకు కట్టడి అయిందనే దానిపై లెక్కలు లేవు.

2004–2014 మధ్య కాలంలో ప్రధానిగా ఉన్న మన్మోహన్ సింగ్ నేతృత్వంలో దేశం తిరోగమనంలో పయనించిందనీ, అందువల్ల తాను కొన్ని కఠిన నిర్ణయాలు, కఠోర విధానాలతో గాడితప్పిన దేశ ఆర్థిక వ్యవస్థను తిరిగి పట్టాల మీదకు ఎక్కించి పరుగులు పెట్టిస్తాననీ 2014 జూన్ మొదటివారంలో ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టిన కొన్ని రోజులకే నరేంద్ర మోదీ దేశ ప్రజలకు స్పష్టం చేశారు. నిజానికి మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని పదేళ్ళ యూపీఏ పాలనలో ఆర్థిక స్థితిగతులు మెరుగ్గానే ఉన్నాయి. ప్రపంచ సంక్షోభం ఏర్పడిన 2008 ఆర్థిక సంవత్సరం మినహా మిగతా 9 ఏళ్ల దేశ స్థూల ఉత్పత్తిలో వృద్ధి రేటు సగటున 8 శాతం మేర నమోదయింది. ఆ తర్వాత 2014–2022 మధ్య 8 ఏళ్ల మోదీ పాలనలో ఒక్క 2020–21లో మాత్రమే అత్యధికంగా 8.95 శాతం మేర జీడీపీలో వృద్ధిరేటు కనిపించింది. అది కూడా అంతకుముందు ఏడాది కరోనా కారణంగా ఆర్థిక వ్యవస్థ అల్లకల్లోలమై జీడీపీ వృద్ధిరేటులో క్షీణత కనిపించింది. దానితో పోల్చుకుంటే 2021–22లో ఆర్థిక వ్యవస్థ కుదుటపడటం వల్ల అధిక వృద్ధిరేటు నమోదయింది. 2014లో దేశ ఆర్థిక వ్యవస్థ పరిమాణం దాదాపు 2 ట్రిలియన్ల డాలర్ల మేర ఉంది. గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో అప్పుడు భారత్‌ది 10వ స్థానం. ప్రస్తుతం 3 ట్రిలియన్ డాలర్లతో భారత్ 5వ స్థానం ఆక్రమించడం చెప్పుకోదగ్గ ఘనతే. కానీ, ఇతర సూచికల్లో భారత్ ఏ విధంగా పురోగమించింది?



వస్తు సేవల పన్ను (జీఎస్టీ)ను అతిపెద్ద పన్నుల సంస్కరణగా చెప్పుకొన్నారు. చేనేత, చివరకు ప్రాణాధార ఔషధాల మీద కూడా జీఎస్టీ విధించడం వల్ల పేదలు, మధ్యతరగతి ప్రజలపై పరోక్షంగా ఆర్థిక భారం పడుతున్నది. కేంద్రానికి సమకూరే ఆదాయాన్ని దామాషా పద్ధతిలో రాష్ట్రాలతో పంచుకొనే విధానానికి కూడా ఎన్డీఏ చెల్లుచీటి పాడింది. కొన్ని రంగాలపై ఎన్డీఏ ప్రభుత్వం విపరీతంగా సెస్సు (ప్రత్యేక పన్ను) విధిస్తున్నది. గతంలో కూడా పెట్రోల్, డీజిల్, రహదారులు మొదలైన రంగాలలో 'సెస్సు'లు ఉన్న మాట నిజమే. కాకపోతే ఆ మొత్తం ఇప్పుడు ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. ఉదాహరణకు 2013–14 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వానికి సెస్సు రూపంలో లభించిన మొత్తం రూ. 73,880 కోట్లు కాగా, 2021–22 ఆర్థిక సంవత్సరం నాటికి కేంద్రానికి సెస్సు ద్వారా పోగుపడిన మొత్తం రూ. 2,96,884 కోట్లు. అంటే గత 7 ఏళ్లల్లో సెస్సుల ద్వారా కేంద్రం అంతకుముందు కంటే 3 రెట్ల మొత్తాన్ని తన ఖజానాలో వేసుకుంది. ఇందులో రాష్ట్రాలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. నిజానికి, 'సెస్సు'ను ఏ రంగం నుంచి అయితే వసూలు చేస్తారో, ఆ మొత్తాన్ని ఆ రంగం అభివృద్ధికే ఖర్చు చేసే సంప్రదాయం ఉంది. కానీ, ఎన్డీఏ ప్రభుత్వం సెస్సు నిధులను ఇతర రంగాలకు దారి మళ్లిస్తోంది. ఒక్క సెస్సుల రూపంలోనే దేశ ప్రజలు రోజుకు రూ. 813 కోట్లు మేర కేంద్రానికి చెల్లిస్తున్నారు. ఇక, కార్పొరేట్ ట్యాక్స్ గతంలో 30 శాతం ఉండగా దానిని 22 శాతానికి కుదించారు. దీనివల్ల పారిశ్రామిక రంగానికి ఊతం ఇచ్చినట్లవుతుందని చెప్పినప్పటికీ దానికి తగిన ఫలితాలు కనబడటం లేదు. గత 8 ఏళ్లల్లో దేశీయ పారిశ్రామికోత్పత్తి వృద్ధిలో చెప్పుకోదగ్గ మెరుగుదల నమోదు కాలేదు. ఎగుమతుల రంగంలో ఏటా సగటున 100 బిలియన్ల డాలర్ల మేర పెరుగుదల నమోదు అవుతున్నప్పటికీ, సాపేక్షంగా దిగుమతులు అంతకుమించి పెరిగిపోతున్నాయి. ఫలితంగా, 'బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్'లో లోటు ఏర్పడి రూపాయి విలువ క్రమంగా క్షీణిస్తోంది. 2014లో డాలర్ విలువ 52 రూపాయలు కాగా, ప్రస్తుతం 82 రూపాయలుగా ఉంది.

రెండేళ్లుగా దేశాన్ని అల్లకల్లోలం చేసిన కరోనా నుంచి ఇప్పుడిప్పుడే క్రమంగా కోలుకొంటున్నప్పటికీ దేశంలో పెరిగిపోతున్న నిరుద్యోగిత ప్రమాద ఘంటికల్ని మోగిస్తోంది. 2014లో నిరుద్యోగిత రేటు 5.4 శాతం ఉండగా, అది ఇప్పుడు దాదాపు 9 శాతానికి చేరినట్లు సెంటర్ ఫర్ మోనిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) తెలిపింది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఈ స్థాయిలో నిరుద్యోగిత రేటు ఉండటం గతంలో ఎన్నడూ లేదు. ప్రతియేటా దేశంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో 2 కోట్ల ఉద్యోగాలను సృష్టిస్తామని మోదీ ఇచ్చిన హామీ నీటిపై రాతగానే మిగిలిపోయింది.

మరోవైపు దేశంలో సంపన్నుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రపంచ కుబేరుల జాబితాలో భారతీయుల సంఖ్య 100 దాటినట్టు ఫోర్బ్స్ పత్రిక వెల్లడించింది. 2014–15లో దేశంలో సగటు తలసరి ఆదాయం రూ. 86,454 కాగా, 2020–21 నాటికి అది రూ. 1.32 లక్షలకు చేరింది. సంపన్నులు మరింత సంపన్నులవుతున్నారు. పేదలు మరింత పేదలవుతున్నారు. కనుక తలసరి ఆదాయ గణాంకాలు నిజమైన అభివృద్ధికి సూచికలు కావు. మరోవైపు రైల్వేలు, ఓడరేవులను ప్రైవేటుపరం చేసిన కేంద్రం త్వరలోనే 25 విమానాశ్రయాలను లీజుల ద్వారా ప్రైవేటు సంస్థలకు అప్పజెప్పడానికి సిద్ధం అయింది. ఇవన్నీ గమనించినప్పుడు భారత ఆర్థిక రంగం 'మేడిపండు'లాగే కనిపిస్తోంది. దేశంలో పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తులను పెంచకుండా, ఉద్యోగ ఉపాధి అవకాశాలను మెరుగుపర్చకుండా, విలువైన సహజ వనరుల్ని ఉపయోగించుకోకుండా ఆర్థిక వ్యవస్థ ఎలా పటిష్ఠం అవుతుంది? స్థిరమైన పెట్టుబడులు, ఎగుమతులు, విదేశాలతో మెరుగైన వాణిజ్య సంబంధాలు, సరళీకృతమైన పారదర్శక ఆర్థిక విధానాలు, భారం పడని పన్నుల విధింపు తదితర చర్యలు మాత్రమే దేశ ఆర్థిక రంగాన్ని సుస్థిరపర్చగలవు.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్యమాసం, తిథి: బ.పంచమి ప.1.01 వరకు, తదుపరి షష్ఠి, నక్షత్రం: పుబ్బ ఉ.11.35 వరకు, తదుపరి ఉత్తర, వర్జ్యం: రా.7.15 నుండి 8.55 వరకు, దుర్ముహూర్తం: ఉ.10.17 నుండి 11.03 వరకు, తదుపరి ప.2.43 నుండి 3.25 వరకు, అమృతఘడియలు: తె.5.26 నుండి ఉ.7.08 వరకు (తెల్లవారితే శుక్రవారం): రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు, యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు: సూర్యోదయం 6.38 : సూర్యాస్తమయం 5.39.

క్లుప్తంగా...

విజయవాడ డివిజన్‌లో పలు రైళ్లు రద్దు

రైల్వేస్టేషన్ (విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ట్రాక్ నిర్వహణ పనుల కారణంగా పలు రైళ్లను పూర్తిగా, పాక్షికంగా రద్దు చేసినట్లు విజయవాడ రైల్వే పీఆర్‌వో నుస్రత్ మండ్రుప్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12న విజయవాడ-భద్రాచలం రోడ్డు (07979), భద్రాచలం రోడ్డు-విజయవాడ (07278), విజయవాడ-బిట్రగుంట (07978), విజయవాడ-గూడూరు (07500), కాకినాడ పోర్టు-విశాఖపట్నం (17267), విశాఖపట్నం-కాకినాడ పోర్టు (17268), విజయవాడ-ఒంగోలు (07461), ఒంగోలు-విజయవాడ (07576), గూడూరు-విజయవాడ (07458) రైళ్లు, 13న బిట్రగుంట-చెన్నై సెంట్రల్ (17237), చెన్నై సెంట్రల్-బిట్రగుంట (17238), గూడూరు-విజయవాడ (07458) రైళ్లను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఈ నెల 12న కాకినాడ పోర్టు-విజయవాడ (17258), విజయవాడ-కాకినాడ పోర్టు (17257) రైళ్లను పాక్షికంగా రద్దు చేసినట్లు తెలిపారు.

నేతాజీ జయంత్యుత్సవాలకు ఏయూ విద్యార్థి ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూ క్యాంపస్: భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 23న పార్లమెంట్‌లో ప్రసంగించే అరుదైన అవకాశం ఏయూ జాతీయ సేవా పథకం వలంటీర్ బలభద్రుని నాగ సాత్విక్‌కు లభించింది. దేశ వ్యాప్తంగా ఈ కార్యక్రమంలో 27 మంది యువ వక్తలు పాల్గొని ప్రసంగిస్తారు. ఏయూ న్యాయ కళాశాల విద్యార్థి నాగ సాత్విక్ తన ప్రతిభతో ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. ప్రధాని సమక్షంలో పార్లమెంట్ హౌస్‌లో 'అమృత్ మహోత్సవ్ కాలంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితం, వారసత్వం' అనే అంశంపై సాత్విక్ ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా సాత్విక్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అభినందించారు.

విశాఖ అపోలోలో మహిళకు అరుదైన శస్త్ర చికిత్స


ఆపరేషన్ జరిగిన మహిళతో కలసి మాట్లాడుతున్న డాక్టర్ ఖాన్

ఆరిలోవ (విశాఖ తూర్పు): విశాఖలోని ఆరిలోవ హెల్త్‌సిటీ అపోలో ఆస్పత్రి వైద్యులు ఓ మహిళకు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. అపోలో ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడు డాక్టర్ అబ్దుల్ డి.ఖాన్ బుధవారం సర్జరీ వివరాలను విలేకరులకు తెలియజేశారు. విశాఖకి చెందిన మహిళ (52) రెండేళ్లుగా పాదం, దాని వేళ్ల వంకర తిరిగి, పాదం కింద చర్మం దళసరిగా తయారై బాధపడుతున్నట్లు చెప్పారు. ఆమెకు ఈ వ్యాధి మధుమేహం వల్ల వచ్చినట్లు గుర్తించామన్నారు. పలు పరీక్షల అనంతరం 10 రోజుల క్రితం ఆమెకు సెయుస్‌టీ విధానం ద్వారా సర్జరీ చేసి పాదంలో వేళ్ల వరకు ఉండే ఎముకలను సరి చేసినట్లు వివరించారు. ఈ విధానం ద్వారా ఏపీలో సర్జరీ చేయడం ఇదే తొలిసారని చెప్పారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉన్నారన్నారు. ఇలాంటి వ్యాధులు అరుదుగా వస్తాయని, త్వరగా వైద్యులను సంప్రదించాలని సూచించారు.

ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీజేపీ

- 26 నుంచి నియోజకవర్గాల్లో పాదయాత్రలు
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు

కడప వైఎస్సార్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు విమర్శించారు. వైఎస్సార్ జిల్లా కడపలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ దుష్ట పాలన నుంచి దేశాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీకి పట్టంగట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకొచ్చాక పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను పెంచి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని మండిపడ్డారు. విభజన హామీలను నెరవేర్చలేదన్నారు. దేశంలోని ముస్లిం మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ హయాంలోనే జరిగిందని, ప్రస్తుత మోదీ ప్రభుత్వం వీరి సంక్షేమాన్ని గాలికొదిలేసిందని చెప్పారు. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలోనే ముస్లిం మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్ ఇవ్వడం వల్ల నేడు ముస్లిం మైనార్టీలు విద్యావంతులయ్యారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి బీసీ జనగణన జరపాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ 26 నుంచి మార్చి 26 వరకు నియోజకవర్గాల్లో పాదయాత్ర చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఐసీసీ సెక్రటరీ మేయప్పన్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగ మధుయాదవ్, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

తేనెలా తీయగా.. నేతితో కమ్మగా..

విదేశాలకు ఏలూరు పిండి వంటలు | నెయ్యి, వెన్నతో నోరూరించే రుచి



నాయుడుగూడెంలో తయారయ్యే సంక్రాంతి పిండి వంటలకు విదేశాల్లోనూ క్రేజ్ పెరుగుతోంది. తేనెలా తీయగా.. నిండా నేతితో కమ్మటి రుచి నింపుకునే ఈ స్వీట్స్‌ను విదేశాల్లో స్థిరపడిన ప్రవాసాంధ్రులు సంక్రాంతి సందర్భంగా ప్రత్యేకంగా ఆర్డర్ చేసి మరీ తాము ఉంటున్న ప్రాంతాలకు రప్పించుకుంటున్నారు.

-ఏలూరు (ఆర్ఆర్ పేట)



కల్తీలేకుండా, నాణ్యతలో రాజీ పడకుండా..



మేం తయారు చేసే పిండివంటల్లో ఎటువంటి కల్తీ లేకుండా జాగ్రత్త పడతాం. శనగపప్పు, బియ్యం వంటివి పిండి ఆడించడానికి సొంతంగా ఇంటిలోనే మిల్లు ఏర్పాటు చేశాం. మా పిండి వంటలకు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి గుర్తింపు కూడా పొందింది. కొంతమంది స్థానిక మహిళలకూ మా ద్వారా ఉపాధి కల్పిస్తున్నందుకు ఆత్మ సంతృప్తి లభిస్తోంది. ప్రవాసాంధ్రులే కాక ఆయా ప్రాంతాల్లోని ప్రవాసాంధ్రుల ఇరుగు పొరుగు ప్రాంతాల్లో నివసించే విదేశీయులు సైతం మా పిండి వంటలను మెచ్చుకుంటూ ఆర్డర్లు ఇస్తూ ప్రోత్సహించడం మరింత ఆనందాన్నిస్తోంది.

– కట్టేని నాగరాణి, పిండివంటల తయారీదారు

అలా మొదలైంది

ఏలూరు జిల్లా పెదపాడు మండలం నాయుడుగూడెం 2005వ సంవత్సరంలో కట్టేని తులసీరామ్, నాగరాణి దంపతులు స్వచ్ఛమైన నెయ్యి, వెన్నను ఉపయోగించి పిండివంటలు తయారు చేయడం ప్రారంభించారు. తొలుత గ్రామంలోని ప్రజలకు రుచి చూపించగా.. వారినుంచి విశేషమైన ఆదరణ లభించింది. అనంతరం పెదపాడు ప్రజలకు కూడా తమ పిండి వంటలను పరిచయం చేశారు ఆ దంపతులు. అక్కడ కూడా అద్భుతమైన స్పందన లభించడంతో జిల్లా కేంద్రం ఏలూరు ప్రజలకూ వాటిని రుచి చూపించారు. అలా మొదలైన నాయుడుగూడెం స్వీట్స్.. ఇప్పుడు ఎన్ఆర్ఐ స్వీట్స్‌గా పేరొందాయి. వీటి రుచి తెలిసిన వారు విదేశాల్లో స్థిరపడిన తమ పిల్లలకు నాయుడుగూడెం పిండి వంటల్ని పంపించడం మొదలు పెట్టారు. అలా విదేశాలకు ప్రయాణమైన నాయుడుగూడెం పిండి వంటలు అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జర్మనీ, సింగపూర్ వంటి దేశాల్లో స్థిరపడిన ప్రవాసాంధ్రులకు సంక్రాంతి అనుభూతుల్ని పంచుతున్నాయి.

ఇతర రాష్ట్రాల నుంచీ ఆర్డర్లు..

నాయుడుగూడెంలో తయారయ్యే పిండివంటలు ఇతర రాష్ట్రాల్లోనూ ఆదరణ చూరగొంటున్నాయి. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలతో పాటు ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, పూణే వంటి ఉత్తర భారతదేశ ప్రజలకూ ఈ పిండివంటలు బాగా నచ్చేశాయి. ప్రతినెలా ఆయా రాష్ట్రాలకు చెందిన ప్రజలు కట్టేని దంపతులకు ఆర్డర్లు ఇచ్చి పిండి వంటలు రప్పించుకుంటున్నారు. వీరు సంప్రదాయ పిండి వంటలతో పాటు జీడిపప్పు పాకం, కోవా బిళ్లలు, కోవా కజ్జికాయలు, బొబ్బట్లు, పూతరేకులు, హాట్ వెన్న ఉండలు, మురుకులు, చేతి పకోడి, దూత పకోడి వంటి వంటకాలకు విశేష ఆదరణ లభిస్తోంది.

బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి జీవిత ఖైదు

విజయవాడ స్పోర్ట్స్: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి జీవితకాల(మరణించే వరకు) కఠిన కారాగార శిక్ష విధిస్తూ విజయవాడ పోక్సో కోర్టు న్యాయమూర్తి డాక్టర్ ఎస్.రజని బుధవారం తీర్పు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని భవానీపురానికి చెందిన మహిళకు మచిలీపట్టణానికి చెందిన వ్యక్తితో 2005లో వివాహం జరిగింది. అనివార్య కారణాలతో ఆమె భర్త నుంచి విడిపోయి భవానీపురంలోని తల్లి ఇంట్లో ఇద్దరు పిల్లలు(12 ఏళ్ల బాబు, 11 ఏళ్ల పాప)తో కలిసి జీవిస్తోంది. కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తుంది. 2021 జనవరి 30న యథావిధిగానే పిల్లలను తన తల్లికి అప్పజెప్పి కూలీకి వెళ్లింది. మధ్యాహ్నం 11 గంటల సమయంలో ఇంటి వద్ద ఆడుకుంటున్న చిన్నారిని అదే ప్రాంతంలో ఉండే షేక్ అయాజ్ అహ్మద్ (49) పిలిచి తన ఇంటికి తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించి, అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న చిన్నారి తల్లి అదే రోజు విజయవాడ దిశ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని మరుసటి రోజు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చారు. బాధితుల తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వి.నారాయణరెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ జి.కల్యాణి న్యాయస్థానానికి వాదనలు వినిపించారు. 15 మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు అయాజ్ అహ్మద్‌కు జీవితకాల కఠిన కారాగార శిక్ష, రూ.2.91 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. నిందితుడు చెల్లించిన నగదులో రూ.1.66 లక్షలను బాధితురాలికి అందజేయాలని, అలాగే నిందితుడు మరో రూ. 5 లక్షలు బాధితురాలికి చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. అదేవిధంగా బాధితురాలికి రూ.4 లక్షలు నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు న్యాయమూర్తి ఆదేశాలిచ్చారు.

మిరప తోటలో.. గంజాయి

- గుట్టుచప్పుడు కాకుండా సాగు చేస్తున్న టీడీపీ నాయకులు
- సెబ్ దాడుల్లో బయటపడిన దందా


మిరపలో నాటిన గంజాయి మొక్కలు తొలగిస్తున్న సెబ్ సీఐ వెంకటరమణ

యర్రగొండపాలెం: పత్తి, మిరప తోటల్లో టీడీపీ నాయకులు గంజాయి సాగు చేస్తున్న వ్యవహారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) దాడుల్లో బయటపడింది. వివరాలు.. ప్రకాశం జిల్లా ఎస్పీ మలికా గర్గ్ ఆదేశాల మేరకు సెబ్ అధికారులు జిల్లావ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు, దాడులు చేపట్టారు. ఈ క్రమంలో యర్రగొండపాలెం మండలంలోని పాలుట్ల గిరిజన గూడెంలో సెబ్ సీఐ వెంకటరమణ తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇద్దరికి చెందిన మిరప, పత్తి పంట పొలాల్లో గంజాయి మొక్కలు ఏపుగా పెరిగి ఉండటాన్ని గుర్తించారు. వెంటనే వాటిని ధ్వంసం చేశారు. విచారణ జరపగా.. ఇద్దరు టీడీపీ వార్డు సభ్యులు, టీడీపీ ఎంపీటీసీ తండ్రి, మరో ముగ్గురు కలిసి గంజాయి సాగు చేస్తున్నట్లు తేలింది. అలాగే గుట్టుచప్పుడు కాకుండా నాటు సారా కూడా కాస్తున్నట్లు వెల్లడైంది. పొలాలకు సంబంధించిన ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని సెబ్ సీఐ వెంకటరమణ తెలిపారు. అనుమానితులుగా గుర్తించిన నలుగురిని బైండోవర్ చేశామని వివరించారు.

స్విమ్స్ వైద్యాధికారికి యంగ్ సర్జన్ ఆఫ్ ఇండియా అవార్డు


జయచంద్రారెడ్డి

తిరుపతి తుడా: అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా ప్రతిష్టాత్మక యంగ్ సర్జన్ ఆఫ్ ఇండియా–2023 అవార్డుకు తిరుపతిలోని స్విమ్స్ శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ప్రత్యేక అధికారి డాక్టర్ ఎం.జయచంద్రారెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ సంస్థ అవార్డులను న్యూఢిల్లీలో బుధవారం ప్రకటించింది. ప్రతి ఏటా అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అంకాలజీ సర్జన్లు, ట్రామా క్రిటికల్ కేర్ సర్జన్లు, బ్రెస్ట్ సర్జన్లతో పాటు 11 విభాగాల్లో యంగ్ సైంటిస్టులకు అవార్డులను అందజేసి ప్రోత్సహిస్తూ ఉంటుంది. రాష్ట్రంలో తొలి సారిగా ఈ అవార్డును స్విమ్స్ అంకాలజీ విభాగ ప్రత్యేక అధికారి జయచంద్రారెడ్డి అందుకోనున్నారు. విశాఖ వేదికగా త్వరలో జరిగే ఆ అసోసియేషన్ 83వ వార్షిక సదస్సులో అవార్డులను ప్రదానం చేయనున్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన యువ వైద్య సైంటిస్టు, సర్జన్లు సదస్సుకు తరలిరానున్నారు. అవార్డు అందుకోనున్న స్విమ్స్ వైద్యాధికారి డాక్టర్ జయచంద్రారెడ్డిని డైరెక్టర్ డాక్టర్ బి.వెంగమ్మ, డీన్ డాక్టర్ అల్లాడిమోహన్ అభినందించారు.

షోకాజ్ నోటీసులకు ఎవరికి వివరణ ఇవ్వాలో చెప్పాలి

- నిర్మాణాలకు నోటీసులపై హైకోర్టు ఆదేశాలు
- ఏ అధికారి తుది ఉత్తర్వులు ఇస్తారన్న విషయాలూ ఉండాలని వెల్లడి
- ప్రస్తుతం ఇస్తున్న షోకాజ్ నోటీసులను సవరించాలని ఆదేశం
- విజయవాడ కార్పొరేషన్ అధికారుల ఉత్తర్వులు రద్దు

సాక్షి, అమరావతి : నిర్మాణాల కూల్చివేత విషయంలో షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్న అధికారులు, వాటికి ఎవరికి సమాధానం ఇవ్వాలో స్పష్టతనివ్వకపోవడాన్ని హైకోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. నిబంధనలు ఏమి చెబుతున్నాయి, షోకాజ్ నోటీసుల్లో ఏ అధికారికి వివరణ ఇవ్వాలి, ఆ వివరణ ఆధారంగా ఏ అధికారి ఉత్తర్వులు జారీ చేస్తారు తదితర వివరాలను స్పష్టంగా పేర్కొనాలని స్పష్టం చేసింది. ఈ విషయంలో అధికారులకు తగిన నిర్దేశకాలు జారీ చేయాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది. ఈ వివరాలను జత చేస్తూ ప్రస్తుతం ఇస్తున్న షోకాజ్ నోటీసులను సవరించాలని ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది. నోటీసులను మునిసిపల్ కమిషనర్ జారీ చేస్తే, ఆయనకే నేరుగా వివరణ పంపిన సందర్భాల్లో కమిషనర్ ఆ వివరణను తుది ఉత్తర్వులు జారీ చేసే అధికారికి పంపాలని స్పష్టం చేసింది. ఓ కేసులో పిటిషనర్ వివరణను పరిగణనలోకి తీసుకోకుండా విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. పిటిషనర్ తిరిగి ఇచ్చే వివరణను పరిగణనలోకి తీసుకుని నాలుగు వారాల్లో చట్ట నిబంధనలకు లోబడి తగిన ఉత్తర్వులు జారీ చేయాలని డిప్యూటీ సిటీ ప్లానర్‌ను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరీ ఇటీవల తీర్పు వెలువరించారు. విజయవాడ వన్‌టౌన్ రామ్‌గోపాల్ వీధిలో ఉన్న తన భవనాన్ని కూల్చివేసేందుకు ఇచ్చిన షోకాజ్ నోటీసులకు వివరణ ఇచ్చినా, దాన్ని పరిగణనలోకి తీసుకోకుండా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు భవనం కూల్చివేత విషయంలో ముందుకెళుతున్నారంటూ ఆర్.మోహిని దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన న్యాయమూర్తి ఈ మేరకు తీర్పునిచ్చారు. పిటిషనర్ తరఫున న్యాయవాది బి.అభయ్ సిద్ధాంత్, మునిసిపల్ కార్పొరేషన్ తరఫున న్యాయవాది మలసాని మనోహర్‌రెడ్డి వాదనలు వినిపించారు.

సంక్రాంతి సంబరాల్లో అపశ్రుతి

- భోగి మంటలు అంటుకుని ముగ్గురు విద్యార్థులకు తీవ్రగాయాలు
- పాఠశాల డైరెక్టర్‌పై కేసు నమోదు


చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శిస్తున్న మంత్రి విశ్వరూప్, కలెక్టర్ హిమాన్షు శుక్లా

ఉప్పలగుప్తం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి విస్‌డమ్ యూపీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో బుధవారం ఏర్పాటుచేసిన సంక్రాంతి సంబరాల్లో అగ్నిప్రమాదం జరిగి ముగ్గురు విద్యార్థులకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడినవారిలో బడుగుపేటకు చెందిన పోతుల వనీషా (3వ తరగతి), మధురపేటకు చెందిన మధు రక్షిత (2వ తరగతి), పేరాయిచెరువుకు చెందిన దిగుమర్తి స్టీఫెన్ పాల్ (యూకేజీ) ఉన్నారు. పాఠశాలలో జరిగిన ముందస్తు సంక్రాంతి వేడుకల్లో భోగి మంట వేశారు. ఇంతలో ఒక ఉపాధ్యాయుడు ఆరిపోతున్న మంటపై ప్లాస్టిక్ బాటిల్‌లో ఉన్న పెట్రోలు చల్లారు. దీంతో మంటలు చెలరేగి విద్యార్థులను తాకాయి. ఉపాధ్యాయులు స్పందించి మంటలు ఆర్పారు. అప్పటికే ముగ్గురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే అమలాపురం శ్రీనిధి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనూరాధ, కలెక్టర్ హిమాన్షు శుక్లా పరామర్శించారు. మెరుగైన చికిత్సకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డీఈవో రవిసాగర్ ఆదేశించారని ఉప్పలగుప్తం ఎంఈవో కె.కిరణ్‌బాబు చెప్పారు. పాఠశాల డైరెక్టర్ దేవరపల్లి రాంబాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు తెలిపారు.

అమరావతి ఉద్యమం అంతరించిపోయింది..!

- బహుజన పరిరక్షణ సమితి



రిలే దీక్ష చేస్తున్న నేతలు

తాడికొండ: ఆర్థిక ఉగ్రవాదులు కుల దాదస్యంతో చేస్తోన్న అమరావతి ఉద్యమం అంతరించిపోయిందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ఎద్దేవా చేశారు. గుంటూరు జిల్లా తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో 3 రాజధానులకు మద్దతుగా సమితి ఆధ్వర్యంలో 386వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు బుధవారం హాజరయ్యారు. మంగళగిరిలో వార్డు కౌన్సిలర్‌గా గెలవలేని లోకేశ్ రాష్ట్రంలో పాదయాత్రకు బయలుదేరడం సిగ్గుచేటన్నారు. రాజధానిలో పేదలకు ఇళ్ళ స్థలాలిచ్చేందుకు ప్రభుత్వం ముందుకువస్తే కనీసం పట్టించుకోని వామపక్షాలు, టిడ్కో గృహాలు, జగనన్న కాలనీల పరిశీలన పేరుతో బయలుదేరడం హేయమన్నారు. సమితి నేతలు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, బొలిమేర శామ్యూల్, కారుమూరి పుష్పరాజ్ పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

చెన్నై సోనా బోట్లను తరిమికొట్టిన అధికారులు

కొత్తపట్నం: చెన్నై సోనా బోట్లను మత్స్యశాఖ సిబ్బంది, మెరైన్ పోలీసులు, మత్స్యకారులు బుధవారం తరిమికొట్టారు. వారు విడిచిపెట్టి వెళ్లిన వలలను స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు, నెల్లూరు, ప్రకాశం సముద్ర తీరం వెంబడి అంతా తమిళనాడుకు చెందిన మత్స్యకారులు చెన్నై సోనా బోట్లలో వందల సంఖ్యలో తీరానికి అతి దగ్గరలో


చెన్నై సోనా బోట్లను అదుపు చేయటానికి బోట్లలో వెళ్తున్న మత్స్యకారులు, మెరైన్ సిబ్బంది, మత్స్యశాఖ అధికారులు

100 మీటర్ల దూరంలో వేటాడుతున్నారు. వారిని వెంబడించడం ఎవరి వల్ల కావటం లేదు. వారి బోట్లు 40 అడుగుల ఎత్తులో ఉంటాయి. మన బోట్లు 5 అడుగుల ఎత్తులో ఉంటాయి. దీంతో మన వలలు, మన బోట్లను దెబ్బతీస్తున్నారు. మన మత్స్య సంపద అంతా వారు కొల్లగొట్టుకుని పోతున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మత్స్యకారులు, మత్స్యశాఖ అధికారులు, మెరైన్ పోలీసులతో మాట్లాడి ఎలాగైనా తమిళనాడు మత్స్యకారులు ఇక్కడ వేటచేయకుండా చూడాలని ఆదేశించారు. వారి బోట్లను నిలువరించేందుకు గత డిసెంబర్ 30న నిజాంపట్నం నుంచి సోనాబోటును బాడుగకు తెప్పించారు. అయితే నిజాంపట్నం నుంచి సోనా బోటును కొత్తపట్నం తీసుకొచ్చే సమయంలో గుండాయపాలెం వచ్చే సరికి ఇంజిన్ చెడిపోయి అక్కడే ఉండిపోయింది. దీంతో జేడీ అవుల చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం 3 ఫైబర్ బోట్లలో మత్స్యకారులు, మెరైన్ సిబ్బంది, మత్స్యశాఖ అధికారులు సముద్రంలో 10 కిలోమీటర్ల దూరంలో వేటాడుతున్న చెన్నై సోనా బోట్ల సమీపానికి చేరుకున్నారు. ఆ సమయంలో 16 బోట్లు వేటాడుతున్నాయి. వారి దగ్గరకు వెళ్లే కొద్దీ వారు వలలను వదిలేసి వేగంగా తమ ప్రాంతానికి తిరిగి వెళ్లడం ప్రారంభించారు. వారి వెంబడి 10 కిలో మీటర్ల దూరం వెళ్లారు. వారు వదిలి పెట్టి వెళ్లిన వలలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ముగిసిన వైకుంఠ ద్వార దర్శనం


తిరుమల ఆలయం వెలుపల ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి

తిరుమల: వైకుంఠ ఏకాదశి పర్వదినాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం బుధవారం అర్ధరాత్రితో ముగిసింది. గురువారం నుంచి యథావిధిగా శ్రీవారి కార్యక్రమాలు జరగనున్నాయి. తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. టైమ్ స్లాట్ టోకెన్లు పొందిన వారికి కేటాయించిన నిర్దిష్ట సమయంలో త్వరితగతిన దర్శనం లభిస్తోంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 58,184 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 16,122 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.20 కోట్లు వేశారు. శ్రీవారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటేశ్వరరెడ్డి, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి వైకుంఠ ద్వారంలో స్వామిని దర్శించుకున్నారు. కాగా, ఆధ్యాత్మిక క్షేత్రం తిరుమలలో చలి తీవ్రత అధికంగా ఉంది. భక్తులు చలికి తట్టుకోలేక దుప్పట్లు, స్వెటర్లు కప్పుకుని తిరుగుతున్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని భక్తుల సౌకర్యార్థం తిరుమల నడక మార్గంలో శాశ్వతంగా షెడ్లు ఏర్పాటు చేసే కార్యక్రమానికి టీటీడీ శ్రీకారం చుట్టింది. డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం శుక్రవారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరుగనుంది. ఈవో ఏవీ ధర్మారెడ్డితో మాట్లాడదలచుకున్న భక్తులు 0877-2263261 ఫోన్ నంబర్లో సంప్రదించవచ్చు.

బిడ్డలకు విషమిచ్చి, తల్లి ఆత్మహత్య

సాక్షి బెంగళూరు: తన ముగ్గురు కుమార్తెలకు విషం ఇచ్చి చంపేసి ఆ తర్వాత తల్లి కూడా ఆత్మహత్య చేసుకున్న ఘటన కర్ణాటకలోని బాగలకోటె తాలూకా తిమ్మాపుర గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన అర్జున్, రేఖ (28) దంపతులకు సన్నిధి (7), సమృద్ధి (4), శ్రీనిధి (2) కుమార్తెలు. ముగ్గురూ ఆడ పిల్లలే కావడంతో వారిని ఎలా పెంచాలోనని తరచూ ఆందోళన చెందేది. గతంలో రెండు సార్లు ఆత్మహత్యకు యత్నించింది. ఈ క్రమంలో బుధవారం భర్త పొలానికి వెళ్లిన తర్వాత జ్యూస్‌లో క్రిమిసంహారక మందు కలిపి పిల్లలకు తాగించి, ఆ తర్వాత తాను కూడా ఆత్మహత్య చేసుకుంది. దీనిపై బాగలకోటె గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది.

బకాయిల చెల్లింపునకు సీఎం హామీ ఇచ్చారు

- ఉద్యోగ సంఘాల నేతలు

సాక్షి, అమరావతి: రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల బకాయిలను త్వరలో విడుదల చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చారని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, ఇతర నేతలు చెప్పారు. బుధవారం వారు సీఎం వైఎస్ జగన్‌ను క్యాంపు కార్యాలయంలో కలిశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. కొత్త పీఆర్సీ వేయాలని, రెండు డీఏలు కూడా ఇవ్వాలని సీఎంను కోరినట్లు చెప్పారు. ఈ సంక్రాంతికి ఒక డీఏ, ఏప్రిల్ నుంచి ఎరియర్స్ ఇస్తామని సీఎం తెలిపినట్లు వారు చెప్పారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన సీఎంకు వారు కృతజ్ఞతలు చెప్పారు.

రాష్ట్రంలో మూడు ఒమిక్రాన్ సబ్ వేరియంట్ కేసులు నమోదు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మూడు ఒమిక్రాన్ సబ్ వేరియంట్ కేసులు నమోదయ్యాయి. ఇటీవల కాలంలో పాజిటివ్ కేసులు నమోదైన ముగ్గురు నమూనాలను జినోమ్ సీక్వెన్సింగ్ లేబొరేటరీలో పరీక్షించారు. విశాఖపట్నంలో విదేశాల నుంచి వచ్చిన వ్యక్తిలో బీఏ-5, గుంటూరులో ఇద్దరికి బీఎఫ్-11 వేరియంట్లు బయటపడ్డాయి. ఈ ముగ్గురి ఆరోగ్య పరిస్థితి సాధారణంగానే ఉందని వైద్య శాఖ అధికారులు తెలిపారు. అయితే, ఇప్పటిదాకా రాష్ట్రంలో కరోనా కొత్త వేరియంట్ బీఎఫ్-7 కేసు ఒక్కటి కూడా నమోదు కాలేదని స్పష్టం చేశారు. సంక్రాంతి సంబరాలు, ఇతర శుభకార్యాల నేపథ్యంలో సమూహాల్లో ఉన్నప్పుడు ప్రజలు మాస్కులు ధరించడంతో పాటు ఇతర జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ముగ్గురు జవాన్ల దుర్మరణం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో కుప్వారా జిల్లాలోని నియంత్రణ రేఖ(ఎల్‌ఓసీ) వద్ద మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు తీవ్ర విషాదకర సంఘటన చోటుచేసుకుంది. మాచిల్ సెక్టార్‌లో పెట్రోలింగ్ విధుల్లో ఉన్న ముగ్గురు సైనికులు నాయబ్ సుబేదార్ పరిశోత్తమ్ కుమార్, హవల్దార్ అమ్రిక్ సింగ్, సిపాయి అమిత్ శర్మ ప్రమాదవశాత్తూ లోయలో పడిపోయారు. ఈ దుర్ఘటనలో ముగ్గురూ మృతిచెందారని ఉన్నతాధికారులు బుధవారం వెల్లడించారు. మృతుల్లో ఒక జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్(జేసీఓ) కూడా ఉన్నాడని తెలియజేశారు. మృతదేహాలను వెలికి తీస్తున్నట్లు ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

క్లుప్తంగా..

పారిస్ రైల్వే స్టేషన్లో బ్లేడు దాడి

పారిస్: ఫ్రాన్స్‌లోని పారిస్ రైల్వే స్టేషన్‌లో ఓ దుండగుడు బ్లేడుతో దాడులకు తెగబడ్డాడు. ఈ దాడిలో ఒక పోలీసు అధికారి సహా ఆరుగురికి గాయాలయ్యాయి. ఉదయం 6.43 గంటల ప్రాంతంలో బాగా రద్దీగా ఉండే గారె దు నార్డ్ రైల్వే స్టేషన్‌లో ఈ ఘటన జరిగింది. దీంతో రంగంలోకి దిగి పోలీసులు దుండగుడ్ని అదుపు చెయ్యడానికి అతనిపై కాల్పులు జరిపారు. ప్రస్తుతం అతను ఆస్పత్రిలో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడని పోలీసు అధికారి గెరాల్డ్ దార్మానిన్ తెలిపారు. బ్లేడుతో దాడి జరిగిన సమయంలో పోలీసు అధికారి బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరించడంతో అతను అతి పెద్ద ప్రమాదం నుంచి తప్పించుకున్నారని చెప్పారు. బాధితుల్లో ఒకరి మెడకి తీవ్రంగా గాయం కావడంతో అత్యవసర చికిత్స అందిస్తున్నారు. దుండగుడు ఈ దాడికి ఎందుకు తెగబడ్డాడో కారణాలు మాత్రం తెలియలేదు.

మూడు రాష్ట్రాలు, 50 ప్రాంతాలు.. ఎఫ్‌సీఐ ఆఫీసుల్లో సోదాలు

న్యూఢిల్లీ: ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో అవినీతి ఆరోపణలపై పంజాబ్, హరియాణా, ఢిల్లీల్లోని 50 ప్రాంతాల్లో సీబీఐ బుధవారం ఏకకాలంలో సోదాలు నిర్వహించింది.లో డీజీఎం ర్యాంకు అధికారిని అరెస్ట్ చేసింది. టెక్నికల్ అసిస్టెంట్ల నుంచి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల దాకా 74 మందిని నిందితులుగా ఎఫ్ఐఆర్‌లో చేర్చింది. రైస్ మిల్లు యజమానులు, దళారీలు, అధికారులు సిండికేట్‌గా ఏర్పడి చేస్తున్న అవినీతిపై సీబీఐ ఆర్నెల్లుగా అండర్ కవర్ ఆపరేషన్ నిర్వహిస్తోంది. రూ.50 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన ఎఫ్‌సీఐ డిప్యూటీ జీఎం రాజీవ్ కుమార్ మిశ్రాను అరెస్ట్ చేసినట్టు తెలిపింది.

అధికారంలోకి వస్తే 200 యూనిట్ల ఉచిత విద్యుత్

కర్ణాటకలో కాంగ్రెస్ తొలి ఎన్నికల హామీ

చిక్కోడి(కర్ణాటక): కర్ణాటకలో అధికారంలోకొస్తే గృహాలకు 200 యూనిట్ల దాకా ఉచిత విద్యుత్ అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. మేలో అసెంబ్లీ ఎన్నికలున్న నేపథ్యంలో బుధవారం ప్రజాధ్వని పేరిట బస్సు యాత్ర ప్రారంభించింది. ఈ సందర్భంగా గృహ జ్యోతి యోజన పథకాన్ని పీసీసీ చీఫ్ డి.కె. శివకుమార్ ప్రకటించారు. ''ఇది మా హామీల్లో మొదటిది. కాంగ్రెస్ అధికారంలోకొస్తే రాష్ట్రంలో ఇళ్లన్నీ విద్యుత్ వెలుగులతో నిండుతాయి'' అన్నారు.

సేంద్రియ ఉత్పత్తుల కోసం 3 కొత్త మల్టీ స్టేట్ సొసైటీలు

న్యూఢిల్లీ: సేంద్రియ విత్తనాలు, ఉత్పత్తుల ఎగుమతుల ప్రచారం కోసం జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల సహకార సంఘాలు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. మల్టీ స్టేట్ కోపరేటివ్ సొసైటీస్ (ఎంఎస్‌సీఎస్) చట్టం, 2002 కింద జాతీయ స్థాయిలో సహకార సేంద్రియ సంఘం, సహకార విత్తన సంఘం, సహకార ఎగుమతుల సంఘాలను రిజిస్టర్ చేయనుంది. ఈ మేరకు బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్వర్యంలో జరిగిన కేబినెట్ కమిటీ ఆన్ ఎకనామిక్ అఫైర్స్ (సీసీఈఏ)లో నిర్ణయం తీసుకున్నారు. సహకార్ సే సమృద్ధి అన్న విజన్‌తో తాము ఈ నిర్ణయాలు తీసుకున్నట్టుగా మోదీ ఒక ట్వీట్‌లో వెల్లడించారు. దేశాన్ని ఆర్థికంగా పరిపుష్టం చేయడానికి, గ్రామీణాభివృద్ధిని పరుగులు పెట్టించడానికి సహకార సంఘాల పాత్ర అత్యంత కీలకమైనదని మోదీ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. కేబినెట్ నిర్ణయాలను విలేకరులకు వెల్లడించిన కేంద్రమంత్రి భూపేందర్ యాదవ్, గ్రామీణ భారతంలో సహకార సంఘాలు అత్యంత ముఖ్యమన్నారు. 35 ఏళ్ల తర్వాత మల్టీ కోపరేటివ్ సొసైటీల ఏర్పాటు జరగడం అత్యంత కీలకమైన నిర్ణయమని చెప్పారు.

అమెరికాలో విమాన సేవలకు సాంకేతిక అంతరాయం

వాషింగ్టన్: ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ వ్యవస్థలో సాంకేతిక సమస్యతో అమెరికాలో బుధవారం విమాన సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. 3,700కు పైగా విమానాలు ఆలస్యంగా నడిచాయి. 600కు పైగా విమానాల రాకపోకలను రద్దు చేశారు. తలెత్తడమే ఇందుకు కారణం. విమానాలు తిరిగే మార్గాల్లో మార్పులు చేర్పులు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, ప్రమాదాల గురించి విమాన సిబ్బందిని అప్రమత్తం చేయడానికి ఎఫ్ఏఏ వ్యవస్థ పనిచేస్తోంది. నోటమ్(నోటీసు టు ఎయిర్ మిషన్స్ సిస్టమ్)లో సాంకేతిక సమస్యలు తలెత్తిందని ఎఫ్ఏఏ వెల్లడించింది. సమస్యను పరిష్కరించి, విమాన సేవలను పునరుద్ధరించడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలియజేసింది. వందలాది విమానాలు ఎయిర్‌పోర్టుల్లోనే నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గంటల తరబడి ఇక్కడే పడిగాపులు గాస్తున్నామని, అధికారులు సరైన సమాచారం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. ఎఫ్ఏఏ వ్యవస్థలో సాంకేతిక లోపం గురించి అమెరికా ట్రాన్స్‌పోర్టేషన్ సెక్రెటరీ పెటీ బుటీగీగ్ అధ్యక్షుడు జో బైడెన్‌కు తెలియజేశారు.

చిక్కుల్లో బైడెన్



అయిన ఆఫీసులో రహస్య పత్రాలపై దుమారం

- దేశద్రోహమంటూ దుమ్మెత్తిపోస్తున్న ప్రత్యర్థులు
- నాకేం తెలియదు, పూర్తిగా సహకరిస్తున్నా: బైడెన్
- క్రిమినల్ విచారణపై త్వరలో ఏజీ నిర్ణయం



నాకు తెలియదు: బైడెన్

వాషింగ్టన్: తన కార్యాలయంలో రహస్య పత్రాలు బయటపడ్డట్టు తెలిసి ఆశ్చర్యపోయానని బైడెన్ అన్నారు. 'ఆ పత్రాల గురించి. ఉపాధ్యక్షునిగా నేను తప్పుకున్న తర్వాత నా కార్యాలయంలోకి అవెలా వచ్చాయో నాకు తెలియదు. వాటిల్లో ఏముందో కూడా తెలియదు. వీటిపై జరుగుతున్న విచారణకు పూర్తిగా సహకరిస్తున్నా. ఇలాంటి అంశాలను నేనెంత సీరియస్‌గా తీసుకుంటానో అందరికీ తెలుసు' అన్నారు. మెక్సికో పర్యటనలో ఉన్న ఆయన మీడియా ప్రశ్నించడంతో ఈ అంశంపై తొలిసారిగా స్పందించారు.

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ చిక్కుల్లో పడ్డారు. ఆయన కార్యాలయంలో రహస్య పత్రాలు బయటపడ్డ ఉదంతం క్రమంగా చినికి చినికి గాలివానగా మారుతోంది. ఆ పత్రాల్లో బ్రిటన్, ఉక్రెయిన్, ఇరాన్‌లకు సంబంధించిన పలు సున్నితమైన అంశాలున్నట్టు వస్తున్న వార్తలు మరింత దుమారానికి దారి తీస్తున్నాయి. బరాక్ ఒబామా హయాంలో బైడెన్ ఉపాధ్యక్షునిగా ఉన్నప్పటి సదరు పత్రాలు ఆయన పదవి నుంచి తప్పుకున్నాక ఉపయోగించిన ప్రైవేట్ కార్యాలయంలో గత నవంబర్లో బయటపడ్డాయి. ఈ అంశం సోమవారం వెలుగులోకి వచ్చింది. వాటి ఉనికిని కనిపెట్టింది బైడెన్ తరఫు లాయర్లేనని, వెంటనే వారు నేషనల్ ఆర్కైవ్స్‌కు సమాచారమిచ్చారని ఆయన వర్గం సమర్థించుకున్నా విపక్షాలు ఇప్పటికే దీనిపై దుమ్మెత్తిపోస్తున్నాయి. 2022 ఆగస్టులో మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నివాసంలోనూ ఇలాగే భారీ సంఖ్యలో రహస్య పత్రాలను నేషనల్ ఆర్కైవ్స్ స్వాధీనం చేసుకోవడం తెలిసిందే. ఈ విషయమై ట్రంప్‌పై దర్యాప్తు, క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ కూడా జరుగుతున్నాయి. అదే కోవలో బైడెన్ కూడా విచారణ ఎదుర్కోక తప్పదంటున్నారు. దీనిపై అటార్నీ జనరల్ మెరిక్ గార్లండ్‌కు ఇప్పటికే ప్రాథమిక నివేదిక అందింది. నేషనల్ ఆర్కైవ్స్, రికార్డ్స్ అడ్మినిస్ట్రేషన్ ఈ విషయాన్ని తనకు నివేదించగానే దీనిపై విచారణ బాధ్యతలను షికాగో అటార్నీ జాన్ లాష్ జూనియర్‌కు గార్లండ్ అప్పగించారు. ఆయన నుంచి ఇప్పటికే అన్ని వివరాలూ తెప్పించుకున్నారు. బైడెన్‌పై పూర్తిస్థాయి నేర విచారణ ప్రారంభించాలా, వద్దా అన్న కీలక అంశంపై గార్లండ్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ట్రంప్ రహస్య డాక్యుమెంట్లకు సంబంధించి ఆయన ఫ్లోరిడా ఎస్టేట్‌లో ఎఫ్‌బీఐ సోదాలతో పాటు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నది గార్లండే కావడం విశేషం! అధ్యక్షుల విజ్ఞతకే అత్యంత ప్రాధాన్యమివ్వడమే గాక వారి ప్రవర్తన విషయంలో అత్యంత పట్టింపుగా ఉండే అమెరికాలో చివరికిది బైడెన్ పదవికి ఎసరు పెడుతుందా అన్నది చూడాలి.

ఏం జరిగింది?

బైడెన్ వద్ద పలు రహస్య పత్రాలు బయట పడ్డట్టు సోమవారం అమెరికా మీడియాలో వార్తలొచ్చాయి. దాంతో వైట్‌హౌస్ దీనిపై అధికారిక ప్రకటన చేసింది. 2022 నవంబర్ 2న వాషింగ్టన్ డీసీలోని పెన్ బైడెన్ సెంటర్లో ఉన్న బైడెన్ ప్రైవేట్ కార్యాలయాన్ని ఖాళీ చేస్తున్న సందర్భంగా అందులో పలు రహస్య పత్రాలను ఆయన లాయర్లు కనుగొన్నట్టు పేర్కొంది. అవన్నీ ఒబామా అధ్యక్షునిగా, బైడెన్ ఉపాధ్యక్షునిగా ఉన్నప్పటివని, అంటే 2013–16 నాటివని చెబుతున్నారు. ప్రెసిడెన్షియల్ రికార్డ్స్ యాక్ట్ పరిధిలోకి వచ్చే పలు పత్రాలు కూడా వీటిలో ఉన్నాయి! అవి రహస్య పత్రాలని తెలియగానే తన లాయర్లు వెంటనే నేషనల్ ఆర్కైవ్స్‌కు సమాచారమిచ్చి వాటిని అప్పగించారని బైడెన్ చెప్పుకొచ్చారు. ఉపాధ్యక్షునిగా పదవీకాలం ముగిశాక 2017 నుంచి మూడేళ్లపాటు ఆయన ఈ కార్యాలయాన్ని వాడుకున్నారు.

ఆ పత్రాల్లో ఏముంది?

బైడెన్ ఆఫీసులో దొరికినవి మామూలు రహస్య పత్రాలేనంటూ తొలుత వార్తలు వచ్చాయి. అయితే వాటిలో బ్రిటన్, ఇరాన్, ఉక్రెయిన్‌లకు సంబంధించి అమెరికా నిఘా వర్గాలు సేకరించిన అత్యంత రహస్య సమాచారం ఉందని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ సీఎన్ఎన్ తదితర వార్తా సంస్థలు తాజాగా వెల్లడించడం సంచలనం రేపుతోంది.

కావాలనే ఆలస్యంగా బయట పెట్టారా?

రహస్య పత్రాలు ప్రైవేట్ కార్యాలయంలో దొరకడం ఒక ఎత్తైతే, దాన్ని ఇంతకాలం దాచి ఉంచడం బైడెన్‌కు మరింత ఇబ్బందికరంగా మారేలా కన్పిస్తోంది. 2022 నవంబర్ 2న ఈ పత్రాలు వెలుగు చూసినప్పటికి అమెరికాలో కీలకమైన మధ్యంతర ఎన్నికలు మరో వారంలోపే ఉన్నాయి. పత్రాల విషయం అప్పుడే బయటికొస్తే ఆ ఎన్నికల్లో డెమొక్రాట్లకు పెద్ద ఎదురుదెబ్బే తగిలేది. అందుకే దీన్ని దాచి ఉంచినట్టు తేలితే బైడెన్‌కు మరింత తలనొప్పిగా మారడం ఖాయం. మధ్యంతరంలో ప్రతినిధుల సభలో విపక్ష రిపబ్లికన్లకు స్వల్ప మెజారిటీ లభించడం తెలిసిందే.

రాజకీయ వేడి

బైడెన్ కార్యాలయంలో రహస్య పత్రాలు దొరకడం అధికార డెమొక్రాట్లు, రిపబ్లికన్ల మధ్య దుమారానికి దారి తీస్తోంది. ట్రంప్ ఎస్టేట్ మాదిరిగా బైడెన్ ఇల్లు, కార్యాలయాల్లో ఎఫ్‌బీఐ ఎప్పుడు సోదాలు చేస్తుందంటూ రిపబ్లికన్ నేతలు ప్రశ్నాస్త్రాలు సంధిస్తున్నారు. ట్రంప్ అయితే మరో అడుగు ముందుకేసి, రహస్య పత్రాలను కాపాడలేకపోయినందుకు వైట్‌హౌస్‌లో కూడా ఎఫ్‌బీఐ సోదాలు చేయాలన్నారు! ప్రతినిధుల సభలో రహస్య పత్రాల వ్యవహారాలను చూసే శక్తిమంతమైన ఓవర్‌సైట్ కమిటీ సారథి అయిన రిపబ్లికన్ సభ్యుడు జేమ్స్ కోమర్ ఇప్పటికే దీనిపై పూర్తి సమాచారమివ్వాలంటూ నేషనల్ ఆర్కైవ్స్‌కు, వైట్‌హౌస్ కౌన్సెల్ కార్యాలయానికి లేఖలు రాశారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ట్రంప్ పత్రాల గొడవ

ట్రంప్ అమెరికా అధ్యక్షునిగా తప్పుకున్నాక పలు రహస్య పత్రాలను వైట్‌హౌస్ నుంచి తన ఫ్లోరిడా ఎస్టేట్‌కు తీసుకెళ్లారన్న వార్తలు సంచలనం సృష్టించాయి. 2022 ఆగస్టులో ఆయన ఎస్టేట్లో ఎఫ్‌బీఐ సోదాల్లో వందలాది డాక్యుమెంట్లు దొరికాయి. తనకేమీ తెలియదని, ఇదంతా రాజకీయ కుట్ర సాధింపని ట్రంప్ ఎదురు దాడికి దిగారు. దొరికినవన్నీ తన వ్యక్తిగత పత్రాలేనంటూ బుకాయించారు. దీనిపై ఇప్పటికే ఆయనపై సివిల్, క్రిమినల్ విచారణలు జరుగుతున్నాయి. మొత్తం 3,000కు పైగా డాక్యుమెంట్లను వైట్‌హౌస్ నుంచి తరలించినట్టు ట్రంప్‌పై అభియోగాలు నమోదయ్యాయి.

ఇవీ తేడాలు...

బైడెన్ పేపర్స్

- 10 డాక్యుమెంట్ల దాకా దొరికాయి.
- వీటిలో కొన్ని మాత్రమే టాప్ సీక్రెట్ తరహావి.
- వీటిపై దర్యాప్తుకు సహకరిస్తున్నట్టు బైడెన్ చెబుతున్నారు.
- బైడెన్ ఆఫీసులో రహస్య పత్రాలున్నాయంటూ ఆయన లాయర్లే ఆర్కైవ్స్‌కు సమాచారమిచ్చారు.

ట్రంప్ పేపర్స్



- ట్రంప్ ఎస్టేట్లో కనీసం 325 డాక్యుమెంట్లు దొరికాయి.
- వీటిలో కనీసం 60 దాకా టాప్ సీక్రెట్ డాక్యుమెంట్లున్నాయి.
- దర్యాప్తును అడ్డుకున్నందుకు ట్రంప్‌పై విచారణ జరుగుతోంది
- ట్రంప్ ఎస్టేట్లోని రహస్య పత్రాలన్నింటినీ ఆయన లాయర్లు అప్పగించారని ఆర్కైవ్స్ వర్గాలకు నమ్మకం కుదరలేదు. ఎస్టేట్‌పై ఎఫ్‌బీఐ ఆకస్మిక సోదాలు జరపగా మరెన్నో డాక్యుమెంట్లు లభ్యమయ్యాయి.

లక్షద్వీప్ ఎంపీకి పదేళ్ల ఖైదు



కవరత్తి: హత్యాయత్నం కేసులో లక్ష ద్వీప్ ఎంపీ, ఎన్సీపీ నేత మహమ్మద్ ఫైజల్ సహా నలుగురికి జిల్లా కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించింది. వారికి పదేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి లక్ష రూపాయల జరిమానా విధిస్తూ సెషన్స్ కోర్టు జడ్జి కె.అనిల్‌కుమార్ తీర్పు చెప్పారు. 2009 లోక్‌సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి పీఎం సయీద్ అల్లుడైన పదాంత సాలిహ్‌ను హత్య చేయడానికి ఫైజల్ మరో ముగ్గురు ప్రయత్నించినట్టు కేసు నమోదైంది. రాజకీయ కక్షలతోనే సాలిహ్‌ను హత్య చేయడానికి కుట్ర పన్నారని, అయితే అందులో వారు విఫలమయ్యారని కోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు నేపథ్యంలో ఎంపీ ఫైజల్ సహా దోషులు నలుగురిని కేరళలోని కన్నూర్ సెంట్రల్ జైలుకి తరలించారు. ఈ తీర్పుతో ఫైజల్ రాజకీయ భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. ఎన్సీపీకి చెందిన నేత ఫైజల్ క్రిమినల్ కేసులో దోషిగా తేలడంతో ఆయనపై అనర్హత వేటు పడుతుందని న్యాయనిపుణులు చెబుతున్నారు. మరోవైపు ఈ కేసు రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నదని ఫైజల్ ఆరోపించారు. తీర్పును హైకోర్టులో సవాల్ చేస్తున్నట్టు చెప్పారు. 2009లో ఫైజల్ మరి కొంత మందితో కలిసి పదునైన ఆయుధాలతో సాలిహ్‌పై దాడి చేశారు. కత్తులు, కటారులు, కర్రలు, ఐరన్ రాడ్లతో కలిసి అతనిని వెంబడించి కొట్టారు. తీవ్రంగా గాయపడిన సాలిహ్‌ని ప్రత్యేక హెలికాప్టర్‌లో ఎర్నాకులం ఆస్పత్రికి తరలించడంతో ఆయన ప్రాణాలు నిలవగలిగారు.

జిలేబీ బాబాకు 14 ఏళ్ల జైలు



చండీగఢ్: తనను తాను దేవుడిగా ప్రచారం చేసుకుంటూ అరాచకాలు సాగించిన జిలేబీ బాబా అలియాస్ అమర్‌వీర్ అలియాస్ బిల్లూ అలియాస్ అమర్‌పురి (63) పాపం పండింది. 100 మందికి పైగా మహిళలపై అత్యాచారం చేసి, వీడియోలు తీసినట్లు అతడిపై ఆరోపణలున్నాయి. ఓ బాలికపై రెండు సార్లు అత్యాచారం చేసిన కేసులో పోక్సో చట్టం సెక్షన్ 6 కింద అతనికి 14 ఏళ్ల జైలు శిక్ష విధిస్తున్నట్లు హరియాణాలోని ఫతేహాబాద్ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు అదనపు జిల్లా జడ్జి బల్వంత్‌సింగ్ బుధవారం ప్రకటించారు. జిలేబీ బాబాను హరియాణా పోలీసులు 2018లో అరెస్టు చేశారు. అతడి ఫోన్‌లో 120కి పైగా అశ్లీల వీడియో క్లిప్పింగ్‌లను గుర్తించారు. జిలేబీ బాబా హరియాణాలోని తోహన్ పట్టణంలో బాబా బాలక్‌నాథ్ మందిరం అధినేతగా ప్రాచుర్యం పొందాడు. మహిళలకు మాదకద్రవ్యాలిచ్చి అత్యాచారం చేయడం, ఆ దురాగతాన్ని వీడియోలో చిత్రీకరించడం, వాటిని చూపి బ్లాక్‌మెయిల్ చేసి బాధితుల నుంచి డబ్బులు గుంజడం అతని స్టైల్.

అంతర్జాతీయ వాణిజ్యంలో భారత్ వేగుచుక్క

ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సులో మోదీ

- ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొనే సత్తా మనకే అధికం
- గత ఎనిమిదేళ్లలో సంస్కరణల వేగం మరింత పెంచాం
- పెట్టుబడులకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా భారత్



ఇండోర్: ప్రపంచ వాణిజ్యంలో భారత్‌ను ఒక వేగుచుక్కగా అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్) పరిగణిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఆర్థిక సంక్షోభం తలెత్తితే సమర్థంగా ఎదుర్కొనే సత్తా ఇతర దేశాలకంటే భారత్‌కే అధికంగా ఉందని స్వాక్షాత్తూ ప్రపంచ బ్యాంక్ చెబుతోందని గుర్తుచేశారు. మన దేశ ప్రాథమిక ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండడమే ఇందుకు కారణమని వివరించారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో బుధవారం ప్రపంచ పెట్టుబడిదారుల 7వ సదస్సులో ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. గత ఎనిమిదేళ్లలో కేంద్ర ప్రభుత్వం సంస్కరణల వేగాన్ని మరింత పెంచిందని పేర్కొన్నారు. పెట్టుబడుల విషయంలో ఎన్నో అవరోధాలను తొలగించిందని వెల్లడించారు. నరేంద్ర మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే..

నంబర్ వన్ స్థానంలో భారత్

''నేటి నూతన భారతదేశం ప్రైవేట్ రంగ బలంపై ఆధారపడుతూ వేగంగా ముందుకు సాగుతోంది. రక్షణ, గనులు, అంతరిక్షం వంటి కీలక వ్యూహాత్మక రంగాల్లో ప్రైవేట్ రంగం ప్రవేశానికి ద్వారాలు తెరిచాం. మల్టీ మోడల్ మౌలిక సదుపాయాల వల్ల దేశంలో పెట్టుబడులకు అవకాశాలు భారీగా పెరిగాయి. బలమైన ప్రజాస్వామ్య వ్యవస్థ, యువ జనాభా అధికంగా ఉండడం, రాజకీయ స్థిరత్వం మన దేశ ప్రగతికి చోదక శక్తులు. మన బలాలే పెట్టుబడిగా సులభతర జీవనం, సులభతర వాణిజ్యాన్ని పెంపొందించడానికి త్వరితంగా నిర్ణయాలు తీసుకుంటున్నాం. 5జీ నెట్‌వర్క్‌ను విస్తరింపజేస్తున్నాం. ఆప్టికల్ ఫైబర్ వ్యవస్థ గ్రామీణ ప్రాంతాలకు సైతం చేరుకుంటోంది. ప్రపంచంలో స్మార్ట్‌ఫోన్ డేటా వినియోగంలో భారత్ నంబర్ వన్ స్థానంలో ఉంది. రికార్డు స్థాయిలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) ఆకర్షించింది.

అది ప్రతి భారతీయుడి ఆశయం


అభివృద్ధి చెందిన దేశ నిర్మాణంలో మధ్యప్రదేశ్ పాత్ర చాలా కీలకంగా మారింది. ఆధ్యాత్మికం, టూరిజం, వ్యవసాయం, విద్య, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లో రాష్ట్రం అద్భుత ప్రగతి సాధిస్తోంది. పెట్టుబడులకు స్వర్గధామంగా మారింది. పెట్టుబడిదారులకు తగిన ప్రతిఫలం అందించడంలో మధ్యప్రదేశ్ రెండు అడుగులు ముందే ఉంటుందని నమ్మకంగా చెప్పగలను. అభివృద్ధి చెందిన భారత్ అనేది కేవలం నోటిమాట కాదు, ప్రతి భారతీయుడి ఆశయం. కోవిడ్‌-19 వ్యాప్తి సమయంలోనూ సంస్కరణలను ఆపలేదు. 2014 నుంచి 'సంస్కరణ, మార్పు, నిర్వహణ' అనే మార్గంలో భారత్ ముందుకు సాగుతోంది. ఆత్మనిర్భర్ భారత్ అభియాన్ వల్ల దేశంలో అభివృద్ధి వేగం పుంజుకుంది. పెట్టుబడులకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారింది.

న్యూ ఇండియా గుర్తింపు చిహ్నాలు

''జాతీయ రహదారుల నిర్మాణ వేగాన్ని ఎనిమిదేళ్లలో రెండింతలు చేశాం. ఎయిర్‌పోర్టుల సంఖ్య రెట్టింపైంది. ఓడరేవుల సామర్థ్యాన్ని, ఆదాయాన్ని ఎన్నో రెట్లు పెంచాం. సరుకు రవాణా కారిడార్లు, పారిశ్రామిక కారిడార్లు, ఆధునిక ఎక్స్‌ప్రెస్ రహదారులు, లాజిస్టిక్(సరుకు నిల్వ) పార్కులు నూతన భారతానికి గుర్తింపు చిహ్నాలుగా మారాయి. మౌలిక సదుపాయాల నిర్మాణం కోసం గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ పేరిట దేశంలో తొలిసారిగా ఒక జాతీయ వేదికను ఏర్పాటు చేశాం. అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణం కోసం అంతా చేతులు కలుపుదాం. కలిసి పనిచేద్దాం. రాబోయే నాలుగైదేళ్లలో భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుంది. మోర్గాన్‌స్టాన్లీ సంస్థ ఈ మేరకు పేర్కొంది. ఇది భారతదేశ దశాబ్దం కాదు, శతాబ్దమని మెకిన్సీ సీఈఓ చెప్పారు'' అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

ఓజోన్ పొర స్వయం చికిత్స

2066 నాటికి పూర్తిగా పూడుకుపోనున్న రంధ్రం



వాషింగ్టన్: వాతావరణ మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు, తద్వారా ప్రకృతి విపత్తులతో అల్లాడిపోతున్న ప్రపంచానికి ఇదొక శుభవార్త. భూగోళంపై ఉష్ణోగ్రతలను నియంత్రించడంలో అత్యంత కీలకమైన ఓజోన్ పొర స్వయం చికిత్స చేసుకుంటోంది. ఓజోన్ పొరకు ఏర్పడిన రంధ్రం క్రమంగా పూడుకుపోతోంది. క్లోరో ఫ్లోరో కార్బన్ల ఉద్గారాలు క్రమంగా తగ్గుముఖం పడుతుండడమే ఇందుకు కారణం. ఐక్యరాజ్యసమితికి చెందిన సైంటిఫిక్ అసెస్‌మెంట్ ప్యానెల్ ఈ విషయాన్ని ఒక నివేదికలో వెల్లడించింది. ప్రతి నాలుగేళ్లకోసారి ఈ నివేదిక విడుదల చేస్తారు. ఓజోన్ పొర పూడుకుపోవడం 2022లో మొదలైందని నివేదికలో తెలిపింది. ఓజోన్ రంధ్రం 2022 సెప్టెంబర్ 7 నుంచి అక్టోబర్ 13 మధ్య సగటున 23.2 మిలియన్ చదరపు కిలోమీటర్ల వైశాల్యానికి కుంచించుకుపోయింది. క్లోరో ఫ్లోరో కార్బన్ల ఉద్గారాలు ఇదే క్రమంలో తగ్గిపోతే 2066 నాటికి పూర్తిగా పూడుకుంటుందని పేర్కొన్నారు. మాంట్రియల్ ప్రోటోకాల్ సత్ఫలితాలు ఇస్తున్నట్లు భావిస్తున్నామని తెలిపారు. ఓజోన్ పొరకు రంధ్రం ఏర్పడినట్లు తొలిసారిగా 1980లో గుర్తించారు. మరో నాలుగు దశాబ్దాల్లో 1980 నాటి స్థాయికి ఓజోన్ పొర చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు నిపుణులు స్పష్టం చేశారు. ఉష్ణోగ్రత 2100 నాటికి 0.3 నుంచి 0.5 డిగ్రీల సెల్సియస్ తగ్గేలా హైడ్రో ఫ్లోరో కార్బన్ల ఉత్పత్తి, వినియోగాన్ని తగ్గించుకోవాలని మాంట్రియల్ ప్రోటోకాల్ నిర్దేశిస్తోంది.



కాస్త కదిలినా చాలు శరీరాన్ని ఛిద్రంచేసే గ్రనేడ్ ఒంట్లోకి దూసుకుపోయి అచేతనంగా ఉన్న ఉక్రెయిన్ సైనికుడికి వెంటనే శస్త్రచికిత్స చేసి ఛాతిలోని గ్రనేడ్‌ను తీసేసిన డాక్టర్ ఇతను. పేరు యాండ్రీ వెర్బా. సంక్లిష్ట ఆపరేషన్లను ప్రశాంతంగా చేసే డాక్టర్‌గా ఇతనికి పేరుంది. ఎలక్ట్రోకోవాగ్యులేషన్(రక్తస్రావం ఆపే ప్రక్రియ) లేకుండానే ఈ ఆపరేషన్ చేయడం విశేషం. రష్యా సైన్యం అసాల్ట్ రైఫిల్‌కు బిగించిన గ్రనేడ్ లాంచర్‌తో దీనిని ప్రయోగించింది.

'ఎయిరిండియా' మిశ్రాకు బెయిల్ నిరాకరణ



న్యూఢిల్లీ: న్యూయార్క్–న్యూఢిల్లీ ఎయిర్ ఇండియా విమానంలో సహ ప్రయాణికురాలిపై మూత్రవిసర్జన చేసిన శంకర్ మిశ్రాకు ఢిల్లీలోని పటియాలా కోర్టు బుధవారం బెయిల్ నిరాకరించింది. తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ అతడు దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం తోసిపుచ్చింది. శంకర్ మిశ్రాను ఢిల్లీ పోలీసులు శుక్రవారం బెంగళూరులో అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపర్చగా నిందితుడిని 14 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీకి తరలిస్తూ న్యాయమూర్తి ఆదేశాలిచ్చారు. తనను చట్టవిరుద్ధంగా అరెస్టు చేశారని శంకర్ మిశ్రా ఆరోపించాడు. తనకు గతంలో ఎలాంటి నేర చరిత్ర లేదని, సాక్ష్యులను ప్రభావితం చేసే స్థాయిలో లేనని, అందుకే బెయిల్ ఇవ్వాలని కోరాడు.

ఐక్యత, సౌభ్రాతృత్వాలే.. భారత మూలమంత్రం

అందుకే జోడో యాత్ర విజయవంతం: రాహుల్



ఫతేగఢ్ సాహిబ్ వద్ద యాత్రలో రాహుల్

ఫతేగఢ్ సాహిబ్ (పంజాబ్): అధికార బీజేపీ దేశంలో హింసాద్వేషాలను వ్యాప్తి చేస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ మరోసారి దుయ్యబట్టారు. ''కానీ మన దేశం ఎప్పుడూ ఐక్యతకు, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచింది. అందుకే భారత్ జోడో యాత్ర ఇంతగా విజయవంతమవుతోంది'' అని అభిప్రాయపడ్డారు. ఆయన యాత్ర బుధవారం పంజాబ్‌లోకి ప్రవేశించింది. ఫతేగఢ్ సాహిబ్ గురుద్వారాను సందర్శించిన అనంతరం ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. బీజేపీ, ఆరెస్సెస్ మతాలను, కులాలను పరస్పరం ఎగదోస్తూ దేశ వాతావరణాన్నే కలుషితం చేశాయంటూ ధ్వజమెత్తారు. అందుకే దేశానికి ప్రేమ, ఐక్యతలతో కూడిన మరో దారి చూపాలనే యాత్ర మొదలు పెట్టినట్టు చెప్పారు. మీడియా కూడా నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి పెను సమస్యలను పక్కన పెట్టి 24 గంటలూ ప్రధాని మోదీని చూపించడానికే పరిమితమవుతోందంటూ చురకలంటించారు.

21 పార్టీలకు ఆహ్వానం

భారత్ జోడో యాత్ర జనవరి 30న జమ్మూ కశ్మీర్లోని శ్రీనగర్‌లో ముగియనుంది. ఈ సందర్భంగా జరిపే ముగింపు సభలో పాల్గొనాలని కోరుతూ 21 పార్టీల అధ్యక్షులకు కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే లేఖలు రాశారు.

అఫ్గాన్‌లో పేలుడు.. 20 మంది మృతి

కాబూల్: అఫ్గానిస్తాన్ రాజధాని కాబూల్‌లో విదేశాంగ శాఖ కార్యాలయం సమీపంలో బుధవారం మధ్యాహ్నం భారీ పేలుడు సంభవించింది. కాబూల్ ఈ ఏడాదిలో ఇది రెండో అతిపెద్ద పేలుడు. ఈ ఘటనలో 20 మందికిపైగా జనం మృతి చెందారు. అయితే, పేలుడుకు పాల్పడింది ఎవరన్నది ఇంకా తెలియరాలేదు. కానీ, అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్(ఐసిస్)కు అనుబంధ సంఘమైన 'ఇస్లామిక్ స్టేట్ ఇన్ ఖొరాసన్ ప్రావిన్స్' 2021 ఆగస్టులో తాలిబాన్ పాలన మొదలయ్యాక అఫ్గాన్‌లో వరుసగా దాడులకు పాల్పడుతోంది.

సాక్షి 24|7
కర్ణాటక
KARNATAKA
గురువారం, 12 జనవరి 2023

గుండెపోటుకు మరో విద్యార్థి బలి


జయంత్

శివమొగ్గ: రాష్ట్రంలో తరచూ ఏదో ఒక ప్రాంతంలో గుండెపోటుతో పసిమొగ్గలు రాలిపోతున్నారు. అటువంటి విషాదం మరొకటి చోటుచేసుకుంది. శివమొగ్గ జిల్లా సొరబ తాలూకా ఎణ్ణెకొప్ప గ్రామంలో పదో తరగతి విద్యార్థి గుండెపోటుతో మరణించాడు. జయంత్ (15) అనే విద్యార్థి బుధవారం ఉదయం బడికి వెళ్లేందుకు తయారవుతుండగా హఠాత్తుగా కుప్పకూలిపోయాడు. వెంటనే అతన్ని ఎణ్ణెకొప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడికి వెళ్లేలోపే జయంత్ మరణించాడు. బాలుని మరణంతో కుటుంబ సభ్యుల ఆక్రందన మిన్నంటింది.

న్యూస్‌రీల్

వర్గీకరణకై పోరాటమే : మందకృష్ణ


మాట్లాడుతున్న మందకృష్ణ

సాక్షి, బెంగళూరు: దేశంలో సంపూర్ణ మెజారిటీతో అధికారంలో ఉండి కూడా ఎస్సీ వర్గీకరణపై బీజేపీ మీనమేషాలు లెక్కిస్తుండడం మాదిగలకు నమ్మక ద్రోహం చేయడమేనని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. ఇకపై ఎస్సీ వర్గీకరణపై బీజేపీతో తేల్చుకుంటామని, అందుకోసం మాదిగలు వీరోచిత పోరాటాలకు సిద్ధం కావాలని సూచించారు. బుధవారం బెంగళూరులోని అంబేడ్కర్ భవన్‌లో ఎమ్మార్పీఎస్ జాతీయ సదస్సు జరిగింది. మందకృష్ణ మాట్లాడుతూ కర్ణాటకలో కూడా సదాశివ కమిషన్ నివేదికను అమలు చేయకుండా బీజేపీ ప్రభుత్వం కూడా జాప్యం చేస్తోందని విమర్శించారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదరాలి పెద్దమనసు


కుర్చీలతో రేణుక, ఉపాధ్యాయ సిబ్బంది

విజయపుర: హారోహళ్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు రేణుక అనే విద్యార్థుల తల్లి కుర్చీలను విరాళం ఇచ్చింది. రేణుక మాట్లాడుతూ తాను ఇళ్లలో పని చేస్తు చిన్న షెడ్‌లో ఉంటున్నట్లు తెలిపారు. తన ఇద్దరు పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నారని చెప్పారు. పాఠశాలలో ఉపాధ్యాయులు కూర్చోవడానికి కుర్చీలు కూడా లేవని తెలిపి ఆవేదన కలిగిందని, అందుకే కొని ఇచ్చానని తెలిపింది. రేణుక దాతృత్వాన్ని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు ప్రశంసించారు.

ప్రిన్సిపాల్ కొట్టాడని...



కృష్ణరాజపురం: ప్రిన్సిపాల్ కొట్టాడని ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బెంగళూరు కేజీ హళ్లి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. రిజ్వాన్ అలియాస్ జైద్ (25) అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. అల్ అమీన్ కళాశాలలో రిజ్వాన్ ఎల్‌ఎల్‌బీ చివరి ఏడాది చదువుతున్నాడు. ఇతనికి ఏడాదిన్నర క్రితం వివాహం జరిగింది. కాలేజీ ప్రిన్సిపాల్ కొట్టాడని మనస్తాపానికి గురైన రిజ్వాన్ ఇంటిలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

గంజాయి దందాలో వైద్య విద్యార్థులు

యశవంతపుర: మంగళూరు సీసీబీ పోలీసులు బుధవారం గంజాయి దందా చేస్తున్న వైద్య విద్యార్థులతో పాటు వైద్యులు, పెడ్లర్లను అరెస్ట్ చేశారు. మంగళూరులోని ప్రతిష్ఠాత్మక కేఎంసీ అత్తావర, కేఎంసీ మణిపాల్, దేరళకట్టె, యెనేపోయా మెడికల్ కాలేజీల వద్ద ఆకస్మికంగా దాడులు చేసి నలుగురు మెడికోలతో పాటు ఇద్దరు వైద్యులు, మరో ఇద్దరు ఇతర కళాశాలకు చెందిన మొత్తం పది మందిని అరెస్ట్ చేశారు. యూకేకు చెందిన నీల్ కిశోరిలాల్ రామ్‌జీని అరెస్ట్ చేసి పెద్ద మొత్తంలో గంజాయి స్వాధీనం స్వాధీనం చేసుకున్నారు. ఇతని అరెస్ట్‌తో అనేక మంది ఈ దందాలో ఉన్నట్లు బయటపడింది.

పులి కాదు, వీధి కుక్క !


కుక్కకు పులి చారలతో వేషం

యశవంతపుర: అడవి జంతువులు పంటలను నాశనం చేస్తుండటంతో రైతు ఓ వినూత్న ఆలోచన చేశారు. పందులు, కోతుల బెడదకు పరిష్కారం కనుగొన్నారు. తన పెంపుడు కుక్కకు పులి రంగులతో చారలు వేశారు. అచ్చు పులిని పోలిన విధంగా మార్చారు. ఈ ఘటన చామరాజనగర జిల్లా అజ్జీపుర గ్రామంలో జరిగింది. ఓ రైతు తన పెంపుడు కుక్కకు పులి తరహాలో మార్చి వెంట తీసుకెళ్తున్నాడు. దాన్ని చూసిన అడవి పందులు, కోతులు ఆ ఛాయలకు కూడా రావడం లేదు. ఊరు కుక్కలు కూడా భయపడిపోతున్నాయి. రైతు ఐడియాను నెటిజన్లు అభినందిస్తున్నారు.

వెల్లివిరిసే యువ తరంగం


ప్రధాని మోదీ రాక, యువజన ఉత్సవాల కోసం హుబ్లీ, ధార్వాడ నగరాల్లో సాగుతున్న వేదికల నిర్మాణం



- నేడు హుబ్లీలో యువజన ఉత్సవాలకు ప్రధాని మోదీ నాంది
- హుబ్లీ–ధార్వాడలో ఐదురోజుల కార్యక్రమాల సందడి
- దేశం నలుమూలల నుంచి యువ ప్రతినిధుల రాక

హుబ్లీ: స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల నేపథ్యంలో... వికసిత యువ– వికసిత భారత్ పేరుతో జాతీయ యువజనోత్సవాలను ప్రారంభించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ గురువారం హుబ్లీకి రానున్నారు. ప్రధాని సమావేశం జరిగే రైల్వే మైదానంతో పాటు జంట నగరాల్లో యువ సందడి నెలకొంది. హుబ్లీ-ధార్వాడలో ఐదు వేదికలలో 5 రోజుల పాటు జరిగే యువజనోత్సవాలకు ప్రధాని శ్రీకారం చుట్టనున్నారు. మోదీ పాల్గొనే ప్రధాన కార్యక్రమం హుబ్లీలోని కేశవాపుర రైల్వే మైదానంలో జరగనుంది. ఇందుకు భారీఎత్తున ఏర్పాట్లు జరిగాయి. హుబ్లీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాఠశాలలకు శుక్రవారం సెలవు ప్రకటించారు. మరోవైపు సంక్షేమ హాస్టల్‌తో పాటు ఆడిటోరియంలు, ప్రైవేట్ అతిథిగృహాలు, లాడ్జిలు యువ ప్రతినిధులతో నిండిపోయాయి. జంట నగరాలను అంగరంగ వైభవంగా తీర్చిదిద్దారు.

రోడ్ షో ద్వారా ప్రధాని రాక

ప్రధాని పాల్గొనే రైల్వే మైదానంలో సభకు 30 వేల కుర్చీలు ఏర్పాటు చేశారు. హుబ్లీ విమానాశ్రయం నుంచి రైల్వే మైదానం వరకు మోదీ రోడ్డు షో నిర్వహిస్తారు. ఈ క్రమంలో రోడ్డుకు ఇరువైపులా బ్యారికేడ్లతో భద్రతను ఏర్పాటు చేశారు. ప్రజలు ఇబ్బంది లేకుండా ప్రధానిని చూడటానికి అవకాశం కల్పించారు. వేదిక ప్రాంగణంలో దాదాపు 2500 మంది పోలీసులతో బందోబస్తుగా ఏర్పాటు చేసినట్లు జంట నగరాల పోలీస్ కమిషనర్ రమణ్‌గుప్తా తెలిపారు.

లక్ష మందికి వంటకాలు

కాగా మరో వైపు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 600 మంది వంటవారు ఒక లక్ష మందికి అవసరమైన వంటలను చేయడానికి సిద్ధమయ్యారు. ఇందుకోసం వర్సిటీ ఆవరణలో 5 ఎకరాల ప్రాంతంలో బృహత్ పాకశాల వెలసింది. అక్కడి మీటింగ్ హాల్‌లోనూ వంటలను వండించడానికి ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా ఉత్తర కర్ణాటకలో పేరుపొందిన ఆహార పదార్థాలను అతిథులకు సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం 12 లారీల్లో బెంగళూరుకు చెందిన క్యాటరింగ్ సంస్థ తమ వస్తువులను, వంటపాత్రలను తెచ్చింది. మరోవైపు పలు సంస్థలు ఈ వేడుకలకు ఆర్థిక, వస్తు చేయూతను అందించారు. ఇక్కడి ప్రముఖ మిఠాయి పేడా నిర్వాహకులు 7,500 మందికి ఉచితంగా పేడా పంపిణీ చేయనున్నారు. సాహస క్రీడల ప్రదర్శనతో పాటు దేశం నలుమూలల నుంచి వచ్చే ఔత్సాహికులు, సంస్థలు స్టాళ్లను ఏర్పాటు చేయనున్నాయి. యువజన ప్రతినిధులు తమ కళా ప్రదర్శనను ప్రదర్శించేందుకు వివిధ వేదికలు ఏర్పాటయ్యాయి.



ఏయే అంశాలపై చర్చలంటే

వివిధ రాష్ట్రాల నుంచి 8 వేల మంది యువజనులతో పాటు మొత్తం 40 వేల మంది పాల్గొంటారని అంచనా. యువ సమ్మిట్, వై-20, భవిష్యత్ కృషి, 21వ శతాబ్దంలో నూతన ఆవిష్కారాలు, వాతావరణ మార్పులు– విపత్తుల నిర్వహణ, శాంతి సుహృద్భావం, ప్రభుత్వం, ప్రజాస్వామ్యంలో యువత పాత్ర, ఆరోగ్య సౌభాగ్యం అనే అంశాలపై సమావేశాలు జరుగుతాయి.

తీర్థహళ్లిలో ఎన్‌ఐఏ సోదాలు

శివమొగ్గ: శివమొగ్గ జిల్లా తీర్థహళ్లి పట్టణంలో బుధవారం ఉదయం ఎన్‌ఐఏ బృందం అనుమానిత ఉగ్రవాదుల ఇళ్లలో తనిఖీలు చేపట్టింది. ఐదు కార్లలో సుమారు 15 మందికి పైగా అధికారుల బృందం వచ్చింది. ముగ్గురు అనుమానిత ఉగ్రవాదుల నివాసాల్లో సోదాలు జరిపారు. తీర్థహళ్లి కాంగ్రెస్ ఆఫీసుకు కూడా వచ్చారు. ఈ కార్యాలయాన్ని ఎప్పుడు అద్దెకు తీసుకున్నారు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారని మాజీ మంత్రి కిమ్మనె రత్నాకర్ తెలిపారు. ఖాసీం అనే వ్యక్తికి చెందిన కట్టడంలో తాము ఆఫీసును ప్రారంభించినట్లు చెప్పారు.

కుక్కర్ కేసులో మరో ఇద్దరి అరెస్ట్

యశవంతపుర: మంగళూరులో జరిగిన కుక్కర్ బాంబ్ పేలుడు కేసులో ఎన్‌ఐఏ మరో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసింది. దక్షిణ కన్నడ జిల్లా మంగళూరుకు సమీపంలోని తోక్కొట్టి పెర్మణ్ణూరు గ్రామానికి చెందిన మాజీల్ అబ్దుల్ రెహమాన్, దావణగెరె జిల్లా హొన్నాళికి చెందిన నదీం అహమద్‌లను అరెస్ట్ చేశారు. పేలుడు నిందితుడు షారిఖ్‌తో సంబంధాలు ఉన్నాయని గుర్తించింది. వీరు మొదట శివమొగ్గ సమీపంలోని తుంగానది తీరంలో ట్రయల్ బాంబ్‌ను పేల్చినట్లు విచారణలో బయటపడింది.

బీడీఏ అధికారులకు హైకోర్టు షాక్

బనశంకరి: బెంగళూరులోని కొడిగేహళ్లి, కోతిహొసహళ్లిలో ప్రైవేటు కంపెనీలు ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఇళ్లు కట్టుకోవడానికి సహకరించిన 8 మంది బీడీఏ అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బీడీఏ కమిషనర్‌ను హైకోర్టు బుధవారం ఆదేశించింది. అంతేగాక ఆక్రమణకు గురైన స్థలాన్ని 15 రోజుల్లోగా స్వాధీనం చేసుకోవాలని యలహంక తహశీల్దార్‌ను ఆదేశించింది. ఈ బాగోతంపై కొడిగేహళ్లి నివాసి అశ్వత్ నారాయణ వేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పీబీ వరాళే ధర్మాసనం విచారించి ఈ ఆదేశాలు జారీచేసింది. విచారణను ఫిబ్రవరి 2వ తేదీకి వాయిదా వేసింది.

కూతురి కాపురం భగ్నమైందని..


పట్టాల వద్ద మృతదేహాలు

- వీడిన రైలుపట్టాలపై ముగ్గురి మృతదేహాల మిస్టరీ


మృతులు పుష్పలత, మైలారప్ప, వారి కూతురు మమత (ఫైల్)

గౌరిబిదనూరు: ఈ నెల 9వ తేదీన తాలూకాలోని తొండేబావి రైల్వే స్టేషను సమీపంలో రైలు పట్టాలపై ఒక పురుషుడు, ఇద్దరు మహిళల మృతదేహాలు కనిపించడం కలకలానికి కారణమైంది. ఇది ఆత్మహత్య, లేక ప్రమాదమా, మృతులు ఎవరు అనేది మిస్టరీగా మారింది. బుధవారం ఆ మిస్టరీ వీడింది. మృతులు తొండేబావి రైల్వేస్టేషను దగ్గరే నివాసముంటున్న మైలారప్ప (50), భార్య పుష్పలత (45), వీరి కుమార్తె మమత (25)గా గుర్తించడమైంది. మైలారప్ప చిన్నకారు రైతు. మమతకు ఇటీవల భర్త కుటుంబ కలహాలతో విడాకులు ఇవ్వడంతో పుట్టింటికి వచ్చేసింది. కూతురి కాపురం చెడిపోవడం వారు తట్టుకోలేకపోయారు. దీంతో ముగ్గురూ కలిసి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు.

మరో కూతురి ఫిర్యాదుతో..

మైలారప్ప మరో కుమార్తె దాక్షాయణి ద్యావరహళ్లిలో ఉంటుంది. మూడురోజుల నుంచి ఫోను చేసినా స్విచాఫ్ అని వస్తోంది. కంగారు పడిన ఆమె మంగళవారం రాత్రి తొండేబావిలోని ఇంటికి వచ్చి ఇంట్లో ఎవరూ లేకపోయేసరికి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అప్పటికే మృతదేహాలకు అంత్యక్రియలు చేసి వారి దుస్తులను భద్రపరిచారు. ఫోటోలను, దుస్తులను చూపించగా దాక్షాయణి తన తల్లిదండ్రులు, సోదరివి అని గుర్తుపట్టి విలపించింది.

హోటళ్లలో రబ్బర్ ఇడ్లీలా?


హోటల్లో ఇడ్లీలు


హోటల్ యాజమానితో గొడవపడుతున్న కస్టమర్లు

- హోసూరు హోటళ్లలో కొత్తరకం వివాదం

హోసూరు: హోసూరు ప్రాంతంలోని పలు హోటళ్లలో రబ్బర్ ఇడ్లీలను అమ్ముతున్నారని కస్టమర్లు హోటల్ యజమానులతో గొడవకు దిగారు. పట్టణంలోని రాయకోట గృహవసతి కాలనీలో నిర్వహిస్తున్న ఓ హోటల్లో ప్రజలకు వడ్డిస్తున్న ఇడ్లీలు రబ్బర్‌లాగా ఉన్నాయని, తుంచితే రబ్బర్ మాదిరిగా సాగుతూ ఉన్నాయని, ఆ ఇడ్లీలు తిన్నవారు అనారోగ్యాలకు గురవుతున్నారని ఆరోపిస్తూ బుధవారం రగడ చేశారు.

ఆ ఇడ్లీలు మేం తయారు చేయం

దీంతో హోటల్ యాజమాని ఇడ్లీలను తాము తయారు చేయమని, శానసంద్రం ప్రాంతం నుంచి తమ హోటల్‌కు సరఫరా చేస్తున్నారని, మూడు రోజులపాటు నిల్వ ఉంచినా అలాగే ఉంటాయని, హోటల్లో చట్నీ, సాంబర్ మాత్రమే తయారు చేసి వడ్డిస్తామని చెప్పాడు.

నమూనాలను ల్యాబ్‌కు పంపాం

దీనిని ప్రజలు ఆహారభద్రతా శాఖాధికారి ముత్తుమారియప్పన్‌కు సమాచారమిచ్చారు. ఈ సందర్భంగా ఆహార భద్రత శాఖాధికారి విలేఖరులతో మాట్లాడుతూ పలు హోటళ్లలో తనిఖీలు నిర్వహించి వివరణ తీసుకున్నామని, శానసంద్రం ప్రాంతంలో హోల్‌సేల్‌గా ఇడ్లీలు తయారు చేసి పట్టణంలోని వివిధ హోటళ్లకు సరఫరా చేస్తున్నారని, ఇడ్లీ తయారు చేసే కేంద్రంలోనూ తనిఖీ చేశామన్నారు. పిండి, ఇడ్లీల శాంపిళ్లను పరిశోధనకు పంపామని, నివేదిక వచ్చేవరకూ ఇడ్లీలను తయారు చేసి సరఫరా చేయరాదని ఆదేశించామన్నారు.

అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్

- కేపీసీసీ చీఫ్ డీకే శివకుమార్
- బెళగావి జిల్లాలో కాంగ్రెస్ 'ప్రజాధ్వని' ప్రారంభం


చెత్తను ఊడ్చే కార్యక్రమం ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

యశవంతపుర: వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికి రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందించనున్నట్లు కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ తెలిపారు. బుధవారం బెళగావి జిల్లా చిక్కోడిలో ప్రజాధ్వని కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల సమస్యలు, బాధలు, అభిప్రాయాలను సేకరించి ప్రతిధ్వనిగా శక్తిని ఇస్తూ జీవితంలో వెలుగును నింపడానికి ప్రజాధ్వని యాత్రను ప్రారంభించినట్లు డీకే వివరించారు. ప్రజాధ్వని యాత్రను బుద్ధ, బసవ ఇళ్లు వదిలిన, ఏసుక్రీస్తు శిలువకు ఎక్కిన, , గాంధీ కాంగ్రెస్‌కు నాయకత్వం వహించిన పవిత్రమైన రోజున ప్రారంభిస్తున్నట్లు డీకేశి వివరించారు. 1924లో బెళగావిలో మహాత్మాగాంధీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అధికారాన్ని స్వీకరించిన రోజు అన్నారు. అదే స్థలం నుంచి కాంగ్రెస్ ప్రజాధ్వని యాత్రను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈసందర్భంగా మాజీ సీఎం సిద్ధరామయ్య, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

పాము కరిచి రైతు మృతి

మైసూరు: పాము కరిచి ఒక రైతు మరణించాడు. ఈ ఘటన జిల్లాలోని సాలిగ్రామ తాలూకా వడ్డరకొప్పలు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన స్వామిగౌడ అనే వ్యక్తి కుమారుడు మంజు (38) పొలానికి వెళ్లి పనిలో ఉండగా ఓ పాము కాటు వేయగా ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయాడు.

మెట్రో దుర్ఘటనలో 8 మందిపై కేసు

- నిర్మాణ సంస్థ, మెట్రో అధికారులపై నమోదు


కూలిన పిల్లర్ తొలగింపు పనులు

బనశంకరి: నగరంలో మెట్రో రైలు మార్గం నిర్మాణంలో ఉన్న పిల్లర్ కూలి తేజస్విని అనే టెక్కీ, ఆమె కొడుకు మరణించిన దుర్ఘటనలో 8 మందిపై కేసు నమోదైంది. ఏ1 గా నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ పేరు, ఏ2 గా ఆ సంస్థ జూనియర్ ఇంజినీర్ ప్రభాకర్, ఏ3 డైరెక్టర్ చైతన్య, ఏ4 సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ మథాయి, ఏ5 ప్రాజెక్టు మేనేజర్ వికాస్‌సింగ్, ఏ6 సూపర్‌వైజర్ లక్ష్మీపతి, ఏ7 మెట్రో డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ వెంకటేశశెట్టి, ఏ8గా మెట్రో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మహేశ్ బెండేకర్‌లను చేర్చారు. కాగా, మెట్రో డిప్యూటీ చీఫ్ ఇంజనీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెక్షన్ ఇంజనీర్‌లను మెట్రో సంస్థ బీఎంఆర్‌సీఎల్ సస్పెండ్‌చేసింది. దుర్ఘటనకు కారణాలను వెలికితీసి నివేదిక ఇవ్వాలని ఐఐఎస్‌సీకి విజ్ఞప్తి చేయగా సమ్మతించిందని మెట్రో ఎండీ అంజుంపర్వేజ్ తెలిపారు.

బాధ్యులపై కఠినచర్యలు: హోంమంత్రి

దుర్ఘటనపై హోంమంత్రి అరగ జ్ఞానేంద్ర మాట్లాడుతూ బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. బాధితులు సూచించిన పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చామని తెలిపారు. మృతురాలి భర్త లోహిత్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోవిందపుర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని, ఆయన ఐదుమంది పేర్లు చెప్పారన్నారు. మెట్రోకు, నిర్మాణ సంస్థకు నోటీసులు ఇచ్చామన్నారు. దర్యాప్తు కొనసాగుతోందని, తప్పెవరిదో ఇప్పుడే చెప్పలేమని తూర్పు డీసీపీ భీమాశంకర్ గుళేద్ తెలిపారు.

టెక్కీ తేజస్వినికి కన్నీటి వీడ్కోలు

- దావణగెరెలో తల్లీ తనయునికి అంత్యక్రియలు
- నాసిరకం పనుల వల్లే మెట్రో పిల్లర్ కూలిందన్న బంధువులు


అంత్యక్రియల్లో విలపిస్తున్న తేజస్విని తల్లి, బంధువులు

బనశంకరి: బెంగళూరులో మెట్రోపిల్లర్ ఇనుపచక్రం పడి ప్రాణాలు కోల్పోయిన టెక్కీ తేజస్విని, కుమారుడు చిన్నారి విహాన్ అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య బుధవారం దావణగెరెలో జరిగాయి. పీబీ రోడ్డు శ్మశానవాటికలో తేజస్విని, గ్లాస్‌హౌస్ వద్ద స్మశానవాటికలో విహాన్ అంత్యక్రియలు కుటుంబసభ్యులు నిర్వహించారు. తేజస్విని తండ్రి సొంతూరు దావణగెరె. గదగకు చెందిన లోహిత్‌కుమార్‌తో తేజస్విని వివాహమైంది. బెంగళూరులో ఆమె ఐటీ ఇంజనీరుగా పనిచేస్తున్నారు. మంగళవారం హెణ్ణూరుక్రాస్ వద్ద పిల్లర్ ఇనుపచక్రం కూలిపడి తేజస్విని, విహాన్ మృతి చెందడం తెలిసిందే. ఈ ఘటన కుటుంబంలో తీవ్రశోకం నింపింది. భర్త లోహిత్‌కుమార్ ప్రాణాలతో బయటపడినప్పటికీ కళ్ల ముందు జరిగిన దుర్ఘటన తలచుకుని కన్నీరుపెడుతున్నారు.


రాలిన ఆశలు... తనయుడు విహాన్‌తో తేజస్విని (ఫైల్)

ప్రభుత్వంపై కుటుంబ సభ్యుల మండిపాటు

రాష్ట్ర ప్రభుత్వం అందించే పరిహారం ఎవరికి కావాలి, పోయిన ప్రాణాలు ఇస్తారా, ఎవరో చేసిన తప్పుకు మా కుమార్తె బలిఅయింది. మా మనవణ్ని కోల్పోయాం, మేమే మీకు పరిహారం ఇస్తాం పోయిన ప్రాణం తీసుకువస్తారా?, కమీషన్ల కక్కుర్తితో చేసిన నాసిరకం పనులే ఈ దుర్ఘటనకు కారణం. బాధ్యులకు కఠిన శిక్ష విధించాలి. తమకు న్యాయం కావాలి అంటూ తేజస్విని సోదరి భాగ్య, పెదనాన్న నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదానికి కారణమైన వారిని అరెస్ట్‌చేసి చట్టపరంగా శిక్షించాలి. అప్పుడు మాత్రమే న్యాయం లభించినట్లు అవుతుందని డిమాండ్ చేశారు.

తేజస్విని భర్త లోహిత్‌కుమార్ ఘటనపై ఫిర్యాదు చేయడానికి గోవిందపుర పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారని, ఫిర్యాదు తీసుకోవడానికి ఆలస్యం చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలన్నారు. దుఃఖంలో ఉన్న లోహిత్‌కుమార్‌ను అక్కడే కూర్చోబెట్టిన పోలీసుల చర్య సరికాదని, దీనిపై విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

పత్తికి మద్దతు ధర ప్రకటించాలి



వినతిపత్రం సమర్పించిన ఎమ్మెల్యే బసనగౌడ

రాయచూరు రూరల్: జిల్లాలో రైతులు పండించిన పత్తి పంటకు మద్దతుధర ప్రకటించాలని ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ డిమాండ్ చేశారు. బుధవారం వ్యవసాయ వర్సిటీలో ఏర్పాటు చేసిన వ్యవసాయ మేళాలో పాల్గొనేందుకు విచ్చేసిన వ్యవసాయ శాఖా మంత్రి బి.సి.పాటిల్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం రైతుల ఆర్థిక పరిస్థితిని గమనించి క్వింటాల్‌కు రూ.12 వేల మద్దతు ధర కేటాయించాలని కోరారు.

కరాటేతో బాలికల్లో ఆత్మస్థైర్యం



మైసూరు: విద్యార్థినులు కరాటే నేర్చుకోవడం వల్ల వారిలో శారీరక శక్తితో పాటు స్వయం రక్షణ చేసుకునే ఆత్మస్థైర్యం కూడా పెంపొందుతుందని సాంఘిక సంక్షేమ మంత్రి కోటా శ్రీనివాస పూజారి అన్నారు. మైసూరు నగరంలోని రాజరాజేశ్వరి నగరలో ఉన్న వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖ మహిళా హాస్టల్‌లో ఓబవ్వ ఆత్మరక్షణ కళా నైపుణ్య ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనను మంత్రి ప్రారంభించి మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడం వల్ల జీవితంలో ఆత్మస్థైర్యం అలవడుతుందన్నారు. అందు కోసమే ఆరవ తరగతి నుంచి విద్యార్థినులకు కరాటే శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

చిక్క ఉత్సవాలకు హాజరైన మంత్రులు



చిక్కబళ్లాపురం: చిక్కబళ్లాపుర ఉత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. కేవీ క్యాంపస్ వద్ద ఫల పుష్ప ప్రదర్శన ఆబాల గోపాలాన్నీ ఆకట్టుకుంటోంది. అలాగే సంగీత రసమంజరిలో అర్జున్‌జన్య, విజయ్ ప్రకాశ్, మంగ్లి పాడిన పాటలు సభికులను ఉర్రూతలూగించాయి. కార్యక్రమానికి మంత్రులు సుధాకర్, సోమణ్ణ, అరగ జ్ఞానేంద్ర, గోపాలయ్య తదితరులు హాజరయ్యారు.

ప్రభుత్వ సలహాదారుతో భేటీ



వాసుదేవరెడ్డిని కలిసిన వైఎస్ఆర్‌సీపీ బెంగళూరు ఐటీ వింగ్ సభ్యులు

బనశంకరి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్య సలహాదారు వాసుదేవరెడ్డి (యుఎస్‌పీ) ని బుధవారం కృష్ణరాజపురంలో వైఎస్ఆర్‌సీపీ ఐటీ విభాగం సభ్యులు, డాక్టర్ల బృందం కలిసింది. ఈ కార్యక్రమంలో చిత్తూరు కు చెందిన పారిశ్రామికవేత్త భూమిరెడ్డి మోహన్‌రెడ్డి, ఎన్ఆర్ఐ దేవులపల్లి రమణారెడ్డి, ఐటీ వింగ్ సభ్యులు లీలాప్రసాద్‌రెడ్డి , అనిల్, చంద్ర, కుమార్‌పులివెందుల, శివ, జయచంద్ర, గిరీశ్, డాక్టర్లు అరవింద్, వేణు, నవీన్, అర్మాన్ తదితరులు కలిశారు.

ఇబ్రహీం క్షమాపణ చెప్పాలి

మండ్య: ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ వ్యక్తిగత జీవితం గురించి అవహేళనగా మాట్లాడిన జేడీఎస్ రాష్ట్రాధ్యక్షుడు సీఎం ఇబ్రహీం తక్షణమే క్షమాపణలు చెప్పి ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని బీజేపీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. నగరంలోని జయచామ రాజేంద్ర ఒడెయర్ సర్కిల్‌లో గుమిగూడిన కార్యకర్తలు జిల్లాధికారి కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లి ఆ తర్వాత వినతిపత్రం సమర్పించారు.

21 నుంచి ఉత్తర కర్ణాటక ఉత్సవాలు

బనశంకరి: బెంగళూరు నగరంలో ఉన్న ఉత్తరకర్ణాటక సంఘసంస్థలు ఈ నెల 21, 22 తేదీల్లో రెండురోజులపాటు నిర్వహించే ఉత్తరకర్ణాటక ఉత్సవ– 2023 కార్యక్రమ లోగో ను బుధవారం సీఎం బసవరాజబొమ్మై విడుదల చేశారు. బెంగళూరు ప్యాలెస్‌మైదానంలో ఉత్సవాలను నిర్వహిస్తారు. నగరంలో స్థిరపడిన ఉత్తరకర్ణాటక ప్రాంతవాసులు తమ సంస్కృతి పరంపరను కాపాడుకోడానికి ఏర్పడిన సంఘాలు ఈ ఉత్సవాలను ఆచరించనున్నాయని అధ్యక్షుడు శివకుమారమేటి తెలిపారు.

స్ఫూర్తిదాత లాల్ బహదూర్‌శాస్త్రి

లాల్ బహదూర్ శాస్త్రి వ్యక్తిత్వం మనందరికీ స్ఫూర్తి కావాలని సీఎం బొమ్మై అన్నారు. బుధవారం దివంగత ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి 57వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చి సరళజీవనం సాగించారని, న్యాయబద్ధమైన సుపరిపాలన అందించి ఆదర్శప్రాయులుగా నిలిచారని తెలిపారు.

సిరిధాన్యాలతో ఆరోగ్య విప్లవం

- వ్యవసాయ శాఖా మంత్రి బీసీ పాటిల్

రాయచూరు రూరల్: దేశంలో సిరిధాన్యాల వినియోగంతో ఆరోగ్య విప్లవం సృష్టించవచ్చని వ్యవసాయ శాఖా మంత్రి బీ.సీ.పాటిల్ పేర్కొన్నారు. ఆయన బుధవారం వ్యవసాయ వర్సిటీలో ఏర్పాటు చేసిన వ్యవసాయ మేళా–2023ను ప్రారంభించి మాట్లాడారు. కళ్యాణ కర్ణాటకలోని ఏడు జిల్లాల్లో జొన్నలు, కొర్రలు, సజ్జలు, మినుములు, నువ్వులు, రాగులు, గోధుమ పంటల సాగుకు వీలుగా పరిశోధనలకు కేంద్ర ప్రభుత్వం, నాబార్డ్ సహకారంతో వ్యవసాయ వర్సిటీకి రూ.25 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. కేంద్రం వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేసిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రైతులకు లబ్ధి చేకూర్చడానికి 2023లో అంతర్జాతీయ సిరిధాన్యాల సంవత్సరంగా ప్రకటించారన్నారు. వర్షాధారిత ప్రాంతాల్లో సిరిధాన్యాలను



జ్యోతి వెలిగిస్తున్న మంత్రులు, ఇతర ప్రముఖులు



మాట్లాడుతున్న వ్యవసాయ మంత్రి బీసీ పాటిల్

రైతులకు రాష్ట్రంలో కిసాన్ సమ్మాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.9 వేల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.4 వేల కోట్ల మేర ఆర్థిక సహాయం అందించిందన్నారు. ఈనెల 31న ధార్వాడలో ముఖ్యమంత్రి రైతు శక్తి పేరుతో నూతన పథకం ప్రారంభిస్తారన్నారు. రవాణా శాఖా మంత్రి బీ.శ్రీరాములు, ఎంపీ రాజా అమరేశ్వర నాయక్, ఎమ్మెల్యేలు రాజా వెంకటప్ప నాయక్, బసనగౌడ, మాజీ ఎంపీ కే.విరుపాక్షప్ప, వీసీ హనుమంతప్ప, సిండికేట్ సభ్యులు కొట్రేష్, త్రివిక్రం జోషి, నగరసభ అధ్యక్షురాలు లలిత, డీసీ చంద్రశేఖర్ నాయక్, జెడ్పీ సీఈఓ శశిధర్, ఎస్పీ నిఖిల్ తదితరులున్నారు.

ఘనంగా 'గాలి' పుట్టినరోజు వేడుక

- నగరంలో భారీ బైక్ ర్యాలీ

సాక్షి,బళ్లారి: మాజీ మంత్రి, కళ్యాణ రాష్ట్ర ప్రగతి పార్టీ వ్యవస్థాపకుడు గాలి జనార్దనరెడ్డి 56వ పుట్టినరోజు వేడుకను ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. బుధవారం నగరంలో ఆయన మద్దతుదారులు భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆయన స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మఠాధిపతులు కమ్మరచేడు కళ్యాణస్వామి, సతీమణి గాలి లక్ష్మీ అరుణ, కూతురు గాలి బ్రాహ్మణి, పార్టీ నేతలు టి.వి.శ్రీనివాసరెడ్డి, దరప్ప నాయక్, సంజయ్ బెటగేరి, అలీఖాన్ తదితరుల సమక్షంలో 56 కేజీల కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. భారీగా అన్నదానం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో గాలి జనార్దనరెడ్డి వర్చువల్ ద్వారా గంగావతి నుంచి మాట్లాడుతూ తాను బళ్లారిలో లేకపోయినా తనపై అభిమానంతో ఎంతో మంది తన జన్మదిన వేడుకలో పాల్గొని పార్టీని బలోపేతం చేయడానికి ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. 12 ఏళ్ల వనవాస జీవితం ముగిసిందని, ఇక ప్రజల మధ్య, ప్రజల సంక్షేమం కోసం జీవితాన్ని అంకితం చేస్తానని, మీరంతా తనకు అండగా నిలవాలని ఆయన అన్నారు.



గంగావతిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మద్దతుదారులు



సమావేశాన్ని ప్రారంభిస్తున్న గాలి లక్ష్మీ అరుణ, స్వామీజీలు

బళ్లారికి దూరం చేస్తారని ఊహించలేదు

తన తండ్రి గాలి జనార్దనరెడ్డి ప్రాణం కన్నా మిన్నగా ప్రేమించిన బళ్లారి నుంచి రాజకీయ కుట్రతో 12 ఏళ్ల నుంచి నేటికీ ఆయనను బళ్లారికి దూరం చేస్తారని తాము కలలో కూడా ఊహించలేదని కుమార్తె బ్రాహ్మణి ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి తాము గడప గడపకు వెళతామన్నారు. గాలి లక్ష్మీ అరుణ మాట్లాడుతూ ఆయన మంత్రిగా ఉన్నప్పుడు బళ్లారిని ఎంతో అభివృద్ధి చేశారన్నారు.

గంగావతిలో...

గంగావతి: రాష్ట్ర ప్రజల సర్వతోముఖాభివృద్ధికి తన గొంతులో ప్రాణం ఉన్నంత వరకు పోరాడుతానని కళ్యాణ రాజ్య ప్రగతి పార్టీ సంస్థాపకులు గాలి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన తన నివాసం వద్ద 56వ పుట్టినరోజు వేడుకలో మాట్లాడారు. గతంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు ఈ ప్రాంత పారిశ్రామిక అభివృద్ధి కోసం బళ్లారిలో అంతర్జాతీయ విమానాశ్రయం కోసం కృషి చేశానన్నారు. గతంలో తనకు వచ్చిన కష్టాల నుంచి భగవంతుడు విముక్తి చేయడం వల్లనే తిరిగి రాజకీయాల్లోకి ప్రవేశించానని, తన తుదిశ్వాస వరకు ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఊరేగింపులో టాప్‌లేని జీప్‌లో పాల్గొన్న జనార్దనరెడ్డిపై బస్టాండ్, గాంధీసర్కిల్, సీపీఎస్ సర్కిళ్లలో అభిమానులు జేసీబీల ద్వారా పూలవర్షం కురిపించారు.

కాంగ్రెస్ బస్సు యాత్ర దిక్కులేనిది

- పోటీపై ఇంకా తీర్మానించుకోలేదు
- రవాణా శాఖ మంత్రి శ్రీరాములు



మాట్లాడుతున్న మంత్రి శ్రీరాములు

రాయచూరు రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన బస్సు యాత్ర రాజకీయ జిమ్మిక్, దిక్కు దిశ లేని యాత్ర అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి బీ.శ్రీరాములు విమర్శించారు. ఆయన బుధవారం వ్యవసాయ వర్సిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన వ్యవసాయ మేళాలో పాల్గొన్న సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. తాను ఏనాడూ కుల రాజకీయాలు చేయలేదన్నారు. తనను ఎస్టీ ఉప కులం అని ప్రచారం చేయడం సబబు కాదన్నారు. మొళకాల్మూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరగలేదని చెప్పడం తగదన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మొళకాల్మూరు నుంచి మళ్లీ పోటీ చేసే విషయంపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. పార్టీ అధిష్టానం సూచన మేరకు పోటీ చేస్తానన్నారు. గాలి జనార్దనరెడ్డి స్థాపించిన కేఆర్‌పీపీతో బీజేపీకి నష్టం లేదన్నారు. మాజీ మంత్రి, విధాన పరిషత్ సభ్యుడు హెచ్.విశ్వనాథ బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరే విషయం తన దృష్టికి రాలేదన్నారు.

ఉద్యోగాల పేరుతో లక్షల వసూళ్లు

- రాయచూరు జిల్లాలో బీదర్ దంపతుల స్కాం

రాయచూరు రూరల్: నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో నయ వంచన చేసి లక్షలాది రూపాయలు వసూలు చేసుకున్న భార్యాభర్తల బాగోతం ఆలస్యంగా జిల్లాలోని లింగసూగూరులో వెలుగు చూసింది. బీదర్‌కు చెందిన సంజయ్ శంభు, భార్య ప్రేరణ కలసి 2019లో ఆరుగురిని మోసం చేశారు.

రూ. 3 లక్షల నుంచి 38 లక్షల వరకూ వసూలు

తన నుంచి రూ 38.76 లక్షల మేర వసూలుచేశారని జనవరి 9న బాధితురాలు సరళాక్ష లింగసూగూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నవీన్ రూ.11.18 లక్షలు, శరణ బసవ రూ.7 లక్షలు, అమరేష్ రూ.7 లక్షలు, సజ్జ హనుమంతు రూ.5.16 లక్షలు, హుసేన్ రూ.4.50 లక్షలు, మహబూబ్ సాబ్ రూ.3 లక్షల చొప్పున సంజయ్ బ్యాంక్ ఖాతాలోకి వేశారు. మరోవైపు డాక్యుమెంట్ చార్జీలను రూ. 20 వేల వరకూ ఒక్కొక్కరి నుంచి గుంజారు.



భార్యాభర్తలు ప్రేరణ, సంజయ్

బంధువైనా వదల్లేదు

సరళాక్షి ప్రేరణకు బంధువు అయినప్పటికీ జాలి చూపలేదు. సంజయ్ శంభు లోకాయుక్తలో రిటైర్డు ఉద్యోగి అని అబద్ధం చెప్పి వారిని మాయమాటలతో మోసం చేశారు. ఏళ్లు గడిచినా ఉద్యోగం రాకపోవడంతో మోసపోయామని గ్రహించి బాధితులు పోలీసులు ఆశ్రయించారు. కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ మంజునాథ్ తెలిపారు.

108 మంది మహిళల దరఖాస్తు

మైసూరు: రానున్న విధానసభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు టికెట్లు కావాలని 28 నియోజకవర్గాల్లో 108 మంది మహిళా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నట్లు, వారిలో గెలిచే సామర్థ్యం ఉన్నవారికి టికెట్లు కేటాయిస్తామని కేపీసీసీ మహిళా విభాగం అధ్యక్షులు పుష్పా అమర్‌నాథ్ తెలిపారు. బుధవారం మైసూరు ప్రెస్‌క్లబ్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ ఐదు మంది మాజీ మహిళా ఎమ్మెల్యేలతోపాటు మొత్తం 108 మంది టికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. తనకు అవకాశం లభిస్తే పోటీ చేస్తానని, ఇంకా నియోజకవర్గాన్ని ఎంచుకోలేదని అన్నారు. కేపీసీసీ మహిళా విభాగం ఈ నెల 16న బెంగళూరులో నిర్వహిస్తున్న నా నాయకి అనే కార్యక్రమంలో అగ్రనేత ప్రియాంకగాంధీ పాల్గొంటారని పేర్కొన్నారు.

17 నుంచి బెళగావి-సికింద్రాబాద్ రైలు ప్రారంభం

రాయచూరు రూరల్: బెళగావి– సికింద్రాబాద్ మధ్య ఈనెల 17 నుంచి రైలు సౌకర్యం ప్రారంభమవుతుందని దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యుడు బాబురావ్ పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం ఆయన విడుదల చేసిన ఓ ప్రకటనలో బెళగావి నుంచి హుబ్లీ, కొప్పళ, బళ్లారి, గుంతకల్, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు మీదుగా సికింద్రాబాద్‌కు ఈ రైలు చేరుతుందన్నారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం

- ఎంపీ మునిస్వామి సవాల్

మాలూరు : తాలూకాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన అభివృద్ధి, ఎమ్మెల్యే నిధులతో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని ఎంపీ ఎస్ మునిస్వామి మాలూరు ఎమ్మెల్యే కె వై నంజేగౌడకు సవాల్ విసిరారు. బుధవారం తాలూకాలోని జగదేనహళ్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాలూకాలో అభివృద్ధి కార్యక్రమాలకు తాను సహకారం అందించడం లేదని ఎమ్మెల్యే నంజేగౌడ చేసిన ఆరోపణల్లో నిజం లేదన్నారు. తాను అభివృద్ధి పనులను ఏనాడూ అడ్డు కోలేదన్నారు. తాలూకాలో రూ.220 కోట్ల వ్యయంతో రోడ్లను నిర్మించామన్నారు. ఎమ్మెల్యే నిధులతో కనీసం రూ.10 కోట్ల వ్యయంతో ఏదైనా అభివృద్ధి పని జరిగిందా? అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ ఉపాధి హామీ పథకం ద్వారానే నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. అలాంటిది అభివృద్ధి విషయంలో ఎమ్మెల్యే తనపై అకారణంగా ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్యే కేఎస్ మంజునాథ్‌గౌడ, ఎట్టికోడి కృష్ణారెడ్డి, జీపీ సభ్యుడు ప్రేమకుమార్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ మునిస్వామి

ఆకట్టుకున్న ఫల పుష్ప ప్రదర్శన



పూలతో తయారు చేసిన కాలే దర్వాజ నమూనా



మలియాబాద్ ఏనుగు ఆకృతి

రాయచూరు రూరల్ : రాయచూరు నగరంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మూడు రోజుల పాటు జరుగుతున్న వ్యవసాయ మేళాలో వివిధ రకాల ఫల పుష్పాలతో ఏర్పాటు చేసిన ఫలపుష్ప ప్రదర్శన ఆకట్టుకుంది. బుధవారం వర్సిటీ మైదానంలో వివిధ రకాల పూలతో ఏర్పాటు చేసిన కాలే దర్వాజ, మలియాబాద్ ఏనుగు, పునీత్ రాజ్‌కుమార్, పండ్లతో ఈశ్వరుడు, నెమలి, మొసలి, సిద్దేశ్వర స్వామీజీ చిత్రపటం తదితరాలు చూపరులను ఆకట్టుకున్నాయి.



పూలు పండ్లతో రూపుదిద్దుకున్న ఈశ్వరుడు



నెమలి ఆకృతి, పండుపై పునీత్ రాజ్ కుమార్ చిత్రం

కోలారు వార్తలు...

పరిశ్రమల స్థాపనతో ఉపాధి

కేజీఎఫ్ : బీమెల్ నుంచి వాపసు తీసుకున్న 967 ఎకరాల భూమిని పరిశ్రమల స్థాపనకు ఉపయోగించుకుని నియోజకవర్గంలో ప్రతి ఇంటికి ఒక ఉద్యోగం చొప్పున ఉపాధి కల్పిస్తామని ఎమ్మెల్యే రూపా శశిధర్ తెలిపారు. బుధవారం కేజీఎఫ్ నుంచి తమిళనాడులోని మేల్ వరత్తూరుకు వెళ్లే భక్తులను 12 బస్సుల ద్వారా పంపించిన అనంతరం ఆమె మాట్లాడారు. గత రెండేళ్ల నిరంతర పోరాట ఫలితంగా బీమెల్ ఫ్యాక్టరీ నుంచి మిగిలిన 967 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుందన్నారు. ఇక్కడ పరిశ్రమలను స్థాపించాలని వచ్చే పారిశ్రామికవేత్తలకు ఈ భూమిని ఇస్తారన్నారు. 2001లో బంగారు గనులను మూసి వేసిన తరువాత ఇక్కడ నిరుద్యోగ సమస్య ఎక్కువైందన్నారు. ఇక్కడ పరిశ్రమలను స్థాపిస్తే నిరుద్యోగ సమస్య నివారణ అవుతుందన్నారు. ఉద్యోగం కోసం నిరుద్యోగులు బెంగళూరుకు వలస వెళ్లడం తప్పుతుందన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు లక్ష్మీనారాయణ, విజయ రాఘవరెడ్డి, ఓడీసీ మునిస్వామి, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.



మేల్‌వరత్తూరుకు వెళ్లే భక్తులకు వీడ్కోలు పలుకుతున్న ఎమ్మెల్యే రూపా శశిధర్

కోముల్ డైరీతో పాడి రైతుకు లాభాలు

శ్రీనివాసపురం : కోముల్ డైరీకి పాలను విక్రయించడం ద్వారా అందే సౌకర్యాలను పొందాలని కోముల్ డైరెక్టర్ ఎస్ హనుమేష్ తెలిపారు. బుధవారం పట్టణంలోని కోముల్ శిబిర కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాడి రైతు సహకార సంఘం సభ్యుల ప్రతిభావంతులైన పిల్లలకు, సహకార సంఘం భవన నిర్మాణానికి రూ.22 లక్షల చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. శిబిర కార్యాలయ వ్యవస్థాపకుడు కె ఎం మునిరాజు మాట్లాడుతూ పాడి రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం పాల ఖరీదు ధరను పెంచిందన్నారు. ఈ సందర్భంగా విస్తరణాధికారులు శ్రీనివాస్, శంకర్, నరసింహరాజు, వినాయక, శ్వేత తదితరులున్నారు.

పార్టీని బలపరచండి

కోలారు : గ్రామీణ ప్రాంతాల్లో పార్టీని బలపరచాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు వర్తూరు ప్రకాష్ కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. బుధవారం పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి గ్రామంలోను బీజేపీ అస్తిత్వంలో ఉన్నా పలు గ్రామాల్లో కాంగ్రెస్‌కు ఏజెంట్లు కూడా లేరన్నారు. ఎన్నికలప్పుడు కాంగ్రెస్ నాయకులు డబ్బులిచ్చి ప్రలోభ పెట్టడానికి చేసే ప్రయత్నాలను ప్రజలు తిరస్కరించాలన్నారు. క్రమశిక్షణ కలిగిన బీజేపీలో పార్టీ కోసం పని చేసిన వారికి ఎప్పటికైనా గుర్తింపు లభిస్తుందన్నారు. శాంతి భద్రతల రక్షణ, దేశ సమగ్ర అభివృద్ధి రాష్ట్రంలోను, దేశంలోను బీజేపీని మళ్లీ అధికారంలోకి తేవాలన్నారు.

రైతు సమస్యలపై చర్చిస్తాం

కోలారు : జిల్లాలోని మామిడి రైతుల సమస్యల గురించి పరిషత్ సమావేశాల్లో చర్చిస్తామని, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని ఎమ్మెల్సీ ఎం.ఎల్.అనిల్‌కుమార్ తెలిపారు. బుధవారం నగరంలోని పాత్రికేయుల భవనంలో మామిడి రైతుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతుల సమస్యలపై సీఎంతో ప్రత్యేకంగా చర్చించడానికి తగిన సమయం తీసుకుంటామని తెలిపారు. రైతుల ఉత్పత్తులకు తగిన మార్కెట్ సౌకర్యం కల్పించడం ప్రభుత్వ కర్తవ్యమన్నారు. రాష్ట్ర మామిడి అభివృద్ధి మండలి మాజీ అధ్యక్షుడు దళసనూరు ఎల్ గోపాలకృష్ణ, జిల్లా మామిడి ఉత్పత్తిదారుల క్షేమాభివృద్ధి సంఘం అధ్యక్షుడు నీలటూరు చిన్నప్పరెడ్డి పాల్గొన్నారు.

కారు ఢీకొని వృద్ధురాలి మృతి



మరియమ్మ(ఫైల్)

గంగావతి: కారటగి తాలూకాలో కారు ఢీకొని ఓ వృద్ధురాలు మరణించింది. వివరాలు..కనకగిరి ఎమ్మెల్యే బసవరాజ్ దఢేసూగూరు బుధవారం కారులో కారటగి నుంచి కనకగిరికి వెళుతుండగా మైలాపుర క్రాస్ వద్ద డ్రైవర్ అదుపు తప్పిన కారు మైలాపురవాసి మరియమ్మ(65) అనే వృద్ధురాలిని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆమెను గంగావతి ఆస్పత్రికి చేర్పించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బళ్లారికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. ఈ మేరకు కారటగి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

కలుషిత నీరు తాగి ఒకరు మృతి

- 40 మందికి పైగా ఆస్పత్రిలో చేరిక





ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దృశ్యం (ఇన్‌సెట్‌లో) మృతురాలు లక్ష్మీదేవి(ఫైల్)

హొసపేట: రాణిపేట వార్డులో కలుషిత నీటిని తాగి తీవ్ర వాంతులు, విరోచనాలతో 12వ క్రాస్ నివాసి లక్ష్మీదేవి(50) మృతి చెందగా, మరో 40 మందికి పైగా వార్డు ప్రజలు తీవ్ర అస్వస్థతతో ఆస్పత్రిలో చేరిన ఘటన మంగళవారం సాయంత్రం జరిగింది. రాణిపేటలో మంచినీటిని సరఫరా చేసే కొళాయిలో నీరు కలుషితం కావటంతో ఈ ఘటన చోటు చేసుకుంది. నగరంలో ఇటీవల యూజీడీ పనుల కోసం తవ్వకాలు జరగడంతో ఆ పైప్‌లైన్ పక్కనున్న మంచినీటి సరఫరా పైప్ ధ్వంసమై మురుగునీరు మంచినీటి సరఫరా పైప్‌లైన్‌లోకి చేరడమే కారణమై ఉండవచ్చని నగరసభ అధికారులు తెలిపారు. తుంగభద్ర డ్యాం సమీపంలో ఉన్నప్పటికీ నగరంలోని అనేక వార్డుల్లో ట్యాంకర్ ద్వారా మంచినీటిని సరఫరా చేయడం ఎంతవరకు సమంజసమని పలు వార్డు ప్రజల అధికారులను ప్రశ్నించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చేరిన వారు కోలుకుంటున్నారని, ఎలాంటి ప్రాణాపాయం లేదని, అనేక మంది ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అవుతున్నట్లు వైద్యాధికారి సలీం తెలిపారు. లక్ష్మీదేవి మృతదేహానికి పోస్టుమార్టం జరుగుతోందని తెలిపారు.

గుర్తింపు కార్డుల పంపిణీ



గుర్తింపు కార్డులను అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు

కంప్లి: కార్మికులకు గుర్తింపుగా బిల్లలను పంపిణీ చేశామని, ప్రతి గ్రామీణ హమాలీ కార్మికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మాజీ ఎమ్మెల్యే సురేష్ బాబు తెలిపారు. బుధవారం పట్టణంలోని ఏపీఎంసీ అధ్యక్షులు హురావళ్లి అధ్యక్షతన చేపట్టిన కార్యక్రమంలో హమాలీ కార్మికులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేసి ఆయన మాట్లాడారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశీలన

కంప్లి: కళ్యాణ కర్ణాటక జిల్లాల్లో అమలు చేసిన జాతీయ విద్యా విధానం రాష్ట్రానికే ఆదర్శమని మహిళా శిశు అభివృద్ధి శాఖ ఉపనిర్దేశకులు విజయకుమార్ తెలిపారు. బుధవారం జాతీయ విద్యా విధానం అమలుపై అవలోకనకు తాలూకాలోని 5 అంగన్‌వాడీ కేంద్రాలను 15 మంది సూపర్‌వైజర్లు పరిశీలించారు. జాతీయ విద్యా విధానం అమలుతో పిల్లల శారీరక, మానసిక, బుద్ధి వికాసంతో పాటు సర్వతోముఖ ఎదుగుదలకు అనుకూలం అయిందన్నారు. శిక్షణా బృందం ప్రముఖులు రాజేంద్రప్ప బైకల్, ఈశ్వర్ అంగన్‌వాడీ పిల్లల పోషణపై తల్లిదండ్రులతో చర్చించి పిల్లలపై జాతీయ విద్యా విధానం ప్రభావంపై సమాచారం సేకరించారు. అభివృద్ధి యోజనాధికారి మోహన్ కాళాపుర, జిల్లా సంపన్మూల ప్రముఖులు జగన్నాథ్, లతీఫాబేగం, రేణుక, ఉషా సింగ్ అశ్వత్ పాల్గొన్నారు.

అనైతికాలను అరికట్టాలని ధర్నా



వినతిపత్రం సమర్పిస్తున్న కరవే కార్యకర్తలు

కేజీఎఫ్ : పార్కుల్లో అనైతిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తూ నవ కరవే కార్యకర్తలు బుధవారం నగరసభ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి నగరసభ అధ్యక్షుడు వళ్లల్ మునిస్వామికి వినతిపత్రం సమర్పించారు. నగరంలో 35కు పైగా పార్కులు ఉన్నా సుభాష్ చంద్రబోస్ పార్క్, కింగ్ జార్జి పార్క్, నెహ్రూ పార్కుల్లో అనైతిక కార్యకలాపాలు, తాగుబోతులు, ఆకతాయిల బెడద ఎక్కువైందన్నారు. మహిళలు, యువతులు, పిల్లలు పార్కుకు వెళ్లాలంటే భయపడుతున్నారన్నారు. నగరసభ దీనికి అడ్డుకట్ట వేయకపోతే పోరాటం తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ఈసందర్భంగా శెట్టికుంట రమేష్, దక్షిణామూర్తి, దయానంద్, సురేష్ శంకరాచారి, లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సౌకర్యాల కోసం వినతి



ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘం పదాధికారులు

శ్రీనివాసపురం : ముళబాగిలులోని ప్రభుత్వ ఆస్పత్రిలో అవ్యవస్థలను సరిచేయాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం పదాధికారులు బుధవారం ఆస్పత్రి ముందు ధర్నా చేసి పాలనాధికారి డాక్టర్ సురేంద్రకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ మాట్లాడుతూ ఆస్పత్రిలో మౌలిక సౌకర్యాల కొరతతో పాటు అడుగడుగునా అవినీతి, అక్రమాలు తాండవిస్తున్నాయని, చేయి తడపనిదే పేదలకు వైద్యం అందే పరిస్థితి కరువైందన్నారు. రోగుల శ్రేయస్సు దృష్ట్యా ఆస్పత్రిలో సౌకర్యాలను అందించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు రాష్ట్ర కార్యాధ్యక్షుడు బంగారి మంజు, తాలూకా అధ్యక్షుడు యలువల్లి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నది కలుషితం కాకుండా కాపాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న చౌడప్ప

గౌరిబిదనూరు: పినాకినీనది కలుషితం కాకుండా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని పర్యావరణవేత్త చౌడప్ప అధికారులు, ప్రజా ప్రతినిధులను కోరారు. బుధవారం టౌన్ ప్లానింగ్ అథారిటీ అధ్యక్షుల కార్యాలయంలో అధ్యక్షుడు వేణుగోపాలరెడ్డి నేతృత్వంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...తాలూకాలో ఉన్న నదిని రక్షించుకోవాల్సి అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని, రెండు రోజుల క్రితం రసాయన వ్యర్థాలను నదిలో విడిచిపెట్టడంతో నీరు కలుషితమైన వేల చేపలు మృత్యువాతపడ్డాయని, కారకులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో బీజేపీ రమేశ్‌రావ్, నగరసభ సభ్యుడు మార్కెట్ మోహన్, కమిషనర్ గీత, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

టూరిస్టు బస్సు, కారు ఢీ

శివమొగ్గ: టూరిస్టు బస్సు, కారు ఢీకొన్న ఘటన శివమొగ్గ జిల్లా హోసనగర తాలూకా రిప్పన్‌పేట వద్ద బేనవళ్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. బెంగళూరు నుంచి పాఠశాల విద్యార్థులతో కొడచాద్రి బెట్టకు వచ్చి తిరుగు ప్రయాణంలో ఉన్న బస్సును శివమొగ్గ నుంచి హొంబుజ దేవాలయానికి వెళ్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జు నుజ్జైంది. కారులోని వారు స్వల్పంగా గాయపడ్డారు. అయితే బస్సులో ఉన్న విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాలేదు. రిప్పన్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఇంటి దొంగ అరెస్టు

మైసూరు: నగర కువెంపు పోలీసులు దొంగను అరెస్ట్ చేసి రూ. 2 లక్షల విలువైన బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం రాత్రి పోలీసులు గస్తీ ఉండగా ఓ ప్రాంతంలో చోరీకి యత్నిస్తున్న మంజ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి విచారణ చేయగా రెండు ఇళ్లల్లో చోరీ చేసినట్లు అంగీకరించాడు. ఇతనిపై ఆరు చోట్ల కేసులు నమోదయ్యాయి.

పట్టుదలతో రాణించాలి

తుమకూరు: పాత్రికేయ రంగంలో ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సరస్వతి అన్నారు. తిపటూరు తాలూకా ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మొదటి ఏడాది జర్నలిజం కోర్సులో చేరిన విద్యార్థులను ఉద్దేశించి ప్రిన్సిపాల్ మాట్లాడారు. జర్నలిజం విద్యార్థులు ప్రస్తుత కాలమాన విషయాలపై అవగాహన కలిగి ఉండి, పట్టుదలతో శ్రమిస్తే ఈ రంగంలో విశేషంగా రాణించవచ్చని సూచించారు. కార్యక్రమంలో కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

యశవంతపుర: హోం మంత్రి అరగ జ్ఞానేంద్ర ఇంటి వద్ద కానిస్టేబుల్ ఆత్మహత్యకు యత్నించిన ఘటన మంగళవారం బెంగళూరులో జరిగింది. చాకుతో చేతిని కోసుకున్నాడు. హుటాహుటిన అతన్ని ఆస్పత్రిలో చేర్చారు. సీఎఆర్ విభాగానికి చెందిన కానిస్టేబుల్ నవీన్ హోంమంత్రి భద్రత విభాగంలో పని చేస్తున్నారు. కారణాలు తెలియరాలేదు. జేసీ నగర పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

'నాను నాయకి'లో పాల్గొనండి



తుమకూరు: ఈ నెల 16న బెంగళూరులో కేపీసీసీ మహిళా విభాగం ఆధ్వర్యంలో జరగనున్న 'నాను నాయకి' కార్యక్రమంలో ప్రతి ఒక్క మహిళా కార్యకర్త పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు గీతా రాజణ్ణ విజ్ఞప్తి చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లాధ్యక్షుడు చంద్రశేఖరగౌడ అధ్యక్షతలో ఏర్పాటు చేసిన నాను నాయకి కార్యక్రమం సిద్ధతా ఏర్పాట్లపై గీతా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఉందని, రాష్ట్రంలోని మహిళలను సంఘటితం చేసేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రైతు బిడ్డలకు విద్యార్థి వేతనాలు



చెక్కులు అందుకున్న విద్యార్థులు

చింతామణి: తాలుకాలో ఉత్తమ మార్కులు సాధించిన పాడి రైతుల బిడ్డలకు కోచిముల్ డైరెక్టర్ బాబు విద్యార్థి వేతనాల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కోచిముల్ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కెంపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంధం చెట్లకు గట్టి భద్రత!



- శునకాలు, సీసీ కెమెరాలు, కావలాదారులు
- పరిరక్షణకు సర్కారు పథకం

సాక్షి, బెంగళూరు: దేశంలో ఎక్కడా లేని విధంగా మంచిగంధం (శ్రీగంధం) చెట్లకు కర్ణాటక అడవులు ప్రసిద్ధి. ఎంతోమంది తోటలు, ఇంటి ఆవరణలోనూ పెంచుతుంటారు. కానీ దొంగలు రాత్రికి రాత్రికి నరికేసి తరలించి స్మగ్లింగ్ చేయడం పెరిగింది. ఈ నేపథ్యంలో శ్రీగంధం చెట్లకు ప్రత్యేక రక్షణ ఇచ్చేందుకు సర్కార్ సిద్ధమవుతోంది. చెట్లకు రక్షణ కల్పించడంతో పాటు వాటి సంఖ్యను పెంచడం ఈ పథకం లక్ష్యం.

100 హెక్టార్లు ఉండాలి..

కొత్త శ్రీగంధం విధానం ప్రకారం 100 హెక్టార్ల స్థలంలో పెరిగిన నాణ్యమైన పెద్ద చెట్లకు ప్రత్యేక రక్షణ కల్పిస్తారు. చుట్టూ జాగిలాలను, సీసీ కెమెరాలను, కావలాదారులను నియమిస్తారు. ప్రతి గంధం చెట్టు, క్లస్టర్‌ను జీపీఎస్ ద్వారా ట్రాక్ చేయనున్నారు. పొరుగునే ఉన్న కేరళ రాష్ట్రంలో కూడా ఇదే విధంగా గంధం చెట్లను కాపాడుతున్నారు.



భయపెట్టని శిక్షలు..

శ్రీగంధం విధి విధానాల ప్రకారం చెట్లను కొట్టేయడం నేరం. అక్రమంగా గంధం చెట్లను నరికి దొరికినట్లు అయితే నిందితులకు ఏడేళ్ల నుంచి పదేళ్ల వరకు కఠిన కారాగార శిక్ష విధిస్తారు. కానీ చోరీలు ఆగడం లేదు. రాష్ట్ర వృక్షంగా శ్రీగంధాన్ని ప్రకటించి నప్పటికీ వాటిని కాపాడడం, సంరక్షించడం ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది. ఇప్పటివరకు 20–30 బ్లాకులను ప్రభుత్వం గుర్తించింది. ఈ బ్లాకుల్లోని చెట్లు సుమారు 30 ఏళ్ల వయసు కలిగి ఉన్నాయి.

యువ బాడీబిల్డర్ ఆత్మహత్య!



శ్రీనాథ్ మృతదేహం



శ్రీనాథ్ (ఫైల్)

కృష్ణరాజపురం: చిన్న వయసులోనే అందరూ అబ్బురపడేలా బాడీ బిల్డర్ అయ్యాడు. అందుకోసం పగలూ రాత్రి శ్రమించాడు. కానీ అతని కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరైంది. బెంగళూరులో ఒక బాడీ బిల్డర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కృష్ణరాజపురం వద్ద హీరండహళ్లిలో జరిగింది. శ్రీనాథ్ (22) అనే బాడీ బిల్డర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈస్ట్ పాయింట్ కాలేజీలో శ్రీనాథ్ డీఫార్మసీ చదువుతున్నాడు. బాడీ బిల్డర్‌గా తయారై పలు దేహదారుఢ్య పోటీల్లో పాల్గొంటూ ఉండేవాడు. ఏం సమస్య వచ్చిందో కానీ మంగళవారం తాను ఉంటున్న గదిలో ఉరి వేసుకున్న స్థితిలో కనిపించాడు. కోలారు జిల్లా శ్రీనివాసపురకు చెందిన శ్రీనాథ్ మరణంపై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. శ్రీనాథ్ ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని తల్లిదండ్రులు చెబుతున్నారు. అవలహళ్లి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది.

చెరువులోకి దూసుకెళ్లిన టాటాసుమో

- ఒకరి మృతి
- ప్రాణాలతో బయటపడిన ముగ్గురు
- అతివేగమే కారణం



బాగేపల్లి: అతివేగం, నిర్లక్ష్యం ఒక నిండుప్రాణం తీసింది. చెరువులో కారు పడిపోవడంతో డ్రైవర్ మరణించాడు. మరో ముగ్గురు ఈత కొట్టుకుంటూ వచ్చి ప్రాణాలతో బయటపడ్డారు. ఈ దుర్ఘటనలో శ్రీనాథ్ (28) అనే వ్యక్తి మరణించాడు. గుమ్మనాయకపల్లి గ్రామానికి చెందిన శ్రీనాథ్ తట్టన్నగారిపల్లి గ్రామంలో ఉంటున్నాడు. అదే గ్రామానికి చెందిన కోటప్ప అనే వ్యక్తి కాలికి గాయం కావడంతో బాగేపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించేందుకు టాటా సుమోలో బయలుదేరారు. పట్టణానికి సమీపంలోని రెడ్డి చెరువు (రామస్వామి పల్లి చెరువు) మీద అతివేగంగా వస్తున్న క్రమంలో నియంత్రణ కోల్పోయిన వాహనం అందులో పడిపోయింది. ఈ ఘటనలో నాగేశ్, గంగరాజు, రవణప్ప కారులో నుంచి బయటకు వచ్చి ఈత కొట్టుకుంటూ ప్రమాదం నుంచి బయటపడ్డారు. డ్రైవింగ్ చేస్తున్న శ్రీనాథ్ బయటపడలేక కారులోనే ప్రాణాలు వదిలాడు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి వచ్చి చెరువులో నుంచి కారును బయటకు తీశారు. శ్రీనాథ్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బైక్ ట్యాక్సీలకు అనుమతులివ్వద్దు

మైసూరు: కర్ణాటక విద్యుత్ బైక్ ట్యాక్సీ యోజన–2021ను రద్దు చేయాలని, వైట్ బోర్డు ట్యాక్సీలకు కూడా అనుమతులు ఇవ్వొద్దని డిమాండ్ చేస్తూ కర్ణాటక ఆటో డ్రైవర్ల సంఘం బుధవారం మైసూరులో భారీ ఎత్తున ఆందోళన నిర్వహించింది. జిల్లాధికారి కార్యాలయం ఎదుట ఆటో డ్రైవర్లు కొంత సేపు నినాదాలు చేసి ఆందోళన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చకుంటే రైతుల మాదిరే ఆత్మహత్యలే శరణ్యమని హెచ్చరించారు. ఇటీవల యాప్ ఆధారిత రవాణా వ్యవస్థ కంపెనీలు కొత్తగా రంగంలోకి రావడంతో తమ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లాధికారి ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

మండ్య: ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను పాటించాలని జిల్లాధికారి డాక్టర్ హెచ్ఎన్ గోపాలకృష్ణ అన్నారు. జిల్లాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన రోడ్డు భద్రతా వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. జనవరి 11 నుంచి 17 వరకు రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కాలేజీ, స్కూళ్లలో రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. వాహనదారులు, ప్రజల ప్రాణ రక్షణ కోసం పోలీసులు, ప్రాంతీయ రవాణా శాఖ ఆధ్వర్యంలో నిబంధనలు రూపొందించినట్లు, వాటిని అందరూ పాటించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఎన్.యతీశ్, ప్రాంతీయ రవాణా అధికారి వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

క్రీడా మైదానం కోసం స్థల పరిశీలన



ప్లాన్ పరిశీలిస్తున్న దృశ్యం

మైసూరు: రాచనగరి మైసూరులో అంతర్జాతీయ స్థాయి క్రికెట్ మైదానం నిర్మించేందుకు ఏర్పాట్లు చకాచకా జరుగుతున్నాయి. క్రికెట్ మైదానం నిర్మించేందుకు కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంస్థకు మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార నుంచి సాతగళ్లి లేఔట్‌లో 20 ఎకరాల స్థలాన్ని ఇచ్చేందుకు తీర్మానించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఈ స్థలాన్ని అధికారులు పరిశీలించారు. ముడా అధ్యక్షుడు యశస్విని ఎస్.సోమశేఖర్, కమిషనర్ జీటీ దినేశ్ కుమార్, అధికారులు స్థలాన్ని పరిశీలించారు. సాతగళ్లి రెండో దశ వసతి యోజనను చేపట్టేందుకు ముడా నిర్ణయించింది. ఇందుకోసం 332 ఎకరాల స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు సర్క్యులర్ కూడా జారీ చేసింది. ఇందులో రింగ్ రోడ్డుతో పాటు 20 ఎకరాల స్థలాన్ని క్రికెట్ మైదానం కోసం వినియోగించాలని నిర్ణయించారు.

స్వామి వారికి చక్కెర పొంగలి నివేదన



మండ్య: జిల్లాలోని ప్రసిద్ధ మేలుకోటె లక్ష్మీ వరాహస్వామి దేవాలయంలో ధనుర్మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. భూవరాహ స్వామికి 108 పాత్రల్లో చక్కెర పొంగలి నివేదించి మహామంగళ హారతి చేపట్టారు. అండాళ్ రంగమన్నార్‌కు ప్రత్యేకంగా అలంకరణ చేశారు. అనంతరం ప్రసాదాన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. ధనుర్మాసం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యాలను నిర్వహించినట్లు భూవరాహ స్వామి దేవాలయ ముఖ్యులు చంద్రమ్మ, అర్చకులు తెలిపారు.

బస్సు ఢీ- మాజీ అధ్యక్షుడి మృతి

మైసూరు: ప్రైవేటు బస్సు ఢీ కొనడంతో గ్రామ పంచాయతీ మాజీ అధ్యక్షుడు మృతి చెందిన ఘటన వరుణ చెరువు వద్ద జరిగింది. రమ్మనహళ్లి గ్రామ పంచాయతీ మాజీ అధ్యక్షుడు నాగరాజు (50) మృతి చెందాడు. కళసిద్ధనహుండి గ్రామానికి చెందిన నాగరాజు తన నలుగురు స్నేహితులతో కలసి కారులో బయలుదేరాడు. వరుణ చెరువు వద్ద మూత్ర విసర్జన కోసం కారును ఆపి రోడ్డు దాటుతుండగా టి.నరసీపురకు వెళ్తున్న ప్రైవేటు బస్సు ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. వరుణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



శరత్ మృతదేహం

యశవంతపుర: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి ఆకస్మికంగా మృతి చెందిన ఘటన బెంగళూరులో జరిగింది. కేపీ అగ్రహారకు చెందిన శరత్ (24) ఆదివారం తాగిన మత్తులో కింద పడ్డారు. గాజు పీసు చేతికి తగిలి నరం కట్ అయింది. అధికంగా రక్తస్రావం అయ్యింది. హుటాహుటిన కుటుంబ సభ్యులు సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. వైద్యులు నరానికి సర్జరీ చేశారు. ఆపరేషన్ తరువాత సతీశ్ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మంగళవారం మధ్యాహ్నం ఆకస్మికంగా శరత్ మృతి చెందారు. అయితే ఉన్నట్టుండి సతీశ్ ఎలా మృతి చెందాడనే దానిపై అనుమానం వ్యక్తమవుతోంది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ కేపీ అగ్రహార పోలీసులకు ఫిర్యాదు చేశారు.

టాయిలెట్‌లో అపరిచితుడు

- విద్యార్థినితో అసభ్య ప్రవర్తన

బనశంకరి: బెంగళూరు నగరంలోని జయనగర విజయ మహిళా కాలేజీ శౌచాలయంలో అపరిచితుడు చొరబడిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఈ ఘటనపై జయనగర పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. విజయా కాలేజీ ప్రిన్సిపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుర్తుతెలియని యువకుడిపై కేసు నమోదు చేసి అతడి ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. మరో పక్క ఈ ఘటనపై విద్యార్థినులు ధర్నాకు దిగారు. వివరాలు... మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో విజయా కాలేజీ విద్యార్థిని టాయిలెట్‌కు వెళ్లారు. ఆ సమయంలో అక్కడ ఓ గుర్తు తెలియని వ్యక్తి కనిపించాడు. అసభ్యంగా ప్రవర్తించడంతో ఆమె గట్టిగా కేకలు వేసింది. దీంతో అతను టాయిలెట్‌కు గడి పెట్టి పారిపోయాడు. సహచరులు అక్కడికి చేరుకుని ఆమెను బయటకు తీసుకువచ్చారు.

విద్యార్థుల ధర్నా: గుర్తుతెలియని యువకుడి చర్యను ఖండిస్తూ విజయా కాలేజీ విద్యార్థులు ధర్నాకు దిగారు. అపరిచితుడిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు.

కోళ్ల సంత కిటకిట



చింతామణి: మకర సంక్రాంతిని పురస్కరించుకొని చింతామణి కోళ్ల మార్కెట్ బుధవారం కిటకిటలాడింది. కోళ్ల ధరలు కూడా ఆకాశాన్నంటాయి. కోళ్లను విక్రయించడానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. పుంజులు వేలల్లో పలికాయి.

అంత్యక్రియలకు నానా అగచాట్లు



యశవంతపుర: గ్రామాలలో అంత్యక్రియలు చేయడానికి నానా తంటాలు పడాల్సి వస్తోంది. ఉత్తర కన్నడ జిల్లాలో ఓ ప్రాంతంలో రోడ్డు మార్గం లేక ఏకంగా 8 కిలోమీటర్లు శవాన్ని ఎత్తుకుని అంత్యక్రియలు నిర్వహించారు. అంకోలా తాలూకా బెరడి గ్రామంలో దామోదర నేము సాయక్ (68) మంగళవారం మృతి చెందాడు. స్మశానానికి రోడ్డు మార్గం లేకపోవడంతో వెదురు బొంగుపై శవాన్ని కట్టుకుని ఎనిమిది కిలోమీటర్లు పొలం గట్టుపై నడుచుకుంటూ అంత్యక్రియలు నిర్వహించారు.

ఓం శక్తి ఆలయానికి భక్తాదులు



చింతామణి: తమిళనాడులోని మేల్ మరువత్తూరు ఓం శక్తి అమ్మవారి దర్శనానికి చింతామణి నుంచి భక్తులు బయలుదేరారు. దాతలు భక్తుల కోసం ఉచితంగా ఐదు బస్సులను ఏర్పాటు చేయడంతో బుధవారం ఆజాద్ చౌక్ నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివెళ్లారు.

హోసూరు వార్తలు..

రేషన్ బియ్యం స్వాధీనం.. వ్యక్తి అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనం, నిందితుడు

కెలమంగలం: అంచెట్టి ప్రాంతం నుంచి కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని కారుతో పాటు డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. వివరాలు... ఆహార భద్రత విభాగ ఇన్స్‌పెక్టర్ రేణుకాదేవి నేతృత్వంలో ఎస్ఐలు క్రిష్ణవేణి, మూర్తి తదితరులు అంచెట్టి- ఉప్పరపల్లి రోడ్డులో మంగళవారం రాత్రి వాహన తనిఖీలు నిర్వహించారు. ఆ మార్గంలో వచ్చిన కారును తనిఖీ చేయగా 1000 కిలోల రేషన్ బియ్యం పట్టుబడింది. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారణ జరుపగా డెంకణీకోట సమీపంలోని ఉడుపరాణి గ్రామానికి చెందిన బసలింగప్ప, ఉన్సలపల్లి, పాండురంగన్‌దొడ్డి తదితర గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి కర్ణాటకలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. బసలింగప్పను పోలీసులు అరెస్ట్ చేశారు.

కార్మికుడు ఆత్మహత్య

కెలమంగలం: కడుపునొప్పి తాళలేక కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన అంచెట్టి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. అంచెట్టి తాలూకా సిద్దాండపురం గ్రామానికి చెందిన చిన్నప్ప (40) కొద్ది రోజులుగా కడుపునొప్పితో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్నాడు. ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తితో చిన్నప్ప మంగళవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువులు హుటాహుటిన డెంకణీకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అంచెట్టి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఏడాది క్రితం అన్న.. నేడు తమ్ముడు

- ఒకే రోజు మృత్యువాత

యశవంతపుర: అన్న మృతి చెందిన ఏడాది తరువాత అదే రోజు తమ్ముడు మృతి చెందిన ఘటన హాసన జిల్లా బేలూరు తాలూకా నెట్టెకెరె గ్రామంలో జరిగింది. నెట్టెకెరె గ్రామానికి చెందిన పుట్టస్వామి, సరోజా దంపతులకు శ్రీధర్ (22), దిలీప్ (21)లు ఇద్దరు కొడుకులు. 2022 జనవరి 9న పెద్ద కొడుకు శ్రీధర్ అనారోగ్యం కారణంగా మృతి చెందారు. దిలీప్ ఈ నెల 4న బేలూరు తాలూకా రాయపుర గ్రామం వద్ద బైకుపై వేగంగా వెళ్తూ అదుపు తప్పి రోడ్డు పక్కలో పొలంలో పడింది. బలమైన గాయాలు కావటంతో కుటుంబ సభ్యులు దిలీప్‌ను హాసన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈనెల సోమవారం మృతి చెందాడు. అన్న మరణించిన ఏడాదికి అదే తేదీన తమ్ముడు మృతి చెందడం కాకతాళీయం. బుధవారం దిలీప్ అంత్యక్రియలను నెట్టెకెరెలో చేశారు. ఇద్దరు కొడుకులను పోగొట్టుకున్న తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు.

ఉత్సాహంగా సమత్వ పొంగల్



కార్పొరేషన్‌లో సంక్రాంతి సంబరాల దృశ్యం

హోసూరు: హోసూరు కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం సమత్వ పొంగల్ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. మేయర్ ఎస్.ఏ.సత్య అధ్యక్షతన కార్పొరేషన్ కార్యాలయం ముందు ముగ్గులు వేసి కార్యాలయాన్ని పూలతో అలంకరించి కొత్త కుండలో పొంగల్ వండి అందరికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా సంక్రాంతి పండుగ విశిష్టతను మేయర్ వివరించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ ఆనందయ్య, కమిషనర్ బాలసుబ్రమణ్యం, కార్పొరేషన్ మండల అధ్యక్షుడు, కార్పొరేటర్లు, కులమతాలకతీతంగా ప్రజలు పాల్గొన్నారు.

ఏనుగుల దాడిలో పంటలు ధ్వంసం






ధ్వంసమైన వరి, బీన్స్ పంటను చూపుతున్న బాధితుడు

కెలమంగలం: డెంకణీకోట చుట్టుపక్కల ప్రాంతాల్లో మంగళవారం రాత్రి అడవి ఏనుగులు వీరంగం సృష్టించాయి. డెంకణీకోట సమీపంలోని దళసూరు, ఎస్. కురుబట్టి తదితర ప్రాంతాల్లో ఏనుగుల గుంపు పంటలు, తోటలపై పడి తొక్కివేశాయి. డెంకణీకోట అటవీ ప్రాంతంలో 50కి పైగా ఏనుగు మకాం వేశాయి. రెండు రోజులుగా ఏనుగులు గుంపులు గుంపులుగా విడిపోయి విధ్వంసం సృష్టిస్తున్నాయి. నష్ట పరిహారం చెల్లించాలని బాధిత రైతులు కోరుతున్నారు. ఏనుగులను అడవిలోకి తరిమికొట్టాలని అటవీ అధికారులను కోరుతున్నారు.

గ్రామంలో ఒంటి ఏనుగు బీభత్సం





ఏనుగు దాడిలో ధ్వంసమైన ద్విచక్ర వాహనం, గ్రామంలో సంచరిస్తున్న ఒంటి ఏనుగు

క్రిష్ణగిరి: సూళగిరి తాలూకా బీర్జేపల్లి పంచాయతీ నాయకానపల్లి గ్రామంలో ఒంటి ఏనుగు బీభత్సం సృష్టించింది. ఓ ఇంటి ముందు ద్విచక్ర వాహనాన్ని తొక్కి ధ్వంసం చేసింది. మంగళవారం రాత్రి నాయకానపల్లి గ్రామంలోకి ప్రవేశించిన ఒంటి ఏనుగు రైతు అశ్వత్థ ఇంటి ముందు నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాన్ని పైకి ఎత్తి విసిరివేసింది. శబ్దం విన్న గ్రామస్థులు బయటకొచ్చేసరికి ఏనుగు కనిపించడంతో అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ఏనుగును అటవీ ప్రాంతానికి మళ్లించారు. ఈ ఘటనతో గ్రామస్థులు వణికిపోతున్నారు.

పిల్లలకు హింసను చూపించరాదు

యశవంతపుర: సమాజంలో హింస, క్రౌర్యం ఉండకూడదని పేజావర మఠాధిపతి విశ్వప్రసన్న తీర్థ తెలిపారు. విధానసౌధలో జరిగిన ధార్మిక ముఖండ సమావేశంలో జరిగిన విషయాలపై ఆయన బుధవారం ఉడుపిలో విలేకర్లతో మాట్లాడారు. క్రౌర్యం చిన్నారుల కంటికి కనిపించకూడదు, మాంసాహారం తినరాదు. పిల్లల కళ్ల ముందు ప్రాణిహింస చేయకూడదన్నారు. మాంసం వేలాడుతున్న దృశ్యాలను పిల్లలకు చూపించకూడదన్నారు. పిల్లలు ఎలాంటి ఆహారం తినాలో పెద్దలు నిర్ణయించాలని సూచించారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

కెలమంగలం: డెంకణీకోట తాలూకా అందేవనపల్లి సమీపంలోని మల్లికార్జున దుర్గం శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం వద్ద రూ. 20 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులకు బుధవారం ఎమ్మెల్యే వై. ప్రకాష్ భూమిపూజ చేశారు. ఆలయం ముందు సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని, ఆలయ కమిటీ, స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతూ వచ్చారు. అధికారులు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 20 లక్షల నిధులు మంజూరు చేశారు. దీంతో తళి యూనియన్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే వై. ప్రకాష్ ముఖ్య అతిథిగా పాల్గొని భూమిపూజ చేశారు. కార్యక్రమంలో డీఎంకే నాయకులు దివాకర్, రాజ, శ్రీనివాసన్, గిరీష్, కుందుకోట పంచాయతీ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి జయరామన్, మూర్తి, గోపి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

47 హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: ఏపీ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో 47 హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పోస్టుల భర్తీకి వైద్య శాఖ నోటిఫికేషన్ ఇచ్చింది. https://dmeaponline.com వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ అప్లికేషన్‌ను అందుబాటులో ఉంచారు. బుధవారం నుంచి దరఖాస్తుల ప్రక్రియ మొదలు పెట్టారు. అర్హులైన వైద్యులు ఈ నెల 17వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఓసీ, బీసీ అభ్యర్థులకు రూ.వెయ్యి, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.750 చొప్పున దరఖాస్తు రుసుం ఉంటుంది. రెండేళ్ల కాలపరిమితితో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పోస్టుల భర్తీ చేపడతారు. ఎంబీబీఎస్/బీడీఎస్ పూర్తి చేసి హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్ డిగ్రీ/హాస్పిటల్ మేనేజ్‌మెంట్/ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్/ఎంబీఏ హ్యూమన్ రిసోర్స్ కోర్సులు చేసి, ఇతర అర్హతలున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ఏడాది జూలై ఒకటో తేదీ నాటికి గరిష్ట వయోపరిమితి 42 ఏళ్లు మించకుండా ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు మూడేళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్లు వయోపరిమితి నుంచి మినహాయింపు ఉంటుంది. http://hmfw.ap.gov.in వెబ్‌సైట్‌లో నోటిఫికేషన్‌ను ఉంచారు.

సమగ్ర శిక్షలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు

సాక్షి, అమరావతి: సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయంలో పొరుగు సేవలు (అవుట్ సోర్సింగ్) పద్ధతిలో జూనియర్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఆఫీస్ సబార్డినేట్లుగా పనిచేయడానికి అర్హతగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. అర్హతలు, ఇతర వివరాలు ఈ నెల 17వ తేదీ నుంచి సమగ్ర శిక్ష కార్యాలయ వెబ్‌సైట్‌లో ఉంటాయని తెలిపారు. హెచ్‌టీటీపీఎస్://సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఐఎన్/డీఎస్ఈ/ లేదా హెచ్‌టీటీపీఎస్://ఏపీఎస్ఎస్ఏ.ఏపీటీఆన్‌లైన్.ఐఎస్ వెబ్‌పోర్టల్‌లో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.

రేషన్ వాహనాల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుంది

మంత్రి కారుమూరి ప్రతిపాదనకు సీఎం అంగీకారం

సాక్షి, అమరావతి: ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు రేషన్ అందిస్తున్న ఎండీయూ వాహనాల ఆపరేటర్లు ఏటా చెల్లించాల్సిన బీమా మొత్తాన్ని ఇక నుంచి ప్రభుత్వమే భరించనుంది. ఇప్పటివరకు ఇన్సూరెన్స్ కంపెనీలు వాహన ఆపరేటర్ల నుంచి బీమా ప్రీమియం వసూలు చేస్తున్నాయి. ఏటా రూ.10 వేలను ప్రీమియంగా.. బ్యాంకు ఖాతాలో జమ అయిన వారి వేతనం నుంచి తీసుకుంటున్నాయి. ఇది తమకు ఇబ్బందికరంగా ఉందని వారు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావుకు విన్నవించారు. ఈ విషయాన్ని మంత్రి.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రీమియం నగదును ఆపరేటర్ల నుంచి వసూలు చేయకుండా, ప్రభుత్వమే ఆ మొత్తాన్ని చెల్లించడానికి సీఎం అంగీకరించారని మంత్రి కారుమూరి తెలిపారు. ఈ మేరకు బ్యాంకులన్నింటికీ సీఎం జగన్ లేఖ రాసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 13న ప్రీమియం నగదును విడుదల చేయాలని ఆర్థికశాఖను ఆదేశించినట్లు తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 9,080 ఎండీయూ వాహనాలకు ఆపరేటర్లు ఏటా రూ.10 వేల చొప్పున మొత్తం రూ.9.2 కోట్ల రూపాయల బీమా ప్రీమియం చెల్లిస్తున్నారు. బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించి వీరందరిపై భారం తగ్గించేలా సీఎం నిర్ణయం తీసుకున్నారు.

ఫేస్‌బుక్‌లో అభ్యర్థన.. ఆర్టీసీ బస్సు ఏర్పాటు

సాక్షి, అమరావతి: ఫేస్‌బుక్‌లో పోస్టు ద్వారా అభ్యర్థించిన వెంటనే ప్రయాణికులకు ఓ బస్సు సర్వీసును ఏర్పాటు చేసి ప్రజా సేవే తమ లక్ష్యమని ఆర్టీసీ నిరూపించిన ఆసక్తికరమైన ఘటన కృష్ణాజిల్లాలోని పామర్రులో జరిగింది. 40 మంది ప్రయాణికులు మంగళవారం రాత్రి పామర్రు నుంచి విజయనగరం జిల్లా నెల్లిమర్ల వెళ్లాల్సి ఉంది. వీరిలో ఒకరు తమకు బస్సు ఏర్పాటు చేయగలరా అని ఆర్టీసీ ఈడీ(ఆపరేషన్స్) కె.ఎస్.బ్రహ్మానందరెడ్డిని ఫేస్‌బుక్ పోస్టు ద్వారా అభ్యర్థించారు. దీనిపై వెంటనే స్పందించిన బ్రహ్మానందరెడ్డి గుడివాడ బస్ డిపో మేనేజర్‌తో మాట్లాడి ఆ ప్రయాణికులకు పామర్రు నుంచి నెల్లిమర్లకు ప్రత్యేకంగా బస్సు సర్వీసు ఏర్పాటు చేశారు. ఆ 40 మంది ప్రయాణికులు ఆ బస్సులో సౌకర్యవంతంగా తమ గమ్యస్థానమైన నెల్లిమర్లకు బుధవారం ఉదయం చేరుకున్నారు. అడగంగానే సాయం చేసిన ఆర్టీసీ సేవలను అభినందించారు.

టీడీపీ నేత సోమిరెడ్డిని విచారించిన సీఐడీ

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నాలుగో అదనపు ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో పత్రాల చోరీ కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారులు టీడీపీ నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని మళ్లీ విచారించారు. బుధవారం జరిగిన విచారణలో సీబీఐ అధికారులకు సోమిరెడ్డి పలు డాక్యుమెంట్లు, పెన్‌డ్రైవ్‌ను అప్పగించినట్లు తెలిసింది.

అద్దెకు విద్యుత్ కార్లు



- దేశవ్యాప్తంగా ప్రభుత్వ శాఖలకు 3,500 ఈ–కార్లు సమకూర్చనున్న సీఈఎస్ఎల్
- 4,675 విద్యుత్ బస్సుల కొనుగోలుకు టెండర్లు
- 2030 నాటికి 49 శాతం విద్యుత్ వాహనాలే ఉంటాయని అంచనా

సాక్షి, అమరావతి: పెరిగిపోతున్న కాలుష్యం బారి నుంచి ప్రజలను, పర్యావరణాన్ని కాపాడాలంటే 2040 నాటికి పెట్రోల్, డీజిల్ కార్లను నిషేధించాలనే డిమాండ్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వ అధీనంలోని కంపెనీ 'కన్వర్జెన్స్ ఎనర్జీ సర్వీసెస్ లిమిటెడ్ (సీఈఎస్ఎల్)' ఏపీ సహా దేశంలోని 18 రాష్ట్రాలకు ఎలక్ట్రానిక్ వాహనాలను సమకూర్చనుంది. ఇందుకోసం టెండర్లను కూడా ఆహ్వానించింది. 3 నుంచి 5 ఏళ్ల కాలానికి 3,500 ఎలక్ట్రిక్ కార్లను కొనుగోలు చేసి ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్, కేరళ, పశ్చిమ బెంగాల్, హరియాణ, అస్సాం, ఒడిశా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, బిహార్, గోవా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, జమ్మూ–కశ్మీర్, జార్ఖండ్ రాష్ట్రాల్లోని ప్రభుత్వ విభాగాలకు అద్దె ప్రాతిపదికన ఇవ్వాలని భావిస్తోంది. అదేవిధంగా ఏపీ సహా దేశంలోని 9 ప్రధాన నగరాల్లో 4,675 విద్యుత్ బస్సుల్ని నడిపేందుకు కూడా సీఈఎస్ఎల్ ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఇందుకోసం టెండర్లను ఆహ్వానించింది. ఇందుకోసం ఆయా రాష్ట్రాలు సొంతంగా చార్జింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవడంతోపాటు అవసరమైన అనుమతులను అందించాల్సి ఉంటుంది. సీఈఎస్ఎల్ ఇప్పటికే దాదాపు 2 వేల విద్యుత్ కార్లను ఈ విధంగా వివిధ రాష్ట్రాలకు సమకూర్చింది.

చార్జింగ్ స్టేషన్లతో ఏపీ తోడ్పాటు

విద్యుత్ వాహనాలను వేగంగా అందుబాటులోకి తీసుకురావాలంటే రాష్ట్రాలకు వివిధ రాయితీలను అందించాల్సిన అవసరం ఉంది. దీనికోసం కేంద్రం ఫాస్టర్ అడాప్షన్ అఫ్ మాన్యుఫాక్చరింగ్ అఫ్ ఎలక్ట్రిక్ వెహికల్స్ పథకాన్ని తీసుకువచ్చింది. దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాలు ఈ పథకం ద్వారా ఎలక్ట్రిక్ వెహికల్స్ (ఈవీ)లను ప్రోత్సహించడానికి ప్రత్యేక విధివిధానాలను రూపొందించాయి. 2019–22 మధ్య మూడేళ్ల కాలానికి ఫేమ్ పథకం కింద రూ.10 వేల కోట్లను కేటాయించగా.. ఈ పథకాన్ని 2024 మార్చి 31 వరకూ పొడిగిస్తున్నట్లు కేంద్రం తాజాగా ప్రకటించింది. ప్రైవేట్ ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుపై టాక్స్ బెనిఫిట్స్ ఇస్తోంది. ద్విచక్ర వాహనాలకు కిలోవాట్‌కు రూ.15 వేలను, త్రిచక్ర, నాలుగు చక్రాల వాహనాలకు రూ.10 వేలను, బస్సులకు రూ.20 వేలను రాయితీగా అందిస్తోంది. విద్యుత్ వాహనాలను అందుబాటులోకి తీసుకురావడం కోసం 7 వేల ఈ–బస్సులు, 5 లక్షల త్రీ వీలర్లు, 55 వేల పాసింజర్ కార్లు, 10 లక్షల ద్విచక్ర వాహనాలను సమకూర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే ఏపీలో 15,865, దేశ వ్యాప్తంగా 4.08 లక్షల విద్యుత్ వాహనాల విక్రయం జరిగింది. తద్వారా రోజుకి 3,76,801 లీటర్ల పెట్రోల్, డీజిల్ ఆదా అవుతోంది. 8,57,441 కేజీల కార్బన్‌డైయాక్సైడ్ తగ్గుతోంది. 2021తో పోలిస్తే విద్యుత్ వాహనాల అమ్మకాలు 2022లో 110 శాతం పెరిగాయి. 2030 నాటికి దేశంలోని మొత్తం వాహనాల్లో దాదాపు 49 శాతం విద్యుత్ వాహనాలే ఉంటాయని అంచనా. వీటికోసం 2 మిలియన్ల పబ్లిక్ ఈవీ చార్జింగ్ స్టేషన్లు అవసరమవుతాయి. దేశ వ్యాప్తంగా పెరగనున్న విద్యుత్ వాహనాల కోసం మన రాష్ట్రంలో జాతీయ రహదారులపై ప్రతి 25 కిలోమీటర్లకు, నగరాల్లో ప్రతి 3 కిలోమీటర్లకు ఒక ఈవీ స్టేషన్‌ను ఏర్పాటు చేసేందుకు 4 వేల ప్రదేశాలను ఇప్పటికే ప్రభుత్వం గుర్తించింది.

ఐటీ అధికారులకూ 'సైబర్' స్ట్రోక్

- గిఫ్ట్ కూపన్ పేరిట రూ.1.10 లక్షలు కొట్టేసిన కేటుగాళ్లు
- ఉన్నతాధికారి డీపీతో వాట్సాప్ ద్వారా ఎర
- సైబర్ నేరస్తుల పనేనని తేలడంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: సైబర్ నేరగాళ్లు ఎవర్నీ వదలటం లేదు. ఆదాయ పన్ను శాఖ అధికారులకు రూ.1.10 లక్షలకు టోకరా వేశారు. విశాఖపట్నానికి చెందిన ఆదాయ పన్ను శాఖ అధికారులకు ఉన్నతాధికారి పేరిట అమెజాన్ గిఫ్ట్ కూపన్లు పంపాలంటూ మెసేజ్ పంపిన సైబర్ నేరగాళ్లు.. వచ్చిన గిఫ్ట్‌కార్డు నుంచి ఆ మొత్తాన్ని వెంటనే తమ ఖాతాలోకి జమ చేసుకున్నారు. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ నుంచి నడిపిన ఈ వ్యవహారంపై విశాఖ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసిన విశాఖ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వాట్సాప్ డీపీతో బోల్తా

ఢిల్లీ కేంద్రంగా విధులు నిర్వర్తించే ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ పంపినట్టుగా విశాఖలోని ఐటీ శాఖ అధికారికి ఇటీవల వాట్సాప్‌లో ఓ మెసేజ్ వచ్చింది. సదరు ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ఫొటో డీపీగా ఉన్న ఫోన్ నంబరు నుంచి.. అమెజాన్ గిఫ్ట్ కూపన్ల రూపంలో రూ.1.10 లక్షలను తనకు అత్యవసరంగా పంపాలని ఆ మెసేజ్‌లో ఉంది. ఆ మొత్తాన్ని త్వరలో తిరిగి ఇస్తానని కూడా మెసేజ్ చేశారు. ఈ సమాచారాన్ని అందుకున్న అసిస్టెంట్ కమిషనర్.. వెంటనే ఆ మొత్తాన్ని ఉన్నతాధికారికి పంపాలంటూ డిప్యూటీ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు సదరు అధికారి రూ.1.10 లక్షల విలువ చేసే అమెజాన్ గిఫ్ట్ కూపన్లు కొనుగోలు చేసి ఆ సమాచారాన్ని వాట్సాప్ ద్వారా ఆ నంబర్‌కు పంపారు. సదరు సైబర్ నేరగాడు వెంటనే ఆ కూపన్లను రెడీమ్ చేసుకున్నారు. తాము మోసపోయిన విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న అధికారులు విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి విశాఖ పోలీసులు విచారణ చేపట్టారు. సమాచారం పంపిన ఫోన్ నంబరు రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ ప్రాంతం నుంచి వచ్చిందని ప్రాథమికంగా తేల్చారు.

ప్రత్యేక టీమ్‌తో విచారణ

సైబర్ నేరగాళ్లు అందరినీ లక్ష్యంగా చేసుకుని నేరాలకు పాల్పడుతున్నారు. రోజురోజుకీ ఈ నేరాల సంఖ్య పెరిగిపోతోంది. దీనిని కట్టడి చేసేందుకు ఎక్కడికక్కడ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ఇలాంటి నేరాలపై విచారణ కూడా వేగవంతం చేస్తున్నాం. విశాఖ ఆదాయ పన్ను శాఖ అధికారుల ఫిర్యాదుపై కేసు నమోదు చేశాం. ఒక టీమ్ ఏర్పాటు చేసి విచారణ జరుపుతున్నాం.

– శ్రీకాంత్, విశాఖ నగర పోలీస్ కమిషనర్

తప్పుడు కథనంపై 'ఈనాడు'కు నోటీసులు

దసపల్లా భూముల కథనంపై ఆ భూముల యజమాని రాణి కమలాదేవి ఆగ్రహం

- ఈనాడుకు నోటీసులు జారీ చేసిన ఆమె తరఫు న్యాయవాది
- హైకోర్టు, సుప్రీంకోర్టు ఆ భూములు కమలాదేవివని తీర్పిచ్చాయని వెల్లడి
- అయినా అసత్యాలతో కథనం ప్రచురించారని ఆగ్రహం
- ఖండన ప్రచురించకపోతే పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరిక

సాక్షి, విశాఖపట్నం: విశాఖ నగరంలోని దసపల్లా భూములపై తప్పుడు కథనాలు ప్రచురిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ ఈనాడు దినపత్రికకు ఆ భూముల యజమాని రాణి కమలాదేవి, ఆమె కుమారుడు దిగ్విజయ్ చంద్ర బుధవారం పరువు నష్టం నోటీసులు జారీ చేశారు. రాణి కమలాదేవి తరఫు న్యాయవాది అరుణ్‌దేవ్ ఈనాడు ఎడిటోరియల్ డైరెక్టర్, ఎడిటర్, ఈనాడు దినపత్రికకు నోటీసులు జారీ చేశారు. నోటీసుల సారాంశం ఇది.. విశాఖపట్నంలోని వాల్తేరు అప్‌ల్యాండ్స్‌లో ఉన్న టీఎస్ (టౌన్ సర్వే) నం 1196, 1197, 1027, 1028లో ఉన్న భూముల్ని దసపల్లా భూములంటారు. వీటిపై మా క్లయింట్ రాణి కమలాదేవి ప్రభుత్వంతో సుదీర్ఘ పోరాటం చేశారు. ఈ భూములు రాణి కమలాదేవికి చెందినవేనని 2009లో హైకోర్టు తీర్పునిచ్చింది. ఇదే తీర్పుని సుప్రీంకోర్టు కూడా వెలువరించింది. ప్రభుత్వ భూముల పరిధి నుంచి ఈ భూముల్ని తొలగించి, సుప్రీంకోర్టు ఆదేశాల్ని పాటించాలంటూ జిల్లా కలెక్టర్‌కు హైకోర్టు దిశానిర్దేశం చేసింది. ఈ విషయం కూడా పత్రికల్లో ప్రచురితమైంది. అయినప్పటికీ, ఉద్దేశపూర్వకంగానే ఈ నెల 11న ఈనాడు దినపత్రికలో ''దసపల్లాపై అత్యుత్సాహం'' పేరుతో కథనాన్ని ప్రచురించారు. ఈ కథనంలో 'దసపల్లా భూముల విషయంలో న్యాయ పోరాటానికి అవకాశం ఉన్నా.. ప్రభుత్వం ప్రయత్నం చేయకపోవడం, వ్యూహం ప్రకారం కలెక్టర్‌తో లేఖ రాయించి సీసీఎల్ఏతో ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా ఉత్తర్వులు ఇప్పించడం.. ఇవన్నీ గమనిస్తే దసపల్లా భూములపై తెరవెనుక ఎంత పెద్ద మంత్రాంగం జరిగిందో అర్థమవుతోంది' అంటూ మా క్లయింట్ పరువుకు భంగం కలిగించేలా అసత్యపు ఆరోపణలతో కథనాన్ని ప్రచురించారు. దసపల్లా భూముల వ్యవహారంలో రాణి కమలాదేవి కుటుంబం ప్రతిష్టని దిగజార్చేలా అసత్యాల్ని ప్రచురిస్తున్నారు. ఈ కథనాన్ని ఖండిస్తూ ఈనాడు పత్రికలో సవరణ ప్రచురించాలి' అని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. నోటీసులు అందుకున్న వెంటనే సవరణ వార్తని ప్రచురించకపోతే రూ.కోటికి పరువు నష్టం దావా వేస్తామని న్యాయవాది అరుణ్‌దేవ్ తెలిపారు.

జీవోను రాజకీయ కోణంలో చూడకండి



జీవో నంబర్ 1ని స్వాగతిస్తూ సంఘీభావం తెలుపుతున్న మేధావులు

ఏయూ క్యాంపస్: ప్రజల ప్రాణాలకు రక్షణ కవచంగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 1 నిలుస్తుందని పలువురు మేధావులు అభిప్రాయపడ్డారు. జీవోను రాజకీయ కోణంలో చూడొద్దని కోరారు. ఎవరి స్వేచ్ఛను ప్రభుత్వం హరించలేదని స్పష్టం చేశారు. విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీలో ఏయూ, విశాఖ నగర మేధావుల వేదిక సంయుక్తంగా బుధవారం 'ప్రజల ప్రాణాలకు రక్ష జీవో నంబర్ 1' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాయి. ప్రభుత్వం ప్రజల ప్రాణాలను రక్షించాలనే ఏకైక లక్ష్యంతో తీసుకువచ్చిన జీవో ఇదని వక్తలు స్పష్టం చేశారు. దీన్ని తామంతా స్వాగతిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది చిన్నారావు, డాక్టర్ ఎ.కె.ఎం.పవార్, ఆచార్య ఎన్.సత్యనారాయణ, డాక్టర్ రాజమాణిక్యం, డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, డాక్టర్ బాలకోటయ్య, డాక్టర్ అంబేడ్కర్ రాజు, డాక్టర్ ఎ.సీతారత్నం, డాక్టర్ రాజ్‌కుమార్, తదితరులు ప్రసంగించారు.




జీవో నంబర్ 1 మన బాధ్యతను గుర్తు చేసింది. ఈ జీవోతో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం, ఇబ్బంది కలగదు.

– ఆచార్య జేమ్స్ స్టీఫెన్, అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్, ఏయూ



ప్రజల ప్రాణాలకు నష్టం జరగకుండా సమావేశాలు పెట్టుకోవచ్చని జీవో స్పష్టం చేస్తోంది. దీన్ని వక్రీకరిస్తూ ఎమర్జెన్సీని తలపిస్తోందని ప్రచారం చేయడం సరికాదు.

– ఆచార్య కె.శ్రీరామమూర్తి, పూర్వ ప్రిన్సిపాల్, ఏయూ ఆర్ట్స్ కళాశాల




ర్యాలీలు, సభలు నిర్వహించవద్దని ప్రభుత్వం ఎక్కడా చెప్పలేదు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా నిర్వహించుకోవాలని జీవో స్పష్టం చేస్తోంది.

– ఆచార్య ఎస్.ఎ.డి.పాల్, టీసీడీఈ సమన్వయకర్త



విమర్శించే వ్యక్తులు ముందుగా జీవోను చదివి, అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలి. ప్రజల మేలు కోసమే ప్రభుత్వం ఈ జీవో తెచ్చింది.

– ఆచార్య పి.విశ్వనాథం, గౌరవ ఆచార్యులు, డీసీఎంఎస్ విభాగం



ఏయూ మహిళా ఉద్యోగుల సంఘం తరఫున జీవో నంబర్ 1ని తాము స్వాగతిస్తున్నాం. ఇటువంటి జీవోలు ప్రజల రక్షణకు, భద్రతకు ఉపయుక్తంగా నిలుస్తాయి.

– ఆచార్య టి.శోభశ్రీ, ప్రిన్సిపాల్, ఐఏఎస్ఈ



జీవో నంబర్ 1 అప్రజాస్వామికం అనడం సరికాదు. కందుకూరు, గుంటూరు ఘటనలు పునరావృతం కాకుండా ప్రజల ప్రాణాలను కాపాడాలనే ఈ జీవో తీసుకువచ్చారు.

– ఆచార్య పి.అర్జున్, గౌరవ ఆచార్యులు, సోషల్ వర్క్ విభాగం



నిషేధం, ఆంక్షలకు వ్యత్యాసం ఉందనే విషయాన్ని గమనించకుండా కొందరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సరికాదు. ఈ జీవోపై వాస్తవాలు తెలిపే విధంగా విస్తృత చర్చలు జరపాలి.

– పాకా సత్యనారాయణ, న్యాయవాది



ప్రజల ప్రాణాలు ఎంతో ప్రధానం. ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేయడం అర్థరహితం.

– ఆచార్య విజయ్‌మోహన్, డీన్, విద్యార్థి వ్యవహారాలు



కొంత మంది ఏకపక్షంగా ఈ జీవోను వ్యతిరేకిస్తూ మాట్లాడుతున్నారు. ఇది సరికాదు.

– ఆచార్య ఎస్.పుల్లారావు, అర్థశాస్త్ర విభాగాధిపతి



అన్ని పార్టీలకు ఈ జీవో వర్తిస్తుంది, ఎక్కడా నిషేధం లేదు.. కేవలం నిబంధనలు మాత్రమే ఉన్నాయి. వీటిని అనుసరిస్తూ సమావేశాలు, ర్యాలీలు జరుపుకోవడానికి ఇబ్బంది ఏముంది?

– ఆచార్య ఎ.పల్లవి, క్రీడా విభాగాధిపతి, ఏయూ

జీవో నంబర్ 1లో నిషేధమనే పదమే లేదు



జీవో నంబర్ 1పై ఏఎన్‌యూలో మేధావుల ఐక్య వేదిక సమావేశం

ఏఎన్‌యూ: ప్రజల ప్రాణాలు, జీవితాలను కాపాడేందుకు రోడ్లపై బహిరంగ సభల విషయంలో నియంత్రణ విధిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మేధావుల ఐక్యవేదిక కొనియాడింది. జీవో నంబర్ 1లో బహిరంగ సమావేశాలు నిషేధమనే పదమే లేదని వక్తలు గుర్తు చేశారు. నియంత్రణకు, నిషేధానికి చాలా వ్యత్యాసం ఉందనేది గుర్తించాలని సూచించారు. తొక్కిసలాటల్లో 11 మంది ప్రాణాలు పోతే ప్రభుత్వం స్పందించకుండా ఎలా ఉంటుందని నిలదీశారు. ప్రజా సంరక్షణ చర్యలు చేపట్టడం పాలకుల కనీస బాధ్యతనే విషయం మరిచిపోకూడదన్నారు. ప్రభుత్వం ఒక కొత్త నిర్ణయం అమల్లోకి తెస్తే దానిపై అవగాహన కల్పించడం మీడియా బాధ్యత అని తెలిపారు. ఇలా కాకుండా ప్రభుత్వ నిర్ణయాలను భూతద్దంలో చూపుతూ.. ఇవి ప్రజలకు నష్టమన్నట్లు ప్రచారం చేయడం సరికాదన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛ ఉందని.. ఇతరుల హక్కులు, స్వేచ్ఛ, ప్రాణాలను హరించకూడదని స్పష్టం చేశారు. ఈ ఉత్తర్వుల ఆవశ్యకత, ఇందులోని అంశాలపై విద్యావేత్తలు, మేధావులు సమాజానికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అలాగే పౌర హక్కుల సంఘాలు, ప్రజా సంఘాలు కూడా స్పందించాలని కోరారు. మేధావుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (ఏఎన్‌యూ)లో బుధవారం జీవో నంబర్ 1పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వక్తలు ఏమన్నారంటే..

రాజకీయ కోణంలో చూడకూడదు..



సామాన్యుల ప్రాణాలు పరిరక్షించేందుకు ప్రభుత్వం జారీ చేసిన ఈ ఉత్తర్వులను రాజకీయ కోణంలో చూడటం సరికాదు. తొక్కిసలాటల్లో 11 మంది ప్రాణాలు పోతే ప్రభుత్వం స్పందించకుండా ఎలా ఉంటుంది? కందుకూరు, గుంటూరు ఘటనలపై పౌరహక్కులు, దళిత సంఘాలు కూడా స్పందించకపోవడం విచారకరం. ఇదే ఘటన అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో జరిగితే అక్కడ సమాజమంతా గొంతెత్తేది. మరణించిన వారికి కనీసం సంతాప సభ కూడా నిర్వహించకపోవడం హర్షణీయమా? కనీసం భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగనీయబోమని ప్రకటించకుండా యథావిధిగా సభలు, సమావేశాలు నిర్వహించడం సరైన పనేనా? ప్రభుత్వ చారిత్రాత్మక నిర్ణయంపై మేధావులు సమాజానికి అవగాహన కల్పించాలి.

–ఆచార్య పి.రాజశేఖర్, వీసీ, ఏఎన్‌యూ

మరిన్ని సదస్సులు నిర్వహించి అవగాహన కల్పిస్తాం..

సమాజానికి ప్రయోజనం చేకూర్చే ప్రభుత్వ ఉత్తర్వులపై సమాజానికి అవగాహన కల్పించడం విద్యావేత్తలు, మేధావుల బాధ్యత. ప్రభుత్వ ఉత్తర్వులపై మేధావుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మరిన్ని సదస్సులు నిర్వహించి అవగాహన కల్పిస్తాం.

–ఆచార్య శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్, ఆర్కిటెక్చర్ కళాశాల, ఏఎన్‌యూ

ప్రభుత్వ ఉత్తర్వులు అందరికీ వర్తిస్తాయని గుర్తించాలి..

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఆసక్తి ఉన్నవారు సూచనలు, సలహాలు ఇవ్వవచ్చు. కానీ ఆ నిర్ణయమే తప్పంటే ఎలా? ప్రభుత్వ ఉత్తర్వులు అందరికీ వర్తిస్తాయనేది గుర్తించాలి.

–ఆచార్య బి.కరుణ, రిజిస్ట్రార్, ఏఎన్‌యూ

ప్రభుత్వ చర్యను అందరూ హర్షించాలి..

సమాజంలోని పౌరులందరి హక్కులు, స్వేచ్ఛ కాపాడటం ప్రభుత్వాల బాధ్యత. ప్రజాప్రయోజనాల కోసం ప్రభుత్వం చేపట్టిన చర్యలను అందరూ హర్షించాలి.

– ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రెక్టార్, ఏఎన్‌యూ

ఎవరికీ ఇబ్బంది లేనిచోట నిర్వహించుకోవాలి..

ఎవరికీ ఇబ్బంది లేనిచోట బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించుకోవాలి. అసలు సమావేశాలే నిర్వహించకూడదని ఆదేశాలు జారీ చేస్తే ఇబ్బంది కానీ ఎవరికీ ఇబ్బంది కలిగించకుండా జరుపుకోండంటే తప్పెలా అవుతుంది?

– ఆచార్య కె.సునీత, ఓఎస్‌డీ, ఏఎన్‌యూ

ఈ జీవోతో ఇబ్బందులేమీ లేవు..

జీవో నంబర్ 1తో ఇబ్బందులేమీ లేవు. దీనిలోని వాస్తవాలను అందరూ గ్రహించాలి. అన్ని వర్గాల ప్రయోజనాలను కాపాడే చర్యలను ఎవరు చేపట్టినా హర్షించాలి.

–ఆచార్య కె.మధుబాబు, డీన్, సీడీసీ, ఏఎన్‌యూ


సంక్రాంతి కానుకగా

వందే భారత్

- 15న సికింద్రాబాద్–విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభం
- ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు ప్రజలకు సంక్రాంతి కానుకగా వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును కేంద్ర ప్రభుత్వం అందించనుంది. జనవరి 15న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 8వ వందే భారత్ రైలును ఉదయం 10:00 గంటలకు ఢిల్లీ నుంచి వర్చువల్ వేదికగా పచ్చజెండా ఊపి ప్రారంభించనున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి విశాఖపట్నం మధ్య సుమారు 8 గంటల్లో నడిచే ఈ రైలు ప్రారంభోత్సవ కార్యక్రమం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ 10వ నెంబర్ ప్లాట్‌ఫాం వద్ద జరుగనుంది. ఈ కార్యక్రమానికి కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి హాజరుకానున్నారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు వరంగల్, ఖమ్మం, విజయవాడ, రాజమండ్రిల్లో ఆగనుంది. వాస్తవానికి వందే భారత్ రైలుకు పచ్చజెండా, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులకు శ్రీకారం, ఇతర అభివృద్ధి పనుల నిమిత్తం ప్రధాని ఈ నెల 19న తెలంగాణకు రావాల్సి ఉంది. అయితే ప్రీ బడ్జెట్ భేటీల్లో భాగంగా అనేక వర్గాలతో గత కొన్ని రోజులుగా ప్రధాని స్వయంగా సంప్రదింపులు జరుపుతుండటం, త్వరలో జరగనున్న కేబినెట్ విస్తరణకు కసరత్తు నేపథ్యంలో పర్యటన వాయిదా పడినట్టు చర్చ జరుగుతోంది. పర్యటన వాయిదాపై పీఎం కార్యాలయం కిషన్‌రెడ్డి, రాష్ట్ర బీజేపీ నేతలకు బుధవారం సమాచారం ఇచ్చినట్లు తెలిసింది.

వందేభారత్ రైలుపై రాళ్లదాడి



రాళ్ల దాడిలో దెబ్బతిన్న వందేభారత్ కోచ్ గ్లాసు

తాటిచెట్లపాలెం/అల్లిపురం (విశాఖ): విశాఖకు వచ్చిన వందేభారత్ రైలుపై ఆకతాయిలు రాళ్లతో దాడి చేశారు. దీంతో రెండు అద్దాలు పాక్షికంగా దెబ్బతిన్నట్లు సమాచారం. బుధవారం సాయంత్రం విశాఖ రైల్వే స్టేషన్ నుంచి కోచింగ్ కాంప్లెక్సుకు తరలిస్తున్న సమయంలో కంచరపాలెం వద్ద కొందరు ఆకతాయిలు రాళ్లు విసిరారు. ఈ ఘటనపై విచారణ చేపట్టాలని రైల్వే భద్రతా దళానికి వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. రాళ్ల దాడికి పాల్పడిన వారిని గుర్తించి, అదుపులోకి తీసుకొనేందుకు రైల్వే పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ప్రతిష్టాత్మకమైన వందే భారత్ రైలుపై దాడిని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. నిందితులను గుర్తించడంలో రైల్వే పోలీసులకు సహకరించాలని నగర పోలీసులు కూడా రంగంలోకి దిగారు. పోలీసు కమిషనర్ శ్రీకాంత్ ఆదేశాల మేరకు వెస్ట్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి సంఘటన స్థలానికి చేరుకుని ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

తెలంగాణ

తెలంగాణ కొత్త సీఎస్ శాంతికుమారి

- సీఎం కేసీఆర్ ఆదేశాలతో ఉత్తర్వులు జారీ
- తెలంగాణ తొలి మహిళా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా రికార్డు
- ఆ వెంటనే సచివాలయంలో బాధ్యతలు స్వీకారం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా 1989 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి ఎ.శాంతికుమారి నియమితులయ్యారు. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు ఆమెను సీఎస్‌గా నియమిస్తూ సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి వి.శేషాద్రి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆమె తెలంగాణ రాష్ట్ర తొలి మహిళా సీఎస్‌గా చరిత్ర కెక్కారు. గత సీఎస్ సోమేశ్‌కుమార్‌ను ఏపీ కేడర్‌కు వెళ్లాలని ఆదేశిస్తూ మంగళవారం రాష్ట్ర హైకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో కొత్త సీఎస్ నియామకం అనివార్యంగా మారిన విషయం తెలిసిందే. సీఎస్ రేసులో ఆర్థిక, పురపాలక, అటవీ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు కె.రామకృష్ణారావు, అరవింద్ కుమార్, శాంతికుమారిల పేర్లు ప్రముఖంగా వినిపించగా, శాంతికుమారి వైపు సీఎం కేసీఆర్ మొగ్గు చూపారు. సీఎస్‌గా నియామకం జరిగిన వెంటనే ఆమె ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఎం ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. సీఎం కేసీఆర్‌తో సమావేశం తర్వాత శాంతికుమారి బీఆర్‌కేఆర్ భవన్‌లోని రాష్ట్ర సచివాలయం చేరుకుని సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించారు.

కేసీఆర్‌తో కలిసి పనిచేసిన శాంతికుమారి

శాంతికుమారి 1999 నవంబర్ నుంచి 2001 జూన్ వరకు మెదక్ జిల్లా కలెక్టర్‌గా పనిచేయగా, అప్పట్లో ఉమ్మడి మెదక్ జిల్లాలోని సిద్దిపేట నుంచి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించిన కేసీఆర్ డిప్యూటీ స్పీకర్‌గా వ్యవహరించారు. 2015–2018 వరకు శాంతికుమారి సీఎంఓ ముఖ్యకార్యదర్శిగా ఉన్నారు. ఈ విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కొన్నేళ్లపాటు కలిసిపనిచేసిన అనుభవం ఉండడంతో పాటు నమ్మకస్తురాలు కావడం.. ఎన్నికల సంవత్సరంలో ఆమెను సీఎస్‌గా నియమించడానికి దోహద పడినట్టు చర్చ జరుగుతోంది. రెండేళ్ల మూడు నెలలకుపైగా సర్వీసు ఉన్న శాంతికుమారి 2025 ఏప్రిల్‌లో పదవీ విరమణ చేస్తారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శాంతికుమారి మెరైన్ బయాలజీలో ఎమ్మెస్సీ, అమెరికాలో ఎంబీఏ చదివారు.



● 'ఆర్‌ఆర్‌ఆర్'లో రామ్ చరణ్, ఎన్టీఆర్

చరిత్రాత్మకం



● ఎం. ఎం. కీరవాణి

తెలుగు నాటు యమా హిట్టు

**నాటుదనంలో మాయామర్మం ఉండదు.
నాటుదనంలో కల్లాకపటం ఉండదు.
నాటుదనంలో హొయలు వగలు ఉండవు.
నాటుదనంలో తళుకూ బెలుగూ ఉండవు.
నాటుదనం గ్రామీణం.
నాటుదనం భోళాతనం.
నాటుదనం సాంస్కృతిక వరం.
నాటుదనం మేకప్ లేని సౌందర్యం.
అందుకే ప్రపంచం మెచ్చింది.
తెలుగు నాటుదనానికి చరిత్రాత్మక గుర్తింపునిచ్చింది.
78 ఏళ్లుగా ఇస్తున్న హాలీవుడ్ గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్‌లో భారతదేశం నుంచి అందునా తెలుగు నుంచి మొట్ట మొదటిసారి 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్'గా ఆర్.ఆర్.ఆర్ లోని 'నాటు నాటు' పాట అవార్డు గెలుచుకుంది.
సంగీత దర్శకుడు కీరవాణి తెలుగు కీర్తిని పెంచారు.
రాసినవారు, పాడినవారు, ఆడినవారు, ఆడించినవారు, ఆదరించిన తెలుగు కుటుంబాలు సెలబ్రేట్ చేసుకోవాల్సిన సమయం ఇది.
పరమ నాటు సమయం.**

పాట కూడా ఒక్కోసారి బాకులా గుచ్చుకుంటుంది. గజమో రెండు గజాలో దూరం కాకుండా సముద్రాలు దాటి తియ్యటి గాటు పెడుతుంది. పల్లవి చెంప నిమురుతుంది. చరణం గుండె తడుముతుంది. పదం పదం కలిసి జ్వరం తెప్పించి వెర్రెక్కిస్తుంది. భాష తెలియని భావం అక్కర్లేని నాదం ముందుకు దుముకుతుంది. హోరున లాకే జలపాతం కింద నిలబడినవాడి జాతి ఏదైతే ఏంటి... రీతి ఏదైతే ఏంటి... నిలువునా తడిపేస్తుంది. పాట కూడా అంతే.

పొలం గట్టు దుమ్ములోన పోట్ల గిత్త దూకినట్టు
పోలేరమ్మ జాతరలో పోతరాజు ఊగినట్టు...

అది గుంటూరు మిర్చి పొలం కావచ్చు. బహుశా నెల్లూరు పోలేరమ్మ జాతర కావచ్చు. కాకుంటే లష్కర్ బోనాలు కావచ్చు. అయితే మేడారం మహా సంగమం కావచ్చు. తెలుగు దనం అది. తెలుగు ఘనం. తెలుగు జనం. తెలుగు జయం. గ్రామీణ తేటదనం. అమాయక నాటుదనం. అది ఊరి పెద్దమనిషి తలపాగ. పేదరైతు భుజాన కండువ. నిండు గాజుల ఇల్లాలి నుదుటి బొట్టు. రోకలి దంచే యువతి చెంపన చెమట చుక్క. అది నిర్మల్ కొయ్య బొమ్మ. కొండపల్లి పూలకొమ్మ. ఉత్త నాటు సౌందర్యం. బహుమేటి సౌందర్యం.

నాటు నాటు నాటు నాటు నాటు వీర నాటు
నాటు నాటు నాటు నాటు నాటు ఊర నాటు

ఈ నాటు ఇప్పుడు ప్రపంచాన్ని గెలిచింది. సినిమా ద్వారా అయితేనేమి తెలుగు మాట ఖండాతరాలలో మోగింది. తెలుగు బాణీ దేశదేశాల వాళ్లతో చిందులు వేయించింది. తెలుగు దరువు భూగోళాన్ని దండనకర ఆడించింది. తెలుగువారికి ఏం తక్కువ? మనకంటే ఎవరు ఎక్కువ?

చులకన చేయని ఘనత

ఆర్.ఆర్.ఆర్‌లో 'నాటు నాటు' పాట వచ్చే సందర్భం ఆంగ్లేయులు తమను తాము గొప్ప చేసుకుంటూ తెలుగు వారికి ఏం వచ్చు అని ప్రశ్నించే సందర్భం. వాళ్ల స్టయిలు డాన్సులు, నైను స్టెప్పులే గొప్ప అనుకుంటూ కథా నాయకులైన రామ్‌ను, భీమ్‌ను నిలదీసే సందర్భం. దానికి జవాబుగా తెలుగువారు రంగంలోకి దిగితే పరిస్థితి ఎంత నాటుగా ఉంటుందో హీరోలు చెప్పాలి. అందుకు పాట కావాలి. గీత రచయిత చంద్రబోస్‌కు సిట్యుయేషన్ చెప్పి 'నువ్వు ఏదైనా రాయి మన ఘనత చాటుకునేలా ఉండాలి. ఎదుటివారిని అవమానించేలా తిట్టేలా ఉండకూడదు' అన్నాడు దర్శకుడు రాజమౌళి. ఇంగ్లిష్ వాణ్ణి తిట్టకుండా చెంప పగులగొట్టాలన్న మాట. చల్లగరిగ (జయశంకర్ భూపాలపల్లి జిల్లా) లాంటి చిన్న పల్లెలో పుట్టిన చంద్రబోస్‌కి తెలుగు వేగం, తెలంగాణ యోగం తెలియనిది ఏముంది? పాట పుట్టింది.

కిర్రు సెప్పులేసుకుని కర్రసాము సేసినట్టు
మర్రిసెట్టు నీడలోన కుర్రగుంపు కూడినట్టు
ఎర్రజొన్న రొట్టెలోన మిరపతొక్కు కలిపినట్టు
నా పాట చూడు
నాటు నాటు నాటు నాటు నాటు నాటు వీర నాటు

చంద్రబోస్ మొత్తం పాట రాశాక కీరవాణి దానికి ట్యూన్ చేశారు. పాట రాశాక ఫైనల్ వెర్షన్‌గా పాట బయట పడటానికి మధ్య దాదాపు 19 నెలలు ఉన్నాయి కరోనా వల్ల. 'లోపలున పాన మంతా దుముకు దుముకులాడేలా' చంద్రబోస్ రాయడం, 'ఒంటిలోన రగత మంతా రంకెలేసి ఎగిరేలా' కీరవాణి ట్యూన్ చేయడం... దాంతో అది కోటి ఈలల పాటైంది. జపాన్ వాడి ఈల.. రష్యావాడి ఈల... చైనా వాడిదీ... వమెరికా వాడిదీనూ.



● చంద్రబోస్


పాదాల తుఫాను

రికార్డింగ్ థియేటర్‌లో వాయుగుండం బలపడింది. ఇక అది తెర మీద తుఫానులా తాకాలి. గంటకు 240 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయాలి. పులి ఒకరు, బెబ్బులి ఒకరుగా ఇద్దరు హీరోలు... ఎన్టీఆర్, రామ్ చరణ్ సిద్ధంగా ఉన్నారు. వీరి కాళ్లకు గజ్జెలు కట్టే వీరుడు కావాలి. ప్రేమ రక్షిత్. ఈ పాండిచ్చేరి కుర్రాడు హైదరాబాద్‌నే తన రెండో ఇల్లు చేసుకున్నాడు. కొరియోగ్రఫీని ఒంట్లో నింపుకున్నాడు. 'ఈ పాటను నువ్వు ఎలాగైనా కంపోజ్ చెయ్. కాని ఇద్దరు హీరోలు ఈక్వల్‌గా కనిపించాలి' అనేది దర్శకుడి షరతు. 'ఎవరి ఎనర్జీ లెవల్ కూడా తగ్గినట్టుగా స్క్రీన్ మీద ఉండరాదు' అన్నాడు దర్శకుడు. ప్రేమ్ రక్షిత్ పాటను అందుకున్నాడు. నెల రోజులు తపస్సు చేశాడు. హుక్ స్టెప్ (వైరల్ అయిన స్టెప్) కోసం యాభై రకాల మూమ్‌మెంట్స్ సిద్ధం చేస్తే దర్శకుడికి ఇప్పుడు ఉన్నది నచ్చింది. పాట కోసం మొత్తం 94 రకాల మూవ్‌మెంట్స్‌ని కంపోజ్ చేశాడు ప్రేమ్ రక్షిత్. పాటను ఉక్రెయిన్‌లో ప్రెసిడెంట్ ప్యాలెస్ దగ్గర 20 రోజులు షూట్ చేశారు. ఇద్దరూ సింగిల్ టేక్ ఆర్టిస్టులే అయినా పర్‌ఫెక్ట్ సింక్ కోసం దాదాపు 46 రీటేకులు అయ్యాయి.

నాటు నాటు నాచో నాచో

తెలుగు తమిళ మలయాళ హిందీ భాషల్లో నాటు నాటు వీర నాటు హిట్ కొట్టింది. ఇందులోని హుక్ స్టెప్‌ను ఆబాల గోపాలం ఇమిటేట్ చేసింది. యూ ట్యూబ్ షాట్స్, ఇన్‌స్టా రీల్స్ వందల వేలుగా తయారయ్యాయి. సల్మాన్ ఖాన్, ఆమిర్ ఖాన్ కూడా ఈ స్టెప్‌ను రిపీట్ చేశారు. ప్రపంచమంతా తెలుగు మోత మోగింది. ఒకప్పుడు రాజ్ కపూర్ చేసిన 'ఆవారా హూ' పాట ఇంత పెద్ద హిట్ అయ్యింది. తమిళంలో రెహమాన్ చేసిన 'తిల్లానా తిల్లానా' ఇలాగే హిట్ అయ్యింది. ఇప్పుడు తెలుగు వంతు.

మన జానపదం, మన నాటుదనం ఇప్పుడు కేకమీదున్నాయి. ఇది తెలుగు ఘనం. ఇది తెలుగు జయం.



● ప్రేమ్ రక్షిత్



● ప్రణతి, ఎన్టీఆర్, రాజమౌళి, రమ, శ్రీవల్లి, కీరవాణి, ఉపాసన, రామ్‌చరణ్, కార్తికేయ, శోభు యార్లగడ్డ

గోల్డెన్ నాటు

ఊర నాటు స్టెప్ విశ్వ విజేత అయింది. తెలుగు సినిమా సత్తాను ప్రపంచవ్యాప్తంగా చాటిన 'ఆర్‌ఆర్‌ఆర్'లోని 'నాటు నాటు.. ఊర నాటు.. వీర నాటు' పాట గ్లోబల్‌గా గెలిచింది. 80వ గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్‌లో 'బెస్ట్ ఒరిజినల్ స్కోర్' విభాగంలో చిత్రసంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణికి అవార్డు దక్కేలా చేసింది. భారతీయ కాలమానం ప్రకారం బుధవారం ఉదయం కాలిఫోర్నియాలోని బెవర్లీ హిల్స్‌లో గల 'ది బెవర్లీ హిల్టన్' వేదికగా గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్ వేడుక జరిగింది. హాలీవుడ్ ఫారిన్ ప్రెస్ అసోసియేషన్ (హెచ్‌ఎఫ్‌పీఏ) మంగళవారం రాత్రి విజేతలకు అవార్డులు ప్రదానం చేసింది. బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగం విజేతను ప్రకటిస్తూ, 'అండ్ ది అవార్డ్ గోస్ టు నాటు నాటు...' అని హోస్ట్ ప్రకటించగానే రాజమౌళి, ఎన్టీఆర్, రామ్ చరణ్, ఇంకా 'ఆర్‌ఆర్‌ఆర్' యూనిట్ నిలబడి, చప్పట్లతో ఆనందం వ్యక్తం చేశారు. ఇంకా వీక్షకుల కరతాళ ధ్వనుల మధ్య ఎం.ఎం. కీరవాణి అవార్డు అందుకున్నారు.

రిహన్నా.. లేడీ గాగాలతో పోటీ పడి..

'బెస్ట్ ఒరిజినల్ సాంగ్-మోషన్ పిక్చర్' కేటగిరీలో భారత్ నుంచి ఒక పాటకు అవార్డు లభించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. టేలర్ స్విఫ్ట్, రిహన్నా, లేడీ గాగా వంటి ప్రపంచ ప్రఖ్యాత గాయకుల పాటలతో పోటీలో నిల్చి కీరవాణి 'నాటు నాటు...' గెలిచింది. కాగా 'బెస్ట్ ఒరిజినల్ స్కోర్' విభాగంతో పాటు 'బెస్ట్ పిక్చర్-నాన్ ఇంగ్లిష్' కేటగిరీలోనూ 'ఆర్‌ఆర్‌ఆర్' నామినేట్ అయినప్పటికీ అవార్డు మాత్రం అర్జెంటీనా చారిత్రక చిత్రం 'అర్జెంటీనా 1985'కు దక్కింది.

ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన 'ఆర్‌ఆర్‌ఆర్' ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకాదరణ పొంది, సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఇప్పటికే పలు అంతర్జాతీయ అవార్డులు అందుకున్న ఈ చిత్రం ఆస్కార్ అవార్డ్స్ తర్వాత అంతటి ప్రతిష్ఠాత్మకంగా భావింపబడుతున్న 'గోల్డెన్ గ్లోబ్' అవార్డు అందుకోవడం పట్ల ప్రపంచవ్యాప్తంగా తెలుగు సినిమా ప్రేక్షకులు అభినందనలు కురిపించారు. ఇక ఈ వేడుకకు రాజమౌళి, కీరవాణి, ఎన్టీఆర్, రామ్ చరణ్ సతీసమేతంగా హాజరయ్యారు. కీరవాణి ఉద్వేగభరిత స్పందన, హీరోలిద్దరి ఎనర్జిటిక్ స్పీచ్.. ప్రపంచ ప్రేక్షకులను ఆకట్టుకుంది. కాగా 'ఆర్‌ఆర్‌ఆర్'కి గోల్డెన్ గ్లోబ్ అవార్డు వచ్చిన సందర్భంగా అమితాబ్ బచ్చన్, రజనీకాంత్, కమల్‌హాసన్, చిరంజీవి, బాలకృష్ణ తదితర సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

థ్యాంక్యూ శ్రీవల్లి - ఎం.ఎం. కీరవాణి

అవార్డు స్వీకరించిన అనంతరం ఎం.ఎం. కీరవాణి మాట్లాడుతూ– ''ధన్యవాదాలు.. ప్రతిష్ఠాత్మక గోల్డెన్ గ్లోబ్ అవార్డు అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఈ ఉద్వేగాన్ని ఈ ప్రాంగణంలో ఇక్కడే కూర్చుని ఉన్న నా వైఫ్ (శ్రీవల్లి)తో షేర్ చేసుకోవడం నాకు ఆనందంగా ఉంది. మామూలుగా అవార్డులు అందుకున్నప్పుడు 'నిజానికి ఇది నాది కాదు.. మరొకరికి దక్కుతుంది' అని అంటుంటారు. అందుకని ఇలాంటి అవార్డు అందుకున్నప్పుడు నేను అలా మాట్లాడకూడదని ప్లాన్ చేసుకున్నాను. కానీ సారీ... (నవ్వుతూ) నేను ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నాను. ఎందుకంటే ఇవి నా హృదయంలోంచి వచ్చే మాటలు. వరుస క్రమంలో చెప్పాలంటే ముందుగా ఈ అవార్డు నా సోదరుడు, ఈ సినిమా డైరెక్టర్ రాజమౌళి విజన్‌కి దక్కుతుంది. నా పనిని నమ్మి, నన్ను సపోర్ట్ చేస్తున్నందుకు తనకు ధన్యవాదాలు. తర్వాత ప్రేమ్ రక్షిత్ గురించి చెప్పాలి. అద్భుతమైన కొరియోగ్రఫీ చేశారు. తను లేకపోతే ఈ పాట లేదు. తర్వాత ఈ పాటకు అన్నీ సమకూర్చిన కాలభైరవ, అద్భుతంగా రాసిన రచయిత చంద్రబోస్, కాలభైరవతో కలిసి ఎనర్జిటిక్‌గా పాడిన రాహుల్ సిప్లిగంజ్, ఫుల్ స్టామినాతో డ్యాన్స్ చేసిన ఎన్.టి. రామారావు, రామ్‌చరణ్‌లకు ధన్యవాదాలు. చివరిగా.. ఈ పాటకు ప్రోగ్రామ్ చేసిన సాహు సిద్దార్థ్, జీవన్‌బాబులకు కూడా ధన్యవాదాలు. ఇంకొన్ని వర్డ్స్ షేర్ చేసుకోవాలనుకుంటున్నాను. అదేంటంటే.. థ్యాంక్యూ శ్రీవల్లి... థ్యాంక్యూ వల్లీ'' అంటూ ఉద్వేగంగా ప్రసంగించారు.



20 రోజులు.. 20 కోట్లు - 'ఆర్‌ఆర్‌ఆర్' నిర్మాత డీవీవీ దానయ్య

''మా 'ఆర్‌ఆర్‌ఆర్'లోని 'నాటు నాటు..' పాటకు ప్రతిష్ఠాత్మక అవార్డు దక్కడం ఆనందంగా ఉంది'' అని చిత్రనిర్మాత డీవీవీ దానయ్య అన్నారు. ఇంకా ఆయన మాట్లాడుతూ – ''ఈ పాట తీసేముందు హీరోలిద్దరూ 30 రోజులు ప్రాక్టీస్ చేశారు. ఆ తర్వాత 20 రోజులు చిత్రీకరణకు పట్టింది. ఈ ఒక్క పాటకే దాదాపు రూ. 20 కోట్లు ఖర్చు పెట్టాం. ఉక్రెయిన్‌లో తీశాం. ఎన్టీఆర్, రామ్‌చరణ్‌గార్లతో పాటు అక్కడి జూనియర్ ఆర్టిస్టులు, డ్యాన్సర్లు.. ఇలా ప్రతిరోజూ రెండువేల మంది ఉండేవారు. కీరవాణిగారు ఇచ్చిన గొప్ప ట్యూన్‌కి చంద్రబోస్‌గారు గొప్పగా రాస్తే, ప్రేమ్ రక్షిత్ అద్భుతంగా కొరియోగ్రఫీ చేశారు. హీరోలిద్దరూ ఎంతో కష్టపడి చేశారు. ఇద్దరికీ కాళ్లు నొప్పులు ఉండేవి. కాసేపు గ్యాప్ తీసుకుని, చేసేవారు. నొప్పులతోనే డ్యాన్స్ చేశారు'' అన్నారు. ఒక్క పాటకు 20 కోట్లంటే ఎక్కువ ఖర్చు అనిపించలేదా? అనడిగితే – ''లేదు. రాజమౌళిగారి మీద నమ్మకంతో వెనకాడలేదు. ఇవాళ ఈ పాట ప్రపంచవ్యాప్తంగా అందర్నీ ఆకట్టుకుని మా నమ్మకాన్ని నిలబెట్టింది'' అన్నారు డీవీవీ దానయ్య.

ఐరన్ మ్యాన్ అంటే ఇష్టం - ఎన్టీఆర్



''రాజమౌళితో 'ఆర్‌ఆర్‌ఆర్' చేస్తున్నప్పుడే ఈ సినిమా ఎక్కువమందికి రీచ్ అవుతుందని తెలుసు. ఆయనతో సినిమాలు చేయడం వల్ల, ఆయన ట్రాక్ రికార్డుని దృష్టిని పెట్టుకోవడం వల్ల తప్పకుండా మేం గెలుస్తామనే నమ్మకం ఏర్పడింది'' అన్నారు ఎన్టీఆర్. మార్వెల్ సినిమాల గురించి విలేకరి అడిగితే... ''మార్వెల్ సినిమా చేయాలని ఉంది. నా ఫ్యాన్స్ దీని గురించి క్రేజీగా మాట్లాడుకుంటున్నారు. నాకు ఐరన్ మ్యాన్ అంటే ఇష్టం. ఆ క్యారెక్టర్ మాకు దగ్గరగా అనిపిస్తుంది'' అని అన్నారు. అది మాత్రమే కాదు.. ''ఇవాళ మీ బర్త్‌డే కదూ.. హ్యాపీ బర్త్‌డే... మీకో చిన్న గిఫ్ట్. మీకు నచ్చుతుందనుకుంటున్నా'' అంటూ ఓ గిఫ్ట్‌ని విలేకరికి అందజేశారు ఎన్టీఆర్.

మాటలు రావడం లేదు. సంగీతానికి హద్దులు లేవు. నాకు 'నాటు నాటు..' లాంటి పాట ఇచ్చిన పెద్దన్నా (కీరవాణి) మీకు శుభాకాంక్షలు. ధన్యవాదాలు. ఇది (అవార్డు) చాలా ప్రత్యేకమైనది. 'నాటు నాటు...' స్టెప్ వేస్తూ ప్రపంచవ్యాప్తంగా పాపులర్ చేసిన ఫ్యాన్స్‌కి ధన్యవాదాలు.
– రాజమౌళి

అది అందమైన టార్చర్ - రామ్‌చరణ్

''మా టీమ్ కష్టమే మమ్మల్ని ఇంతదాకా తీసుకువచ్చింది. అదొక అందమైన టార్చర్. సౌత్ ఇండియా నుంచి సినిమాలకు ఎంతో పాపులర్ అయిన ఈ ప్రాంతానికి రావడం, ప్రశంసలు పొందడం మాకు ఎనర్జీని ఇచ్చే విషయం. నాకిష్టమైన ప్లేస్ ఇది. హాలిడే ట్రిప్స్‌కి వస్తుంటాను. ఈ 80వ గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్‌కి రావడం ఆనందంగా ఉంది'' అన్నారు రామ్‌చరణ్. కాగా 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రం 'మార్వెల్' మూవీస్‌ని తలపించిందని, మీరు మార్వెల్ యాక్టర్‌లా కనిపించారని, మార్వెల్ స్టార్‌గా, సూపర్ హీరోగా చేయాలనుకుంటున్నారా? అని రామ్‌చరణ్‌ని ఓ విలేకరి అడగ్గా, ''తప్పకుండా చేస్తాను. నా ఫేవరెట్ మార్వెల్ మూవీ 'కెప్టెన్ అమెరికా'' అన్నారు. అవార్డు వేడుకకు ముందు రెడ్ కార్పెట్ పై ఇంకా మాట్లాడుతూ – ''ఇక్కడి టాప్ టెక్నీషియన్లతో పని చేయాలని ఉంది. అలాగే మా భారతదేశంలో అద్భుతమైన సూపర్ హీరోలు ఉన్నారు. వారి నటనని ఇక్కడి దర్శకులు ఎక్స్‌పీరియన్స్ చేయాల్సిన అవసరం ఉంది'' అని రామ్‌చరణ్ అన్నారు. ఒకవేళ మీ సినిమాకి అవార్డు వస్తే అని విలేకరి అడగ్గా– ''మా డైరెక్టర్ రాజమౌళి గారిని ఆ అవార్డుని నాకు ఇవ్వమని అడుగుతాను. కొన్ని రోజులు మా ఇంట్లో ఉంచుకుని ఆ తర్వాత వెనక్కి ఇచ్చేస్తాను'' అన్నారు.

ఇద్దరు స్టార్స్‌కి కొరియోగ్రాఫ్ చేయడం అనేది పెద్ద సవాల్. ఎందుకంటే ఒక్కో స్టార్‌కి ఒక్కో స్టైల్ ఉంటుంది. 'నాటు నాటు..'కి రెండు స్టయిల్స్ తీసుకుని, ఒకే స్టయిల్‌గా మార్చడం జరిగింది. నేను సవాల్‌గా తీసుకుని ఈ పాట చేశాను. కొరియోగ్రాఫ్ చేయడానికి నాకు రెండు నెలలు పట్టింది. చిత్రీకరణకు 20 రోజులు. 43 రీటేక్స్ తీసుకోవడం జరిగింది. మొదట్లో కొంచెం భయం అనిపించింది. ఎందుకంటే ఇద్దరు స్టార్స్‌ని సమానంగా చూపించాలి. అందుకే చివరి వరకూ పాటకు మెరుగులు దిద్దుతూనే ఉండేవాళ్లం.
– ప్రేమ్ రక్షిత్, కొరియోగ్రాఫర్

కీరవాణి సార్‌తో నా ప్రయాణం ఒక దశాబ్దం నాటిది. సార్ నన్ను నమ్మి 'నాటు నాటు..'ని నాలుగు భాషల్లో పాడేలా చేశారు. ఇది నాకు అద్భుతమైన అవకాశం. 'ఆర్‌ఆర్‌ఆర్'కి పాడటం అనేది నాకో పెద్ద చాలెంజ్. నిరూపించుకోవాలని చాలా కష్టపడి పాట పాడాను. ఈ పాటను పెద్ద హిట్ చేసినందుకు యావత్ భారతదేశానికి ధన్యవాదాలు.



– రాహుల్ సిప్లిగంజ్, గాయకుడు


''నా జీవితంలో మరచిపోలేని మధుర క్షణాలివి. ఎందుకంటే 'నాటు నాటు' పాట విశ్వ వేదిక మీద విజయం సాధించింది. రచయితగా చాలా చాలా సంతోషంగా, గర్వంగా ఉంది'' అన్నారు చంద్రబోస్. ''28 ఏళ్ల ప్రస్థానం, 850 చిత్రాలు, 3,600లకు పైగా పాటలు.. మొట్ట మొదటి పాట 'తాజ్‌మహల్'లోని 'మంచు కొండల్లోన చంద్రమా..' నుండి ఇప్పటి 'వాల్తేరు వీరయ్య'లోని పాట వరకూ.. ప్రతి పాటకూ తపస్సే, మథనమే జ్వలనమే. 3500 సార్లకు పైగా తపస్సు చేస్తే ఒక్కసారైనా భగవంతుడు ప్రత్యక్షమవుతాడు కదా, ఈసారి 'నాటు నాటు..' పాటకు భగవంతుడు ప్రత్యక్షం అయి, వరం ఇచ్చాడని భావిస్తున్నాను.
– చంద్రబోస్, రచయిత

ప్రతి భారతీయుడిని గర్వించేలా చేసింది
– నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి



''ఈ విజయం చాలా ప్రత్యేకం. కీరవాణి, ప్రేమ్ రక్షిత్, కాలభైరవ, చంద్రబోస్, రాహుల్ సిప్లిగంజ్‌లకు అభినందనలు. ఎస్.ఎస్. రాజమౌళి, జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్‌తో పాటు 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్ర బృందానికి అభినందనలు. ఈ ప్రతిష్ఠాత్మక గౌరవం ప్రతి భారతీయుడిని ఎంతగానో గర్వించేలా చేసింది'' అన్నారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. చిత్ర బృందాన్ని అభినందిస్తూ ట్వీట్ చేశారు.

మరిన్ని విజయాలు సాధించాలి
– బిశ్వభూషణ్ హరిచందన్, గవర్నర్



'నాటు నాటు' గోల్డెన్ గ్లోబ్ అవార్డు సాధించినందుకు 'ఆర్‌ఆర్‌ఆర్' యూనిట్‌ని గవర్నర్ బిశ్వ భూషణ్ హరిచందన్ అభినందించారు. ఈ పాటకు అవార్డు రావడం ద్వారా తెలుగు సినిమా ప్రపంచ సంగీత వేదికపై గర్వించదగ్గ స్థాయిలో నిలిచిందన్నారు. తెలుగు సినీ పరిశ్రమ భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని గవర్నర్ ఆకాంక్షించినట్లుగా రాజ్ భవన్ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి.

ఆర్‌ఆర్‌ఆర్ టీమ్‌కు అభినందనలు
– వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఏపీ ముఖ్యమంత్రి




ప్రతిష్ఠాత్మకమైన గోల్డెన్ గ్లోబ్ అవార్డు సాధించి తెలుగుజెండాను రెపరెపలాడించిన 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్ర యూనిట్‌ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. 'ఆర్‌ఆర్‌ఆర్' సాధించిన ఈ విజయాన్ని చూసి గర్వపడుతున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ట్వీట్ చేశారు. చిత్ర మ్యూజిక్ డైరెక్టర్ ఎం.ఎం. కీరవాణి, దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి, హీరోలు తారక్ (జూనియర్ ఎన్టీఆర్), రామ్ చరణ్‌తోపాటు 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమా టీమ్ మొత్తానికి అభినందనలు తెలిపారు.

తెలుగు పాటకు దక్కిన గౌరవం
– కిషన్ రెడ్డి, కేంద్రమంత్రి



'నాటు నాటు' పాటకు గోల్డెన్ గ్లోబ్ అవార్డు దక్కడం భారతీయ సంగీతానికి, ప్రత్యేకంగా తెలుగు పాటకు దక్కిన అద్భుత గౌరవమని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి కొనియాడారు. ఈ సందర్భంగా చిత్ర సంగీత దర్శకుడు కీరవాణి, దర్శకుడు రాజమౌళి, నటులు రామ్‌చరణ్, ఎన్టీఆర్‌తో పాటు యావత్ చిత్ర యూనిట్‌కు ఆయన అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో మన సంగీతం, మన కొరియోగ్రఫీ, మన దర్శకత్వం, మన చిత్రాలు మరింత గుర్తింపును అందుకోవాలని కోరుకుంటున్నట్లు తెలియజేశారు.



ప్రపంచ టీటీ చాంపియన్‌షిప్ పోటీలకు శ్రీజ అర్హత

దక్షిణాఫ్రికాలో ఈ ఏడాది మే నెలలో జరిగే ప్రతిష్టాత్మక ప్రపంచ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీలకు మహిళల సింగిల్స్ విభాగంలో జాతీయ చాంపియన్, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ, మనిక బత్రా అర్హత పొందారు. దోహాలో జరుగుతున్న ఆసియా క్వాలిఫయింగ్ టోర్నీలో వీరిద్దరు ప్రిక్వార్టర్ ఫైనల్ చేరి ఈ బెర్త్‌లు ఖరారు చేసుకున్నారు. పురుషుల సింగిల్స్‌లో ఆచంట శరత్ కమల్... పురుషుల డబుల్స్‌లో శరత్ కమల్–సత్యన్.. మిక్స్‌డ్ డబుల్స్‌లో మనిక బత్రా–సత్యన్ కూడా ఈ మెగా ఈవెంట్‌కు అర్హత పొందారు.

బోపన్న, రామ్‌కుమార్ జోడీలు ఓటమి



అడిలైడ్ ఓపెన్ ఇంటర్నేషనల్–2 ఏటీపీ టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)–ఎబ్డెన్ (ఆస్ట్రేలియా)... రామ్‌కుమార్ (భారత్)–రేయస్ వరేలా (మెక్సికో) జోడీలు ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిపోయాయి. బుధవారం జరిగిన మ్యాచ్‌ల్లో ఐదో సీడ్ బోపన్న–ఎబ్డెన్ 6–7 (4/7), 5–7తో నికోలస్ మహుట్ (ఫ్రాన్స్)–టిమ్ ప్యుయెట్జ్ (జర్మనీ) చేతిలో... రామ్–వరేలా 3–6, 4–6తో అరెవాలో (ఎల్ సాల్వడోర్)–రోజర్ (నెదర్లాండ్స్) చేతిలో ఓటమి పాలయ్యారు.

హైదరాబాద్ వన్డే టికెట్లన్నీ 'ఆన్‌లైన్'లోనే

- ఈ నెల 18న భారత్, కివీస్ మ్యాచ్
- 13 నుంచి 'పేటీఎం'లో టికెట్ల విక్రయం



సాక్షి, హైదరాబాద్: దాదాపు నాలుగు నెలల క్రితం హైదరాబాద్‌లో టి20 మ్యాచ్ టికెట్ల అమ్మకాల సందర్భంగా తీవ్ర రచ్చ జరిగింది. తోపులాటలు, పోలీసుల లాఠీఛార్జీతో పాటు పలువురు గాయపడి పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) పనితీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. దాంతో ఈసారి హెచ్‌సీఏ ముందు జాగ్రత్తలపై దృష్టి పెట్టింది. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రత్యక్షంగా కౌంటర్ ద్వారా 'ఆఫ్‌లైన్' పద్ధతిలో టికెట్లు అమ్మరాదని నిర్ణయించింది. దీంతోపాటు టికెట్ల సంఖ్యపై కూడా స్పష్టతనిచ్చింది. ఈ నెల 18న ఉప్పల్ స్టేడియంలో భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగే తొలి వన్డే కోసం అన్ని టికెట్లనూ 'ఆన్‌లైన్' ద్వారానే అమ్ముతామని హెచ్‌సీఏ అధ్యక్షుడు మొహమ్మద్ అజహరుద్దీన్ ప్రకటించారు. 'పేటీఎం' వెబ్‌సైట్ ద్వారా టికెట్లను (ఒక్కొక్కరు గరిష్టంగా నాలుగు చొప్పున) అభిమానులు కొనుగోలు చేయవచ్చు. మ్యాచ్‌కు సంబంధించిన ఇతర వివరాలను ఆయన బుధవారం వెల్లడించారు. స్టేడియం సామర్థ్యం 39,112 కాగా... 9,695 కాంప్లిమెంటరీ టికెట్లు పోను 29,417 టికెట్లను ప్రేక్షకుల కోసం అందుబాటులో ఉంచారు. ఒకేరోజు అన్ని టికెట్లను అమ్మితే వచ్చే సమస్యలను దృష్టిలో ఉంచుకొని నాలుగు రోజుల పాటు అమ్మకానికి ఉంచుతున్నట్లు అజహర్ చెప్పారు. జనవరి 13, 14, 15, 16 తేదీల్లో సాయంత్రం 5 గంటల నుంచి ఆన్‌లైన్‌లో ఫ్యాన్స్‌కు టికెట్లు లభిస్తాయి. ఈ వన్డే కోసం కనిష్ట టికెట్ ధర రూ. 850, గరిష్ట టికెట్ ధర రూ. 20,650 (కార్పొరేట్ బాక్స్)గా ఉంది.

న్యూజిలాండ్ విజయం

కరాచీ: పాకిస్తాన్‌తో బుధవారం జరిగిన రెండో వన్డేలో న్యూజిలాండ్ 79 పరుగుల తేడాతో గెలిచి మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 1–1తో సమం చేసింది. మొదట న్యూజిలాండ్ 49.5 ఓవర్లలో 261 పరుగులకు ఆలౌటైంది. కాన్వే (101; 13 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ చేశాడు. విలియమ్సన్ (85; 10 ఫోర్లు) రాణించాడు. పాక్ బౌలర్లలో నవాజ్ (4/38), నసీమ్ షా (3/58) ఆకట్టుకున్నారు. 262 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్తాన్ 43 ఓవర్లలో 182 పరుగులకు ఆలౌటైంది. బాబర్ ఆజమ్ (79; 8 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మూడో వన్డే శుక్రవారం జరుగుతుంది.

ఇక్కడే సిరీస్ పడతారా?

- సూపర్ ఫామ్‌లో భారత్
- తప్పక గెలవాల్సిన స్థితిలో లంక
- కోల్‌కతాలో నేడు రెండో వన్డే
- మధ్యాహ్నం గం. 1:30 నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం



కోల్‌కతా: ఈ ఏడాది ప్రపంచకప్ సన్నాహాన్ని ఘనంగా ప్రారంభించిన టీమిండియా ఇదే ఊపులో సిరీస్‌ను కోల్‌కతాలోనే ముగించాలనే పట్టుదలతో ఉంది. శ్రీలంకతో నేడు జరిగే రెండో వన్డేలో గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. మరోవైపు సిరీస్‌లో నిలవాలంటే తప్పక గెలవాల్సిన స్థితి లంకది. టి20 సిరీస్‌లో రెండో మ్యాచ్ ద్వారా పుంజుకున్నట్లే... ఈ పోరులోనూ గెలవాలని ఆశిస్తుంది. ఈడెన్ పిచ్‌పై ఐదేళ్ల క్రితం (2017) ఆసీస్‌తో వన్డే ఆడిన భారత్ గెలిచింది. లంకతో మాత్రం ఈ వేదికపై 2014లో ఆడగా.. రోహిత్ శర్మ డబుల్ సెంచరీ (264) చేశాడు. గువహటి వన్డేలోనూ ధాటిగా ఆడిన భారత కెప్టెన్ తన జోరు కొనసాగిస్తే మాత్రం సింహళ జట్టుకు కాళరాత్రే! పైగా గిల్, కోహ్లిలతో టాపార్డర్ సూపర్ ఫామ్‌లో ఉండటం, మళ్లీ పేస్ దళం చెలరేగడం భారత బలాన్ని అమాంతం పెంచుతోంది. కోల్‌కతాలో స్పిన్నర్లకు అవకాశం ఉండటంతో చహల్, అక్షర్ కూడా ప్రభావం చూపుతారు.

సర్వశక్తులు ఒడ్డాల్సిందే!

ఇప్పుడున్న భారత్ ఫామ్‌ను చూస్తే దుర్భేద్యంగా ఉంది. ఇలాంటి జట్టును ఎదుర్కోవాలన్నా... ఓడించాలన్నా శ్రీలంక సర్వశక్తులు ఒడ్డాల్సిందే. సమష్టి బాధ్యత కనబరిస్తేనే పటిష్టమైన టీమిండియాను ఢీకొంటుంది. లేదంటే గత మ్యాచ్ ఫలితమే పునరావృతమైనా ఆశ్చర్యం లేదు. టాపార్డర్‌లో నిసాంక మాత్రమే నిలకడగా ఆడుతున్నాడు. షనక కెప్టెన్ ఇన్నింగ్స్‌తో రాణిస్తున్నాడు. వీరితో పాటు ఫెర్నాండో, కుశాల్ మెండిస్‌లు కూడా రాణిస్తేనే భారీ స్కోరు చేయగలుగుతుంది.

21 ఈడెన్ గార్డెన్స్‌లో భారత్ ఇప్పటి వరకు 21 వన్డేలు ఆడింది. 12 మ్యాచ్‌ల్లో గెలిచి, 8 మ్యాచ్‌ల్లో ఓడింది. ఒక మ్యాచ్ రద్దయింది. ఈ వేదికపై శ్రీలంకతో ఐదు మ్యాచ్‌లు ఆడిన టీమిండియా మూడింటిలో గెలిచి, ఒక మ్యాచ్‌లో ఓడింది. మరో మ్యాచ్ రద్దయింది.

పిచ్, వాతావరణం

ఈడెన్ గార్డెన్స్ బ్యాటర్లతో పాటు బౌలర్లకూ అవకాశమిస్తుంది. అయితే టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్‌కే మొగ్గుచూపుతుంది. వాన ముప్పు లేదు.

పృథ్వీ షా 379

రంజీ ట్రోఫీ చరిత్రలో రెండో అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన బ్యాటర్‌గా రికార్డు



అమిన్‌గావ్ (అస్సాం): జాతీయ జట్టులో పునరాగమనం కోసం తీవ్రంగా కృషి చేస్తున్న ముంబై యువ క్రికెటర్ పృథ్వీ షా అద్భుత ఇన్నింగ్స్‌తో అదరగొట్టాడు. అస్సాం జట్టుతో జరుగుతున్న రంజీ ట్రోఫీ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో పృథ్వీ షా (383 బంతుల్లో 379; 49 ఫోర్లు, 4 సిక్స్‌లు) 'ట్రిపుల్ సెంచరీ' సాధించాడు. ఈ ఇన్నింగ్స్‌తో 23 ఏళ్ల పృథ్వీ షా 89 ఏళ్ల రంజీ ట్రోఫీ చరిత్ర పుటల్లోకి ఎక్కాడు. ఈ మెగా టోర్నీ చరిత్రలో మహారాష్ట్ర క్రికెటర్ బి.బి.నింబాల్కర్ (443 నాటౌట్; 1948లో కతియావార్ జట్టుపై) తర్వాత రెండో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన బ్యాటర్‌గా పృథ్వీ షా నిలిచాడు. అంతేకాకుండా రంజీ ట్రోఫీలో 'ట్రిపుల్ సెంచరీ'... విజయ్ హజారే వన్డే టోర్నీలో 'డబుల్ సెంచరీ'... ముస్తాక్ అలీ టి20 టోర్నీలో సెంచరీ చేసిన ఏకైక భారత క్రికెటర్‌గా పృథ్వీ షా గుర్తింపు పొందాడు. ఈ రంజీ సీజన్‌లో పృథ్వీ ఇప్పటివరకు 539 పరుగులు చేశాడు.

ఓవర్‌నైట్ వ్యక్తిగత స్కోరు 240తో బ్యాటింగ్ కొనసాగించిన పృథ్వీ మరో 139 పరుగులు సాధించి రియాన్ పరాగ్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. ఓవర్‌నైట్ స్కోరు 397/2తో ఆట కొనసాగించిన ముంబై ... కెప్టెన్ అజింక్య రహానే (191; 15 ఫోర్లు, 2 సిక్స్‌లు) అవుటవ్వగానే తొలి ఇన్నింగ్స్‌ను 4 వికెట్లకు 687 పరుగులవద్ద డిక్లేర్ చేసింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన అస్సాం ఆట ముగిసే సమయానికి ఒక వికెట్ కోల్పోయి 129 పరుగులు చేసింది.

ఆంధ్ర భారీ స్కోరు

భరత్, షోయబ్, నితీశ్ అర్ధ సెంచరీలు



భరత్



షోయబ్

న్యూఢిల్లీ: ఢిల్లీ జట్టుతో జరుగుతున్న రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు నమోదు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 203/3తో రెండో రోజు ఆట కొనసాగించిన ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌ను 133.2 ఓవర్లలో 9 వికెట్లకు 459 పరుగులవద్ద డిక్లేర్ చేసింది. కెప్టెన్ హనుమ విహారి (85; 11 ఫోర్లు) తన ఓవర్‌నైట్ వ్యక్తిగత స్కోరుకు మరో తొమ్మిది పరుగులు జోడించి అవుటవ్వగా... కోన శ్రీకర్ భరత్ (80; 8 ఫోర్లు, 1 సిక్స్), నితీశ్ కుమార్ రెడ్డి (66; 9 ఫోర్లు, 1 సిక్స్), షోయబ్ మొహమ్మద్ ఖాన్ (78; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) బాధ్యతాయుతంగా ఆడి అర్ధ సెంచరీలు సాధించారు. భరత్, నితీశ్ ఆరో వికెట్‌కు 68 పరుగులు... నితీశ్, షోయబ్ ఏడో వికెట్‌కు 86 పరుగుల జత చేసి ఆంధ్రను పటిష్ట స్థితికి చేర్చారు. ఢిల్లీ బౌలర్ హృతిక్ షోకీన్ నాలుగు వికెట్లు పడగొట్టాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఢిల్లీ ఆట ముగిసే సమయానికి 9 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 19 పరుగులు చేసింది.

సింధుపై మారిన్‌దే పైచేయి

స్పెయిన్ ప్లేయర్ చేతిలో పదోసారి ఓడిన భారత స్టార్ షట్లర్



సింధు



మారిన్

కౌలాలంపూర్: కొత్త ఏడాదిని, కొత్త సీజన్‌ను భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ఓటమితో ప్రారంభించింది. మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 బ్యాడ్మింటన్ టోర్నీ నుంచి ప్రపంచ ఏడో ర్యాంకర్ సింధు తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టింది. చిరకాల ప్రత్యర్థి, మూడుసార్లు ప్రపంచ చాంపియన్, రియో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత కరోలినా మారిన్ (స్పెయిన్)తో బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సింధు 12–21, 21–10, 15–21తో ఓడిపోయింది. మారిన్, సింధు ఇప్పటివరకు 15 సార్లు ముఖాముఖిగా తలపడగా... మారిన్ పదిసార్లు సింధును ఓడించి, ఐదు సార్లు ఆమె చేతిలో ఓడిపోయింది. 2018 మలేసియా ఓపెన్ క్వార్టర్ ఫైనల్లో చివరిసారి మారిన్‌పై సింధు గెలిచింది. చీలమండ గాయం కారణంగా ఐదు నెలలపాటు ఆటకు దూరంగా ఉన్న సింధు ఈ మ్యాచ్‌లో అడపాదడపా మెరిసింది. యాదృచ్ఛికంగా మూడు గేముల్లోనూ ఒక్కసారి కూడా ఇద్దరి స్కోర్లు సమంగా కాకపోవడం విశేషం. తొలి గేమ్‌లో మారిన్ పూర్తి ఆధిపత్యం చలాయించగా... రెండో గేమ్‌లో సింధు విజృంభించింది. మూడో గేమ్‌లో మళ్లీ మారిన్ పుంజుకుంది. ఆరంభంలోనే 3–0తో ఆధిక్యంలోకి వెళ్లిన మారిన్ అదే జోరును కొనసాగించి విజయాన్ని ఖరారు చేసుకుంది. మరో మ్యాచ్‌లో భారత్‌కే చెందిన మాళవిక బన్సోద్ 9–21, 13–21తో రెండో సీడ్ ఆన్ సె యంగ్ (కొరియా) చేతిలో ఓడిపోయింది.

పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో భారత నంబర్‌వన్, ప్రపంచ ఎనిమిదో ర్యాంకర్ హెచ్‌ఎస్ ప్రణయ్ 22–24, 21–12, 21–18తో భారత్‌కే చెందిన ప్రపంచ పదో ర్యాంకర్ లక్ష్య సేన్‌పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకున్నాడు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) జోడీ 21–16, 21–13తో చోయ్ సోల్ జియు–కిమ్ వన్ హో (కొరియా) జంటను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది.

సినిమా

ఆ ఊహ రాగానే ఎనర్జిటిక్‌గా దూకేశా!

- చిరంజీవి



"దర్శకులు, రచయితలు చెప్పే కథని అందరూ వింటారు.. కానీ, నేను మాత్రం చూస్తాను. అందులో ఎమోషన్ ఎంత ఉంది? ప్రేక్షకులు సంతృప్తి చెందుతారా? లేదా అనేది విజువల్‌గా చూస్తాను. పాటలు, ఫైట్లు, డైలాగులు అనేవి అదనపు అలంకరణలు. 'వాల్తేరు వీరయ్య'లో ఎమోషన్స్‌తో పాటు ప్రతి సీన్ ఎంటర్‌టైన్ చేస్తుంది. పిల్లలు, ఫ్యామిలీతో వెళ్తే ఈ చిత్రాన్ని చాలా ఎంజాయ్ చేస్తారు" అని చిరంజీవి అన్నారు. బాబీ కొల్లి (కేఎస్ రవీంద్ర) దర్శకత్వంలో చిరంజీవి, శ్రుతీహాసన్ జంటగా నటించిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. హీరో రవితేజ కీలక పాత్ర చేశారు. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిరంజీవి చెప్పిన విశేషాలు.

బాబీ 'వాల్తేరు వీరయ్య' కథ చెప్పినప్పుడు మిమ్మల్ని ఆకర్షించిన అంశమేంటి?

ఎమోషన్ కనెక్ట్ అయితేనే ఏ సినిమా అయినా ప్రేక్షకుల మనసులను హత్తుకుంటుంది. 'వాల్తేరు వీరయ్య' కథలో గొప్ప ఎమోషన్ ఉంది. అందుకే బాబీ కథ చెప్పగానే చేద్దామన్నాను. ఇందులోని ఎంటర్‌టైన్‌మెంట్‌ని నా గత చిత్రాలు 'ముఠా మేస్త్రీ, ఘరానా మొగుడు, అన్నయ్య'లో ఫస్ట్ హాఫ్ క్యారెక్టరైజేషన్‌తో పోల్చుకోవచ్చు.

మీ అభిమానిగా బాబీ మిమ్మల్ని తెరపై ఎలా చూపించనున్నారు?

నేను కంటెంట్‌ని బలంగా నమ్ముతాను.. బాబీ కూడా నాలాగే కథని నమ్ముతాడు. అందుకే మా ఇద్దరికీ కుదిరింది. ఏదైనా సీన్ కాస్త తగ్గినట్లు అనిపించినా వెంటనే మరో చక్కని సన్నివేశం రాసి, తీసేవాడు. నా అభిమానిగా కంటే ఓ డైరెక్టర్‌గా బాబీ ఎక్కువ మార్కులు సంపాదించాడు.

'బాబీకి నేను ఫ్యాన్ అయ్యాను' అని మీరు అనడానికి కారణం?

అతని హార్డ్ వర్క్‌కి ఫ్యాన్ అయ్యా. 'వాల్తేరు వీరయ్య' చేస్తున్నప్పుడు వాళ్ల నాన్నగారు చనిపోయారు. మామూలుగా 11 రోజుల పెద్ద ఖర్మ వరకూ తను ఉండాలి. కానీ, మూడో రోజు చిన్న ఖర్మ అయిన వెంటనే వచ్చి పని చేశాడు. 'మీతో పని చేస్తుంటే నాన్న లేని లోటు ఉండదు సార్' అన్నాడు. తన అంకితభావానికి హ్యాట్సాఫ్.. అందుకే నేను తనకు అభిమాని అయ్యాను.

ఈ సినిమాలో వింటేజ్ వైబ్ కనిపిస్తోంది. షూటింగ్ టైమ్‌లో మీక్కూడా యంగ్ ఏజ్ వైబ్ వచ్చిందా?

నాకు అన్ని రకాల వైవిధ్యమైన పాత్రలు చేయాలని ఉంది. 'శుభలేఖ, స్వయంకృషి, మంత్రిగారి వియ్యంకుడు' వంటి చిత్రాలు ఆ తాపత్రయం నుండి వచ్చినవే. రాను రాను ఆర్థికంగా, కమర్షియల్‌గా ముడిపడిన చిత్ర పరిశ్రమలో నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్స్ శ్రేయస్సుని దృష్టిలో పెట్టుకొని మనకి ఏం కావాలనే దానికంటే ప్రేక్షకులు మన నుండి ఏం కోరుకుంటున్నారో ఇవ్వడానికే మొదటి ప్రాధాన్యత ఇచ్చాను. రీ ఎంట్రీలో కూడా ఫ్రీడమ్ ఫైటర్‌గా 'సైరా', పాటలు, హీరోయిన్ లేకుండా 'గాడ్ ఫాదర్' చేశాను.. ఈ సినిమాలు గౌరవప్రదమైన హిట్లందుకున్నాయి. అయితే ప్రేక్షకులు, అభిమానులు నన్ను కమర్షియల్ సినిమాల్లో చూడటానికే ఎక్కువగా ఇష్టపడుతున్నారు. అది వందకి వంద శాతం ఇవ్వాలనే 'వాల్తేరు వీరయ్య' చేశాను. ఈ చిత్రం మరోసారి వింటేజ్ చిరంజీవిని గుర్తు చేస్తుంది.

ఇన్నేళ్లయినా ఏ అంశం మీలో తపన పెంచుతోంది?

కేవలం ప్రేక్షకుల ఆదరణే.. వాళ్లు ఆదరిస్తున్నారు కాబట్టే చేయగలుగుతున్నాను. 'బావగారూ బాగున్నారా'లో నేను చేసిన బంగీ జంప్‌ని ప్రేక్షకులు చూసి.. 'వాట్ ఏ ఫీట్' అని క్లాప్స్ కొడతారని ఊహించుకున్నాను. ఆ ఊహ రాగానే ఎక్కడ లేని ఎనర్జీ వచ్చింది.. రిలాక్స్‌గా దూకాను. అయితే ఫైట్స్, డ్యాన్స్.. అంటూ ఒళ్లు హూనం చేసుకోవడం కంటే 'దృశ్యం'లో వెంకటేశ్‌లా, 'విక్రమ్' సినిమాలో కమల్ హాసన్‌లా చేయాలనుంది.. (నవ్వుతూ).

సంక్రాంతి రేసులో ఎప్పుడూ మీ సినిమా ముందు వస్తుంది.. కానీ ఈసారి వెనక్కి తగ్గారు?

మైత్రీ మూవీస్ నుండే రెండు చిత్రాలు (వాల్తేరు వీరయ్య, వీరసింహారెడ్డి) సంక్రాంతికి వస్తున్నాయని హ్యాపీ ఫీలయ్యాను. పండగ టైమ్‌లో ఎన్ని సినిమాలకైనా చోటు ఉంటుంది. ఒక రోజు గ్యాప్ ఇస్తే ఏ సినిమా రెవెన్యూ ఆ సినిమాకి ఉంటుంది. అందుకే నేనే ఒకరోజు వెనక్కి ఉంటానని చెప్పాను. ఫస్ట్ డే రికార్డ్ కోసం తాపత్రయపడేవారికి మా రెవెన్యూ తగ్గుతుందనే ఫీలింగ్ ఉంటుంది. రావాల్సిన షేర్ వస్తుందనే నమ్మకం ఉంటే ఎప్పుడు ఎలా రిలీజ్ చేసినా నిలబడుతుంది.

ఎన్నో ప్రతిష్ఠాత్మక బ్యానర్లలో, ఎంతో మంది నిర్మాతలతో పని చేశారు. మైత్రీ మూవీ మేకర్స్‌లో సినిమా చేయడం ఎలా అనిపించింది?

మైత్రీ మూవీ మేకర్స్ లాంటి నిర్మాతలు చాలా అరుదుగా ఉంటారు. ఖర్చుకు వెనకాడకుండా ప్యాషన్‌తో సినిమాలు చేస్తున్నారు. 'ఖర్చు విషయంలో జాగ్రత్త. మీలాంటి నిర్మాతలు ఇండస్ట్రీకి కావాలి' అని నేనే వాళ్లకి చెబుతుంటాను. షూటింగ్‌లో ఒక రోజుకి నలభై లక్షల రూపాయిలు కూడా ఖర్చు అయ్యేది. చిత్రీకరణ టైమ్‌లో ఎక్కడా వృథా కాకూడదని బాబీకి కూడా చెప్పాను.. తను కూడా వృథా కాకుండా చేశాడు.. దాంతో నిర్మాతలకు కలిసొచ్చింది. నిర్మాతల బాగోగులు చూడాల్సిన బాధ్యత దర్శకులపైనా ఉంది.

సినిమాల్లో రిటైర్మెంట్ గురించి మీరు చేసిన కామెంట్స్ హాట్ టాపిక్ అవడంపై..?

కెరీర్ మొదట్లో ప్రతి నటుడికి ఒక ఆకలి ఉంటుంది. మనల్ని మనం తెరపై చూసుకోవాలని, మంచి పేరు తెచ్చుకోవాలనే స్పిరిట్ ఉంటుంది. ఆ కసి, స్పిరిట్ కొంతకాలం తర్వాత ఎందుకు ఉండకూడదు? అమితాబ్ బచ్చన్‌గారు ఇప్పటికీ హార్డ్ వర్క్ చేస్తారు. ఇక్కడ ఎప్పుడూ ఆర్టాకలితో ఉండాలి. కడుపు నిండినట్లు ఉంటే అనుకున్నది డెలివర్ చేయలేమని చెప్పడమే నా మాటల ఉద్దేశం.

నటీనటుల క్రమశిక్షణ గురించి మీ అభిప్రాయం?

క్రమశిక్షణ, సమయ పాలన వల్లే నా కెరీర్ ప్రారంభంలో వరుస అవకాశాలు అందిపుచ్చుకున్నా. మనం ఫామ్‌లో ఉన్నప్పుడు దాని విలువ తెలియదు.. కానీ అపజయాలు వచ్చినప్పుడు తెలుస్తుంది. క్రమశిక్షణ, సమయ పాలన అనేది లేకపోతే మనకి అవకాశాలు ఇచ్చేవారు కూడా ఉండరు.

'అన్నయ్య'(2000)లో రవితేజ మీ తమ్ముడిగా నటించారు. ఇరవై ఏళ్ల తర్వాత 'వాల్తేరు వీరయ్య'లో చేశారు. ఆయనలో అప్పటికీ ఇప్పటికీ మీరు గమనించిన తేడా?

రవితేజ అప్పుడు ఎలా ఉన్నాడో ఇప్పుడూ అలాగే ఉన్నాడు. స్టార్ ఇమేజ్ వచ్చిన తర్వాత తనలో వచ్చిన మార్పులేవీ లేవు. అదే ప్రేమ, అదే ఉత్సాహం, అదే ఎనర్జీతో ఉన్నాడు. 'వాల్తేరు వీరయ్య'లో రవితేజ పాత్ర కథకు మరింత బలం చేకూరుస్తుంది.

ఈ చిత్రంలో మీ డైలాగ్ రవితేజ, ఆయన డైలాగ్ మీరు మార్చుకున్నట్టున్నారు?

మా ఇద్దరి అభిమానిగా బాబీకి వచ్చిన ఆలోచన అది. నన్ను ఇష్టపడే రవితేజకి నా డైలాగ్ చెప్పడం తనకి ఫ్యాన్ బాయ్ మూమెంట్. అలాగే నా తమ్ముడిలాంటి రవితేజ డైలాగ్‌ని నేను చెప్ప డం సరదాగా అనిపించింది.. ఈ డైలాగ్స్‌ని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు.

శ్రుతీహాసన్‌తో వర్క్, డ్యాన్స్ చేయడం గురించి?

నా ఫ్రెండ్, లెజెండ్ కమల్‌గారి కూతురు శ్రుతి. తన డీఎన్ఏలోనే డ్యాన్స్ ఉంది. అవలీలగా డ్యాన్స్ చేస్తుంది. హార్డ్‌వర్క్ చేసింది.

దేవిశ్రీప్రసాద్ మ్యూజిక్ గురించి..

దేవిశ్రీ డబుల్ ఎనర్జిటిక్‌గా ఉంటాడు. ఇందులోని పాటలన్నీ ఇష్టం. అయితే 'నీకేమో అందం ఎక్కువ.. నాకేమో సిగ్గెక్కువ..' పాట నా ఫేవరెట్.

తెలుగులో కథల కొరత ఉందా?

లేదు.. మంచి ప్రతిభ ఉన్న యువ దర్శక, రచయితలు వస్తున్నారు. 'అర్జున్ రెడ్డి, ఉప్పెన, జాతిరత్నాలు, పెళ్ళి చూపులు' వంటి సినిమాలన్నీ మంచి కంటెంట్ ఉన్న కథలే.

రీమేక్ సినిమాలు చేయడం రిస్కా?

అలాంటిదేం లేదు. ఒక రీమేక్ కథతో సినిమా చేస్తున్నప్పుడు అందులో మన హీరో ఎలా ఉంటాడనే క్యూరియాసిటీ ప్రేక్షకుల్లో ఉంటుంది. మలయాళ హిట్ ఫిల్మ్ 'లూసిఫర్'లో కొన్ని మంచి మార్పులు చేసి 'గాడ్‌ఫాదర్' చేశాం. ఆ సినిమా మాతృక చూసినవ్వటికీ 'గాడ్ ఫాదర్'ని కూడా ప్రేక్షకులు హిట్ చేశారు.. ఇప్పుడు తమిళ హిట్ మూవీ 'వేదాలం' రీమేక్ చేస్తున్నాను.

దర్శకత్వం ఆలోచనలున్నాయా?

చివరి శ్వాస వరకూ సినిమాతో మమేకం అవ్వాలనే ఉంది. సినిమాకి సంబంధించిన ఏ విభాగం అయినా ఓకే. దర్శకత్వం చేయగలననే నమ్మకం కలిగినప్పుడు చేస్తాను.

'చిరంజీవికి మరీ అతి మంచితనం పనికిరాదు' అనే అభిప్రాయంపై ఏమంటారు?

కొందరు ఓ మాట అంటారు.. అనిపించుకుంటారు. కానీ, నేనలా కాదు. నన్ను అన్నారని నేను కూడా అంటే నాకూ, వాళ్లకి తేడా ఏముంటుంది? నేను ఏదైనా మంచి ముగింపు గురించి ఆలోచిస్తాను.. అందుకే సంయమనం పాటిస్తాను. అది ఎంతోమందికి ఆనందం ఇస్తుంది.

దాసరి నారాయణరావుగారి తర్వాత ఇండస్ట్రీలో పెద్ద దిక్కు మీరే అంటున్నారు.. కానీ ఆ బాధ్యతని మీరెందుకు వద్దంటున్నారు?

ఇండస్ట్రీకి ఎలాంటి సమస్య వచ్చినా స్పందిస్తాను.. అందుకు బాధ్యత అవసరం లేదు. చిత్ర పరిశ్రమకి రుణం కాయడం నాకు ఇష్టం.. అంతే కానీ, ఆ భుజం కీర్తి తీసుకోవడం ఇష్టం ఉండదు.

'వాల్తేరు వీరయ్య' సినిమా టిక్కెట్ ధర పెంచుకునే వెసులుబాటు కల్పించిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలకు కృతజ్ఞతలు.

'ఆర్ఆర్ఆర్' చిత్రంలోని 'నాటు నాటు..' పాటకు గోల్డెన్ గ్లోబ్ అవార్డు దక్కడం ఆనందంగా ఉంది. దేశం గర్వించే చారిత్రక విజయం ఇది. 'ఆర్ఆర్ఆర్' చిత్రబృందానికి నా అభినందనలు.

నాటు నాటుకు డ్యాన్స్ చేశా!

- షారుక్ ఖాన్



షారుక్ ఖాన్, దీపికా పదుకోన్ జంటగా నటించిన చిత్రం 'పఠాన్'. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో యశ్ రాజ్ ఫిలింస్ నిర్మించిన ఈ హిందీ సినిమా ఈ నెల 25న విడుదలవుతోంది. కాగా ఈ చిత్రం తెలుగు ట్రైలర్‌ను సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు హీరో రామ్‌చరణ్. ఈ సందర్భంగా ట్విట్టర్‌లో తనదైన స్టైల్‌లో రామ్ చరణ్‌కి కృతజ్ఞతలు చెప్పారు షారుక్ ఖాన్. "థ్యాంక్యూ సో మచ్. నా మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్. మీ 'ఆర్ఆర్ఆర్' టీమ్ ఆస్కార్ అవార్డును ఇండియాకు తీసుకొచ్చినప్పుడు దయచేసి నన్ను తాకనివ్వండి.. లవ్యూ" అని ట్వీట్ చేశారు షారుక్. "తప్పకుండా ఎస్ఆర్‌కే సార్. ఈ అవార్డు ఇండియన్ సినిమాకు చెందింది" అని పోస్ట్ చేశారు చరణ్. కాగా 'నాటు నాటు..' పాటకు గోల్డెన్ గ్లోబ్ అవార్డు లభించడం పట్ల షారుక్ ఖాన్ హర్షం వ్యక్తం చేశారు. ఉదయం వార్త తెలిసిన వెంటనే 'నాటు నాటు..' పాటకు డ్యాన్స్ చేశానని ట్విట్టర్‌లో వెల్లడించారు. భారత్‌ను గర్వపడేలా చేశారని ప్రశంసించారు.

చిన్న సినిమా నిర్మాతలను ప్రోత్సహించాలి

- నక్కిన త్రినాథరావు



త్రినాథరావు, రూప

"చిన్న చిత్రాలు తీసే నిర్మాతలను ప్రోత్సహించాలి. ఎందుకంటే వారు తీసిన చిత్రాలు మినిమమ్ సక్సెస్ అయినా కొత్త సినిమాలు చేస్తూనే ఉంటారు" అని డైరెక్టర్ నక్కిన త్రినాథరావు అన్నారు. మనీష్, మదునందన్ హీరోలుగా, లావణ్య, అక్సా ఖాన్, అలివియా ముఖర్జీ హీరోయిన్లుగా శివ బాబు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'క్షణం ఒక యుగం'. రూప నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను నక్కిన త్రినాథరావు విడుదల చేసి, "కొత్తవారిని ప్రోత్సహిస్తున్న నిర్మాత రూపగారికి ఈ సినిమా పెద్ద సక్సెస్ ఇవ్వాలి" అన్నారు. "నటీనటులు, సాంకేతిక నిపుణులు ఫుల్ సపోర్ట్ చేయడంతో మా సినిమా బాగా వచ్చింది" అన్నారు రూప. "మంచి కాన్సెప్ట్‌తో వస్తున్న మా చిత్రం అందరికీ నచ్చుతుంది" అన్నారు శివ బాబు.

యాక్షన్ ఎంటర్‌టైనర్



జీఎస్ఎన్ నాయుడు

జీఎస్ఎన్ నాయుడు ప్రధాన పాత్రలో ప్రమోద్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'యుగల్'. 'ది మాన్ విత్ డైవర్షన్' అనేది ట్యాగ్ లైన్. శ్రీలక్ష్మి గణపతి సుబ్రమణ్య స్వామి ప్రొడక్షన్స్ పతాకంపై ఆర్. బాలాజీ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. జీఎస్ఎన్ నాయుడు మాట్లాడుతూ– "యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. ఈ మూవీకి తొలుత 'గన్ని' అనే టైటిల్ అనుకున్నాం. కానీ, ఆ టైటిల్ వేరేవాళ్లు రిజిస్టర్ చేయించడంతో 'యుగల్' ఖరారు చేశాం" అన్నారు. "మా చిత్రాన్ని సెప్టెంబర్ 2న విడుదల చేస్తున్నాం" అన్నారు ప్రమోద్ కుమార్. కెమెరామేన్ ప్రేమ్ జై విన్సెన్ట్, ప్రొడ్యూసర్ వినయ్ కుమార్ పాల్గొన్నారు.

సాక్షి బిజినెస్

గురువారం
12-1-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽ 10	నిఫ్టీ ▽ 18
60,106	17,896

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫైన్' చూడండి

విదేశీ సూచీలు (భారతీయ కాలమానం రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	10,861	△ 118
డోజోన్స్	33,805	△ 101
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,725	△ 30
డాక్స్	14,948	△ 173
షాంఘై	3,162	▽ 8
నిక్కాయ్	26,446	△ 270

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	56,115 △ 141
బంగారం (99.5 స్వచ్ఛత)	55,890 △ 140
వెండి (కిలో)	68,363 △ 734

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		80.91	82.58
£	బ్రిటన్ పౌండ్		97.69	101.01
€	యూరో		86.20	89.28
¥	జపాన్ ఎన్ (100)		60.72	62.71
AU$	ఆస్ట్రేలియా డాలర్		55.30	57.65
S$	సింగపూర్ డాలర్		60.40	62.40
SAR	సౌదీ రియాల్		20.76	22.43
UAE D	యూఏఈ దిర్హామ్		21.31	23.11
¥	చైనా యువాన్		10.92	12.95

బిగ్‌'సి' లక్కీడ్రా ఆఫర్‌కు విశేష స్పందన



హైదరాబాద్: బిగ్‌'సి' 20వ వార్షికోత్సవం సందర్భంగా ప్రకటించిన లక్కీడ్రా ఆఫర్‌కు విశేష స్పందన లభిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు, సీఎండీ ఎం.బాలు చౌదరి పేర్కొన్నారు. ఈ మేరకు విడుదలైన ఒక ప్రకటన ప్రకారం, ఈ ఆఫర్‌లో మొత్తం 3 లక్కీడ్రాలను తీస్తారు. 11వ తేదీన రెండవ లక్కీడ్రా నిర్వహించి 35 మంది విజేతల పేర్లను సంస్థ డైరెక్టర్ బాలాజీ రెడ్డి ప్రకటించారు. ఆఫర్ ఈ నెల 29వ వరకూ కొనసాగుతుంది. మూడు లక్కీడ్రాలలో విజేతలుగా ఎంపికైన కస్టమర్లకు 20 మారుతీ ఆల్టో కార్లు, 20 బజాజ్ ప్లాటినా బైక్‌లు, 20 రిఫ్రిజిరేటర్లు, 20 ఏసీలు, 20 టీవీలను బహుమతులుగా అందజేయడం జరుగుతుంది. దీనితోపాటు మొబైల్స్ కొనుగోలుపై పలు ప్రయోజనాలను కూడా అందిస్తున్నట్లు ప్రకటన వివరించింది.

బీ న్యూలో రెడ్‌మీ నోట్ 12 5జీ సిరీస్ ఆవిష్కరణ



హైదరాబాద్: మల్టీ బ్రాండ్ మొబైల్స్ రిటైల్ చైన్ బీ న్యూ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్ స్టోర్లలో రెడ్‌మీ నోట్ 12 5జీ సిరీస్ అందుబాటులోకి వచ్చింది. ఈ మేరకు ఇక్కడ బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో ప్రముఖ నటి ఈషా రెబ్బా ఈ ఫోన్‌ను ఆవిష్కరించారు. సంస్థ సీఎండీ వైడీ బాలాజీ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయి నితేష్, రెడ్‌మీ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొబైల్ కొనుగోళ్లకు సంబంధించి ఈఎంఐ, జీరో ఫైనాన్స్ సౌలభ్యం అందుబాటులో ఉన్నట్లు సంస్థ విడుదల చేసిన ప్రకటన తెలిపింది.

రూపే కార్డుల ప్రోత్సాహానికి రూ. 2,600 కోట్ల స్కీము

న్యూఢిల్లీ: రూపే డెబిట్ కార్డులు, తక్కువ విలువ చేసే భీమ్-యూపీఐ లావాదేవీలను ప్రోత్సహించే దిశగా కేంద్ర క్యాబినెట్ బుధవారం రూ. 2,600 కోట్ల స్కీముకు ఆమోదముద్ర వేసింది. దీని కింద ఈ ఆర్థిక సంవత్సరంలో రూపే కార్డులు, యూపీఐని ఉపయోగించి జరిపే పాయింట్ ఆఫ్ సేల్స్, ఈ-కామర్స్ లావాదేవీలను ప్రోత్సహించినందుకుగాను బ్యాంకులకు ప్రోత్సాహకాలు లభిస్తాయి.



కార్ల సందడి..

‘ఎలక్ట్రిక్’ స్టార్ట్!

ప్రారంభమైన ఆటో ఎక్స్‌పో-2023 • కొలువుదీరిన కొత్త వాహనాలు

గ్రేటర్ నోయిడా: భారత్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా రెండేళ్లకోసారి జరిగే ఆటో ఎక్స్‌పో 2023 బుధవారం ప్రారంభమైంది. 2022లో జరగాల్సిన ఈ కార్యక్రమం కోవిడ్-19 కారణంగా వాయిదా పడింది. ఈసారి షోలో ఎలక్ట్రిక్ వాహనాలు హైలైట్. 5 మోడళ్లు ప్రపంచంలో తొలిసారి ఎక్స్‌పోలో తళుక్కుమంటున్నాయి. వీటిలో మారుతీ 5 డోర్ జిమ్నీ, నెక్స్ట్ జనరేషన్ కియా కార్నివల్, ఎంజీ ఎయిర్ ఈవీ, టాటా పంచ్ ఈవీ, హ్యుందాయ్ అయానిక్-5 ఉన్నాయి. జనవరి 18 వరకు ప్రదర్శన ఉంటుంది.

■ **సుజుకీ ఈవీఎక్స్ 550 కిలోమీటర్లు**
వాహన తయారీ దిగ్గజం జపాన్‌కు చెందిన సుజుకీ మోటార్ కార్పొరేషన్ అభివృద్ధి చేసిన కాన్సెప్ట్ ఎలక్ట్రిక్ మధ్యస్థాయి ఎస్‌యూవీ ‘ఈవీఎక్స్’ తొలిసారిగా అంతర్జాతీయంగా దర్శనమిచ్చింది. 2025లో ఈ కారు మార్కెట్లో అడుగుపెట్టనుంది. 60 కిలోవాట్ అవర్ బ్యాటరీ ఏర్పాటు ఉంది. ఒకసారి చార్జింగ్‌తో 550 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుందని కంపెనీ డైరెక్టర్, ప్రెసిడెంట్ తోషిహిరో సుజుకీ వెల్లడించారు. మొత్తం 16 వాహనాలను మారుతీ ప్రదర్శిస్తోంది. వీటిలో వేగన్-ఆర్ ఫ్లెక్స్ ఫ్యూయల్ ప్రోటోటైప్, బ్రెజ్జా ఎస్-సీఎన్‌జీ, గ్రాండ్ విటారా ఇంటెలిజెంట్ ఎలక్ట్రిక్ హైబ్రిడ్ వంటివి ఉన్నాయి.

■ **హ్యుందాయ్:** అయానిక్-5 ఈవీ ప్రపంచంలో తొలిసారిగా ఆవిష్కరించింది. పరిచయ ఆఫర్‌లో ధర తొలి 500 మంది కస్టమర్లకు రూ.44.95 లక్షలు. 72.6 కిలోవాట్ అవర్ బ్యాటరీతో 217 హెచ్‌పీ ఎలక్ట్రిక్ మోటార్ పొందుపరిచారు. ఒకసారి చార్జింగ్‌తో 631 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. అయానిక్-6 ఎలక్ట్రిక్ సెడాన్ సైతం కొలువుదీరింది. 53, 77 కిలోవాట్ అవర్ బ్యాటరీ ప్యాక్ ఆప్షన్స్‌లో లభిస్తుంది.

■ **ఎంజీ:** హెక్టర్, హెక్టర్ ప్లస్ ఫేస్‌లిఫ్ట్ కొలువుదీరాయి. ఆల్ ఎలక్ట్రిక్ మిఫా 9 ఎంపీవీ తొలిసారిగా భారత్‌లో తళుక్కుమన్నది. దీనిలో 90 కిలోవాట్ అవర్ బ్యాటరీ ఉంది. 440 కిలోమీటర్లు పరుగెడుతుంది. ఫుల్లీ ఎలక్ట్రిక్ ఎంజీ-4 హ్యాచ్‌బ్యాక్, ఎంజీ 5 ఎలక్ట్రిక్ స్టేషన్ వేగన్ (ఎస్టేట్), ఈఎంజీ6 హైబ్రిడ్ సెడాన్ సైతం ప్రదర్శనలో ఉంది.

■ **బీవైడీ:** సీల్ ఎలక్ట్రిక్ సెడాన్‌ను ఆవిష్కరించింది. 2023 చివరి త్రైమాసికంలో రానుంది.


■ **లెక్సస్:** ఎల్‌ఎం 300హెచ్ ఎంపీవీ (టయోటా వెల్‌ఫైర్) భారత్‌లో అడుగుపెట్టింది. హైబ్రిడ్ పవర్‌ట్రెయిన్‌తో రూపుదిద్దుకుంది. 150 హెచ్‌పీ, 2.5 లీటర్ అట్కిన్సన్ సైకిల్ పెట్రోల్ ఇంజన్ ఏర్పాటు ఉంది. కొత్త ఆర్‌ఎక్స్ ఎస్‌యూవీ భారత్‌లో ప్రవేశించింది. ఎల్‌ఎఫ్-30, ఎల్‌ఎఫ్-జడ్ ఈవీ కాన్సెప్ట్ మోడళ్లు ఉన్నాయి.

■ **టయోటా:** ల్యాండ్ క్రూజ్ ఎల్‌సీ 300 ఎస్‌యూవీ కొత్త రూపులో దమక్కుమంటోంది. బీజడ్4ఎక్స్ భారత్‌లో అడుగుపెట్టింది. 71.4 కిలోవాట్ అవర్ బ్యాటరీ ఏర్పాటు ఉంది. 450 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది.


■ **టాటా:** అందరినీ ఆశ్చర్యంలో పడేస్తూ హ్యారియర్ ఈవీ కాన్సెప్ట్‌ను ఆవిష్కరించింది. 2024లో మార్కెట్లోకి రానుంది. డ్యూయల్ మోటార్, ఆల్ వీల్ డ్రైవ్ ఉంది. 2025లో రంగ ప్రవేశం చేయనున్న సియర్రా ఈవీ కాన్సెప్ట్ సైతం మెరిసింది.



మారుతీ ఈవీఎక్స్ కాన్సెప్ట్



హ్యుందాయ్ అయానిక్ 5 ఈవీతో షారూక్



టాటా మోటార్స్ సియర్రా ఈవీ



టయోటా హైలక్స్ ఆఫ్‌రోడ్

ఏపీలో కియా... రూ.2,000 కోట్ల పెట్టుబడి

ప్లాంటులో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ
2025 నాటికి మేడిన్ ఇండియా ఈవీ

గ్రేటర్ నోయిడా: వాహన దిగ్గజం కియా ఇండియా ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్ ప్లాంటులో వచ్చే నాలుగేళ్లలో రూ.2,000 కోట్ల పెట్టుబడి చేయనుంది. ఎలక్ట్రిక్ వాహనాల పరిశోధన, అభివృద్ధి, తయారీ, మౌలిక వసతులకు ఈ మొత్తాన్ని ఖర్చు చేయనున్నట్టు సంస్థ బుధవారం ప్రకటించింది. ప్రస్తుతం కంపెనీ భారత్‌లో సింగిల్ బ్యాటరీ ఎలక్ట్రిక్ మోడల్‌ను విక్రయిస్తోంది. దేశీయంగా తయారైన ఎలక్ట్రిక్ కారును 2025లో ఆవిష్కరించాలన్నది సంస్థ ప్రణాళిక. అంతర్జాతీయంగా 2027 నాటికి 14 ఎలక్ట్రిక్ మోడళ్లను ప్రవేశపెట్టనున్నట్టు కియా ఇప్పటికే ప్రకటించింది. ఇందుకు మొత్తం రూ.1.79 లక్షల కోట్లు ఖర్చు చేస్తోంది.

ప్రత్యేకంగా భారత్ కోసం..
భారత్‌లో ప్రతిపాదిత పెట్టుబడి ఇప్పటి వరకు అనంతపూర్ ప్లాంటులో కంపెనీ చేసిన మూలధనంలో మూడింట ఒక వంతు అని కియా ఇండియా వైస్ ప్రెసిడెంట్, సేల్స్, మార్కెటింగ్ హెడ్ హర్‌దీప్ సింగ్ బ్రార్ తెలిపారు. ‘మాస్ మార్కెట్ లక్ష్యంగా ప్రత్యేకంగా భారత్ కోసం ఒక మోడల్ తయారు కానుంది. 2025లో ఇది రానుంది. ఈవీలను విడుదల చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్లాంటు సిద్ధంగా ఉంది’ అని వివరించారు.



కియా ఈవీ9 కాన్సెప్ట్

అవసరాలకు అనుగుణంగా..
కస్టమర్ల వ్యాపార అవసరాలకు అనుగుణంగా ప్రత్యేకంగా పర్పస్ బిల్ట్ వెహికిల్స్ (పీబీవీ) తయారీలోకి ప్రవేశిస్తున్నట్టు కియా ప్రకటించింది. కడెన్స్ మోడల్ ఆధారిత పోలీస్ వ్యాన్, అంబులెన్స్‌ను కంపెనీ ప్రదర్శించింది. ‘పీబీవీలకు పెద్ద మార్కెట్ ఉంది. 2030 నాటికి ఈ విభాగంలో అంతర్జాతీయంగా నాయకత్వ స్థానానికి చేరుకోవాలన్నది లక్ష్యం. పూర్తి ఎలక్ట్రిక్ కాన్సెప్ట్ మోడల్స్ ఈవీ9, కేఏ4 సైతం ప్రదర్శనలో కొలువుదీరాయి.

ఆటుపోట్ల మధ్య ఫ్లాట్‌గా

10 పాయింట్లు తగ్గిన సెన్సెక్స్



ముంబై: రోజంతా ఆటుపోట్ల మధ్య సాగిన ట్రేడింగ్‌లో దేశీ స్టాక్ మార్కెట్లు చివరికి అక్కడక్కడే అన్నట్లుగా ముగిశాయి. సెన్సెక్స్ 10 పాయింట్లు తగ్గి 60,106 దిగువన ముగిసింది. నిఫ్టీ 18 పాయింట్ల నష్టంతో 17,896 వద్ద నిలిచింది. కొద్ది రోజులుగా విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు కొనసాగుతుండటం మార్కెట్లను బలహీనపరుస్తున్నట్లు నిపుణులు పేర్కొన్నారు. ఇంట్రాడేలో సెన్సెక్స్ 60,365-59,806 పాయింట్ల మధ్య ఊగిసలాడింది. వెరసి 559 పాయింట్ల మధ్య హెచ్చుతగ్గులు చవిచూసింది. నిఫ్టీ సైతం 17,976- 17,824 పాయింట్ల గరిష్ట, కనిష్టాలను తాకింది. కాగా.. వరుసగా మూడో రోజు దేశీ కరెన్సీ బలపడింది. డాలరుతో మారకంలో రూపాయి 13 పైసలు పుంజుకుని నెల రోజుల గరిష్టం 81.61 వద్ద ముగిసింది. తొలుత 81.52 స్థాయి వరకూ ఎగసింది.

టాటా ఏస్ ఈవీ డెలివరీలు

న్యూఢిల్లీ: టాటా మోటార్స్ ‘ఏస్ ఈవీ’ డెలివరీలను ప్రారంభించినట్టు ప్రకటించింది. ఇది ఎంతో అత్యాధునిక టెక్నాలజీతో, సున్నా కాలుష్యాన్ని విడుదల చేసే చిన్న పాటి వాణిజ్య వాహనం (4 చక్రాలు) అని కంపెనీ తెలిపింది. అమెజాన్, డెల్హివరీ, డీహెచ్ఎల్, ఫెడెక్స్, ఫ్లిప్‌కార్ట్, జాన్సన్ అండ్ జాన్సన్ కన్జ్యూమర్ హెల్త్, మోతీవింగ్, సేఫ్ ఎక్స్‌ప్రెస్, ట్రెంట్ సంస్థలకు తొలుత టాటా ఏస్ (ఏసీఈ) ఈవీలను అందించినట్టు ప్రకటించింది. ఒక్కసారి చార్జింగ్‌తో 154 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని కంపెనీ తెలిపింది.

దిగువబాటన భారత్ వృద్ధి రేటు

ప్రపంచ బ్యాంక్



న్యూఢిల్లీ: భారత్ 2023-24 ఆర్థిక సంవత్సరం వృద్ధి అంచనాలను ప్రపంచ బ్యాంక్ కుదించింది. 6.9 శాతంగా ఉన్న క్రితం అంచనాలను 6.6 శాతానికి కుదిస్తున్నట్లు తన తాజా ఎకనమిక్ అప్‌డేట్‌లో తెలిపింది. భారత్ 2021-22లో 8.7 శాతం వృద్ధి రేటును నమోదుచేసుకోగా, ప్రస్తుత 2022-23లో ఈ రేటు 6.9 శాతంగా ఉంటుందని ఇప్పటికే ప్రపంచ బ్యాంక్ పేర్కొంది. కాగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటును ప్రపంచ బ్యాంక్ 6.1 శాతంగా అంచనావేసింది. అంటే వృద్ధి రేటు క్రమంగా దిగువకే పయనిస్తుందన్నది ప్రపంచ బ్యాంక్ అంచనా. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనిశ్చితి, ఎగుమతులు, పెట్టుబడుల వేగం తగ్గడం తన అంచనాలకు కారణమని ప్రపంచ బ్యాంక్ పేర్కొంటోంది. అయితే ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఎకానమీల్లో భారత్ తొలి స్థానంలో ఉంటుందని ప్రపంచ బ్యాంక్ పేర్కొంది.

విద్య, ఉద్యోగ సమాచారం

దక్షిణ మధ్య రైల్వేలో 4103 అప్రెంటిస్‌లు

సికింద్రాబాద్‌లోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ) దక్షిణ మధ్య రైల్వే-ఎస్‌సీఆర్ వర్క్‌షాప్/యూనిట్‌లలో యాక్ట్ అప్రెంటిస్ శిక్షణలో ప్రవేశాలకు ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఎస్‌సీఆర్ పరిధిలోకి వచ్చే జిల్లాల్లో నివసించే అభ్యర్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు.

- **ట్రేడ్‌ల వారీగా ఖాళీలు:** ఏసీ మెకానిక్-250, కార్పెంటర్-18, డీజిల్ మెకానిక్-531, ఎలక్ట్రీషియన్-1019, ఎలక్ట్రానిక్ మెకానిక్-92, ఫిట్టర్-1460, మెషినిస్ట్-71, మెకానిక్ మెషిన్ టూల్ మెయింటెనెన్స్-05, మిల్‌రైట్ మెయింటెనెన్స్-24, పెయింటర్-80, వెల్డర్-553.
- **అర్హత:** కనీసం 50% మార్కులతో పదో తరగతి, సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 30.12.2022 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.
- **ఎంపిక విధానం:** పదో తరగతి, ఐటీఐలో సాధించి మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 29.01.2023.
- **వెబ్‌సైట్:** www.scr.indianrailways.gov.in

సౌత్ ఈస్టర్న్ రైల్వేలో 1785 యాక్ట్ అప్రెంటిస్‌లు

కోల్‌కతాలోని ఆర్ఆర్‌సీ-సౌత్ ఈస్టర్న్ రైల్వే ఎస్ఈఆర్ వర్క్‌షాప్/తదితర కేంద్రాల్లో యాక్ట్ అప్రెంటిస్ శిక్షణలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 1785
- **ట్రేడులు:** ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, డీజిల్ మెకానిక్, మెషినిస్ట్, పెయింటర్, టర్నర్, రిఫ్రిజిరేటర్ అండ్ ఏసీ మెకానిక్.
- **అర్హత:** కనీసం50% మార్కులతో మెట్రిక్యులేషన్, సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 01.01.2023 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఐటీఐ, మెట్రిక్యులేషన్ మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తులకు చివరితేది:** 02.02.2023.
- **వెబ్‌సైట్:** www.rrcser.co.in

తెలంగాణ జిల్లా కోర్టుల్లో 66 ఎగ్జామినర్ పోస్టులు

తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జ్యుడిషియల్ మినిస్టీరియల్ సర్వీసులో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన ఎగ్జామినర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. • **మొత్తం పోస్టుల సంఖ్య:** 66

- **అర్హత:** ఇంటర్మీడియట్ లేదా దానికి సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి. నిర్దేశిత విద్య, సాంకేతిక అర్హతల కంటే ఎక్కువ ఉన్న అభ్యర్థులు, ధ్రువపత్రాల పరిశీలన సమయంలో పత్రాలను అందజేయాలి. **వయసు:** 01.07.2022 నాటికి 18 నుంచి 34 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ,ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు రూ.22,900 నుంచి రూ.69,150 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** సీబీటీ/ఓఎమ్మార్ పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు. • **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ)/ఓఎమ్మార్ పరీక్షలో 100 ప్రశ్నలుంటాయి. జనరల్ నాలెడ్జ్ విభాగంలో 60, జనరల్ ఇంగ్లిష్ విభాగంలో 40 ప్రశ్నలుంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయించారు. పరీక్ష వ్యవధి 120 నిమిషాలు.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది:** 11.01.2023.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.01.2023.
- **కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేది:** మార్చి 2023.
- **వెబ్‌సైట్:** tshc.gov.in

ఎయిమ్స్, మంగళగిరిలో 68 ఫ్యాకల్టీ పోస్టులు

మంగళగిరిలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.


- **మొత్తం పోస్టుల సంఖ్య:** 68
- **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్లు, అడిషనల్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు.
- **విభాగాలు:** బయోకెమిస్ట్రీ, డెర్మటాలజీ, జనరల్ మెడిసిన్, నెఫ్రాలజీ, గైనకాలజీ, పాథాలజీ, సైకియాట్రీ, ఫిజియాలజీ, యూరాలజీ తదితరాలు.

అర్హత

- **ప్రొఫెసర్లు:** సంబంధిత స్పెషలైజేషన్‌లో ఎండీ/ఎంఎస్/ఎంసీహెచ్/డీఎం ఉత్తీర్ణులవ్వాలి. కనీసం 14ఏళ్లు పని అనుభవం ఉండాలి. **వయసు:** 58 ఏళ్లు మించకూడదు.
- **అడిషనల్ ప్రొఫెసర్లు:** సంబంధిత స్పెషలైజేషన్‌లో ఎండీ/ఎంఎస్/ఎంసీహెచ్/డీఎం ఉత్తీర్ణులవ్వాలి. కనీసం 10 ఏళ్లు పని అనుభవం ఉండాలి. **వయసు:** 58 ఏళ్లు మించకూడదు.
- **అసోసియేట్ ప్రొఫెసర్లు:** సంబంధిత స్పెషలైజేషన్‌లో ఎండీ /ఎంఎస్ /ఎంసీహెచ్ /డీఎం ఉత్తీర్ణులవ్వాలి. కనీసం 6 ఏళ్లు పని అనుభవం ఉండాలి. **వయసు:** 50 ఏళ్లు మించకూడదు.
- **అసిస్టెంట్ ప్రొఫెసర్లు:** సంబంధిత స్పెషలైజేషన్‌లో ఎండీ/ఎంఎస్/ఎంసీహెచ్ /డీఎం/మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. కనీసం 3 ఏళ్లు పని అనుభవం ఉండాలి. **వయసు:**50ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు రూ.1,01,500 నుంచి రూ.1,68,900 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.02.2023.
- **వెబ్‌సైట్:** www.aiimsmangalagiri.edu.in

ఎయిర్‌పోర్ట్స్ అథారిటీలో కొలువులు

దేశవ్యాప్తంగా ఉన్న కార్యాలయాల్లో పోస్టుల భర్తీకి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) ప్రకటన విడుదల చేసింది. దీనిలో భాగంగా ఎయిర్ కంట్రోల్ విభాగంలోని 364 మేనేజర్, జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులను భర్తీ చేయనుంది. సైన్స్, ఇంజనీరింగ్ విభాగంలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన పట్టభద్రులు ఈ ఉద్యోగాలకు పోటీ పడవచ్చు. ఆన్‌లైన్ రాత పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఉద్యోగాలకు ఎంపికైన వారు ఆకర్షణీయ వేతనాలు అందుకోవచ్చు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.



కేంద్ర ప్రభుత్వానికి చెందిన మినీరత్న సంస్థల్లో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) ఒకటి. ఎయిర్‌పోర్టుల సమర్థ నిర్వహణకు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ అందించే సేవలే కీలకమైనవి. ఈ విభాగంలో ఉద్యోగాలకు ఎంపికైన వారు కార్యాలయాల్లో ఉంటూనే.. విమాన రాకపోకలు పర్యవేక్షిస్తూ, ప్రయాణం క్షేమంగా జరిగేలా చూస్తారు. ఇటీవల గేట్ స్కోర్ ఆధారంగా 596 పోస్టుల భర్తీకి ప్రకటన చేసిన ఏఏఐ.. ప్రస్తుతం గేట్‌తో సంబంధం లేకుండా మరో 364 ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 364

పోస్టులు-అర్హతలు

- **మేనేజర్(అఫీషియల్ లాంగ్వేజ్)-02: అర్హత:** ఈ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే వారు హిందీ లేదా ఇంగ్లిష్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ పాసై ఉండాలి. లేదా ఏ సబ్జెక్టుతో పీజీ చేసినా.. హిందీ, ఇంగ్లిష్‌లను తప్పనిసరిగా చదివి ఉండాలి. ఇంగ్లిష్ నుంచి హిందీ, హిందీ నుంచి ఇంగ్లిష్‌లోకి, ముఖ్యంగా టెక్నికల్ , సైంటిఫిక్ అంశాలను అనువదించడంలో అనుభవం ఉండాలి.
- **జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్)-356:** ఈ పోస్టులకు ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ సబ్జెక్టులతో మూడేళ్ల బీఎస్సీ(సైన్స్) రెగ్యులర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. లేదా ఏదైనా ఇంజనీరింగ్ డిగ్రీ ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ సబ్జెక్టులతో పాసవ్వాలి. ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడంలో నైపుణ్యాలు కలిగి ఉండాలి.
- **జూనియర్ ఎగ్జిక్యూటివ్(అఫీషియల్ లాంగ్వేజ్)-4:** హిందీ లేదా ఇంగ్లిష్‌లో మాస్టర్స్ చేసిన అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులు. వీరు గ్రాడ్యుయేషన్ స్థాయిలో ఇంగ్లిష్ సబ్జెక్టుగా చదివి ఉండాలి. లేదా గ్రాడ్యుయేషన్ స్థాయిలో హిందీ ఒక సబ్జెక్టుగా ఉండి, ఇంగ్లిష్‌లో మాస్టర్స్ చేసిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **సీనియర్ అసిస్టెంట్(అఫీషియల్ లాంగ్వేజ్)-2:** హిందీలో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తిచేయాలి. డిగ్రీ స్థాయిలో ఇంగ్లిష్‌ను ఒక సబ్జెక్టుగా చదవాలి. లేదా ఇంగ్లిష్‌లో పీజీ చేసి డిగ్రీ స్థాయిలో హిందీని ఒక సబ్జెక్టుగా చదివినవారై ఉండాలి. లేదా ఏదైనా సబ్జెక్టుతో పీజీ చేసి.. హిందీ, ఇంగ్లిష్ తప్పనిసరిగా చదివి ఉండాలి.
- డిపార్ట్‌మెంట్ అభ్యర్థులైతే పార్ట్‌టైం/కరస్పాండెన్స్/దూర విద్య విధానంలో చదివినవారైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇతరులు తప్పనిసరిగా రెగ్యులర్ విధానంలో మాత్రమే చదివుండాలి. చివరి ఏడాది/సెమిస్టర్ చదువుతున్న వారు కూడా దరఖాస్తుకు అర్హులే. డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ సమయానికి ఫలితాలు వెలువడి, ఉత్తీర్ణత సాధించి ఉండాలి.

వయసు

- 21.01.2023 నాటికి సీనియర్ అసిస్టెంట్ పోస్టుకు 30 ఏళ్లు, జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు 27 ఏళ్లు, మేనేజర్ పోస్టుకు 32 ఏళ్లు మించకూడదు.

ఎంపిక విధానం

- పోస్టులను అనుసరించి ఆన్‌లైన్ పరీక్ష, వాయిస్ టెస్ట్, ఇంటర్వ్యూ, బ్యాక్‌గ్రౌండ్ వెరిఫికేషన్, సర్టిఫికేట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

రాత పరీక్ష ఇలా

- జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్) పోస్టుల రాత పరీక్ష ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. రెండు పార్టులుగా(పార్ట్-ఎ, పార్ట్-బి) ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో పరీక్ష ఉంటుంది. పరీక్ష సమయం 2 గంటలు.
- **పార్ట్-ఎ:** ఈ విభాగంలో 4 సెక్షన్‌లు ఉంటాయి. ఇందులో ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్‌లో 20 ప్రశ్నలకు-20 మార్కులు, జనరల్ ఇంటెలిజెన్స్/రీజనింగ్‌లో 15 ప్రశ్నలకు-15 మార్కులు, జనరల్ ఆప్టిట్యూడ్/న్యూమరికల్ ఆప్టిట్యూడ్‌లో 15 ప్రశ్నలకు15 మార్కులు, జనరల్ నాలెడ్జ్ అండ్ జనరల్ అవేర్‌నెస్‌లో 10 ప్రశ్నలకు 10 మార్కుల చొప్పున పరీక్ష ఉంటుంది. పరీక్ష సమయం 60 నిమిషాలు.
- **పార్ట్-బి:** ఈ విభాగంలో రెండు సెక్షన్లు ఉంటాయి. మ్యాథమెటిక్స్‌లో 30ప్రశ్నలకు 30మార్కులు, ఫిజిక్స్‌లో 30 ప్రశ్నలు 30 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది.పరీక్ష సమయం 60నిమిషాలు.

సిలబస్ అంశాలు

- **జనరల్ ఇంటెలిజెన్స్/రీజనింగ్:** ఈ విభాగంలో 20 మార్కులకు ప్రశ్నలుంటాయి. రీజనింగ్, సీటింగ్ అరేంజ్‌మెంట్, బ్లడ్ రిలేషన్స్, పజిల్స్, ఇనీక్వాలిటీస్, ఇన్‌పుట్ -అవుట్‌పుట్, కోడింగ్-డీకోడింగ్, డేటా సఫిషియెన్సీ, ఆర్డర్ అండ్ ర్యాంకింగ్, ఆల్ఫాన్యూమరిక్ సిరీస్, డిస్టెన్స్ అండ్ డైరెక్షన్, వెర్బల్-నాన్‌వెర్బల్ రీజనింగ్ అంశాల నుంచి ప్రశ్నలుంటాయి.
- **ఇంగ్లిష్ లాంగ్వేజ్:** ఈ విభాగం నుంచి 15 మార్కులకు ప్రశ్నలుంటాయి. ఇందులో రీడింగ్ కాంప్రహెన్షన్, క్లోజ్‌టెస్ట్, డిటెక్షన్ ఆఫ్ ఎర్రర్స్, ఇంప్రూవింగ్ సెంటెన్సెస్ అండ్ పేరాగ్రాఫ్స్, కంప్లీషన్ ఆఫ్ పేరాగ్రాఫ్స్, పేరా జంబ్లింగ్, ఫిల్ ఇన్ ద బ్లాంక్స్, పార్ట్స్ ఆఫ్ స్పీచ్, మోడ్స్ ఆఫ్ నెరేషన్, ప్రిపొజిషన్స్, వాయిస్ ఛేంజ్ తదితర అంశాల నుంచి ప్రశ్నలుంటాయి.
- **జనరల్ నాలెడ్జ్:** ఈ విభాగం నుంచి కూడా 15 మార్కులకు ప్రశ్నలను అడుగుతారు. జాతీయ, అంతర్జాతీయ వ్యవహారాలు, వర్తమానాంశాలు, ముఖ్యమైన సంస్థలు, వాటి ప్రధాన కేంద్రాలు, పుస్తకాలు-రచయితలు, అవార్డులు, దేశాలు, వాటి రాజధానులు, కరెన్సీలు, ప్రభుత్వ పథకాలు, ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన ప్రశ్నలు వస్తాయి.
- **జనరల్ ఆప్టిట్యూడ్:** ఈ విభాగంలో 10 మార్కులకు ప్రశ్నలుంటాయి. డేటా ఇంటర్‌ప్రిటేషన్, ఏరియా అండ్ వాల్యూమ్, ఎస్ఐ అండ్ సీఐ, టైమ్, స్పీడ్, డిస్టెన్స్, టైమ్ అండ్ వర్క్, రేషియో అండ్ ప్రపోర్షన్, ప్రాఫిట్ అండ్ లాస్, పర్సెంటేజెస్, యావరేజెస్, నంబర్స్ మొదలైనవి ఉంటాయి.
- బ్యాంక్ క్లర్క్ పరీక్షల స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. ఐబీపీఎస్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న బీఎస్సీ, బీటెక్ పట్టభద్రులు జూనియర్ ఎగ్జిక్యూటివ్ పరీక్షలో సులువుగా ఎదర్కోగలుగుతారు. గత ప్రశ్నపత్రాలు సాధన చేయడంతోపాటు పక్కా ప్రణాళికతో ప్రయత్నిస్తే మంచి స్కోర్ సాధించవచ్చు.

పార్ట్-బి సిలబస్

- ఈ విభాగంలో అధిక మార్కులు పొందడానికి 11, 12 తరగతి పుస్తకాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. వీటిలో మ్యాథ్స్, ఫిజిక్స్‌లోని ప్రాథమికాంశాలపై దృష్టి పెట్టాలి. గత ప్రశ్నపత్రాలు, మాక్ టెస్టులను ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి. దీనిద్వారా ఇన్‌టైంలో ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వగలుగుతారు. అంతేకాకుండా ఆయా అంశాల్లో చేసే తప్పులను సరిచేసుకోవడానికి వీలవుతుంది.

వేతనాలు

- మేనేజర్(ఈ-3) పోస్టులకు ఎంపికైన వారికి ప్రతి నెల రూ. 60,000-1,80,000 వరకు వేతనంగా లభిస్తుంది. అలాగే జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఈ-1) పోస్టులకు ఎంపికైన వారికి రూ.40,000-1,40,000, సీనియర్ అసిస్టెంట్ (ఎన్ఈ-6) వారికి రూ.36,000-1,10,000 వరకు వేతనంగా అందుతుంది.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- దరఖాస్తులకు చివరి తేదీ: 21.01.2023
- వెబ్‌సైట్: http://www.aai.aero

కొలువుదీరిన కోచ్ రెస్టారెంట్!

విజయనగరం రైల్వేస్టేషన్‌లో అందుబాటులోకి..
- 24 గంటలూ టిఫిన్స్, మీల్స్
- రాష్ట్రంలో గుంటూరు తర్వాత రెండో కోచ్ రెస్టారెంట్

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఇన్నాళ్లూ పట్టాలపై ప్రయాణికులతో పరుగు తీసిన ఆ రైలు ఏసీ బోగీ.. ఇప్పుడు విలాసవంతమైన చిన్న సైజ్ రెస్టారెంట్‌గా మారిపోయింది. ఇది చూడాలంటే విజయనగరం రైల్వేస్టేషన్ ప్రాంగణంలోకి వెళ్లాల్సిందే. రాత్రి 8 గంటల తర్వాత రైలు దిగి కాస్త ఏమైనా తిందామంటే ఏమీ దొరకక ప్రయాణికులు ఇన్నాళ్లూ ఇబ్బంది పడేవారు. ఇప్పుడిక ఆ సమస్య లేదు. 24 గంటలూ ఆహార పదార్థాలు అందుబాటులో ఉండేలా తూర్పు కోస్తా రైల్వే అధికారులు దీనికి రూపకల్పన చేశారు. ఈ కోచ్ రెస్టారెంట్‌ను డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్ఎం) అనూప్‌కుమార్ సత్పతి బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. రైల్వే అదనపు ఆదాయం సముపార్జనపై దృష్టి పెట్టింది. అందులో భాగంగా రైలు కోచ్‌ను ఇలా మార్పు చేసిన రెస్టారెంట్.. దక్షిణ భారతదేశంలో రెండోది. మొదటిది గుంటూరు రైల్వేస్టేషన్ ఆవరణలో ఉంది. తూర్పు కోస్తా రైల్వేజోన్ పరిధిలో మాత్రం ఇదే మొదటిది. దీనిలో చక్కని టేబుళ్లతో పాటు 38 ఎగ్జిక్యూటివ్ చైర్లను ఏర్పాటుచేశారు. 40 మంది వరకూ ఒకేసారి కూర్చోవచ్చు. టిఫిన్స్, మీల్స్ 24 గంటలూ అందుబాటులో ఉంటాయి. ఫాస్ట్‌ఫుడ్స్, ఐస్ క్రీమ్స్ కూడా ఇక్కడ స్పెషల్. బర్త్ డే వంటి ప్రత్యేక వేడుకలను జరుపుకొనేందుకు వీలుగా ఈ కోచ్ రెస్టారెంట్‌ను తీర్చిదిద్దారు.

సంక్రాంతికి 8 ప్రత్యేక రైళ్లు

సాధారణ రైళ్లతో పాటు సంక్రాంతి రద్దీ దృష్ట్యా ఎనిమిది ప్రత్యేక రైళ్లను ప్రవేశపెట్టినట్లు డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి తెలిపారు. డిమాండ్‌ను బట్టి అదనపు రైళ్లను సికింద్రాబాద్ నుంచి ఒడిశా వరకూ వేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తూర్పుకోస్తా రైల్వే సీనియర్ డీసీఎంలు ఏకే త్రిపాఠి, ప్రీతిరాణా, డీసీఎం అవినాష్, ఎస్‌డీఈ పీకే మహారాణా, ఎస్‌డీఎంఈ ఎస్‌కే పాత్రో, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీజీ ప్రసాదరావు, స్టేషన్ మేనేజర్ కె.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


రైలుకోచ్ రెస్టారెంట్ ఇలా...

శ్రీసిటీలో కొరియా డిప్యూటీ కాన్సుల్ జనరల్

వరదయ్యపాళెం(తిరుపతి జిల్లా): చెన్నైలోని శ్రీసిటీని రిపబ్లిక్ ఆఫ్ కొరియా డిప్యూటీ కాన్సుల్ జనరల్ వోంజే చెన్నైలోని కొరియా ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ ఏజెన్సీ (కోట్రా) సర్టిఫైడ్ కస్టమ్స్ అటార్నీ హైవాన్ కిమ్, జిహ్వాన్‌లతో కలసి బుధవారం సందర్శించారు. శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ వీరికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీసిటీ మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక ప్రగతి, ప్రత్యేకతలను శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వారికి వివరించారు. శ్రీసిటీలో ప్రపంచస్థాయి మౌలిక వసతులు, వ్యాపార అనుకూల వాతావరణం ఎంతో బాగుందన్న వోంజే ఇక్కడ పలు కొరియన్ కంపెనీలు ఉండడంపై సంతోషం వ్యక్తం చేశారు.



శ్రీసిటీని సందర్శించిన రిపబ్లిక్ ఆఫ్ కొరియా డిప్యూటీ కాన్సుల్ జనరల్ వోంజే

ఉద్యోగులకు చెల్లింపుల్లో రెండంచెల భద్రత

సీఎఫ్ఎంఎస్ ఐడీ ఉన్న ఉద్యోగులు, పెన్షనర్లకు వర్తింపు
- సీఎఫ్ఎంఎస్ ఐడీ ఆధార్, మొబైల్ నంబర్‌తో అనుసంధానం
- ఆధార్‌తో అనుసంధానం అయిన మొబైల్ ఫోన్‌కు ఓటీపీ
- ఓటీపీ ఉంటేనే సీఎఫ్ఎంఎస్‌తో లాగిన్



సాక్షి, అమరావతి: రిజర్వ్ బ్యాంక్ నిబంధనలకు అనుగుణంగా ఉద్యోగులకు ఆన్‌లైన్ చెల్లింపుల్లో రెండంచెల భద్రతా వ్యవస్థను అమల్లోకి తీసుకువస్తూ రాష్ట్ర ఆర్థిక శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. సీఎఫ్ఎంఎస్/హెర్బ్ అప్లికేషన్స్ ద్వారా చేసే లావాదేవీలకు రెండంచెల భద్రతను తప్పనిసరి చేసింది. దీనికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ సేవలు పూర్తి సురక్షితంగా అందించేలా సీఎఫ్ఎంఎస్ ఐడీ ఉన్న ప్రతి ఉద్యోగి, పెన్షనర్లు, వ్యక్తులు తమ సీఎఫ్ఎంఎస్ ఐడీని ఆధార్, మొబైల్ నంబర్‌తో అనుసంధానం చేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసింది. సీఎఫ్ఎంఎస్ /హెర్బ్ అప్లికేషన్స్‌లో సురక్షితంగా లాగిన్ అవడానికి ఆధార్‌తో అనుసంధానం అయిన మొబైల్ ఫోన్‌కు వచ్చే వన్ టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ) నమోదును తప్పనిసరి చేసింది. దీనికి అనుగుణంగా ప్రతి ఉద్యోగి ఈకేవైసీ, ఆధార్, మొబైల్ నంబర్ల పరిశీలనను జనవరి 20 నాటికి పూర్తి చేయాలని సంబంధిత శాఖల డీటీఏలు, పీఏఓ, ఏపీసీఎఫ్ఎస్ఎస్ సీఈవో చర్యలు తీసుకోవాల్సిందిగా ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

● తెలంగాణ

22న చేగువేరా కుమార్తె హైదరాబాద్ రాక

సాక్షి, హైదరాబాద్: క్యూబా విముక్తి విప్లవ నాయకుడు చేగువేరా కుమార్తె అలైదా గువేరా ఈనెల 22న హైదరాబాద్ రానున్నారు. ఈ సందర్భంగా బీజేపీ, ఎంఐఎం మినహా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సభ నిర్వహిస్తున్నట్లు సీపీఐ ఒక ప్రకటనలో తెలిపింది.

జాతీయ జనపనార బోర్డు ప్రాంతీయ కార్యాలయాలు రద్దు

- హైదరాబాద్, చెన్నై కార్యాలయాలు కోల్‌కతా ప్రధాన కార్యాలయంతో విలీనం
- ఫిబ్రవరి 1వ తేదీ నుంచి విలీనం అమలు

సాక్షి, న్యూఢిల్లీ : హైదరాబాద్, చెన్నైల్లోని జాతీయ జనపనార బోర్డు ప్రాంతీయ కార్యాలయాలను కేంద్ర జౌళి శాఖ రద్దు చేసింది. నేషనల్ జ్యూట్ బోర్డ్ యాక్ట్, 2008 (2009 నంబర్ 12) సెక్షన్ 3 (3) ప్రకారం చెన్నై, హైదరాబాద్‌లోని జాతీయ జనపనార బోర్డు ప్రాంతీయ కార్యాలయాలు కోల్‌కతాలోని ప్రధాన కార్యాలయంతో విలీనమయ్యాయి. ఈ విలీనం తర్వాత రెండు ప్రాంతీయ కార్యాలయాల బాధ్యతలు, ఆస్తులు, సిబ్బందిని కోల్‌కతాలోని ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. జాతీయ జనపనార బోర్డు ప్రాంతీయ కార్యాలయాల విలీనం ఉత్తర్వులు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని కేంద్ర జౌళి శాఖ ప్రకటించింది.

ఆర్పీఎఫ్‌లో ఉద్యోగాలకు ఫేక్ నోటిఫికేషన్!

- 19,800 కానిస్టేబుల్ పోస్టుల పేరిట నిరుద్యోగులకు కేటుగాళ్ల వల
- సోషల్ మీడియాలో ప్రకటనతో అభ్యర్థుల్లో ఆశలు
- డబ్బు వసూళ్ల దందా మొదలుపెట్టిన మోసగాళ్లు
- దరఖాస్తు ప్రక్రియ మొదలుకాక పోవడంతో నిరుద్యోగుల ఆరా
- ఫేక్ నోటిఫికేషన్ అని స్పష్టం చేసిన రైల్వే అధికారులు

సాక్షి, హైదరాబాద్: రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌లో కానిస్టేబుల్ ఉద్యోగాల పేర కేటుగాళ్లు నిరుద్యోగులను బురిడీ కొట్టించే ప్రయత్నం చేశారు. మామూలు మాటలు చెబితే అభ్యర్థులు నమ్మరన్న ఉద్దేశంతో, ఫేక్ నోటిఫికేషన్‌ను సృష్టించి సామాజిక మాధ్యమాల్లో సర్క్యులేట్ చేశారు. దీంతో పెద్ద సంఖ్యలో అభ్యర్థులు వీరి వలలో పడినట్టు తెలుస్తోంది. తాజాగా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో రైల్వే కార్యాలయాలకు అభ్యర్థులు వచ్చి, దరఖాస్తులు ఎప్పటినుంచి అందుబాటులో ఉంటాయో వాకబు చేయటం ప్రారంభించారు. దీంతో అసలు గుట్టు రట్టయింది.

దరఖాస్తు ఆప్షన్ రాకపోవడంతో..

రైల్వేలో ఉద్యోగాల పేర మోసగాళ్లు భారీ ఎత్తున డబ్బులు వసూలు చేస్తున్న ఘటనలు తరచూ వెలుగు చూస్తున్నాయి. వీరితో స్టడీ సెంటర్ల నిర్వాహకులు కొందరు చేతులు కలుపుతున్నారు. ఉద్యోగాల కోసం అభ్యర్థుల నుంచి కేటుగాళ్లు డబ్బులు వసూలు చేస్తుంటే, వారికి పరీక్ష కోసం శిక్షణ పేరుతో స్టడీ సెంటర్ల నిర్వాహకులు దందా నడుపుతున్నారు. ఇలాంటి సమయంలో తాజాగా 19,800 ఆర్‌పీఎఫ్ కానిస్టేబుళ్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయిందంటూ ఆర్‌పీఎఫ్ పేరుతో ఓ ప్రకటన సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమైంది. కొన్ని పత్రికల్లో కూడా ఈ ప్రకటన ప్రచురితమైంది. దీంతో ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న వేల మందిలో ఆశలు రేకెత్తాయి. దీంతో కేటుగాళ్లు ఉద్యోగాలిప్పిస్తామంటూ దందా ప్రారంభించారు. చాలా ప్రాంతాల్లో అభ్యర్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్టు తెలిసింది. ఈ క్రమంలో రోజులు గడుస్తున్నా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అప్‌లోడ్ చేసే ఆప్షన్ వెలువడక పోవడంతో అభ్యర్థుల్లో అనుమానాలు మొదలయ్యాయి. రైల్వే కార్యాలయాలకు వెళ్లి వాకబు చేయటం ప్రారంభించటంతో ఈ వ్యవహారం వెలుగు చూసింది.

ప్రస్తుతం ఎలాంటి రిక్రూట్‌మెంటూ లేదు

తామెలాంటి రిక్రూట్‌మెంట్ ప్రస్తుతం చేపట్టడం లేదని, అది నకిలీ ప్రకటన అంటూ అధికారులు వెల్లడించారు. సాధారణంగా రైల్వే ఉద్యోగాల భర్తీ రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్‌ఆర్‌బీ), రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్ (ఆర్ఆర్‌సీ) ద్వారా జరుగుతుంది. కానీ ఆర్‌పీఎఫ్ ఉద్యోగాలు వీటి ద్వారా కాకుండా ప్రత్యేక కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతుంది. ప్రస్తుతం రైల్వే బోర్డు అలాంటి కమిటీ ఏదీ ఏర్పాటు చేయలేదు. కానీ ఏకంగా 19,800 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ పేరుతో భారీ అక్రమాలకు తెరతీయటం రైల్వేలో దుమారం రేపుతోంది. దీని వెనక ఉన్నవారి కోసం రైల్వే పోలీసులు వేట ప్రారంభించినట్లు ఓ ఉన్నతాధికారి తెలిపారు.

సోషల్ మీడియా ప్రకటనలు నమ్మొద్దు

రైల్వేలో ఎలాంటి ఉద్యోగ భర్తీ కసరత్తు మొదలైనా ఆర్‌ఆర్‌బీ, ఆర్ఆర్‌సీ, రైల్వే బోర్డు ఆధ్వర్యంలోని ప్రత్యేక కమిటీలు నోటిఫికేషన్ జారీ చేస్తాయి. ఇవన్నీ రైల్వే అధీకృత వెబ్‌సైట్‌ల ద్వారా మాత్రమే వెల్లడవుతాయి. సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ నోటిఫికేషన్ల విషయంలో అభ్యర్థులు జాగ్రత్తగా ఉండాలి. కేటుగాళ్లు వాటిని సృష్టించి మోసగించే ప్రమాదం ఉందన్న విషయాన్ని గుర్తించాలి.
– దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌ఓ రాకేశ్

గ్రూప్–1 ప్రిలిమ్స్ ఫలితాలకు తెలంగాణ హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

- ఒక్క అభ్యర్థి స్థానికత కోసం ఆపడం సరికాదన్న ధర్మాసనం

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 ప్రిలిమ్స్ ఫలితాల విడుదలకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఒక అభ్యర్థి స్థానికత వివాదం నేపథ్యంలో ఫలితాలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. స్థానికత అంశంపై తర్వాత విచారణ చేస్తామని చెప్పింది. ఒక్క అభ్యర్థి కారణంగా పూర్తిగా ఫలితాలనే నిలిపివేయడం సరికాదని అభిప్రాయపడింది. ఏడో తరగతి నుంచి పీజీ వరకు తెలంగాణలో చదివిన తనకు స్థానికత కోటా వర్తింపజేయకపోవడంపై నిహారిక అనే అభ్యర్థి గతంలో హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై సింగిల్ జడ్జి విచారణ జరిపి స్థానికతను పరిగణనలో తీసుకోవాలని టీఎస్‌పీఎస్సీని ఇటీవల ఆదేశించారు. ఈ ఉత్తర్వులపై టీఎస్‌పీఎస్సీ హైకోర్టును ఆశ్రయించగా జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ కార్తీక్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఒక్క అభ్యర్థి స్థానికత వివాదం నేపథ్యంలో ఫలితాలను మొత్తంగా నిలిపివేయడాన్ని తప్పుబట్టింది. టీఎస్‌పీఎస్సీ తరఫున న్యాయవాది ఎం.రాంగోపాల్‌రావు వాదనలు వినిపించారు. ఏడో తరగతి వరకు తెలంగాణలో చదివి ఉంటేనే స్థానికత వర్తిస్తుందని, అయితే నిహారిక ఆరో తరగతి ఏపీలో చదివారని, ఈ కారణంగా ఆమెకు స్థానికత వర్తించదని చెప్పారు. సింగిల్ జడ్జి ఉత్తర్వుల కారణంగా గ్రూప్–1 పరీక్ష రాసిన లక్షలమంది అభ్యర్థులు ఫలితాల కోసం నిరీక్షించాల్సి వస్తోందని నివేదించారు. దీనిని పరిగణనలోకి తీసుకుని ఫలితాల వెల్లడికి అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను అమలు చేయాలని నిహారిక తరఫు సీనియర్ న్యాయవాది సత్యంరెడ్డి వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం అభ్యర్థి సమగ్ర వివరాలను తమకు నివేదించాలని టీఎస్‌పీఎస్సీని ఆదేశించింది. స్థానికత వ్యవహారంపై తర్వాత తుది ఉత్తర్వులు జారీ చేస్తామని స్పష్టం చేస్తూ విచారణను వాయిదా వేసింది.

బస్సు, లారీ ఢీ

- లారీ డ్రైవర్ మృతి

వైరా రూరల్/ బోనకల్: ఎదురెదురుగా వస్తున్న లారీ, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో లారీ డ్రైవర్ మృతి చెందగా, బస్సు అదుపుతప్పి ఓ ఇంటి పైకి దూసుకెళ్లడంతో బస్సు డ్రైవర్, ప్రయాణికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఖమ్మం జిల్లా వైరా మండలంలోని పాలడుగు – బోనకల్ మండలం సీతానగరం మధ్య ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బుధవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి 15 మంది ప్రయాణికులతో మధిర వెళ్తున్న మధిర డిపోకు చెందిన సూపర్ లగ్జరీ ఆర్టీసీ బస్సు, మధిర నుంచి వైరా వైపు వస్తున్న లారీ పాలడుగు సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఏపీలోని గోకవరానికి చెందిన లారీ డ్రైవర్ జట్ల శ్రీనివాస్‌యాదవ్ (40) లారీ క్యాబిన్‌లోనే ఇరుక్కుని మరణించాడు. బస్సు అదుపు తప్పి పాలడుగులోని కొత్తపల్లి నాగేశ్వరరావు ఇంట్లోకి దూసుకెళ్లడంతో చింతకాని మండలం ప్రొద్దుటూరుకు చెందిన బస్సు డ్రైవర్ బి.తిరుమలేసు, ప్రయాణికుడు వేమిరెడ్డి భరత్ బస్సు క్యాబిన్‌లో ఇరుక్కుని తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు బయటకు తీసి 108 వాహనంలో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. బస్సు దూసుకెళ్లిన ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. అయితే బస్సు దూసుకెళ్లడంతో నాలుగు గదుల ఆ ఇల్లు పూర్తిగా కూలిపోయే స్థితికి చేరింది. వైరా, బోనకల్ ఎస్‌ఐలు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

పోలీస్ హెలికాప్టర్‌పై మావోల కాల్పులు

- తిప్పికొట్టిన బలగాలు..ఛత్తీస్‌గఢ్‌లో ఘటన
- మావోల కీలక నేత హిడ్మా హతమయ్యాడంటూ పుకార్లు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో పోలీసులు ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌పైకి మావోయిస్టులు కాల్పులు జరిపారు. అప్రమత్తమైన బలగాలు ఎదురుకాల్పులు జరపడంతో మావోయిస్టులు తప్పించుకున్నట్లు సమాచారం. పామేడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని దారెల్లి – మీనగట్ట గ్రామాల అటవీ ప్రాంతాల మీదుగా పోలీసు బలగాలతో ప్రయాణిస్తున్న హెలికాప్టర్ పైకి బుధవారం మావోయిస్టులు కాల్పులు జరిపారు. ఈ విషయాన్ని గుర్తించిన పైలెట్ హెలికాప్టర్‌ను పైకి లేపడంతో అందులో ఉన్న పోలీసులు కిందికి కాల్పులు జరిపారని తెలిసింది. అయితే మావోయిస్టు కీలకనేత, కేంద్రకమిటీ సభ్యుడు, దక్షిణ బస్తర్ డివిజన్ కమిటీ సభ్యుడు మడవి హిడ్మా అలియాస్ సంతోష్ స్వగ్రామం సుకుమా జిల్లాలోని పువర్తి కావడం, కాల్పుల జరిగిన ప్రాంతం ఆ గ్రామానికి సమీపంలో ఉండడంతో ఆ ప్రాంతంలో హిడ్మా ఉండవచ్చునని, ఈ క్రమంలోనే పోలీసులు హెలికాప్టర్‌లో వచ్చి కాల్పులు జరిపారని, కాల్పుల్లో హిడ్మా హతమయ్యాడనే పుకార్లు వ్యాపించాయి. కాల్పులు జరిగిన మాట వాస్తవమే అయినప్పటికీ హిడ్మా హతమయ్యాడని పోలీసు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ప్రకటన రాకపోవడంతో ఇవి పుకార్లేనని తేటతెల్లమైంది.

సేవే పరమావధిగా..

> జీవితంలో రిస్కు తీసుకో..గెలిస్తే నాయకుడివి అవుతావు. ఓడితే మార్గదర్శకుడివి అవుతావు...
> నిన్ను నువ్వు నమ్ముకో..ప్రపంచమే నీ పాదాల చెంత ఉంటుంది.
> నువ్వు బిజీగా ఉంటే ప్రతిదీ ఈజీనే... నీ నువ్వు ఈజీగా ఉంటే ఏదీ ఈజీ కాదు.
> మందలో ఒకరిగా ఉండకు... వందలో ఒకరిగా ఉండటానికి ప్రయత్నించు.
> ప్రయత్నం చేసి ఓడిపో.. కాని ప్రయత్నం చేయడంలో మాత్రం ఓడిపోకు
> కెరటం నాకు ఆదర్శం.. లేచి పడుతున్నందుకు కాదు పడినా కూడా లేస్తున్నందుకు
> – స్వామి వివేకానంద

జీవితనౌకకు చుక్కానిలాంటి ఇటువంటి మాటలతో, స్ఫూర్తిదాయకమైన తన ప్రసంగాలతో జాతి ఖ్యాతి పతాకను విశ్వ వేదికలపై రెపరెపలాడించిన స్వామి వివేకానంద ఎందరికో ఆదర్శం. యువ చైతన్యమే సమాజానికి చోదక శక్తి అని వక్కాణించిన ఆయన భావనను నిజం చేస్తూ పలువురు సేవాపథంలో దూసుకుపోతున్నారు. నేడు జాతీయ యువజనోత్సవం సందర్భంగా అటువంటి సేవకులు, సంస్థల గురించి...

చైతన్యం బోధిస్తున్న రాజు మాస్టర్


రిపబ్లిక్ డే సందర్భంగా గత ఏడాది పేదలకు వస్త్రదానం చేసిన జి.రాజు మాస్టర్

సామర్లకోట: స్థానిక యువకుడు జి.రాజు మాస్టర్ మదర్ థెరిసా వలంటరీ ఆర్గనైజేషన్‌ను ఏప్రిల్ 21, 2003లో ఏర్పాటు చేశారు. సావిత్రీబాయి పూలే, స్వామి వివేకానంద జయంతి వారోత్సవాలు, రిపబ్లిక్ డే సందర్భంగా పేదలకు వస్త్రదానం, గాంధీ వర్ధంతి, సర్వేపల్లి రాధాకృష్ణ, అబ్దుల్ కలామ్, నెహ్రూ, ఘంటసాల జయంతి, ఆగస్టు 15 వేడుకలు, అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా టీచర్లకు సత్కారం, వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారికి ఉగాది పురస్కారాలు, అమరవీరుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆయా కార్యక్రమాలకు సంబంధించి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నారు. పీజీ పూర్తి చేసిన రాజు మాస్టర్ పేదవారికి విద్య అందించాలనే లక్ష్యంతో తక్కువ ఫీజులతో కాన్వెంట్ ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నారు. జాతీయ నాయకుల చరిత్రను యువతకు తెలియజేయడానికి ఆయా నాయకుల జయంతి, వర్ధంతి సందర్భంగా ఉత్సవాలను నిర్వహించి యువతలో చైతన్యం కలిగిస్తున్నట్టు ఆయన 'సాక్షి'కి తెలిపారు.

మన ఊరు – మన బాధ్యత అంటూ...



నేషనల్ యూత్ అవార్డు స్వీకరించిన సంతోషంలో సంస్థ సభ్యులు

కాకినాడ రూరల్: ఇంద్రపాలెంలో మన ఊరు – మన బాధ్యత స్వచ్ఛంద సంస్థను దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ స్ఫూర్తితో మేడిశెట్టి రామ మోహనరావు 2014 అక్టోబర్ 15న ప్రారంభించారు. గ్రామంలో మెరుగైన పారిశుధ్యం, పార్కు అభివృద్ధి, మొక్కలు నాటడం, మండల పరిషత్ స్కూల్‌ను దత్తత తీసుకుని పిల్లలకు బ్యాగుల పంపడం తదితర పనులు చేపట్టారు. ఈ సేవా కార్యక్రమాలకు యువకులే కాదు, చిన్నారులు, వృద్ధులు కూడా ఆకర్షితులై సేవా కార్యక్రమాల్లో పాల్గొని గ్రామానికి సేవ చేస్తున్నారు. నాడు ఆరు నుంచి నేడు 180కి చేరిన సభ్యులు గ్రామంలో రూ.18 లక్షలతో లైబ్రరీని అభివృద్ధి చేశారు. గ్రామస్తులు చెట్ల కింద కూర్చునేందుకు వీలుగా బెంచ్‌లు ఏర్పాటు చేశారు. పాలిటెక్నిక్ ఎంట్రన్స్ విద్యార్థులకు ఫ్రీ కోచింగ్, స్పోకెన్ ఇంగ్లిషు వంటి సదుపాయాలు కల్పించారు. సుమారు రూ.10 లక్షలతో పార్కు అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ సంస్థకు 2017– 18 సంవత్సరానికి గాను నేషనల్ యూత్ అవార్డు లభించింది. కేంద్ర యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ చేతుల మీదుగా 2021 ఆగస్టు 31న పురస్కారం అందుకున్నారు.

ఆకలి తీర్చే 'ఎఫ్‌టీఎస్'


అమలాపురంలో ఓ నిరుపేద బాలికకు పుట్టిన రోజు వేడుకలను నిర్వహిస్తున్న ఎఫ్‌టీఎస్

అమలాపురం టౌన్: బండార్లంకకు చెందిన తులా లోకేశ్వర రాంబాబు ఓ ప్రైవేటు ఉద్యోగి. రెండున్నరేళ్ల కిందట అమలాపురం ఫ్రీ టైమ్ సర్వీస్ (ఎఫ్‌టీఎస్) ఫౌండేషన్‌ను ప్రారంభించాడు. 29 ఏళ్ల రాంబాబు పాఠశాలలకు పుస్తకాలు సరఫరా చేసే ఓ బుక్స్ పబ్లికేషన్ సంస్థలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నారు. తమకు దొరికే ఫ్రీ టైమ్‌లో సేవ చేయడం వల్ల ఈ సంస్థకు ఫ్రీ టైమ్ సర్వీస్ అని పేరు పెట్టారు. కోవిడ్ సమయంలో ఆకలితో అలమటిస్తున్న నిరుపేదలను అన్వేషించి మరీ కడుపు నింపేవారు. అప్పుడే ఎఫ్‌టీఎస్ వాట్సాప్ గ్రూపును రూపొందించారు. సభ్యుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. ఇప్పుడు 1,500 మంది ఉన్నారు. ఇదే ఫౌండేషన్ పేరుతో తెరిచిన ఫేస్ బుక్‌లో 20 వేల మంది వీక్షకులు ఉన్నారు. ఇప్పుడు ఈ వాట్సాప్, ఫేస్‌బుక్ వేదికగా ఆ ఫౌండేషన్ సేవలు విస్తరించాయి. కోనసీమలోనే కాకుండా హైదరాబాద్‌లో ఉన్న గ్రూపు సభ్యులు కూడా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. పుట్టిన రోజో, పెళ్లి రోజో, జ్ఞాపకార్థమో వారి ఆర్థిక స్తోమతను బట్టి కొంతమంది పేదలకు అన్నం పెట్టేందుకు ముందుకు వస్తూ ఈ ఎఫ్‌టీఎస్‌ను వేదికగా ఉపయోగించుకుంటున్నారు. ఇప్పటి వరకు దాదాపు 50 వేల మంది పేదల ఆకలి తీర్చినట్లు, ఓ అనాథాశ్రమం ఏర్పాటు చేయాలన్నదే తన లక్ష్యమని రాంబాబు చెప్పారు.

ఈ రక్త సంబంధానికి 24 ఏళ్లు!


రక్తదానం చేస్తున్న బొడ్డవరం యువత

కొటనందూరు: అవసరమైనప్పుడు రక్తం అందక విలువైన ప్రాణాలు పోతున్న విషయాన్ని గమనించిన కోటనందూరు మండలం బొడ్డవరం గ్రామ యువత మనమే ఎందుకు రక్తదానం చేయకూడదని భావించారు. గ్రామానికి చెందిన యల్లపు దొరబాబు ఆధ్వర్యంలో యువకులందరూ కలిసి 1998లో శ్రీరామకృష్ణ సేవా సమితి పేరుతో రక్తదానం ప్రారంభించారు. రక్తదానంపై జనంలో పలు అపోహలు ఉన్న రోజుల్లోనే ఇక్కడ యువత రక్తదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గడచిన 24 ఏళ్లలో ఆ గ్రామానికి చెందిన సుమారు 100 మంది యువకులు ఇప్పటి వరకూ 7,170 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. ఇప్పటికీ దానిని కొనసాగిస్తున్నారు. బొడ్డవరంలో ఉండే యువకులతో పాటు ఈ గ్రామానికి చెంది ఇతర ప్రాంతాల్లో ఉంటున్న యువకులు సైతం రక్తదాన కార్యక్రమంలో పాల్గొంటున్నారు. 365 రోజులూ 24 గంటలూ ఏ సమయంలోనైనా ఏ గ్రూపు రక్తాన్ని కోరినా యువకులు సొంత ఖర్చులతో బాధితుల దగ్గర కెళ్లి రక్తం ఇచ్చి వస్తుంటారు. రక్తం ఇవ్వడానికి వెళ్లిన వారు ఆపదలో ఉన్నవారి దగ్గర నుంచి కనీసం మంచి నీళ్లు ఆశించరు. ఇదే గ్రామం నుంచి యువకుల స్ఫూర్తితో 65 మంది కళ్లను కూడా దానం చేశారు.

లవ్ టు సర్వ్

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామకు చెందిన 22 ఏళ్ల యువకుడు సమయమంతుల సాయిగణేశ్ తన స్నేహితులు వసుమర్తి వంశీ విశ్వనాథన్, చెరుకు మధులతో కలసి ఐదేళ్ల క్రితం లవ్ టు సర్వ్ అనే సంస్థను స్థాపించి సేవా కార్యక్రమాలు మొదలు పెట్టాడు. అనాథాశ్రమాల్లో ఆశ్రయం పొందుతున్న వారికి అవసరమైన కిరాణా సరకులు, దుస్తులు, విద్యా సామగ్రి అందించడం మొదలు పెట్టారు. 2018 సంవత్సరం జనవరిలో ముగ్గురితో ప్రారంభమైన సంస్థ ప్రయాణం ప్రస్తుతం 250 మంది సభ్యులతో సాగుతోంది. సంస్థ ప్రెసిడెంట్ 22 ఏళ్ల వసుమర్తి వంశీ విశ్వనాథ్ ఇప్పటి వరకు 18 సార్లు రక్తదానం చేశాడు. వివేకానందుడు స్ఫూర్తిగా రక్తదానం, సామాజిక రుగ్మతలు, కరోనా వంటి విపత్కర పరిస్థితులపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నారు. కరోనా సమయంలో 2 వేల మందికి ఆహారం అందించారు. ఆకలి తీర్చడం, మాస్కుల పంపిణీ, 'ఫ్లాష్ మాబ్స్' పేరుతో యువతరానికి సోషల్ సర్వీస్ గొప్పతనాన్ని తెలియజేస్తున్నారు. 500కి పైగా అవసరమైన వారికి రక్తదానం చేశారు. పేద మహిళలతో టైలరింగ్ షాపులు ప్రారంభించారు. శారీరక వైకల్యం కలిగి ఏ విధమైన ఆసరా లేని ఐదు కుటుంబాలను దత్తత తీసుకుని అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారు.


సమయమంతుల సాయిగణేశ్, ద్రాక్షారామ

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed at Jagati Publications Limited, Survey No 172, Vegata Village, Jadigenahalli, Hoskote Taluk Bangaluru Rural Dist, Amar Ujala Publications Limited, C-21-22, Sector -59, Noida, Gautam Buddhanagar, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd., 22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No TNTEL/2008/25943